# సాహిత్యలోకంలో సజీవ స్త్రీమూర్తులు

- వ్యాసాలు

# జలంధర





శ్రీ
కౌముది
మీ మునివేళ్లలో సాహితీ వెన్నెల
www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 18



# విషయసూచిక


| | |
|---|---|
| లత గారి 'ఎడారి పూవులు' లో కామాక్షి | 3 |
| భానుమతీ రామకృష్ణ గారి 'అత్తగారి కథలు' లో అత్తగారు | 10 |
| మాలతీ చందూర్ గారి 'భూమి పుత్రి' లో దుర్గ | 15 |
| డా.శ్రీదేవి గారి 'కాలాతీత వ్యక్తులు' లో ఇందిర | 22 |
| బీనాదేవి గారి 'పుణ్యభూమీ కళ్ళు తెరు' లో రాజమ్మ | 28 |
| వాసిరెడ్డి గారి 'సమత' లో అరుంధతి | 35 |
| దాశరథి గారి 'చిల్లరదేవుళ్ళు' లో నీరజ | 42 |
| బలివాడ కాంతారావు గారి 'సంపెంగి' లో సంపెంగి | 46 |
| వడ్డెర చండీదాస్ గారి 'హిమజ్వాల' లో గీతాదేవి | 56 |
| గోపీచంద్ గారి 'మెరుపుల మరకలు' లో ఉషారాణి | 64 |
| పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి గారి 'కౌసల్య' లో కౌసల్య | 71 |
| సి.ఆనందారామం గారి 'మనస్విని' లో సుమిత్ర | 77 |
| కొడవటిగంటి కుటుంబరావు గారి 'అనుభవం' లో పార్వతి | 81 |
| బుచ్చిబాబు గారి 'చివరికి మిగిలేది' లో అమృతం | 87 |
| గురజాడ వారి 'కన్యాశుల్కం' లో మధురవాణి | 91 |
| డి.కామేశ్వరి గారి 'కొత్తమలుపు' లో రూప | 96 |
| చలం గారి 'అరుణ' లో అరుణ | 101 |
| కె.రామలక్ష్మి గారి 'కరుణ కథ' లో కరుణ | 106 |
| కొమ్మూరి వేణుగోపాలరావు గారి 'భారతి' లో భారతి | 109 |
| ద్వివేదుల విశాలాక్షి గారి 'గోమతి' లో గోమతి | 115 |
| కృష్ణ గారి 'యాత్ర' లో మీరా | 119 |
| యద్దనపూడి గారి 'సెక్రటరీ' లో జయంతి | 124 |
| రంగనాయకమ్మ గారి 'బలిపీఠం' లో అరుణ | 129 |

# 'లత' - "ఎడారి పూవులు"లో కామాక్షి

"జీవితం ఎడారిగా... అందులో ఉండే చిన్న చిన్న సుఖాలు ఒయాసిస్సులుగా కొందరు గడిపితే - జీవితమే ఒయాసిస్సులుగా అందులో ఉండే అనుభవాలు పువ్వులుగా మరికొందరు గడుపుతారు."

మన తరం మహా రచయిత్రులలో ఒకరు, పోయిన తరాల ఆలోచనా వీధుల్లో రాజీత్వం చలాయించిన నవలా రచయిత్రి, అటు మేధావి వర్గానికి, ఇటు నిర్భాగ్య వర్గానికీ కూడా "క్రేజ్" సృష్టించిన లతగారు ఎడారి పూవులు ప్రారంభిస్తూ అన్న పై మాటలు ఈ నవల గురించి, ఇందులో పాత్రల గురించి చాలా చెపుతాయి.

ఈ నవలలో సజీవత, ప్రత్యేకత లేని పాత్రే లేదు. అక్షరం అక్షరంలోనూ తనదైన ప్రత్యేక ఆలోచనావిధానాన్ని శైలిని చూపిస్తూ, మనను కూడా తనతోపాటు ఆలోచించమని... ప్రాధేయపడరు ఈ రచయిత్రి 'ఇలా కాక ఇంకెలా ఆలోచించగలం?' అని ప్రశ్నిస్తారు.. శాసిస్తారు.

ప్రతి మంచి రచయితా హృద్యమమైన కథావిధానం, పాత్ర చిత్రీకరణ, శైలి.... వీటి గురించి ప్రాధాన్యం ఇచ్చినా... తను చెప్పేందుకు, తన అభిప్రాయాల నిర్దుష్టతను ప్రస్ఫుటం చేసే పాత్రను ఏదో ఒకదాన్ని తప్పకుండా ఎన్నుకున్నప్పుడు, అది నవలా ప్రక్రియ అయినా, నాటకమైనా తప్పకుండా పాఠకులు మేధస్సును ఆలోచింపచేస్తుంది.

ఈ నవలలో కామాక్షి అటువంటి పాత్ర. మంచితనం, మానవత్వం, ఆడపిల్లల్లో అసాధారణంగా కనిపించే మేధస్సు, ఉపయోగపడగల కారుణ్యం, అప్పుడప్పుడు మేధస్సు పొరలు చీల్చుకుని తొంగిచూసే ఆడతనం, తనలోని భావాలు అసూయా? ప్రేమా? దయా? దుర్మార్గాన్ని చూసినప్పుడు కలిగే ఆవేశమా? ఆవేదనా?... ఏది ఏదో విశ్లేషించుకోగలిగిన ఈ అద్భుత మేధావిని "ఎడారిపువ్వులు" నవల చదివిన తరువాత మనలోని ఆలోచనలలో సుస్థిరత్వం ఏర్పరచుకుంటుంది.

నల్లపిల్ల కామాక్షి "కంటకం" పత్రికాధిపతి వెంకటపతిగారి కూతురు. ఆమె పాత్ర ప్రవేశం, ఆ తరువాత రెండు మూడు పేజీల్లోనూ మనకు రచయిత్రి ఈ పాత్ర చిత్రీకరణను లింకుగా ఎన్నుకోవడం అర్థమౌతుంది. తను చెప్పదలచుకున్నది తనుగా చెప్పడం కన్న "నాటకీయత"తో సంభాషణల ద్వారా చెప్పించడం, పైగా సునిశితమైన మేధస్సు, పన్నీటిజల్లులాంటి హాస్యంతో మన కళ్ళెదురుగా కామాక్షిని నిలబెడతారు రచయిత్రి.

వెంకటపతిగారి చెత్త వ్యాసాలు వెయ్యక తప్పనిసరి పరిస్థితిలో ఉండే యువ సంపాదకుడు శివరావు. కంటకం ఆఫీసులోకి 27 సంవత్సరాల నల్లగులాబీలా ప్రవేశించింది కామాక్షి అంటూ ఆమె వయస్సు రంగు - ఏ రెండూ ఆ మధ్య తరగతి ఆడపిల్లకు పెళ్ళి కావడానికి అడ్డంగా నిలబడ్డాయో ఆ రెండూ ఆమె ప్రత్యేకతలన్నట్లు గులాబీతో పోలుస్తూ చెప్తారు రచయిత్రి.

కామాక్షి లాంటి వ్యక్తిత్వం ఉన్న స్త్రీలు అరుదు. నల్లగా, పొడుగ్గా ఆకర్షణీయంగా ఉండే ఆమె హృదయంలో ఏమి ఉందో తెలుసుకోవడం ఆ బ్రహ్మకు కూడా తరం కాదు.

తండ్రి స్వార్థాన్ని తన మీద ప్రేమను కూడా పెట్టుబడిగా ఉపయోగించుకోవాలనుకునే లక్షణాన్ని ఎరిగిన కూతురు కామాక్షి జీవితంలో మాధుర్యం ఉందన్నా మనుష్యుల్లో మానవత్వం స్వార్థం కన్న ఎక్కువ పాళ్ళలో ఉంటుందన్నా నమ్మదు గాక నమ్మదు.

ఇనపభాషా శ్రవణంగా వినిపించిన శివరావు సంపాదకీయం చదివి పకపకా పగలబడి నవ్విందని విసుక్కుని -

"నువ్వు జన్మలో రైటరు కాలేవు... అలా అయితే నా చెవి కోసి ఇస్తాను.." అంటాడు వళ్ళు మండి శివరావు.

"తథాస్తు.. మీ ఆశీర్వచనం సఫలం అవ్వాలనదే నా కోరిక. లేకపోతే నేరాయడం ఏమిటి నా మొహం?" అంటుంది కోపీమని.

ఖంగుతింటాడతను. ఇంతవరకూ పెళ్ళికాని ఈ నల్ల పిల్ల గురించి లోకులనుకునే కారణాలు ఏది నిజమైనా ఈ జన్మలో పెళ్ళికాదు. కానీ ఆమెతో సంభాషణ... అదొక క్రాస్‌వర్డ్ ఫజిల్ పూరించినంత ఫీలింగ్ శివరావుకు.

"నీవు ఇంత చక్కగా మాట్లాడ్డం ఎక్కడ నేర్చుకున్నావ్?" అంటాడు...

"మీ శుశ్రూష చెయ్యడం..." అందులో వెటకారం విని, "అడిగిన ఏ విషయానికి సూటిగా సమాధానం నీ జన్మలో చెప్పలేవు కదా!" అంటాడు.

"నా జన్మలో చెప్పలేనివి చాలా వున్నాయి. ఒకటి నేను రైటర్ని కాలేనని ధైర్యంగా మా నాన్నకు చెప్పలేకపోవడం. రెండు నేను నిన్ను ప్రేమిస్తున్నాను. పెళ్ళిచేసుకో అని ఏ మొగవాడితోనూ అనలేకపోవడం...!"

ఇలా మాట్లాడగల కామాక్షి, తన మీద నిందలు గురించి , మాట్లాడుతూ -

"నేను మగవాళ్ళను చూసి సిగ్గుపడను. స్త్రీగా ఆకర్షించే పదార్థం ఏదైనా నాలో ఉంటుందని నాకు జ్ఞాపకముండదు. మగవాళ్ళతో తిరుగుతాను. ఏ మగవాడినీ కేర్‌చెయ్యను..." అంటుంది.

"ఏమిటో శివరావు... జీవితం ప్రారంభించే మొదటి రోజుల్లో ప్రతి పువ్వూ మన కోసమే వికసిస్తుందనుకుంటాము... కొన్నాళ్ళు పోయిన తరువాత కానీ, అవి ఎడారి పూవులని మనకు తెలియదు -" అంటుంది నిట్టూరుస్తూ..

"అగ్నిపర్వతాల సంగతి నాకు తెలియదు. అందరి మనస్సుల్లోనూ ఎడారి పూవులు కొన్ని వున్నాయి. మహాభయంకరమైన ఎడారిలో ఒక చిన్న ఒయాసిస్సు... ఒయాసిస్సు పక్కన రెండు ఆకులతో ఒక ఖర్జూరపు చెట్టు. ఆ చెట్టుకు ఓటో రెండో పూవులుండచ్చు. అప్పుడప్పుడు దారి తప్పిన ఒంటరి ఒంటె ఏదైనా బక్కచిక్కిన తన మెడచాచి ఆ పువ్వునందుకంటే ఆ అదృష్టం ఆ పువ్వుదో, ఆ ఒంటెదో ఆలోచించుకునేందుకు ఆ చుట్టుపక్కల ఎవరూ ఉండరు..."

ఆశ్చర్యపోతాడు శివరావు ఆ భావుకతతో కూడిన అక్షర చిత్రీకరణకు.

"నీవు జన్మతః రైటరువి. ఇప్పుడు ఒప్పుకో బుద్దేస్తోంది.." అంటాడు మూడు నిమిషాల్లో తన అభిప్రాయం మార్చుకుని కారణం, కామాక్షిలో ఉండే స్పష్టమైన వ్యక్తీకరణ.

"ఎడారిపువ్వులు" స్పూర్తిగా గుర్తింపులేని గొప్ప చిత్రకారులు శంకరరావుగారికి ఐడియా ఇస్తుంది. అతని చేత అద్భుతమైన చిత్రం "ఎడారిపూవులు" చిత్రీకరింపచేస్తుంది.

ప్రేమించి పెళ్ళి చేసుకున్నాననుకుని సంసారంలో ప్రేమ నేతిబీరకాయలో నెయ్యి అని అర్థం చేసుకుంటాడు రాజు. అతను శివరావును కలుసుకోడానికి వస్తాడు.

"ప్రతి మనిషి మనస్సులోనూ ఎడారి పూవులు వికసిస్తూ ఉంటాయని పాఠం నేర్చుకున్నాను... " అంటాడు శివరావు.

"ఇల్లాంటి సూక్తులు కనిపెట్టేది కామాక్షి..." అంటాడు రాజు వెంటనే.

అందగాడూ, ప్రేమ, ఆకర్షణలనే బలహీనతలున్న రాజు, భావకుడు, మేధావి, రచయిత అయిన శివరావు - ఇద్దరూ కామాక్షి మేధస్సును గౌరవిస్తారు. కానీ, పెళ్ళికి ఇష్టపడలేరు. కారణం ఆమె నల్లపిల్ల. సౌందర్యాన్ని భ్రాంతి అని ఏ మగవాడూ అనుకోలేడు. మేధావి అయిన వాడు కూడా!

ఈ నవలలో మనకు కామాక్షి గౌరవించే మహోన్నతమైన పాత్ర పార్వతిని సృష్టిస్తారు రచయిత్రి. వందనీయురాలైన ఆ వ్యక్తి కామాక్షిని సంపూర్ణంగా అర్థం చేసుకుంటుంది.

స్త్రీత్వం, మాతృత్వం అందమైన పాళ్ళలో మిళితమైన ఆమె వ్యక్తిత్వానికి ఎవరిముందూ తల వంచని కామాక్షి వినమ్రురాలైపోతుంది.

కామాక్షిలో చిత్రమదే. ఔన్నత్యాన్ని ప్రేమించడం ఆమెలో ప్రత్యేకత... అది పార్వతిలాంటి పవిత్ర స్త్రీ మూర్తిలోనూ గుర్తించగలదు. పతితల్లో, దుఃఖితుల్లో బాధాసర్పదష్టుల్లోనూ గుర్తించగలదు.

పార్వతి లీల గురించి చెప్పినప్పుడు, "ఈ లీల అమాయకురాలు... కురూపి.. అయినా తనలో ఏదో ఆకర్షణ ఉందనే ఊహ ఆమెలో వేళ్ళుతన్నుకున్నది. ఈ అభిప్రాయం కాస్తో, కూస్తో ప్రతి స్త్రీకి ఉంటుంది..."అనుకుంటూ తన వంక తను అప్రయత్నంగా చూసుకున్న కామాక్షి ఆలోచనలని ఇట్టే చదివేసి సన్నగా నవ్వుకుంటుంది పార్వతి.

అందుకే ఆమె ముందు తల వంచగలుగుతుంది కామాక్షి. తన వింత ప్రశ్నలకు ప్రపంచం ఇచ్చే సమాధానాలు నమ్మలేనప్పుడు, పార్వతక్కను సొల్యూషన్ అడుగుతుంది.

"ఎవరికిష్టమైన పద్ధతిలో వాళ్ళు జీవితాన్ని నడుపుకోవడం మంచిదేనంటావా?" అని అడుగుతుంది.

ఆ ప్రశ్న వెనకాల అర్థం తెలిసిన పార్వతి ఆలోచించి –

"ఇతరులకు బాధ కలిగించనంతవరకూ ఎవరి పద్ధతిలో వారు జీవితాన్ని గడుపుకోవడం అంత విమర్శించతగ్గది కాదు" అనే పార్వతిని చూసి నిజంగా దాంపత్య జీవితంలో సహజంగానే ఇంత ఆనందం ఉన్నదా? లేక ఈ చిన్న స్వర్గం పార్వతి అక్కయ్య తన మేధస్సు దాచుకుంటూ ఇల్లాలి తనంతో సృష్టించిందా? అన్న సమస్యతో వేగిపోతుంది కామాక్షి. ఈవిడ చూపించే అమృతమయమైన అనురాగం, ఆనందం నిజమైతే, తను చేజేతులారా, అతి తెలివి తేటలు, విశ్లేషణలతో జీవితం పోగొట్టుకుంటున్నానా? అని ప్రశ్నించుకుంటుంది.

పార్వతి తోటికోడలు సత్యవతి అవినీతితో సుఖపడుతోంది. పార్వతి అక్కయ్య పవిత్రతతో సుఖపడుతోంది – ఏమిటి తేడా? ఏది మంచిదో చెప్పేది ఎవరు? ఎందులో శాంతి ఉందో అదే మంచిది అనిపిస్తుంది కామాక్షికి.

ఎప్పుడూ సౌందర్యాన్ని ప్రేమిస్తున్నాననుకుంటూ, రోజా పువ్వుల్ని కొనుక్కుని ఆనందిస్తూ, తెల్లగా, అందంగా ఉంటుందన్న కారణంతో సునంద అనే బోగం పిల్ల ప్రేమలో పడి పెళ్ళి చేసుకుంటాడు శివరావు.

'కవిత్వం కవిత్వంగా ఉండనీ... జీవితంలో దాని ఛాయలు వెతుక్కుని శ్రమపడకు' అని హెచ్చరిస్తాడు విమర్శకుడూ, రచయిత డాక్టరు అయిన మధుసూదనరావు. ఆయన అభిప్రాయాలు చాలా విచిత్రమైనవి.

"పెళ్ళి చేసుకునే ఆడవాళ్ళు వేరయ్యా.. వాళ్ళు సత్యనారాయణ వ్రతం పీటల మీదకు వస్తారు. అంతే కానీ, సునంద లాంటి స్త్రీ నీకేవుండాలనుకోవడం అన్యాయం... అదే నీ కష్టాలకు కారణం..."

అలా అంటున్న డాక్టరు క్లినిక్‌లోకి గజలక్ష్మిలా ప్రవేశిస్తుంది కామాక్షి. ఠీవిమని ఒక రోజా పువ్వు తలలో పెట్టుకుంటుంది.

"నీ రోజాపూవులు సార్థకమయ్యాయి. నువ్వొత్తి చమురుకాళ్ళవాడివి శివరావూ. కామాక్షమ్మను కట్టుకుంటే తీరిపోనా?" అంటాడు డాక్టరు.

"మా నాన్న ప్లానదే.. నేనే పడనిచ్చాను కాను..." అంటుంది కామాక్షి.

"అవును డాక్టరుగారూ.. జీవితంలో నేను చాలా పొరపాట్లు చేశాను –" అంటూ వెళ్ళిపోతాడు శివరావు సీరియస్‌గా.

"చూశావా కామాక్షీ - నిన్ను పెళ్ళి చేసుకోకపోవడం పొరపాటని ఒక పురుషుడు అనుకుంటున్నాడు. ఏదీ నీ చెయ్యి ఇలా ఇయ్యి" అంటాడు డాక్టరు కొంటెగా... "ప్రేమించి పెళ్ళి చేసుకోవడం అంత బుద్ధితక్కువ పని సృష్టిలో లేదనిపిస్తోంది.." అన్న డాక్టరుతో. "అలా అనుకున్నవాళ్ళే క్షణంలో ప్రేమలో పడిపోతారు.." అని నోరుమూయిస్తుంది కామాక్షి.

" ఆడదానికి పుస్తె కడితే, 'నాకో రిబ్బను ముక్క తెచ్చి పెట్టవా? చెయ్యి నొప్పిగా ఉంది కట్టుకట్టరూ? అని కళ్ళు తేలేసే ఆడదాన్ని చూస్తే, నాకు అసయ్యం..." అంటూ భార్యా వియోగం పొందినతను మళ్ళీ ఎందుకు పెళ్ళి చేసుకోలేదో చెపుతాడు డాక్టరు.

"అక్కడే మీరు పొరబడుతున్నారు. అలా ఆధారపడ్డట్టు నటించడంలో ఆడదానికి అపరిమితమైన తృప్తి కలుగుతుంది.. కనీసం అలా నటిస్తుంది..." అంటుంది కామాక్షి.

తన మాటల్లో శ్లేషగ్రహించీ గ్రహించనట్లు నటిస్తోంది ఆమె అని డాక్టరు అర్థం చేసుకుని -

"నువ్వు రచయిత్రివేమో కానీ, గొప్ప నటివి మాత్రం అవును..." అంటాడు.

"నేనాడపిల్లను డాక్టరూ... నాకన్నీ తెలిసినా తెలియనట్లు నటించాలి.." ఆలోచిస్తూ అన్న కామాక్షి మాటల వెనక అర్థం డాక్టరును కదిలిస్తుంది.

"నీలాగా, హాయిగా, కల్మషం లేకుండా నిజం చెప్పే వాళ్ళను చూస్తే నాకెంతో ఇష్టం.." అంటాడు మేధావి కొంచెం సినికల్‌లా ఆలోచించే డాక్టరు.

కంటకం కాపీలు చేత్తోపుచ్చుకుని డాక్టరుకు వ్యాసాలు వినిపించాలని గిరీశం బొంకుల దిబ్బ మీదకు ప్రవేశంలా వచ్చిన తండ్రిని చూసి కామాక్షి హడిలిపోతుంది.

పత్రికలో మహాద్భుతమైన "ఎడారి పూవులు" చిత్రాన్ని చూస్తున్న డాక్టరుతో. "ఆ చిత్రానికి భావాన్ని నేనే ఇచ్చాను... ఆ చిత్రకారుడు నా స్నేహితుడు.." అన్న కామాక్షి మాటలకు డాక్టరు మనస్సులో ఏదో ఒకమూల అసూయలాంటి భావం తళుక్కుమంటుంది. కామాక్షి చిత్రమైన స్త్రీ అతని మనసులో కలవరం గ్రహించి కొద్దిగా గర్విస్తుంది.

"ఈ డాక్టరూ, ఈ మనస్థత్వవేత్త... రచయిత.. ఒక పేద చిత్రకారుణ్ణి చూసి అసూయపడుతున్నాడు. కొన్ని నిమిషాల క్రితం ఇతనే ప్రేమను గురించి వెక్కిరించాడు..." అనుకుంటుంది.

వెళుతూ ఆమె చూసిన చూపు కొత్త బట్టలో పూచిక ముల్లులా గుచ్చుకుంటుంది డాక్టరుకు... అని ఒక్క వాక్యంతో చాలా చెపుతారు రచయిత్రి.

" ఈ చిత్రంలో మహోన్నత భావం ఉంది. ఒయాసిస్‌లో వాటర్ లిల్లీస్ చిత్రం పేరు ఎడారి పూవులు... కామాక్షి హృదయంలో ఎడారి పూవులున్నాయని దానర్థం..." అనుకుంటాడు డాక్టరు.

కామాక్షి ఆలోచనలు చిత్రమైనవి. వాటికి క్షణికత క్షణభంగురత ఉన్నా విలక్షణతా స్పష్టతా కూడా ఉంటాయి. చీకటిని గుత్తులు గుత్తులుగా నీలిగంటలు విచ్చుకున్నట్లు విరబోసుకుంది అనుకుంటుంది. చీకటి నల్లనిది. తనూ అంతే. అంతేనా?! తను మధ్యతరగతి ఆడపిల్ల. అసలు ఈ తరగతే విచిత్రమైంది. నెలాఖరున పదిరూపాయలు అప్పు చెయ్యవలసినవాడు తను పరమ దరిద్రుడనుకుంటే, అయిదు రూపాయలు వెనక వేయగలిగినవాడు పరమభాగ్యవంతుడనుకుంటాడు. పాతికేళ్ళుదాటిన తన పెళ్ళి తండ్రికొక సమస్య. తనకిన్నాళ్ళూ కలగని ఏదో భావన డాక్టరు దగ్గర తలెత్తింది. దీన్నేనా ప్రేమ అంటారు? అనుకుందామె. నిన్న సాయంత్రం బద్ధకంచేత దండగుచ్చకుండా వదిలిన మల్లెపూలు వాడిపోయాయి. స్త్రీ జీవితం కూడా ఇంతేనా? సకాలంలో సూత్రబంధం కాకపోతే ఇలాగే వాడిపోతుందా? చెప్పరాని భయం ఆమెను ముంచివేస్తుంది. చేతికందిన 'ఏకవీర' చదువుతుంది.

ధర్మం చెయ్యాలి, ధర్మం అంటే ఏమిటి? ధర్మాధర్మాలకు మధ్య గీతగీసినదెవరు? దేశానికి ఒక ధర్మం. కాలానికి ఒక న్యాయం, వ్యక్తికి ఒక నీతి అమల్లో వున్నట్లు ప్రపంచ చరిత చూస్తే కనబడుతుంది. ఏది నీతి? ఏది అవినీతి? ఈ ప్రశ్నకు మాత్రం జవాబివ్వడానికి ప్రతివాడికీ హక్కున్నట్లు భావిస్తాడు.

తను డాక్టరుతో వృద్ధుడు, ఆశోపహతుడు అయిన శంకరరావుగారిని స్నేహితుడని చెప్పిందేమిటి? అయినా తన స్నేహితులంతా అల్లాంటివారే?... ఆమెకు నవ్వొస్తుంది. లోకం చేత అపహసించబడినవాళ్ళు, వెలివేయబడ్డవాళ్ళూ, అపనిందపాలు కాబడిన స్త్రీలు తన స్నేహితులు.. తప్పితే పార్వతి అక్కయ్యలాంటి దేవతలు, డాక్టరు లాంటి ...

ఆగిపోతాయి ఆమె ఆలోచనలు. తండ్రివచ్చి ఆ స్థితిలో డాక్టరు రేపు రమ్మన్నాడు అనగానే -

"నేనెందుకు వెళ్ళాలి? ఏమయినా సరే వెళ్ళకూడదు. తను స్త్రీ... తనలో కొన్ని బలహీనతలు ఉన్నాయి. అది బయట పెట్టుకునే ధైర్యమూ, అదృష్టమూ రెండూ తనలో లేవు.."

అందుకే డ్రస్ చేసుకుని వెళ్ళక తప్పదని అంటున్నప్పుడు శంకరరావుగారు కనిపించగానే తన బలహీనత తాను జయించగలిగానని నిట్టూరుస్తుంది.

తనలోని భావోద్వేగానికి కళ్ళాలు వేయగలిగిన ఆ మహామేధావురాలు మరొక బొమ్మకు శంకరరావుగారికి స్ఫూర్తినిస్తుంది.

"పోషణ లేని పూలతోట ఆ పూలతోటలో ఒకవైపు ఒత్తుగా రాలి వడిపోయిన మల్లెపూలు. వాటి పక్కన ఒక తాచుపాము. మరొకవైపు యవ్వనం అప్పుడే జారిపోతున్న యువతి.. ఆమె వెనక దుర్మార్గుడనిపించే ఒక మొగవాడు.. దీన్ని వెయ్యండి శంకరరావుగారూ 'సూత్రవిహీనులు' అని పేరు పెట్టండి.." అంటుంది.

ఆశోపహతుడైన ఆ చిత్రకారుడికి ఒక కథ ఉంటుంది మేనగోడలు పథవిహీనను గుండెల్లో దాచుకుని భార్యా బిడ్డల్ని కూడా త్యాగం చేసి ఆమెకు దారి చూపించాలని తీసుకువస్తాడు. కానీ ఉన్నట్లుండి "మరొకడి భార్యగా ఉండేకన్న నీకు ఉంపుడుగత్తెగా ఉండటం నాకిష్టం..." అన్న అన్నపూర్ణ మాటలకు ప్రలోభపడి పెళ్ళిచేసుకుంటాడు కానీ. ఆ తరువాత అదెంత తప్పో గ్రహిస్తాడు. అన్నపూర్ణలో ఆడతనం, విశృంఖలత, ఆమెపట్ల ఆయన వ్యామోహం... ఇవి అతని దుఃఖానికి కారణం అయితే ధర్మచ్యుతి ఆయనకు బతుకు భయం కలిగిస్తుంది. జీవితంలో ట్రాజెడీ ఏమిటంటే, మగవాడు తనకు అందడు అనుకున్నంత కాలం స్త్రీ అతణ్ణి గాఢంగా ప్రేమిస్తుంది. ఎప్పుడైతే అతణ్ణి అందుకోగలుగుతుందో ఆ మరుక్షణం నుంచీ అతణ్ణి నిర్లక్ష్యం చేస్తుంది. అందుకే మొదట త్యాగమూర్తిగా కనిపించిన మేనమామ ఇప్పుడు చీరలు, నగలు ఇవ్వలేని అసమర్థుడిగా కనిపిస్తాడు. ఇది అర్థం చేసుకుంది కామాక్షి. శంకరరావుగారు మామూలు మానవుడికి అర్థంకాని నిరాశను, భయాన్ని చిత్రాల్లో చిత్రీకరించే పద్ధతి బ్రతుకుతెరువు పద్ధతి కాదు. ఆఖరుకు ఆయన వంటి ఉన్నతుడైన కళాకారుడు సినిమా బొమ్మలు కూడా వేస్తున్నాడు. అందుకే అతనికి "కంటకం" పత్రికలో ఉద్యోగం ఇప్పించింది కామాక్షి.

ఆ చనువుతోనే అన్నపూర్ణ కథలు అచ్చువేయించమనే ఆ మనిషిని చూసి జాలిపడుతుంది కామాక్షి.

"ఈ కాలంలో రచయిత కానిదెవరు శంకర్రావుగారూ! ఒక్క నేను తప్ప... రచయితలు సృష్టించబడరు. స్వయం సృష్టి పొందుతారు..." అని మందలిస్తుంది.

కామాక్షిని అవమర్యాద చేస్తున్నాననుకుని అసూయతో శివరావుకి స్క్రిప్టు ఇవ్వబోయిన అన్నపూర్ణ, అక్కడున్న అందరూ కామాక్షి కంఠంలో ఆజ్ఞకు ఆశ్చర్యపోతారు. ఆమె ఆజ్ఞ ఎంత బలవత్తరమైనదో అర్థమౌతుంది అందరికీ.

మాటలతో చిక్కులో కుంచుకుపోయినట్లున్న పరిస్థితిని, 'ఏమండోయ్ శివరావుగారూ! రమణీ ప్రియదూతిక తెచ్చి ఇచ్చే కప్పురపు విడెం ఉంటేగానీ ఈ వారం సంపాదకీయం రాదా?' అని వాతావరణం తేలికచేస్తుంది. అటువంటి మేధావంతురాలు, వాక్చాతుర్యం కల

పిల్ల డాక్టరు ఫోను అని చెప్పగానే గొంతులో సన్నటి వణుకు గమనించి, 'చివరికి కామాక్షికి కూడా ఈ మాహాగ్ని తాలూకు వేడి సోకిందా' అని నవ్వుకుంటాడు శివరావు.

జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించాలంటే ఉత్సాహం అవసరం. దానికి వ్యక్తిలో ఆత్మవిశ్వాసం, ప్రగాఢమైన వాంఛా, జీవితంపట్ల అనురాగం అవసరం. ఒక వ్యక్తితో చైతన్యం ముడిపడదు. ఏ మహావ్యక్తికైనా మానవజాతిని సమీకరించగలిగితే ఒక మహా చైతన్యం ఉజ్వలంగా ప్రకాశిస్తుంది. అతడు మహాపురుషుడవుతాడు. కృష్ణుడు, అలాంటి మహావ్యక్తి అంతేకానీ నువ్వన్నట్లు భగవంతుడూ కాదు. జీలకర్రాకాదు..." అంటాడు డాక్టరు. అందుకే అతడంటే ఆకర్షణ. తనను ఆలోచింపచేసే మగవాడంటే భయపడి గౌరవిస్తుంది ఆడది.

"నువ్వు చిత్రమైన దానివి కామాక్షీ. వివాహం చవకైందంటావు. కృష్ణుడు భగవంతుడంటావు... అర్థంకాదు..."

చర్రున "ఏరే ఎందుకని - పెళ్ళనేది ప్రస్తుతం గాలివానలో పూరిగుడిసెలాంటిది. లోపలివాళ్ళు బయటకురావాలని, బయటవాళ్ళు లోపలికిపోవాలని ప్రయత్నిస్తున్నారు..." అంటుంది కామాక్షి.

"అయితే నువ్విప్పుడు లోపలికి వెళదామనుకుంటున్నావా?" చటుక్కున నోరుజారి, నాలిక కొరుక్కున్న డాక్టరును చూసి నవ్వుకుని, "నేను పూరిగుడిసెలోకి వెళ్ళను డాక్టరుగారూ. మహాసౌధమైతేనే ప్రవేశిస్తాను... అయితే అది నా ఆత్మగౌరవానికి తాజ్‌మహల్ అయితేనే" అంటుంది. ఈ జవాబులోనే ఆమె వ్యథకు అర్థం కనిపిస్తుంది. ఆత్మగౌరవం అనేదానికి దెబ్బతగలడం మేధావంతురాలు. ప్రత్యేక వ్యక్తిత్వం ఉన్న ఏ మనిషీ భరించలేడు. అది "పెళ్ళి" కోసరం కూడా.

అటు జోలపాట...ఇటు యవ్వన చైతన్యస్రవంతి... చివరికి వినిపించే చావుబాజా. అదే కదా చివరికి అని నవ్వేస్తుంది. "ఆది మధ్యాంతాలు"... ఇలా నీరవ నిశ్శబ్దంలో మహానాదానికి ప్రతిధ్వనిలా మాట్లాడుతుంది కామాక్షి.

సీత గురించి చెపుతూ, ఒకప్పుడు కురిసిన ఆమె కన్నీటి బిందువులు కాలమనే అగ్నిలో ఆవిరైనాయి. ఇప్పుడు సీతను పూజనీయురాలంటున్నాము. దీన్నిబట్టి స్త్రీ ఏ పరిస్థితిలోనూ సుఖించలేదు... నీతి అనే మత్తు ముందు స్త్రీ రక్తనాళాలలో ఇంజక్షన్‌చేసి, నిశ్చేతనంగా ఆమె పడి ఉండటమే 'సుఖనిద్ర' అని పిక్చర్ పెయింట్ చేసి ప్రవర్తిస్తోంది లోకం - అని విమర్శిస్తుంది కామాక్షి.

తండ్రికి కామాక్షి డాక్టరును పెళ్ళి చేసుకుంటుందన్న భయంతో, ఆస్థిగల కూతురు చేయిజారిపోతుందన్న భయంతో డాక్టరు, తోటి డాక్టరు రోజావతితో సినిమాలో కనిపించాడని బహు ఆనందంగా వార్త మోసుకు వస్తాడు. కంటకం ఆఫీసుకు వచ్చిన తండ్రి నైజానికి అసహ్యించుకుంటుంది. తండ్రి కోసరం జీవితాంతం ఇలా ఉండిపోవాలా అని ఆలోచిస్తుంది - కానీ, మళ్ళీ తన ఆలోచనలను తనే విమర్శించుకుంటుంది. డాక్టరు రోజావతి సినిమాహాల్లో డాక్టరుతో కనబడిందని తెలిసి అసూయ పడుతుంది.

"పది లక్షల వాక్యాల కన్నా పదునుగా మాట్లాడే కన్నీరు స్త్రీకి ఆయుధం" అని డాక్టరంటే -

"అది ఆయుధం మాత్రమేకాదు... అవ్యక్తమైన అనుభవానికి, అగోచరమైన అనుపాతానికి కూడా అది చిహ్నం..." అన్నది.

"నీవు నన్ను అవమానించావ్ కదూ! దీనివల్ల నాకు ఎంతో తృప్తిగా ఉంది. నువ్వూ స్త్రీవే" అంటాడు డాక్టరు.

తనే మిసెస్ మధుసూధనరావు అని అసూయాగ్రస్తురాలైన ఆ లేడీ డాక్టరు ఆహ్వానం పంపితే పంతంగా వెళుతుంది డాక్టరుతో, తీరా అతను ఉండవల్లి తీసుకువెళ్ళి వివాహం సంగతి ఎత్తితే "నన్ను ఆలోచించుకోనియ్" అంటుంది. ప్రేమ అంటే అందమైన జాబిల్లిని చూస్తూ వెనక్కు నడవడం, పెళ్ళి అంటే అలా చూస్తూ బొక్కబోర్లపడటం..." అని వ్యాఖ్యానిస్తుంది శివరావుతో. అయినా "డాక్టరును నేను పెళ్ళిచేసుకోడానికి నీ అభ్యంతరమేమిటి" అంటూ అతని మనసుపొరలు ఊడదీసి అతణ్ణి ఖంగారు పెడుతుంది. అప్పుడే ఉత్తమ సాహిత్యమంటే అంటూ జర్నలిస్ట్ కామాక్షిగా ఆమెచేత చెప్పిస్తారు రచయిత్రి.

"అధర్మం అంటే అసహ్యం, దౌర్జన్యం సహించలేకపోవడం, న్యాయరక్షణకు ఆత్మవిశ్వాసం, సౌందర్య పిపాస... వీటిని మానవుడిలో పెంచేదే ఉత్తమ సాహిత్యం..."

పెళ్ళి విషయం ఎటూ తేల్చుకోలేక, ఆడదానిలా అసూయపడి తప్పించుకుందా మని ప్రయత్నిస్తున్న కామాక్షిని -

"నేను ఒక మాట చెపుతాను. మనం మనకోసరం బ్రతకాలి... చిన్న సంగతి. నీవు ఇవ్వలేనిదాన్ని ఇతర్లు ఇస్తే అసూయపడకు..." అని వెళ్ళిపోతాడు డాక్టరు.

ఆ తరువాత ప్రేమమయి పార్వతక్కయ్యను రాయబారం పంపుతుంది. కానీ డాక్టరు ఊరు వెళ్ళిపోతాడు. తన సర్వస్వమూ ఉన్న పెట్టె సముద్రంలో పారేసుకున్న పాంధుడిలా చూస్తుంది కామాక్షి.

ఆ మర్నాడే శివరావుతో పత్రికల కాన్ఫరెన్స్‌కు వెళుతుంది. ఉద్రేక స్వభావురాలూ, ప్రతివిషయాన్నీ విమర్శించుకోగలిగిన మేధావిని అయిన ఆ యువతికి తన మన "స్థితి" ఏమిటో తనకే అర్ధంకాదు. కారణం -

"అసహజంగా బ్రతకడం వల్ల వచ్చే తిప్పలే ఇవి. ప్రేమలేనిచోట దైహికసంబంధం ఉండచ్చుకానీ, దైహిక సంబంధం లేకుండా ప్రేమ ఉండదు" అన్న శివరావు మాటలు ఆలోచింపచేస్తాయి ఆమెను. తనలోని ఉద్రేకాన్ని అది మనసుకు వేసే శిక్షను కూడా తన జీవితానికి తానే ప్రేక్షకురాలిగా మారి విమర్శించుకుంటుంది కామాక్షి.

ఊరికి తిరిగి వచ్చిన తరువాత, సునందకు శివరావుకు తెలియకుండా రక్తదానం చేస్తుంది. అది తెలిసిన శివరావు రెండుచేతులూ పట్టుకుని కృతజ్ఞతలు చెపుతాడు. డాక్టరు తిరిగి వస్తాడు. ఆమె పట్ల ఉన్న ఆకర్షణకు పెళ్ళి ఎంత ఇరుకైనదో అతనికి అర్ధమౌతుంది.

"నా సుఖాల బండిని నేను లేటుగా వెళ్ళిపోగొట్టుకుంటున్నాను. నా సౌఖ్యాన్ని విధి నిర్ధాక్షిణ్యంగా తన ఇనుపచేతిలో కలిపి ఉండ చుట్టి చిత్తు కాగితాల బుట్టలో పడేసింది. నన్ను ఆలోచించుకోనీయండి..." అంటే -

"నీ జీవితం అంతా నా ఆలోచనతో గడిపేయడం నాకు సుఖాన్నిచ్చేలాగుంది కామాక్షీ.... కనీసం స్నేహితులుగానన్నా మిగులుదాం,,,, అది నాకు చాలు..." అంటాడు డాక్టరు.

"ఎందుకు తను ఇంత బేల అవుతోంది ఆ విషయంలో..." అని తర్కించుకుంటుంది. పెళ్ళి అనే ఆలోచనే ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. డాక్టరుకి లీల అనే అభాగ్యురాల్ని హాస్పటల్లో చేర్చడానికి తీసుకువచ్చిన కామాక్షి కనపడుతుంది.

అతని కళ్ళల్లో జీవవాంఛను గ్రహించి... తన ఎదురు చూసే క్షణాలు అర్థమై, "క్షమించండి డాక్టర్. నాకు ఓపికలేదు" అనే కామాక్షి అతణ్ణి మరింత ఉన్నత్తుణ్ణి చేస్తుంది.

పెళ్ళి అనే గూడులో బలవంతపు వాంఛలు, మొహమాటంగా, తప్పనిసరిగా భరించే వెన్నెముకలేని జీవులకు అర్ధంకాని క్షణాలవి.. ఒక వ్యక్తి మరొక వ్యక్తి కేవలం వ్యక్తిత్వం, మేధస్సు, మృదుత్వం వలన ఎంత వాంఛనీయమనే విషయం అర్ధమౌతుంది.

అటువంటి క్షణాల్లో కాలుతున్న ఇనుము మీద పడి నీటి చుక్కలా ఆవిరి అయిపోయినట్లు అప్పుడే ప్రవేశించిన ఉన్నత కళాకారుడైన శంకరరావుగారి ప్రేలాపన ఇద్దర్నీ చల్లబరుస్తుంది. అన్నపూర్ణ ఉత్తరం ఆ అభాగ్యురాలిమీద జాలిపడేట్లు చేస్తుంది. ఆ ఆవేదన ప్రపంచం అంతా శూన్యంగా అయినట్లు అనిపిస్తుంది.

ఎడారిపూవును అందుకుంటే అదృష్టం ఆ ఒంటెదా? పువ్వుదా?!

ఈ ప్రశ్నలు కాలగర్భంలో నిలిచిపోయాయి. అతిసున్నితమైన మానసిక విశ్లేషణలను అర్ధం చేసుకుని అక్షరరూపకల్పన చెయ్యగలిగిన మహారచయిత్రి లత సృష్టించిన కామాక్షి - ఒక విన్నూత్న ప్రక్రియ.

మన కోసరం ఆ పాత్ర చాలాసార్లు ఆలోచించి పెడుతుంది. మనసు ఆలోచించమని ఇబ్బంది పెడుతుంది. ఎన్నో విభిన్న పాత్రల చిత్రీకరణ చేసిన ఈ మహారచయిత్రి మాటలివి. "ఈ జీవితానికీ సాహిత్యానికీ ఉండే సంబంధం ఎంతటి గాఢమైందో చాలామందికి తెలియదు. దేశకాల సంఘటనలు రచనకి కొంతమటుకు ఆధారమైనా, రచయిత వీటికి సరి అయిన రూప చిత్రణ చేసిన రోజున కొన్ని సమస్యలకి కొంత సమాధానం రావచ్చును. పూరించలేని మహాసమస్యలలో జీవితం ఒకటి. క్షణక్షణం మార్పుచెందే మానవ జీవితం, నీతి నియమాలనూ, సాంఘిక వ్యవస్థలనూ తనకనుగుణంగా మార్చుకుంటూ ముందుకు పురోగమిస్తుంది. ఈ పురోగమనం సుఖజీవనం కోసరం అని భ్రమిస్తాము. నిన్న మనల్ని ఆశ్చర్యపెట్టిన మార్పు ఈ రోజున మామూలై పోతుంది. ఈ మారే దృశ్యాన్ని సరైన రూపకల్పన చేసిన వాడే ఉత్తమ రచయిత...' అంటారు రచయిత్రి.

ఎన్నో విచిత్రమైన పాత్రలు సృష్టించి, సాహిత్యసైమూన్లు సృష్టించిన లతగారు మనకు మిగిల్చిన ఒక అద్భుత సృష్టి "ఎడారి పూవుల్లో"ని కామాక్షి.

****

# శ్రీమతి భానుమతి రామకృష్ణగారు సృష్టించిన "అత్తగారు"

**రచయిత్రి,** మహానటి, గాయని, దర్శకురాలు, ఉపాసకురాలు, చిత్రకారిణి, సంగీత దర్శకురాలు - వివిధ కళావిభావరి శ్రీమతి భానుమతీ రామకృష్ణ. ఆవిడ ఇతర ఖ్యాతులవలన రచయిత్రిగా పేరు పొందలేదు. రచయిత్రిగా సాహిత్యంలో ఒక సముచిత స్థానం పొందారు అనడం కన్న సాధించారు అనడం ఉత్తమం. దానికి తార్కాణం - ఆమె 'అత్తగారి కథలు' సాహిత్య అకాడమీ బహుమతి పొందడం. అంతకన్నా గొప్ప నిదర్శనం అత్తగారి కథలు విపరీతంగా అమ్ముడుపోయి పాఠకలోకామోదం పొందడం.

గొప్పవాళ్ళు ఏం చేసినా గొప్పే అంటారు అనుకునే సామాన్య ప్రజల మాటలకు అతీతురాలు. ఈ స్త్రీ మూర్తి నేను గొప్పదాన్ని కాబట్టి, గొప్పగానే పనులు చేస్తాను. గొప్పగానే రాస్తాను - అనే ఆత్మస్థైర్యం ఈమెది.

వివిధ రంగాల్లో నిష్ణాతురాలైన ఈవిడకు పాండిత్యం వరం. ఈమె కవిత్వం ఛందోబద్ధంగా చెప్పగలదు. సంస్కృతాంధ్ర భాషల్లో పరీక్షలు రాసెయ్యకపోయినా ఉభయ భాషా ప్రవీణ. చాలా మంచి పాఠకురాలు. కొంచెం పచ్చిమిరపకాయ బజ్జీలాంటి సద్విమర్శ ఆమెది.

"నాకు పెర్ల్‌బక్ ఇష్టం... ఆవిడ పుస్తకాలు అనువదించాను. నాకు అన్ని రసాలూ ఇష్టమే నేను ఏకాగ్రత చూపించలేదు కానీ, నేను చాలా సీరియస్ నవలలు రాసుండేదాన్నే. నేను నా ప్రతిభ ఏ ఒక్క శాఖకో అంకితం చెయ్యలేదు. ఫౌన్‌టెన్‌లా దశదిశలా వ్యాపించింది. అందుకే నాకు అన్ని రసాల్లోకి ఎక్కువ ఇష్టమైన హాస్యరసంతో నేను అత్తగారి కథలు రాసాను. నా కథలకు ఇన్స్పిరేషన్ మా అత్తగారే కానీ, ఇన్సిడెంట్స్ నా కల్పితాలు" - అంటారు భానుమతి.

అడవిబాపిరాజుగారు ఒక చోట - "మానవ జీవితంలో సంభవించే ఒడుదుడుకులకు, కష్టనిష్ఠూరాలకు బండిని కాపాడే స్ప్రింగ్ లాంటిది హాస్యరసం. హాస్యమనే కాపుదల లేకపోతే మానవుని హృదయం దుఃఖాఘాతం ఒక్కటి తగినా ముక్కలై ఉండును. మానవ జీవితము అద్దపు సామాను జాగ్రత్త వంటిది. ఆ సామాను విచ్ఛిన్నం కాకుండా ఉక్కుపెట్టె హాస్యరసం" అంటారు.

హాస్యరసం అంటే ఏమిటి? "వికృతి దర్శనాది జిహ్వామనోవికారోహనం"... అన్నాడు ప్రతాపరుద్రీయుడు. కానీనిజానికి హాస్యరచన నిర్వచనం చాలా కష్టం. "నిజమైన హాస్యం మెదడు నుంచీ పుట్టేది కాదు. హృదయం నుంచీ స్రవించేది. హాస్యము అంటే వెక్కిరింత

కాదు. దాని సుస్వరూపము ప్రేమ. పెద్ద పెట్టున గలగలలాడుచూ వచ్చే నవ్వుకన్న సద్దు చేయని చిరునవ్వులోనే, దాని లోతులు మనకు అర్థమౌతాయి -" అంటారు కార్లాయిల్.

అసలు మనకు పదవ శతాబ్దం వరకూ సాహిత్యం దొరికినట్టు తార్కాణం లేదు. ఆ తరువాత శ్రీనాథుడు కొంత హాస్య రచన చేశారు. ప్రబంధ కాలం నాటికి వికటకవి తెనాలి రామలింగడు శాశ్వతమయ్యారు. చాటువులు మనకు హాస్యాన్ని నిలిపాయి. ఆ తరువాతా అంధ యుగంలో హాస్యం వెతకలేం కదా.. ఇంక ఆధునిక యుగంలో వీరేశలింగం పంతులుగారు, పానుగంటి, చిలకమర్తి, గురజాడ, వేదం వేంకటరాయ శాస్త్రిగారు. ఆ తరువాత భమిడిపాటి వారు - మునిమాణిక్యం, మొక్కపాటివారు, వీరంతా హాస్యరచనకు సముచిత స్థానాన్నిచ్చి ఆంధ్ర సాహిత్యలక్ష్మిని సాలంకృతురాల్ని చేశారు.

ఆరుద్ర, శ్రీశ్రీ అనంతర యాత్ర (దేముని ఎదుట), బుచ్చిబాబుగారు (దారేపోయే దానయ్య), ముట్నూరివారు, విశ్వనాథంవారు (హాహా హూహూలూ) సాహిత్య సదస్సులో హాస్యానికి పెద్దపీట వేశారు.

రాజమన్నారుగారు, గోవిందరాజుల సుబ్బారావుగారు, ముద్దుకృష్ణగారు, కొవ్విడి లక్ష్మణగారు, కాంచనపల్లి కనకాంబగారూ, గంటి కృష్ణవేణమ్మగారు - వీరందరూ కూడా సాహిత్యంలో హాస్య సహాయంతో శాశ్వతత్వానికి ప్రయత్నించారు.

పై చెప్పిన మహా రచయితల స్థాయిలో "అత్తగారి"ని రూపకల్పన చేశారు శ్రీమతి భానుమతిగారు. ఆంధ్ర సాహిత్యంలో హాస్య రచనల మీద రీసర్చ్ జరిగితే అత్తగారి కథలు సముచిత స్థానం పొందక తప్పదు.

"సజీవమైన పాత్రను సృష్టించడం, ఆ పాత్ర యొక్క ప్రత్యేక వ్యక్తిత్వాన్ని చిత్రించడం సులభంగా సాధ్యంకాదు. ప్రబంధ నాయికా నాయకులు అచ్చుబొమ్మలు. ప్రతి వార, మాస పత్రికల్లో పాత్రలు నూటికి తొంభైకి మించి కీలుబొమ్మలు.. వాటిలో జీవగుణం ఉండదు. మన సాహిత్యంలో వాస్తవికత అరుదు. స్వానుభవంకన్న కవి సమయాల మీదా, లక్షణ సూత్రాలమీద నిర్మింపబడిన మన పూర్వ కావ్యాల్లో వాస్తవికతకు ప్రాధాన్యం లేదు. ఆధునిక రచయితలకు పాశ్చాత్య సాహిత్య ప్రభావం వల్ల వాస్తవికత మీద అభిమానం కలిగింది. కానీ ఏ కొందరో తప్ప ఆ విషయంలో విజయం సాధించలేదు. ఇంక హాస్యరస పోషణంటే అది మరీ అవినీతి, అపనింద, అసూయ, అసహ్యకరమైన పద ప్రేలాపన లేకుండా చక్కగా గిలిగింతలు పెడుతూ సృష్టించినవి బహు తక్కువ. అందులో భానుమతి "అత్తగారు" పాత్ర ఒకటి" - అంటారు రాజమన్నారుగారు.

భానుమతిగారి "అత్తగారు" తెలుగుదేశంలో ఒక ప్రత్యేక వ్యక్తిగా, సజీవ మూర్తిగా మిగిలిపోయింది. ఏ పాత్ర అయినా, అది ఎంత గొప్పగా రచయిత ఊహల్లో రూపుదిద్దుకున్నా వాస్తవానికి దూరమైతే గొప్ప పాత్రగా మిగిలిపోతుందేమోకానీ, అది సజీవతను సంతరించుకోలేదు. దానికి కారణం పాఠకులు ఆ పాత్రలో తమని తాము ఐడెంటిఫై చేసుకోలేకపోవడమే.

కానీ "అత్తగారు" అలా కాదు. ఆవిడను మనం ఒక డైమన్షన్ లో ప్రతి అత్తగారిలోనూ - ఆవిడ చాదస్తమో, అమాయకత్వమో, ఎప్పుడో తళుక్కుమనే జాణతనమో, అభిమానమో, ప్రేమో, ఉదాసీనమో, పెద్దరికంపట్ల వ్యామోహమో, గౌరవం పొందాలన్న కుతూహలమో, వంటమీద తన అధికారమో, మడి ఆచారాల మీద విపరీతమైన పోటీ, ఊహించలేని అమెండిమెంట్స్, పనివాళ్ళ మీద విపరీతమైన అనుమానమో, ప్రపంచం అంతా తమను దోచేసి అన్యాయంగా లక్షాధికారులై పోతారన్న భావమో. తన కొడుకు తనను ఏనాడూ మోసం చెయ్యడనీ, వెక్కిరించడన్న అభేద్యమైన నమ్మకమో, అప్పుడప్పుడు కోడలు వల్ల ఆ పనేదో నువ్వే చేస్తావు అన్న అనుమానపు చూపులో, శకునాలంటే, పంచాగాలంటే పిచ్చో, జ్వరమొచ్చినప్పుడు అప్పగింతలు పెట్టి మంగళహారతులు పాడెయ్యడమో - ఇలా ఇందులో కొన్నో లేక ఒకటో, రెండో గుణాలు ప్రతి అత్తగారిలోనూ ఉంటాయి. అదేం తమాషానో అవి కోడళ్ళే గ్రహించగలరు మరి.

"మా అత్తగారు మొన్నేం చేశారనుకున్నారు? భానుమతి అత్తగారిలా.." అని నవ్వేసే కోడళ్ళు ఆంధ్రదేశంలో ఎంతమందో.. ఇదుగో కేవలం ఈ ఐడెంటిఫికేషన్ వల్లే ఈ పాత్ర సజీవమైపోయింది.

ఆవిడ అత్తగారి పరిజ్ఞానానికి ఆధారమూ లేదు, అంతులేదు. ఆవకాయా నిమ్మకాయా ఒకేరకంగా పెట్టేయచ్చనే మనిషి. ఆవెంతో గేదంతే అనేరకం. ఆవిడకు తను చేసే ప్రతి నిర్వాహకంలోనూ కల్తీలేని నమ్మకం. పాపం.. అది అరిటికాయ పొడి చేసినా అందులో బొగ్గులపొడి కలిసినా, వడియాలు పెట్టి, అవి తగిలి పక్కింటి పిల్లాడికి బొప్పికట్టి రక్తం వచ్చినా, అవన్నీ తోసి రాజని ఎప్పటికప్పుడు కొత్త ప్రయత్నాలు పెట్టుకుంటుంది పాపం. ఏదైనా పొరపాటు జరిగితే ఆ తప్పు మరొకరిమీద తోసేసి చల్లగా తప్పుకుంటారు. ఆవిడ గిల్టీనెస్ చూస్తే కోపంరాదు. నవ్వొస్తుంది. సమయానికి తల దాటెయ్యడం, ప్లేట్లు తిప్పేయడంలో మహా దిట్ట ఆవిడ. అంతేకానీ, తప్పు తనంతట తాను ఒక పట్టాన ఒప్పుకోదు.

ఆవిడ పెరిగిన వాతావరణం, ఆవిడ బుల్లి ప్రపంచంలో ఏమి ఎరుగునో అదే జ్ఞానం అంటుంది ఆవిడ. దాన్ని దాటి మరింత పరిజ్ఞానం ఉందంటే ఒప్పుకోదు. శంఖంలో పోస్తే తీర్థంలా కొడుకో, మనవడో ఆవిడ ప్రీతిపాత్రులు కాబట్టి వారు చెబితే కొద్దిగా ఒప్పుకుంటుంది.  ఆంధ్రదేశపు అత్తగారిలా ఈవిడకు పుట్టింటివాళ్ళంటే చచ్చేంత ప్రేమ. అదే కోడలు తరపు పుట్టింటివాళ్ళంటే మహా ఎద్దేవ. కూతురంటే పంచప్రాణాలు. ఆవిడ వస్తోందని అప్పటికప్పుడు పదహారు రకాల తెలుగు వంటలు చేయించేస్తుంది. సవతులకు సరసం ఉండకూడదు. పాలవాడు తమ వాడుకకు పోసేవాళ్ళు సొంతగేదె కొనుక్కుంటే సహించలేడు. దొంగలు నల్లగా మీసాలతో ఉంటారు. ఇలా ఆవిడకు కొన్ని సిద్ధాంతాలున్నాయి. వాటికి జీవితంలో జరిగే నిజ సంఘటనలకూ ఘర్షణలోనే కథలు పుట్టాయి. ఐదు మానికుల వంచితం ఇచ్చే ఆవుందంటే నమ్ముతుంది. కానీ ఐదుమానికల పాలు ఇచ్చే జెర్సీ ఉందంటే నమ్మదు - బస్సు, ఫోర్డువానూ ఒకటే ఆవిడకు.

"హాస్యం ఎప్పుడూ మనస్థితికి వాతావరణానికి మధ్య ఉండే అసాంగత్యం నుంచీ ఉత్పత్తి అవుతుంది" అంటారు కొడవటిగంటివారు. నిజం అది. ఆవిడకు జరిగేది కూడా అలాగే జరుగుతుంది పాపం. పూలు, పళ్ళు, టెంకాయ.. ఆవు కోసం సిద్ధం చేస్తే అచ్చోసిన అంబోతు వస్తుంది. వంటకాలు సిద్ధంచేసుకుని కూతురు కోసం కారు పంపిస్తే కారులో పెళ్ళివారింటి విధవరాలైన వంటావిడను ఆవిడే ఆనుకుని ఎక్కించుకుని వస్తాడు డ్రైవరు. నక్సలైట్లు పారిపోయి మద్రాసు వచ్చారని పేపర్లో చదివి గూర్ఖాతో ఎవర్నీ రానియ్యద్దని చెప్పడంతో పాపం బంధువులూ, ఆత్మీయులూ అవమర్యాదపడి, తిట్టి వెళ్ళిపోతే నిజంగానే పారిపోయిన దొంగలు మారువేషాల్లో చుట్టాలమని నమ్మించి ఇంటిలో తిష్టవేస్తారు. ఇవన్నీ చదువుతూంటే మనకు పగలబడి నవ్వాలనిపిస్తూనే "పాపం అత్తగారు" అనిపిస్తుంది. అదే గొప్ప హాస్యం. హాస్యంలో వక్రత్వం, వికటత్వం ఉండకూడదు. నవ్వుతో పాటు అయ్యో పాపం అనిపించేదే గొప్ప హాస్యం.

ఆవిడ ఇంటి వెనకాల చాకలాడు, మంగలాడూ చేరారు. హాయిగా రోజు సన్నాయి మేళం, గాడిద అరుపు శకునం వినచ్చు అనుకునేలోపల, అది అపశ్రుతి మేళంగా గాడిదల ఘీంకారంగా మారిపోయి, ఇరవైనాలుగు గంటల్లో అభిప్రాయాన్ని మార్చేసుకుంటుంది.

ఆవిడకు తన భావన ముఖ్యం కానీ నిజం ముఖ్యం కాదు. ఒప్పుకోవద్దు. కథల్లో ఇది అనేక విషయాల్లో కనిపిస్తుంది. కొలువులో పెట్టే దశావతారాల్లో కృష్ణుడు కంసుణ్ణి చంపేబొమ్మలో  కృష్ణుడికో వేలూ, కంసుడికొక కాలూ పోవడంతో ఆ బొమ్మ బైట పడేశారు. "ఆ బొమ్మంటే మా అత్తగారికి ప్రాణం. నిద్రలేవగానే దానిముందుకు వెళ్ళి కళ్ళు తెరిచి నమస్కారం చేసేవారు. నాకో సందేహం కలిగింది. ఆవిడ నమస్కరించేది చచ్చిపోతున్న కంసుడికా? చంపుతున్న కృష్ణుడికా" అని, ఈ దృశ్యంలో భక్తిగా కళ్ళు మూసుకుని బోసినోటితో కంసుడికి నమస్కరిస్తున్న అత్తగారిని ఊహించుకోగానే మనకు నవ్వాగదు.

ఆవిడ పంచాంగాలు పాతవీ కొత్తవీ కూడా తిరగేసే సరదా ఉన్న మనిషి. ఒక్కొక్కసారి మతిమరుపుతో పోయిన సంవత్సరానిదో, అయిపోయిన నెలదో పంచాంగం తిరగేసి ఏకాదశి అని ఏ షష్ఠినాడో ఉపవాసం ఉంటుంది. పక్కింటి ఆవిడ వాళ్ళ పిల్లాడి అక్షరాభ్యాసానికి ముహూర్తం అడిగితే, దశమి అనుకుని అష్టమినాడు మంచి వర్జ్యం ఘడియల్లో అక్షరభ్యాసం చేయించేస్తుంది. అర్థాశ్రయమైన హాస్యానికి వ్యంగ్యస్ఫూర్తి ప్రధానం. ఆ వ్యంగ్య వైభవం చేత అందులో అర్థం లౌకికానందాన్ని ఆపాదిస్తుంది మనకు.

అత్తగారికి పెళ్ళిళ్ళు కుదర్చడం మహా సరదా. అరవీరభయంకరంగా కోరలు లాంటి పళ్ళు, మిడిగుడ్లుకల లక్ష్మీ నరసింహమ్మ అనే సార్థకనామధేయురాలికి సంబంధాలు వెతుకుతుంది. పెళ్ళికొడుకులందరూ దడుపు జ్వరానికి లోనైనంత పనౌతుంది. పోనీ ఆ పళ్ళు కొంచెం డెంటిస్టు చేత ఫైలు చేయిస్తే... అంటుంది కోడలు మెల్లగా.! అదేమాట.. వాళ్ళ తాతల కాలంనుంచీ నృసింహస్వామి ఉపాసకులు. వాళ్ళు అంతే. అంతా అదే పోలిక. లెంపలేసుకోమంటుంది. వెంకటేశం అనే మరొక అర్భనాకారికి మెట్ట తాబేలు పెంచే గంగాళాల్లా ఉండే వంశం పిల్లకు కట్నం ఆశతో పెళ్ళి కుదురుస్తుంది. ఆ తరువాత ఆ పెళ్ళి చూపుల ప్రహసనం, మెట్టతాబేలుతో పెళ్ళికొడుకు మూణ్ణిద్దర్లు - చెప్పేవి కావు చదవాల్సిందే మెట్టతాబేలు కొరకగానే రయ్యిన పారిపోయి పెళ్ళి చూపుల్లో డైనింగ్ టేబులెక్కేస్తాడు పెళ్ళికొడుకు. పెళ్ళిపీటల మీద అది కనబడగానే ఖంగారులో పురోహితుడి మెడలో తాళి కడతాడు. కార్యం గదిలో కనబడగానే తలుపులు తట్టి దూసుకుపోయి, సామాన్ల గదిలో అత్తగారు విశ్రాంతి తీసుకుంటుంటే, ఆవిడ తలమాటున ముడుచుకుని పడుకుంటాడు. ఫోటో తీద్దామంటే కోటు జేబులో స్టైలుగా చెయ్యి పెట్టుకోబోతే దాక్కున్న తాబేలు కొరుకుతుంది. ఇంక రెండు చేతులు పైకి పెట్టి 'దాన్ని తీసేయండి... చచ్చిపోతా.. కోటు పీకేయండి... చచ్చిపోతా?'' అని వెఱ్ఱిగా పిచ్చి కేకలు వేస్తాడు.

పెళ్ళి కూతురుకి పాత నగలుతో అలంకరించాలని అత్తగారి ప్రయత్నం - ''వడ్డాణం పెట్టడానికి పెళ్ళి కూతురు నడుం కోసం వెతికాం చిక్కలా - పిల్లను ఒక్కసారి నిలువునా చూసి మధ్య భాగం నడుం అని తేల్చి వడ్డాణం తగిలించబోయాం. సగం చుట్టుకు కూడా రాలేదా వడ్డాణం.. మెళ్ళో గొలుసు భూగోళంలా ఉన్న పిల్ల తల నుండీ దిగి మెడదాకా వెళ్ళలేదు. మధ్యనే స్టకప్ అయింది. ఇంక వంకీలు ముజేయి దాటలేదు. అత్తగారు నిరుత్సాహపడిపోయారు'' - ఈ దృశ్యం ఊహించుకుంటేనే చాలు... అక్షరాలతో కార్టూన్లు ఇవి.

మంచి హాస్యంలో ఒకరినొకరు పరాభవించుకోవడం ఉండదు. ఆపాతమధురమై, వినేవారికి, చదివేవారికి కూడా మానసోల్లాసాన్ని ఇచ్చేది గొప్ప హాస్యం.. శబ్దాశ్రయమై ఆ హాస్యం కన్నా అర్థాశ్రయమైన హాస్యం మరింత హాయిగా ఉంటుంది. మొదటి దాన్లో శ్లేష(ఫన్) ఎక్కువగా పోషించబడాలి. కానీ అర్థాశ్రయానికి వ్యంగ్యస్ఫూర్తి ముఖ్యం... చిలకమర్తి వారి 'గణపతి' ఈ కోవకు చెందింది. మళ్ళీ భానుమతి ''అత్తగారు'' ఇదే కోవకు చెందుతుంది. వ్యంగ్యానికి భానుమతిగారు పెట్టింది పేరు.

పనిమనిషి ఎల్లమ్మ నంగనాచి ప్రహసనంలో, పాపం అమాయకుడైన వంట అయ్యరును ఇరికిస్తారు అల్లరికి పనివాళ్ళు. 'దానికి అన్నిసార్లు కాఫీ ఇచ్చి గొంతుమీదకు తెచ్చుకున్నావు కదయ్యా' అని ఏడిపిస్తారు అత్తగారు. ''అమ్మా మీరూ నన్నపార్థం చేసుకున్నారా... ఏనాడో స్వసుఖము త్యజించి, శరీర సౌఖ్యములను మరిచి, వంట చెరకుతో వంట చెరకువలె...'' అని వాపోతాడు పాపం వంటాయన ''అప్పుడు (వంటాయన) మా అత్తగారికి అన్ని పనుల్లోనూ సహాయపడుతూండేవాడు ఒక్క వంటపనిలో తప్ప -''

''అప్పుడు పెండ్లి కంటే ముందు ''అంపకాలు'' జరుగుతుంది'' - ఇవన్నీ భానుమతిగారు మనిషిని స్థితిని చెప్పడానికి ఉపయోగించే పద్ధతులు.

అత్తగారు తిరుపతి ట్రిప్పులో చెల్లెలి కోడలితో రాత్రంతా లడాయి వేసుకుని, తెల్లవారగానే ముసిముసినవ్వుల్తో సంబంధాలు మాట్లాడుతారు. అరిటిపళ్ళు ఎన్ని తిన్నారో తెలియకుండా ఉండేందుకు చాపకిందకు తొక్కలు తోసేస్తూ ఉంటారు ఆవిడ వంట చేసుకుని వీపు గోడకు తిప్పి భోజనానికి కూర్చుంటే సాక్షాత్తు భగవంతుడే స్థంభంలో నరసింహుడిలా ఆ గోడలో ప్రత్యక్షమై చూస్తే తప్ప ఆవిడ

ఏం తింటున్నారో ఎవరికీ అర్థం కాదు. ఈనుతున్న గొడ్డు చుట్టూ, భూప్రదక్షణం అంత పుణ్యం అని ప్రదక్షిణం చెయ్యబోయి అది విసుగుతో తోసెయ్యగానే పాచిపట్టిన నీళ్ళతొట్లో పడి ఒక పట్టాన బయటకు రాలేదు అత్తగారు. "అమ్మగారు పడతారని తెలిస్తే శుభ్రంగా కడిగేవాడిని" అంటాడు పనివాడు. ఇదంతా కథలో పాత్రలో మిళితమైన హాస్యం. హాస్యం కోసం వేరే పాత్రలను ప్రవేశపెట్టడం ఉత్తమ కల్పనా శిల్పానికి తార్కాణం కాదు. ఆ పాత్రకు వేరే ఇంకొక అట్టను కత్తిరించి గ్రంథంలో అతికించినట్లుంటాయి. పాత్రలంటే కార్డ్‌బోర్డ్ కటౌట్స్ కాదు. ఎంతో చైతన్యవంతంగా ఉంటేనే అది సజీవతను ఆపాదించుకుంటుంది.

ఇందులో కోడలు మహాజాణ. చాలా మంచిదే. అత్తగారి మీద భక్తీ, శ్రద్ధా ఉండే వ్యక్తే.. కానీ అత్తగారి పరిస్థితిని ఎప్పటికప్పుడు తన తప్పు లేకుండా బైటపెడుతూ ఉంటుంది. గొప్పదైన ఈ పాత్ర అత్తగారితో సమాంతర పాత్రగా ప్రథమ పురుషలో చెప్పే ఈ కథలు మహా తెలివిగా అత్తగారి శాశ్వతత్వాన్నీ, ప్రత్యేకతల్ని తెలియచెపుతుంది. ఎదుటి వ్యక్తిలో లోపాలు, దోషాలు ఎన్నిక చేసి ఎద్దేవ చెయ్యడం ఒక్కొక్కసారి తాత్కాలికంగా నవ్వు తెప్పించినా, అది గొప్పదైన హాస్యం కాదు. వాటిని నవ్వుకుంటూనే పరివర్తన తెప్పించాలని చేసే ప్రయత్నం ఉత్తమ జాతి హాస్యం. తమ లోపాలు తామే గుర్తుంచుకుని ఎదుటివారిలో ఎత్తిచూపకముందే తామే గ్రహించుకుని, నవ్వుతూ బైట పెట్టి నవ్వుకోవడం చాలా ఆత్మ పరిశోధనా పూర్వకమైన హాస్యం. ఒకరకంగా ఈ కథల్లో అది కూడా ఉందనచ్చు. ఎందుకంటే 'అత్తగారూ.. బాలుపాయింటు'లాంటి అనుభవాలు భానుమతిగారివే అవి అత్తగారికి ఆపాదించబడినట్లు కథ సృష్టించారట.

మరొకరి లోపాలను కనిపెట్టి వాటిని తీవ్రంగా ఏవగించుకోవడం కంటే, వాటిని తేలికగా చూసి, ఆనందించి ఉభయతారకమైన హాస్యంతో ఇతరుల పట్ల సానుభూతి పెంచడం రెండవ పద్దతీ - ఈ కథల్లో రచయిత్రి ఎక్కువగా అదే పద్దతి ఉపయోగించారు.

ఈ అత్తగారి కథలు మూడు భాగాలు. అత్తగారి కథలు 1,2 భాగాలు, అత్తగారూ - నక్సలైట్లు మూడవ భాగం. ఇవి పండిత పామర జనామోదం పొందిన కథలు.

భానుమతిగారు 'అత్తగారు' అను పాత్రను రంగస్థలం మీద నడిపిస్తూ ఒక గొప్ప "ట్రిక్" చేశారు. ఆమె ఈ పనిని బహుశా కావాలని చేసి ఉంటే, అతికించిన బొమ్మ తయారై ఉండేది. దైవదత్తమైన ఆవిడ రచనా పాటవంలో అది అలా అమిరిపోయింది. అత్తగారిని ముఖ్యపాత్రధారిగా పెట్టుకుని, హాస్యాన్ని ఆహార్యం చేసి, అప్పర్ మిడిల్‌క్లాస్ వాతవరణాన్ని, తెలుగింటి పాతకాలపు గృహిణుల మనస్థత్వాన్ని అమాయకత్వాన్ని, అలవాట్లనూ వర్ణిస్తూ, మనకు చరిత్ర, దాని ఆత్మను నిలబెట్టేశారు. అక్షరరూపంలో వాస్తుశాస్త్రం ప్రకారం కట్టిన ఇల్లు, వంటవాళ్ళు, గోల్కొండ వ్యాపారుల పద్దతి, ఆచారం, ముడిపేరుతో జరిగే అల్లరి, అమెండ్‌మెంట్స్ ప్రక్షాళన - ఇవన్నీ నవ్వొచ్చేట్లు వివరిస్తూనే మనదైన పద్దతులు ఎలా ఉంటాయో చెప్పారు భానుమతిగారు.

ఇందులో వర్ణించిన వంటలు మన తెలుగుదనాన్ని ఆంధ్రుల భోజన ప్రియత్వాన్నీ చూపెడతాయి. తల్లులకు ఆడపిల్ల ఇంటికి వస్తోందంటే వచ్చే హడావిడి సంబరం, వియ్యంకులు వస్తే, ఏదో ఒక స్పెషల్ చేసి వడ్డించి గొప్పదనం చెప్పాలనుకునే ఔన్నత్యం. బంధుప్రేమ, పనివాళ్ళ మీద ప్రేమ ఆప్యాయత, అనుమానం సమపాళ్ళలో ఉండడం - ఇవన్నీ మనవాళ్ళ పద్దతులే... పుస్తకం చదువుతున్నంతసేపూ, మనవాళ్ళందర్నీ అద్దంలో చూసినట్టుంటుంది - ఇది ఒక ప్రత్యేక శైలి. పాత్రోన్మీలనకు తపన పడేవారు సాధారణంగా పరిస్థితుల్ని సృష్టించగలరు కానీ, వాతావరణాన్ని మర్చిపోతారు, లేక అశ్రద్ధ చేస్తారు. అందువల్లనే ఒక్కొక్కసారి గొప్ప కథలు, నవలలు అనిపించే వాటిల్లో ఏదో లోపం కనిపిస్తుంది. అది ఈ తెలియని బాక్‌డ్రాప్ చిత్రీకరణ, నేటివిటీ, జనాంతికత ఇవీ ఈ కథల్లో ప్రతీచోటా మనకు కనిపిస్తూనే ఉంటాయి. మన అమ్మమ్మలు, బామ్మలు, తాతమ్మలు ఎలా ఉండేవారో మనం గుర్తుపట్టెయ్యచ్చు. పైగా ఎక్కడా దుర్భరమైన గుణాలు అత్తగారికి ఆపాదించి అవమానపరచలేదు భానుమతిగారు. ఈ అత్తగారిని తెలుసుకుని, ఈకాలం అత్తగార్ల గుండెల్లో పెరిగిన కట్నాల గోడలు, అసూయల తెరలు తొలిగిపోతే, ఎంత బావుండును అనిపిస్తుంది. అన్ని కథలూ చదివిన తరువాత

మనకు తెలియకుండానే అత్తగారంటే అభిమానం, ప్రేమా గుండెల్లో చల్లగా పరచుకుంటాయి. తలుచుకున్నప్పుడల్లా నవ్విస్తాయి. ఇందువల్లే ఈ పాత్ర సజీవతను పొందింది.

ఆవిడ అత్తగారిని తలుచుకోని కోడల్ని లేకుండా చేసారు మొత్తానికి భానుమతిగారు తన రచనా స్ఫూర్తితో. బహుశా వంద పుస్తకాల అంకితాలు, కొన్ని శిలావిగ్రహాల ఆవిష్కరణలకన్నా ఈ రచనల వలన ఆంధ్ర సాహిత్యంలోనూ, అత్తా కోడళ్ళున్న ప్రతి ఇంటిలోనూ తన అత్తగారిని శాశ్వతం చేసి కోడలుగా తన మనసు తీర్చుకున్నారు భానుమతిగారు.

ఇటు రచనా ప్రక్రియంగా, అటు సజీవ పాత్ర సృష్టిపరంగా కూడా భానుమతిగారు ఆంధ్ర సాహిత్యంలో ఒక సముచిత స్థానాన్ని పొందారు.

❀❀❀

# మాలతీ చందూర్ 'భూమిపుత్రి'లో "దుర్గ"

**ప్రపంచంలో చాలా అందంగా స్పందించేవి,** మనసుతో మాటలాడగలిగేవీ, మనం నిశ్శబ్దంలోకి పారిపోయి వినగలిగితే బోలెడన్ని ఊసులు తెలియ చెప్పేవి - ఇవన్నీ చాలా సహజసిద్ధమైనవి. అతి మామూలుగా ఉండే వెన్నెలరాత్రి, వానచినుకు, హఠాత్తుగా ఉదయించే ఇంద్రధనస్సు, కమ్మటి భావనను మనసులో ఇముడ్చుకుని మనముందు గుమ్మరించిపోయే మలయానిలము, .సద్యోజాత ప్రసూనం - ఇవేనా - ఇంకెన్నీ - చాలా సహజంగా హాయిగా అద్భుతంగా మనం ఆగి గమనించి పలకరించగలిగితే జీవితానికి అవతలి ఒడ్డుకు ఊహల ఓడ కట్టగలవు అవి.

ఆ స్థితికి మనం వెళ్ళలేకో, ట్యూన్ చేసుకోలేకేనేమో, ఏదో పర్వర్టిజమ్, కాంప్లెక్సు, దేనిమీదా నమ్మకంలేని సినిసిజమ్, ఏదో ఒకవిచిత్రావేశాన్ని నిబిడీకృతం చేసుకున్న తమస్సు, మేఘం కమ్మిన చందమామ, ధూళిలో రాలిపోయిన మల్లెపూవు, ఎండిపోయిన గుండెలమీద పారేడే ఎముకల శిశువు, స్మశానంలో వినవచ్చే కరాళనృత్యంలో డమరునాదం, చిట్లుతున్న గాజుల్లో నిస్సహాయత, బిగుసుపోతున్న పసుపుతాడు - ఇవన్నీ చూడటానికి, ఊహించడానికి అలవాటుపడ్డ మేధస్సులు మనలో చాలా మందివి. అవి కవిత్వం చెప్పగలవు. కావ్యాలు అందించగలవు. గుండెల్లో లావాల్ని పుట్టెల్లో నరాల్ని వత్తులుగా వేసి రక్తారుణ దీపాలు వెలిగించగలవు.

కానీ...సద్యో జాలాలను దండగుచ్చి వాతావరణాన్ని మార్చే చేతులూ, నల్లటి బావుండని చిత్తడి నేలమీద సన్నటివేళ్ళు ఉషఃకాలంలో సారించే తీగల ముగ్గుల మధ్య అందంగా అలంకరించుకుని కలకలా నవ్వే గొబ్బిళ్ళ పాపాయిలూ, భావరాహిత్యంలో నిలబడిపోయిన దర్వాజాకు మామిడి ఆకులు, బంతి పువ్వులతో అలంకరించే గాజుల చేతులు, దీనత్వం మీద అనాధలమీద జాలికన్న "మీరూ మాలో ఒకరని" చెప్ప గలిగిన దృఢత్వం, కరుణ, ప్రేమ, దయ చాలా సహజంగా పంచిపెట్టగల హృదయం - వీటిని గురించి తెలుసుకున్న వ్యక్తులు, అనుభవాన్ని పంచగల నిశ్శబ్దమూర్తులు మనచుట్టూ వాతావరణాన్ని ట్యూన్‌చేసి, జీవితంలోని సినిసిజమును, శాడిజంను అణగద్రొక్కగల 'దుర్గ'లౌతారు. ఇంత అద్భుతమైన విలువలు జీవితాల చుట్టూ అందంగా, నిశ్శబ్దంగా వ్యాపించి ఉన్నాయి. గుర్తించమని మనను తయారు చేస్తుంది 'దుర్గ'

దుర్గ - ఈమె మాలతీ చందూర్‌గారు సృష్టించి సజీవత్వం ఆపాదించబడిన 'భూమిపుత్రి'లో పాత్ర. అసలు ఈ నవల పేరులోనే రచయిత్రి చాలా ఊహకందని విషయాలకు ఊపిరి పోసి, రేఖారూపంగా మన ముందు నిలబెట్టి చదువుతున్నంతసేపూ "ఇలా హాయిగా ఆలోచించవచ్చుకదా! మనం కూడా ఇంత సుఖంగా బ్రతకచ్చుకదా అనిపిస్తారు. దుర్గ మాములు ఆడపిల్ల - మనలో ఒక అమ్మాయి కానీ ఆమెను సృష్టించిన మాలతిగారు ఆమెను గుర్తింపచేసి అక్షరాలతో సజీవత్వం ఆపాదించి రచయిత్రిగా ఆవిడ మనకు తీపి జ్ఞాపకంగా ఉండిపోయేటట్లు చేశారు.

"పదిమంది మధ్యలో మాట, నెమ్మది, సంస్కారం, టేబిల్ మానర్స్, స్నేహితుల్ని తయారు చేసుకోవడం, స్నేహం, నిలుపుకోవడం - ఇవన్నీ పల్లెటూర్లో పుట్టిపెరిగిన మా కెవరు నేర్పుతారండీ! మా అమ్మలకూ, తమ్ములకూ కూడా వంటలు చెయ్యడం, సర్దుకుపోవడం తప్ప ఏం తెలుసు?! మేము ఎవర్ని చూసి నేర్చుకున్నాం?! మాలతీ చందూర్‌గారే మాకు ఇవన్నీ చెప్పారు. ఆవిడను నేను ఎప్పుడూ చూడలేదు.. కానీ, ఆమె నాబోటి ఎంతో మందికి తల్లి. గురువు కూడా" - అన్నది, తనకున్న మండువాఇల్లును చాలా శుభ్రంగా, అందంగా ఆర్టిస్టిక్‌గా పెట్టుకున్న తూర్పుగోదావరి జిల్లాలో మారుమూల పల్లెటూరు ఆడబడుచు ఒకామె. విప్లవాలను విరజిమ్మిన రచయిత్రులను, స్వతంత్ర కాంక్షను నిద్రలేపి, దాన్ని తరువాత ఎలా ఉపయోగించుకోవాలో తెలియచెప్పని రచయితలను, భావుకతను నేర్పించి, భావరాహిత్యపు పరిధుల విశృంఖలత అనే తీరం చేరని పడవలను ఎక్కించి వదిలేసిన రచయితలను, గురించి వింటూ ఉంటాం. చదువుతాము. కానీ తన చుట్టూ ఉన్నవారికి, అక్షరజ్ఞానం తెలిసిన వారికి, స్నేహంగా, పద్ధతిగా, అప్యాయతగా హాయిగా బ్రతకడం ఎలా అని నేర్పడానికి ప్రయత్నించిన మన ఆంధ్ర దేశపు రచయిత్రి మాలతీ చందూర్. అందుకే 'దుర్గ'ను సృష్టించగలిగింది.

మనచుట్టూ ఉండే మామూలు హాయిని, సహజమైన ఆనందాన్ని గుర్తించలేము. ఏవో ఆలోచనా వలయాలలో చిక్కడిపోతాం మనం. **మండుటెండలో చల్లటి చెట్టుకింద సేదతీర్చుకునే బాటసారి తమోగర్భంలో ఉండే అగ్నిరేఖల్ని ఊహించుకుంటే అది ప్రత్యేకత ఏమో కానీ, తనకు చల్లటి నీడను అవసరంలో అందించి ఆదరించిన చెట్టు అమోఘత్వాన్ని గుర్తిస్తే మనిషి సుఖపడగలుగుతాడు.** దీనివల్ల చెట్టుకు వచ్చే ప్రత్యేకమైన గుర్తింపులేదేమో... కానీ, **గుర్తించ గలిగిన హృదయం వల్ల మనిషి ఎదుగుతాడు.** ఈ చిన్న జీవన సత్యాన్ని తెలుసుకోవడానికి చాలా గొప్ప విద్యావిధానం కావాల్సిరావడం దురదృష్టకరం. అటువంటి విద్యాలయమే ఉంటే అందులో ఈ నాన్‌డిటైల్డ్ భూమిపుత్రి.

'కనకదుర్గ" అంటూ ఉత్తరంలో సంతకం పెట్టి బావను ఫకాల్న నవ్వించిన దుర్గ. ఊపిరి సల్పకుండా కబుర్లు చెప్పి ఉక్కిరి బిక్కిరి చేసే దుర్గ. ఎక్కడా క్షణం సేపు కుదురుగా నిల్చోదు. రామకృష్ణను (దుర్గ బావని) నిల్చోనివ్వదు. ఆ పెద్ద కాటుక కళ్ళు గిరగిరా తిప్పుతూ, చుట్టూ పరిసరాలను గమనిస్తూ, గలగల పారే నదీ ప్రవాహంలా మాట్లాడే ఈ వాగ్డుడుకాయ ఎందుకు వస్తోంది?! సహజ సిద్ధంగా బిడియస్తుడు, పిరికివాడూ అయిన రామకృష్ణ ఆలోచిస్తాడు.

"ఉన్నట్టు నేను నీదగ్గరకు వచ్చేస్తున్నాను".. అని టెలిగ్రాం! మానసికంగా పరిపక్వం కాని రామకృష్ణ అర్థికంగా అత్తయ్యా మామయ్యల మీద ఆధారపడ్డ రామకృష్ణ ఒణికిపోతాడు.

పైగా రావడమే తడవుగా "ఈ రాత్రి వెళ్ళిపోతాననుకుంటున్నావేమో అదేం కుదరదు. మనిద్దరం పెళ్ళి చేసుకుందాం.." అంటుంది. గుండాగిపోయినంత పనౌతుంది రామకృష్ణకు. మామయ్య తన కూతురు సరస్వతిని ఇచ్చి చెయ్యాలనే తనకు చదువు చెప్పిస్తున్నాడని తెలుసు, కానీ ఆయన తమ్ముడు కూతురు.. దిక్కూమొక్కూ లేని "దుర్గ" అంటే రామకృష్ణకి విపరీతమైన ఇష్టం అభిమానం ఉన్నా మామయ్యను ఎదిరించి వేసుకునే ధైర్యం, ఆలోచన లేవు అతనికి.

'నువ్వు నా తండ్రిలాంటివాడివి అంటే కులం సంగతి ఎత్తుతావేమిటి బాబాయ్...' అంటూ రంగస్వామితో చుట్టరికం కలుపుతుంది. ఆ కలుపుగోలుతనం, చొరవతోనే ఇంటావిడకు, రామకృష్ణ స్నేహితులకు దగ్గరైపోతుంది. వీరందరూ మొదట్లో జాలితో

దుర్గను ఆదరించినా, కొద్దిరోజుల్లోనే తన ప్రవర్తనతోనూ, తన ప్రత్యేకతతోనూ, మరిచిపోలేని ఆత్మీయురాలౌతుంది. రామకృష్ణను పెళ్ళిచేసుకుంటుంది.

ఆమె నిజాయితీ, సూటిగా ఆలోచించగలగడం ఆమె జీవితాన్ని ఒక ప్రత్యేకమైన దారిలో పెడతాయి. కొమ్మమీద నుంచీ అటూ ఇటూ వాలే చీకిలి పిట్టలా, ఈ చిలిపికళ్ళ చూపుల వెనక ఏదో ఆలోచన, ఎంతో ముందు చూపు ఉంటాయి. గొప్ప ఆర్థిక తత్వవేత్తలా ఆలోచిస్తుంది దుర్గ. సాధారణంగా జీవితం కొట్టిన దెబ్బలకు బెరుకు, భయం నిస్పృహ కలుగుతాయి. కానీ దుర్గ నిజాయితీతో కూడిన ఆత్మవిశ్వాసం ఆమెకు కొత్త జీవితం ఇస్తుంది.

దుర్గ మాట్లాడే ఆర్థిక వ్యవస్థ విధానం నుంచీ, మనకు ఆంధ్రదేశంలో దిక్కులేని ఆడవాళ్ళను సొంత అన్నదమ్ములు, అయినవాళ్ళు కూడా ఎలా అణిచిపెట్టాలని, మోసంచెయ్యాలని ప్రయత్నం చేస్తారో చాలా గొప్పగా చెప్పారు రచయిత్రి. దుర్గ తల్లి భర్త పోవడంతో, కూతురుతో బావగారి పంచన చేరుతుంది. వాళ్ళూ తమను ఆదుకున్నారని, పోషిస్తున్నారన్న ఉద్దేశ్యంతో దాస్యం చేస్తుంది. కూతురు దుర్గ చేత చేయించాలని ప్రయిత్నిస్తుంది.

"మీ మామయ్య మావల్ల ఏం నష్టపోలేదు. మా ఇల్లు తనే తాకట్టు పెట్టుకున్నాడు. దమ్మిడీ జీతం లేకుండా వంటమనిషి, పనిమనిషులం మేమిద్దరం దొరికాం. జీతానికి పెట్టుకున్న వాళ్ళైతే వీళ్ళ తిట్లకు జడిసి ఎప్పుడో పొయ్యేవారు. మేము కాబట్టి పడి ఉన్నాం..." అంటుంది దుర్గ.

తన ఇంటి కప్పుకింద ఉన్న అనాధలు రామకృష్ణ, దుర్గ ఇద్దరు. కానీ రామకృష్ణకు తన కూతుర్ని ఇచ్చి చెయ్యాలని చదువు చెప్పించి, ఖర్చులు భరిస్తాడు ఈశ్వరయ్య. కానీ దుర్గ వల్ల ప్రత్యేకమైన లాభం లేకపోవడం వల్ల ఆమెను చాలా హీనంగా చూస్తాడు... అతని కూతురు ఉపయోగించిన పాతబట్టలు దుర్గ కట్టుకోవాలి. క్యూటక్సు వేసుకుని, గంజి చీరలు నలక్కుండా కట్టుకున్న కూతురుకు తమ్ముడు కూతురు దాసి పని చెయ్యాలి. గాజులు వేయించుకోవాలన్నా కనీసం సినిమా చూడాలన్నా బోలెడంత కాకాపట్టాలి. పండుగలప్పుడు చాకిరి వీళ్ళది. సరదా వాళ్ళదిగా మారిపోతుంది. బొమ్మలు కొలువు పెట్టడం, పార్కులు చెయ్యడం - ఇల్లాంటి చాకిరి దుర్గది. కానీ మెప్పుకోలు మటుకు పెద్దమ్మ పొందాలి. కుంకుడుకాయలు, తిలకంసీసా లాంటివి కూడా వాళ్ళకున్న కొద్దిపాటి డబ్బు (ఇల్లు అమాంతం సొంతం చేసుకుని కన్నీళ్ళు తుడవడానికి ఇచ్చిన ఒక వెయ్యి వెండి రూపాయలు) లోనే లెక్క చూసుకోవాలి. మనిషికి తిండి, బట్ట, ఉండటానికి ఆశ్రయం ఇచ్చినంత మాత్రం చేత వాళ్ళను కొనుక్కున్నాం అనుకుంటారు. తల్లి కూతురు ఇద్దరూ కోడి కుయ్యగానే లేచి పని ప్రారంభిస్తే, రాత్రి పదిగంటలదాకా పని చెయ్యాల్సిందే తల్లి, దాస్యానికే పుట్టాననుకోవడం, దుర్గకు బాధ కలిగించి, ఆమెలో విప్లవం లేపుతుంది. అందుకే అప్పుడప్పుడూ పెదనాన్నకు, పెద్దమ్మకు ఎదురు తిరుగుతుంది. కానీ తల్లి ఆ కొంచెం నీడకూడా ఉండదన్న భయంతో దుర్గను కొడుతుంది.

"నేను అడ్డం వద్దామనుకున్నాను కానీ..." అన్న రామకృష్ణ గొంతులో నిస్సహాయతను చూసి నవ్వి "నువ్వా" అని నవ్వే దుర్గకు బోలెడు ప్రపంచ జ్ఞానం, టెన్త్‌క్లాసు 'డిగ్రీ'లకు అందని లౌక్యం ఉంటుంది.

తల్లి నిస్సహాయ స్థితిలో చచ్చిపోతే ఏడ్చి గుండెలు బాదుకుని దుఃఖపడదు దుర్గ. ఆమె దుఃఖం కన్నీటికి అతీతమైంది. పోన్లే తల్లి చచ్చి సుఖపడింది అంటుంది.

"తల్లి చచ్చిపోయినా నువ్వు పనిచేయాలా?" అని రామకృష్ణ బాధగా అన్నప్పుడు, నవ్వులో మువ్వల సవ్వడి దాచేసుకుని నిశ్శబ్దంగా, బాధగా, నిర్లిప్తంగా నవ్వుతుంది దుర్గ.

ఇంతటి ఆర్థిక శాస్త్రవేత్తలా, చాలా కాలిక్యులేటివ్‌గా ఉండే ఈ అమ్మాయి గుండెల్లో ప్రత్యేకత కోసం ఎంత ఉలికిపాటు ఉంటుందో హృద్యమంగా చెపుతారు రచయిత్రి. ముగ్గులు వెయ్యడం దుర్గ ప్రత్యేకత. కానీ ఆ ముగ్గు తన డబ్బుతోనే కొనుక్కోవాలి. పెదనాన్న ఇవ్వడు.

"ఎందుకు ఆ దండగ ఖర్చు?" అంటే.

"ప్రతి మనిషికి ఒక గుర్తింపు ఉండాలనిపిస్తుంది మీకందరికీ మీమీ ప్రత్యేకతలున్నాయి. మరినేనో... నాకు ఎవరూ లేరు అనాథను. నేను కొన్ని పనులు ప్రత్యేకంగా చెయ్యగలను.. నాకూ ప్రత్యేకత ఉంది అని నిరూపించుకోవాలనిపిస్తుంది" అంటుంది దుర్గ దీనస్వరంతో. **ఎంత అద్భుతమైన జీవన సమీక్ష ఆ పల్లెటూరిపిల్లలో.**

"బావా! ఏ ఆశా లేకుండా, నాదీ అన్న వస్తువు లేకుండా అలా ఒక్కళ్ళే బ్రతకటం ఎంత కష్టం?? అది ఎంత కష్టమో చెప్పడానికి నాకు మాటలు రావడం లేదు. నిద్రపోవడం, పనిచేసుకోవడం, వండటం, అందరికీ వడ్డించడం. మళ్ళీ పని, మళ్ళీ వంట, రాత్రిళ్ళు ఒక్కర్తెనే హాల్లో పడుకోడం.. ఈ దినచర్యలో నాకు సినిమా చూడడం, నువ్వు సెలవుకు రావడం ఈ రెండే వెలుగు కిరణాలు. నీతో మాట్లాడ నిచ్చేవారు కాదనుకో. ఆ తిట్లు తిని, నేను కాబట్టి ఆ ఇంటి అన్నం తిని, బట్టకట్టాను. మరొకళ్ళయితే నూతిలో దూకి చచ్చేరు. సినిమా చూసి, అదంతా మళ్ళీ తిరిగ్గా నేను నాలో తిరిగి వేసుకుని చూసేదాన్ని. పుస్తకాలు చదివితే కరెంటు ఖర్చు అనేవాళ్ళు అందులో..." ఎంతో సెన్సిటివ్, ఆలోచించగల నేర్పూ ప్రత్యేకత ఉన్నా, ఆ అభాగ్యురాలైన అమ్మాయి ఆంధ్ర దేశపు, ఆర్థిక సామాజిక వ్యవస్థకు బలైపోయిన అమ్మాయి మాటలు ఎవరికీ తొందరగా అర్థం కావు.

పెళ్ళైన తరువాత ఎలా బ్రతకాలా? అని ఆలోచిస్తూంటే "నీకేం భయం లేదు. నేను ఉన్నాను. మనం ఒకరికి ఒకరు తోడు. నీ కష్టం నాతో చెప్పుకోవచ్చు. నా బాధ నీకు చెప్పుకుంటాను. **మనసులో మాట చెప్పుకోగలిగిన తోడు దొరికినప్పుడు భయం అన్నది ఉండదు." అన్న దుర్గలో మనకు కనిపించే గొప్ప గుణం "పాజిటివ్ థింకింగ్".** "నువ్వు అలా ధైర్యంగా చెపితే, నాకు ఏనుగు ఎక్కినంత సంతోషంగా ఉంటుంది" అని ఎదుటి వ్యక్తికి శక్తినిచ్చి, గౌరవించి, ప్రేమించి, ధైర్యం చెప్పే దుర్గ తన చుట్టూ వాతవరణాన్ని అద్భుతంగా మార్చగలదు. తన శక్తి మీద ఆధారపడ్డ నిస్సహాయురాలిని, గుండెల్లో దాచుకోవాలి అనిపిచేట్లు చేస్తుంది దుర్గ.

ఈ నవలలో చాలా సార్లు దుర్గ – స్వతంత్ర్యం, అది మనిషిలో నింపే కొత్త ఊపిరి గురించి చాలా హృద్యమంగా చెపుతుంది.

"పెదనాన్న ఇంట్లో నాకు 'ఇది నా ఇల్లు కాదు. వీళ్ళు నా వాళ్ళు కారు' అని ప్రతిక్షణం అనిపిస్తూ ఉండేది. వాళ్ళు తిండిపెడుతున్నారు. నేను చాకిరీ చేస్తున్నాను అనుకునేదాన్ని కానీ ఈ నా ఇంట్లో నుంచీ పారిపోవాలనిపించదు. వంటరితనం, ఎవరికీ అక్కరలేక పోవడం ఎంత బాధాకరమైన విషయమో ఎవరికీ తెలియదు. "

"బావా! నాకు ఈ రోజు ఎలా ఉందో తెలుసా! హాయిగా రోడ్లమీద పరిగెత్తాలనో, గట్టిగా అరిచి నేను సర్వస్వతంత్రురాలని చెప్పాలని ఉంది: ఇన్నాళ్ళకు భయపడకుండా నిద్ర లేచాను. " లేవగానే సతాయింపులు, బాధ్యతలు తెలియ చెప్పడం నిన్నో మొన్నో చేసిన పొరపాట్లకు భయంకరమైన తిట్లు తినవలసి రావడం, అంతకన్నా భయంకరమైన విషయం నువ్వు మాకు చాకిరికి పుట్టావు, నువ్వు మాలో ఒక దానివి ఎప్పుడూ కాలేవు.. అని చుట్టూ పెదనాన్న, ఆయన కుటుంబం ఎల్లప్పుడూ తెలియపరుస్తూ ఉంటే, బానిసత్వం అంటే ఏమిటో, ఏ కొద్ది స్వతంత్ర్యం కూడా మనిషికి ఎంత హాయినిస్తుందో అర్థం చేసుకోగలుగుతుంది దుర్గ; అందుకే రోషంగా, "స్వతంత్ర్యం గురించి నువ్వు చెప్పుకోలేవు. నాకున్న స్వేచ్ఛను, స్వతంత్రాన్ని నువ్వు గుర్తించలేవు. బావా! నీలాంటి మగవారు సరస్వతిలాంటి వాళ్ళు (పెదనాన్న కూతురు) స్వతంత్రాన్ని గుర్తించలేరు. ఎందుకో తెలుసా? అది మీకు పుట్టుకతోనే ఉంది. దాన్ని గురించి మీరు పోరాడక్కర్లేదు. మీకు అవసరమూరాదు... సూర్యోదయం అన్నది అందరికీ వెలుతురును, సంతోషాన్ని ఇస్తుంది. నాలాంటి బానిస బ్రతుకు బ్రతికిన వాళ్ళకు భయం, బాధను ఇస్తుంది..." అని స్పష్టంగా చెప్పగలుగుతుంది.

రామకృష్ణ స్నేహితుల గదిని, బ్రహ్మచారుల మఠం నుంచీ, ఒక ఇల్లాలు ఉండే గదిగా మార్చేస్తుంది దుర్గ ఆమెలో పొందిక, పద్ధతి పెద్ద పొగడ్త కోరుకోవు. అలా ఉండటం ఆమె సహజసిద్ధ గుణం కానీ తనూ, రామకృష్ణ ఆ ఇంట్లో కాపురం ఉండటం వల్ల, ప్రిన్సిపాల్‌గారు మొదలైన వాళ్ళు పెదనాన్న ఈశ్వరయ్య ఫిర్యాదు చెయ్యగానే ఇబ్బంది పెడతారని తెలియంగానే..

"అన్నదమ్ముల్లాంటి నీ ఫ్రెండ్స్ గురించి అలా వంకరగా మాట్లాడినప్పుడు. ఇక్కడ ఉండటం మనకు అంత మంచిది కాదు. మన మనసులు స్వచ్ఛంగా ఉండచ్చు కానీ చూసేవాళ్ళ మనసుల్లో బురద ఉంటుంది బావా వేరే గది చూడు..." అనే దుర్గ లౌకిక జ్ఞానం నుంచీ చాలా తెలుసుకోవాలి: "నేను తప్పుచెయ్యనప్పుడు నేను ఎవరికి భయపడాలి? ఎందుకు భయపడాలి?" అంటూ మిడిమిడి జ్ఞానంతో ప్రశ్నిస్తూనే, తీరా ఎవరైనా ఏదైనా అంటారని, తమనీడ చూసుకుని తాను భయపడే అజ్ఞాన విద్యావంతుల కన్నా దుర్గ లాజిక్ గొప్పది.

"తాతా... మేము పుట్టింది పెద్దకులం అయినా మా ఇళ్ళల్లో ప్రేమాభిమానాలు ఉండవు. నువ్వెవరివి, నేను ఎవర్ని.. ఒక రెండు రోజుల్లో ఏం అభిమానం చూపెడుతున్నావో చూడు?!" అంటూ ఒక సీసా ఉల్లిపాయల పప్పు పులుసుతో, కొరివి కారంతో వాచ్‌మన్ తాతకు దగ్గరైపోయి, స్కూలు ఆవరణలో పొందికగా గుమ్మాలకు పసుపూ, ఇటూ అటూ చంద్రవంకలాగా తీర్చిన కుంకమ రేఖలు, పసుపు గుమ్మం మీద తెలుపు, ఎరుపు చుక్కలు - వీధి వాకిలి అద్దంలాగా ఊడ్చి, తీర్చిదిద్దిన రంపవల్లులు - ఆ పాడుపడ్డ కొంప వాతావరణమే మార్చేస్తుంది దుర్గ.

"దుర్గా!? నువ్వు మాట్లాడి ఆలోచిస్తావు అందుకే నీ కబుర్లు నిజాయితీగా, తమాషాగా, ఉంటాయి -" ఆమెలో పసితనపు ఆకర్షణకు కారణం, ఎదటివారిని ఆకట్టుకునే నిశ్శబ్దార్పణ కనిపెడతారు బ్రహ్మచారి, అరవింద భక్తులు, ఆస్కూలుకు క్యూరేటర్ అయిన సంజీవరావుగారు. ఆయన దృష్టిలో ఆదర్శవంతమైన పాఠశాల అనాధ శరణాలయం గురించిన ఆలోచనలు బోలెడు కానీ, అవి ఆచరణలోపెట్టేటప్పటికి ఆచరించే టీచర్లకు, మ్యాట్రిన్స్‌కు పిల్లలకు విసుగు, విరక్తి కలిగించి, ఎక్కడ తను అపజయం ఎదుర్కొంటున్నారో ఆయనకు అర్థంకాదు. **అనుభూతి రాహిత్యం, అర్పణభావం లేకపోవడం చాలా ఆదర్శాలు అపజయం పొందడానికికారణం** అని తెలుసుకోవడానికి "దుర్గ" అర్థంకావలసి వచ్చింది సంజీవరావుకి.

దుర్గ పట్ల పుత్రికా వాత్సల్యంతోనూ, స్త్రీ సహజమైన మాతృత్వభావనతోను, ఆయన పసితనంలోని సువాసనల అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటారు. వేపపువ్వుల వాసన, పారిజాతాల గుబాళింపు, కొబ్బరి మట్టలు కాలుతున్న వాసన, అరవిందాశ్రమంలోని గులాబీలు, మంచిగంధపు వాసనలు ప్రశాంతంగా, చల్లగా, నిశ్శబ్దంగా ఉండే ఆశ్రమం - ఇవన్నీ గుర్తుకు తీసుకురాగల దుర్గ నైసర్గికమైన శక్తి ఆయనకు ఒక విధాన అర్థం కాదు.

దుర్గ పిల్లలను ఎలా దారికి తీసుకు వస్తుందో స్టడీ చేస్తారు సంజీవరావుగారు. దుర్గ తను అల్లుకున్న పొదరిల్లులో అనాధ పిల్లలతో అటు గోపీ అనే కుక్కను, కస్తూరి అనే పిల్లిని కూడా సభ్యులుగా చేర్చుకుంటుంది. దుర్గలో గుర్తించవలసిన గొప్పతనం ఎక్కడంటే, ఆమె వాచ్‌మన్ తాతను, భర్తను, స్టూడెంట్స్‌ను, పిల్లిని, కుక్కను - అందర్నీ ప్రేమభావనతో సమానంగా ఆలోచించగలదు. ఎంతో గొప్ప వేదాంతులమనుకునేవారు సాధించలేనిది దుర్గ సాధించగలదు. "పదిమంది కలిసి సంతోషంగా హాయిగా ఉండటం నాకు కొత్త ఊపిరిని ఇస్తుంది" అనే దుర్గ, వర్షంలో కుంపటి పెట్టి బస్తాడు మొక్క జొన్న పొత్తులు కాలుస్తుంది. "మీరు తేగలు, మొక్కజొన్న పొత్తులు, కోతి కొమ్మచ్చులాడటం, సీమ చింతకాయలు తినడం ఎరగరా?" అని అమాయకంగా అడిగే దుర్గ మాటలకు తన చిన్నప్పటి యూనిఫాంస్, డిసిప్లెన్స్‌తో కూడిన నాగరికపు పెంపకం గుర్తుకు వస్తుంది సంజీవరావుగారికి. మంత్రిగారి వనమహోత్సవంలో ఉండే ఆర్టిఫిషియాలిటీ, మొక్కలు చచ్చిపోతాయేమోఅన్న బాధతో దుర్గ పిల్లల సహాయంతో మొక్కల మీద ప్రేమతో చేసిన "వనమహోత్సవానికి" తేడా అర్థం అవుతుంది ఆయనకు.

"ఎవరికీ అక్కరలేక పోవడం - ఎంత బాధాకరమైన విషయమో తెలుసా.. జంతువులకు మెదడు లేదేమో, కానీ హృదయం ఉంది. చెట్లకూ అంతే వాళ్ళను ఎవరు ప్రేమిస్తారో వాటికి బాగా తెలుసు." అంటుంది దుర్గ.

దుర్గను చూసి విద్యార్థులకు, కాలేజీ స్టూడెంట్స్‌కు తేలిక భావం కానీ, ఆమెను కేవలం ఆడదానిలాగా చూడాలన్న ఆలోచన కానీ రాదు. దుర్గ అంటే తమకంటే పెద్దది. తమకంటే చాలా విషయాలు తెలిసిన గృహిణి అనుకుంటారు. అంటే దానికి కారణం చాలా అనవసరమైన నైతిక సమస్యలు, ఈమె విషయంలో తలెత్తుకపోవడానికి కారణం ఏమిటా అని ఆలోచిస్తారు రెక్టారు "దానికి ఆమె ప్రవర్తనే కారణమా? అసలు స్త్రీ పురుషులు, తమ సెక్స్ గురించి, దేహనిర్మాణంలో ఉన్న వైవిధ్యాన్ని గురించి ప్రస్ఫుటం చెయ్యకుండా ఉంటే, ఆ తేడా క్షణం క్షణం అర్థమయ్యేలా ప్రవర్తించకుండా ఉంటే, ఇన్ని నైతిక సమస్యలు రావేమో.." అన్న నిర్ణయానికి వస్తారు . దుర్గ ఆత్మస్థైర్యానికి, గంభీరానికి కారణం- స్త్రీ అయి పుట్టడంలో గర్వించ తగ్గ విషయం కానీ, అవమానపడి, నక్కి నక్కి తలుపు వెనక దాక్కోనక్కర్లేదు అనే తత్వం.

దుర్గ చిన్న చిన్న పనులు చేసి తనకు తోచింది సంపాదిస్తుంది. కానీ ఆమె ఆర్థిక స్వంతంత్ర్యవాంఛలో కక్కుర్తిలేదు. ఇది చాలా గుర్తించవలసిన విషయం... రామకృష్ణ స్నేహితులు వారి దాంపత్యంలో లేమిని గుర్తించి, "పోనీ చెల్లాయ్ .. మేము నీ దగ్గరే డబ్బులిచ్చి భోంచేస్తాం" అన్నప్పుడు ఏమాత్రం దురాశ పడకుండా "వంటమామ్మ మీమీద ఆధారపడి బ్రతుకుతోంది వద్దు"నే దుర్గ నాలుగణాలు కూడా జాగ్రత్తగా దాచే ఇల్లాలు - మనసు చాలా రకాల అభిమానాలను గుర్తించమంటుంది.

బిడ్డతల్లి కాబోతున్న దుర్గ తన తెలివి తక్కువ తనానికి చింతిస్తుంది. ఫామిలీ ప్లానింగ్ గురించి తెలుసుకోలేని తెలివితక్కువ మొద్దును అని బాధపడినా, నేను ఆడదాన్ని కానీ, పిరికిదాన్ని కాను అనే దుర్గ, కడుపుతో ఉన్న దుర్గ, అనవసరమైన ఖర్చు లేకుండా, ఆరోగ్యవంతంగా ఎలా ఉండాలో తెలుసుకుంటుంది.

సుజాత లాంటి అయినింటి ఆడపడుచుకు దుర్గ ఇంట్లో లేమిలో కూడా ఒక పొందిక, శుభ్రత వల్ల ఇంటి పరిసరాల్లో నిరాడంబరత కనిపిస్తుందే కానీ, దరిద్రం కనపడదు., "మీకు స్వెట్టర్ అల్లినందుకు అందరిలా మీరు కూలీ ఇవ్వకండి అక్కా! నేను మీ స్నేహం కోరుకుంటున్నాను" అని దుర్గ అంటే, చాలామంది ధనవంతుల కంటే, హుందాగా ప్రవర్తించే దుర్గ, డబ్బు అది ఎక్కడ పడినా, ఏడాది అయినా ఏరుకుందామని కక్కుర్తిపడే 'గౌరవప్రదమైన' చాలా మంది జనం కన్నా దుర్గ లక్షరెట్లు పైమెట్టునుందని, బ్రతుకు గురించి లౌక్యం తెలిసిన పెద్దింటి ఆడబడుచు, ఇల్లాలు సుజాత గుర్తిస్తుంది.

"మనిషికి డబ్బు ఒక్కటేకాదుగా, నా అన్నవాళ్ళు వారి ఆప్యాయత ఆదరణ కావాలి. తిండి లేకపోతే ఎన్నాళ్ళలో కానీ మాడిపోం. కానీ ప్రేమ లేకపోతే చచ్చిపోతాం -"

"అక్కా!నేను ప్రతిదీ మంచికే జరుగుతుంది, ప్రతీదీ మంచికే సంభవిస్తుంది అని మనస్ఫూర్తిగా నమ్ముతాను. ఇవి పుస్తకాల మాటలు కావు. నాకు తెలిసిన ఈ చిన్న ప్రపంచంలో దయా, స్నేహం, మంచితనం ఇవి కోకొల్లలుగా ఉన్నాయి. ఈ మూడింటిని నేను పరిపూర్తిగా పొందాను -" అనే ఈ దుర్గను చూసి చాలా రకాల ఆలోచనల్లో పడుతుంది సుజాత. తన వారనుకునే వారెవరూ తనలో ఉండే దయ, ప్రేమ, కరుణ వంటి గుర్తించని గుణాల్ని దుర్గ గుర్తించింది. ఆపిల్ల చాలా సహజంగా నిండుగా ప్రవర్తించ గలగడం. డబ్బు లేకపోవడం అన్నది సిగ్గుపడాల్సిన విషయం కాదు, అది జీవితంలో ఒక భాగంగా మామూలు విషయంలాగా ప్రవర్తించగలగడం అపూర్వంగా అనిపిస్తుంది సుజాతకు. బంగారు పనస తొనల లాంటి దుర్గ పాపాయికి తన ఇంట్లో పనికిరాని పాత ఉయ్యాల వాడుకోడానికి ఇస్తుంది డబ్బు గల ఇల్లాలు సుజాత. కానీ ఆ ఉయ్యాలను అందంగా ఖర్చు లేకుండా పాత చీరలతో చిలుకలు కుట్టి ఉపయోగించుకుంటున్న దుర్గ "బహుమతి తీసుకోవడం ఎంత హుందాతనం ప్రదర్శించవచ్చో" తెలియచెపుతుంది ఒక వస్తువు ఒకరికి ఇవ్వడంలో ఇంత ఆనందం ఉందా? కృతజ్ఞత ఇంతటి అందమైన అనుభూతి దాగి ఉంటాయా అనిపించేట్టు చేస్తుంది దుర్గ.

పసి బిడ్డ తల్లి బాలింత దుర్గ ఎక్కువ జాగ్రత్తలేం తీసుకోదు. శుభ్రత, శుచి, వ్యాయామం చక్కటి ఆరోగ్యానికి మార్గదర్శకాలు కానీ అర్థం లేని పత్యాలు, చీకటి గదుల్లో గాలాడని మూసిన తలుపుల మధ్య నిరంతరం రెస్టు తీసుకోవడం బాలింత తనం కాదని తెలియచెపుతుంది దుర్గ.

దుర్గకు ఒక బలహీనత కూడా ఉంది కానీ. అది చాలా గొప్ప అద్భుతమైన బలహీనత. అది డబ్బు కాపీనం అంటే భయం. ఇది చాలా తమాషా భావన, ప్రతిదాన్ని డబ్బుతో లెక్క కడితే వాటి విలువ తగ్గిపోతుందన్నభావన. అందుకే డబ్బు కాపీనం ఎంత భయంకరమైనదో చెపుతూ... "తృప్తి లేకపోవడం చేతే పెదనాన్న నన్నూ, అమ్మనీ బానిసల్ని చేశాడు. పురుగుల్లా చూశాడు. ప్రలోభం నాకొద్దు. సంపాదన ఎక్కువైతే నాకు పాడు బుద్దులు పుట్టవచ్చు.."అంటుంది. ఈ దుర్గ గుండెల్లో కక్కుర్తి అంటే సంఘం ఎంత ఏహ్యాత పెంచిందో, కాపీన్యం ఎంత భయంకరమైన, అమానుషమైన శిక్షల్ని తన చుట్టూఉండే అమాయక జనానికి నిర్ణయిస్తుందో అర్థం చేసుకుంటే, సంఘం ఇవ్వాళ ఇంత చిక్కు ముళ్ళ పొదరిళ్ళలో ఇరుక్కుని ఊపిరి ఆడక ఎందుకు కొట్టుకుంటుందో అర్థమైపోతుంది మనకు. దుర్గ ప్రశ్నలు, సమాధానాలు మనకు తెలియని చాలా చీకటి దారుల్లో దీపాలు వెలిగిస్తాయి.

స్కూలులో ఉండే అనాథ పిల్లల విషయంలో దుర్గ ప్రవర్తన, దాని పరిణామం చాలా గొప్పగా ఉంటుంది. ఈ నవలలో మనకి కోరల పౌర్ణమి, గొబ్బిళ్ళ పండగ, రథసప్తమి, వినాయక చవితి ఒకటేమిటి ఆంధ్రదేశపు ఆడపిల్ల ఆ ఆనందపు సరదాలన్నీ అక్షరాల్లో గుచ్చెత్తి మనమీద తలంబ్రాలుగా కురిపిస్తారు రచయిత్రి. అసలు తెలుగింటి ఆడపిల్లలమైనందుకు, గుండెలు ఆనందంతో పొంగిపోతుంది. మనకు మనను చూసి మన జాతి సంస్కృతిని చూసి ఆనందించగల అదృష్టం భవిష్యత్తులో వికసించబోయే పూబాలల గుండెల్లో నిలిచిపోయే గుబాళింపు రచయిత్రి మనకు ప్రసాదించారు.

దుర్గ ఊహలకు రెక్కలున్నాయి. అవి అనాథ పిల్లలను స్టేజికి ఎక్కించినప్పుడు ఒక్కసారిగా విహంగయానం చేశాయి. మేకప్పు లేకుండా, ఎక్కువ ఖర్చులేకుండా నలభై మంది పిల్లల్ని "విద్యావన" అన్న పేరుతో నాటిక రాసి స్టేజ్ ఎక్కిస్తుంది దుర్గ. నాటకం చివర తను తన పిల్లి, కుక్క, పాపాయి అందరూ స్టేజిమీద కనబడవలసి రావడంతో బెంబేలు పడి, ఇంటికే పారిపోతుంది.

తల్లి పోయినప్పుడు కూడా ఏడవని దుర్గ. ఆనాడు వెక్కి వెక్కి ఏడుస్తుంది. రామకృష్ణ సముదాయించినా ఊరుకోలేక పోతుంది. ఆ దుఃఖానికి కారణం చాలా సున్నితమైనది. అమాయకురాలైన వనకన్య తన పెంపుడు జంతువుల వల్ల విద్యాలయానికి అవమర్యాద జరిగిందని భావించి ఆత్మన్యూనతా భావంతో కుంగిపోతుంది - సంఘం ఎంత భయంకరమైనదంటే, అది దుర్గలాంటి వారిని చాలా భయపెడుతుంది. ఒంటరి తనంలో, ప్రకృతిలో లీనమై, పసిబిడ్డలతో, జంతుజాలంతో హాయిగా ఉండగలిగిన దుర్గ ఒక్కసారిగా చదువు సంస్కారం ఉన్న బోలెడు మంది టీచర్లు, నాగరీకుల మనుకునే మనుష్యుల మధ్య ఎక్స్‌పోజ్‌కాగానే, ఏదో కుంచుకుపోయిన భావన, తక్కువ అయిపోయానన్న నిస్సహాయతతో ఒణికి పోతుంది. ఈదృశ్యం పేజీలు తిప్పడంలో చిక్కుకుపోయే పాఠకులు మర్చిపోవచ్చుకానీ, ఏమాత్రం పరిశీలనా జ్ఞానం ఉన్నవారైనా అంతర్లీనమైన సుళ్ళు తిరిగే ముళ్ళనాగరికతను ఎంత చక్కగా చెపుతుందో అర్థం చేసుకోగలరు. సంస్కారం అన్న భావన డబ్బుకు, ఆడంబరానికి, కొత్త తరహా నాగరికతకు, అర్థంకానప్పుడు, వారికి తెలిసిన సూడో కల్చరు దానికి రూపాయి అణాపైసలతో లెక్కకట్టలేనప్పుడు ఒదిలించుకుందామనే ప్రయత్నించే ఏదో ఊపిరాడని నాగరికత ఎంత మంది దుర్గలను, (ఒక్కొక్కప్పుడు మన గుండెల్లో దాక్కున్న మన పసితనపు రూపాన్ని) ఎంత ఉక్కిరి బిక్కిరి చేసి కన్నీరు తెప్పించగలదో, ఎన్నిసార్లు బలవంతంగా పసితనపు ఇంద్రధనస్సులను, రంగుల అలంకరణల్నీ హాయైన నవ్వును దాచుకోవాల్సిన పరిస్థితి కల్పించగలదో అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తే ఎంత గొప్ప "హార్ట్" ను అక్షర రూపంలో దృశ్యచిత్రంగా రచయిత్రి మార్చారో అర్థమౌతుంది మనకు.

"నేను ఉండకపోతే మటుకు? నేను నాటిన మొక్కలు పెద్దవై కాయలు కాచి, అవి పిల్లలు కోసుకు తింటే ఆ గొప్ప నాకు కాదా! తెల్లారి లేచినప్పటినుంచీ అన్ని పనులూ మనకోసం మనం చేసుకుంటూ ఉంటాం. అందులో ఒకటి రెండు ఇతరుల కోసం చేస్తే ఏం?"

అనే దుర్గకు సంజీవరావుగారు ఆమె సృష్టించిన నాటికకు బహుమతి వచ్చిందని చెప్పి, ఆమె ఆలోచనలు ఎంత గౌరవప్రదమైనవో చెప్తారు. అంతేకాదు ఒక గొప్ప విద్యాశ్రమంలో భార్యాభర్తలిద్దరికీ ఉద్యోగాలు ఇప్పిస్తారు. దుర్గ జీవన విధానానికి సరిపోయే ఆ ప్రదేశానికి వెళ్ళడానికి ఆయుత్తమై మళ్ళీ కొత్త జీవన వాహినిలోకి అడుగుపెడుతుంది దుర్గ.

"భూమి పుత్రి" చదవగానే ʻదుర్గʻ మన సొంతం అనిపిస్తుంది. కాస్సేపు ఆమె మనమే అనిపిస్తుంది.

"ప్రమదలు" అనగానే "ప్రమాదాలు"గా వెక్కిరించబడే కాలంలో "ప్రమదావనాన్ని" నిర్వహించడం ప్రారంభించిన మాలతిచందూర్‌గారు దాన్ని "ప్రమోదవనం" చేశారు. కొంతమంది రచయిత్రులను తయారు చేశారు. కొన్ని వందల మందిని సంస్కారవంతులుగా ప్రభావితం చేశారు. ప్రమదావనంతో అక్షర పుష్పాలతో సంస్కారాన్ని, తావిని, జ్ఞానాన్ని ఆంధ్రదేశపు ప్రమదల మీద పన్నీరుగా చిలికి, తీయటి స్నేహవల్లరులను పేరంటానికి పిలిచిన మాలతీ చందూర్‌గారు "భూమిపుత్రి" రాయడంలో ఆశ్చర్యంలేదు. "దుర్గ" ఆమె ఊహావల్లరి. అహంకారం, ఒకరకమైన కాంప్లెక్సు అడ్డం రాకుండా, జీవితాన్ని నేర్చుకుందాం అనుకునే ఎంతో కొంత విధేయత ఉన్న పాఠకులు ముఖ్యంగా సంస్కారం ఉన్న పాఠకురాళ్ళు... "భూమిపుత్రి" నుంచీ చాలా చాలా నేర్చుకోగలరు.

****

# డాక్టర్ పి.శ్రీదేవి" కాలాతీత వ్యక్తులు"లో ఇందిర

"ఒక్కొక్క రచయిత ఒక ప్రత్యేకమైన బాధనీ, పరతంత్రతనూ, లేమినీ, కష్టాన్నీ, నైరాశ్యాన్ని ఆధారం చేసుకుని విముక్తినీ, స్వేచ్ఛనీ, మార్గాన్నీ, సామరస్యాన్నీ ప్రతిపాదిస్తున్నాడు... ఇది తనకూ, పాఠకుడికీ ఇద్దరికీ చెందిన సమాజం నుంచీ అనుభూతి ద్వారా తన స్పృహలోకి వచ్చినదే. ఏ సృజనాత్మకమైన స్పృహ ద్వారా తన నైరాశ్యాన్ని అధిగమించాడో ఆ స్పృహనే పాఠకుడికి పంచి ఇచ్చి, పురోగతికి స్వేచ్ఛకూ విముక్తికీ మార్గం చూపిస్తున్నాడు...." (ʻవాటీజ్ లిటరేచర్ʻ - సార్రే)

ఈ విషయం గురించి చెబుతూ, "మనిషికి విముక్తి కలిగించే చైతన్య స్ఫురణ, ప్రేరణ, స్పృహ, సృజనాత్మక రచనలో వ్యంగ్యంగా అభివ్యక్తం కావడాన్నే సాహిత్యంలో సామాజిక స్పృహగా గుర్తించడమవుతుంది" - అంటారు శ్రీ ఆర్.ఎస్.సుదర్శనం.

ఇటువంటి తపనతో రాసే పుస్తకాలు కాలాతీతంగా నిలబడగలుగుతాయి: దానికి కారణం రచయితకు చెప్పే వస్తువు పట్ల చాలా వరకూ నిజాయితీ ఉపయోగించాలన్న ప్రయత్నం ఉండటం.

ఇటువంటి గొప్ప పుస్తకాలు చాలా మంది మహారచయితలు మహా ప్రస్థానాలకూ నాందిగా రాస్తుంటారు. వారి రచనా పరంపరలు కాలానుగుణంగా వారి అనుభవాలననుసరించి దృక్పథాలు మారడం కూడా మనం గమనించవచ్చు. కానీ కీర్తిశేషులైన రచయితల పుస్తకంలో కొంత విశేషం, కొంత సశేషం కూడా ఉంటుంది. అదేమిటో తెలుసుకోవాలంటే, " ఆc ఆయన (లేక ఆమె) మనకు తెలియనిదేం చెపుతుందిలే..." అన్న భావనతో పుస్తకం చదవడం ప్రారంభించకూడదెప్పుడూ. అది మనల్ని మంచి పాఠకుల్నిగా తయారు కానీయదు. రచయిత ఏమిటి ఆలోచించాడో సాధించి శోధించాలి. తెలివి గల రచయిత ఎప్పుడూ తను చెప్పదలచుకున్నది

అనాయాచితంగా చెప్పడు. తెలుసుకోగలిగే వాడికి తపన ఉన్నవాడికి అర్థమయ్యేటట్లు చెబుతాడు. అంతే (అందుకే గొప్ప పుస్తకంగా కొందరికి అనిపించేది, మరి కొన్ని వర్గాల వారికి "బోర్" అనిపించవచ్చు) మనం మన భావనా ప్రపంచపు వీధుల్లో ఆలోచనల మెరుపు తీగెలను ఆధారంగా రచయిత సౌందర్య ఊహాసౌధాలకు చేరి అతని "భావన"ను తెలుసుకుని ప్రభావితుల మవ్వాలి.

అర్థం చేసుకోకుండా అక్షరాల చదువుకుంటూ పోతే మనం అర్థం తెలియని దారుల్లో ఆగిపోతాం. కాసిని అక్షరాలు... ఏకొంచమో ఏర్చికూర్చిన అక్షరమాలలు, కొన్ని వేల "అద్భుతానుభవాల భావన" మనకు అర్థమవ్వడానికి నాంది పలకవచ్చు.

ఆ తరువాత "రచయిత హృదయం" మనకు అర్థమవ్వాలి. మనలో ఆర్ద్రత, కన్నుల్లో తడి ఉండాలి. ప్రతిదాన్లో తప్పులు వెదకడమే మన గొప్పతనానికి ఋజువు అనే పసితనం నుంచీ బయటపడి స్పందించగల స్థితి మాత్రమే రసస్పృష్టికి నాంది పలుకుతుంది. మనిషికీ మనిషికీ, జంతువుకీ మనిషికీ ఇదుగో ఈ రసావిష్కరణలోనే తేడా వస్తుంది.

"We are only human in so for as we are sensitive, and our honour is precisely in proportion to our passion" అన్నారు మహానుభావుడైన రస్కిన్.



ఇప్పుడు మనం చర్చించబోయే డాక్టర్ శ్రీదేవి గారి "కాలాతీత వ్యక్తులు" (అందులోని "ఇందిర") అప్పట్లో వచ్చిన నవలల్లో చెప్పుకోదగ్గ పుస్తకంగా మిగిలింది. తమాషా ఇంత గొప్ప రచయిత్రి ఒక్కటే నవల రాయడం, అదే ఆవిడ మనకు ఒక మధురస్మృతిగా మిగల్చడం ఆశ్చర్యం. సాధారణంగా ఏ రచయిత్రికీ పట్టని అదృష్టం ఇది తినాలి.

డాక్టర్ శ్రీదేవిగారి తండ్రి డాక్టర్ గుళ్ళపల్లి నరసింహమూర్తిగారి ప్రభావం తరువాతి జీవితంలో శ్రీ గోరాగారి ప్రభావం ఈవిడ మీదా, ఈవిడ జీవిత సరళిమీదా, ఆదర్శాల మీదా ఉండేవని ప్రతీతి. ఆమె చాలా నిర్భయంగా బ్రతికిన వ్యక్తి సంఘం భయం పెట్టే కొన్ని పరిధుల నుంచీ, పోరాటం జరిపి బయటపడాలన్న ప్రయత్నం, సంఘాన్ని లొంగదీసుకోవాలన్న ప్రయత్నం ఈవిడ పాత్రల్లో మనకు కనబడుతూనే ఉంటుంది. ఈమె వైజాగ్‌లో ఉండగా 'కాలాతీత వ్యక్తులు' రాశారు.... అప్పటి ఆమె వయస్సేదైనా అనుభవాలిచ్చిన వయస్సు చాలా గొప్ప జీవన సమీక్షకురాల్ని చేశాయి. పరిసరాలు, పరిస్థితులు కన్న జీవితమే ఈవిడను ఎక్కువ ఆకర్షించి 'ఫాసినేట్' చేసిందనిపిస్తుంది.

ఈవిడ ఒక విశిష్టమైన పెంపకంలో తండ్రి ఆలోచనా దృష్టి నుంచీ, ఆ తరువాత శ్రీ గోరాగారి కోణం నుంచీ 'క్రాస్ సెక్షన్ ఆఫ్ సొసైటీ'ని రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకునే శక్తిని ఇచ్చిందనిపిస్తుంది. చాలా విశిష్టమైన వ్యక్తిత్వంతో విపరీతమైన జీవన స్వేచ్ఛ ఉన్న ఈ యువతి ఆలోచనాపరిధి అనంతాల వరకూ వ్యాపించడం, ఎదిగిన మనిషి ఎత్తునుంచీ దిగంతాలను సమీక్ష చెయ్యగల శక్తిని పుంజుకోవడం ఆశ్చర్యమనించదు. ఆ నిర్దేశికత జ్ఞానం - జీవనపోరాటం, అదిచ్చే నిర్లిప్తత ఉంటే కానీ ఏ రచయిత్రీ ఆ స్థితికి వెళ్ళలేదు. ఆమెకు అప్పటి మేధావి వర్గంతో పరిచయమున్నా, కళా రంగంతో దగ్గర తనం ఉన్నా ఆవిడ బహుశాః మానసికంగా ఒంటరిగా ఆలోచిస్తూ ఎదిగి ఉంటారనిపిస్తుంది.

తమాషా ఏమిటంటే, ' "కాలాతీత వ్యక్తులు" చదివిన తరువాత దాన్ని రాసిన వ్యక్తి మీద మనకు అడ్మిరేషను, ఆవిడ స్త్రీ కావడం ఒక రకమైన ఆశ్చర్యం కలిగించింది' అన్న పాఠకులు చాలామంది ఉన్నారు.

ఎందుకంటే సాధారణంగా ఆడవాళ్ళు రచనను కుటీర పరిశ్రమ చేశారనీ, అది సాధారణ స్త్రీల జీవిత పరిధిలోని వంటలు, కుట్లు అజ్ఞానం, సిల్లీ సెంటిమెంట్లు, అర్థం లేని నీతి పరిధులకూ, కుంచుకుపోయిన మానసికమైన ముడతలలో దాగిన అసూయ, ద్వేషాలకు

రూపకల్పన చేసారని చాలామంది వ్యాఖ్యానం చేస్తూ ఉంటారు. దానికి కారణం కొంత మంది రచయిత్రులు తాము ఆడవారమని గుర్తించమని, తమ తీరని కోరికలు, ఆశలు నవలల్లో గుప్పించి అక్షరాలు పేర్చి సాహిత్యమనడం కారణమేమో కూడా. అందుకే విశ్వసాహిత్యపు పరిధిలో ఈ నవలలు నిలబడ లేక జారిపోవడం జరుగుతూ ఉండవచ్చు. ఈ ప్రభావం నుంచీ బయటపడి, పురుషుడి కోణం నుంచీ, మేధావంతుల ఆలోచనల నుంచీ, జారిన ముత్యాలు ఏరుకోకుండా మేధావంతురాలైన స్త్రీ మూర్తి కళాకారిణి అయినప్పుడు ప్రపంచాన్ని తెలియకుండానే ప్రాభావితుల్ని చేస్తుంది.

డాక్టర్ శ్రీదేవి అటువంటి స్త్రీ... ఆమెకాలానికి - మేధావి వర్గాన్ని ఆనాటి మూర్ఖవిశ్వాసాలకు, అది దారి చూపించే మార్గానికి అప్పటి జీవితానికీ మధ్య ఏర్పడిన అగాధం చాలా ఆలోచింపచేసింది. ఒకవైపు ఎగ్జిస్టెన్షియలిజం వారు, మరొక పక్క కమ్యూనిస్టులు - మరొక పక్క సాంప్రదాయ బద్ధులు... ఇలా రకరకాల భావవిప్లవాలు చెలరేగి, ఎవరు గుర్తించిన దారిలో వారిని ప్రభావితం చేసిన రోజులవి... అందుకే దాదాపు 20, 25 ఏళ్ళ క్రితమే ఒక గొప్ప రచనా విప్లవంలో ఈ నవల కూడా పెరిగి ఉంటుంది. కానీ స్త్రీ అయి, శ్రీదేవిలా సాహసించడానికి చాలా స్వాతంత్ర్యం, జీవన స్వేచ్ఛ కావాలి. ఎదుగుదల కావాలి. ఒక ఉపరితలం మీద నుంచీ అక్షరాలతో థర్డ్ డైమన్షనల్ ఫోటోగ్రాఫ్ తీయగల శక్తి కావాలి. ఇది చాలా కష్టం. అందుకే ఆవిడలాంటి వారు ప్రారంభించిన అద్భుత ప్రక్రియ ఊపిరి పోసుకోవడానికి చాలాకాలం పట్టిఉండవచ్చు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే, సాధారణంగా మంచి అక్షరాల్లో మనకు రచయిత భావన, ఆదర్శనం, ఆర్తి తొంగి చూస్తూనే ఉంటుంది. మంచి రచయితలు అయితే మనని చదివించే కంపల్షన్ అట్టే పెట్టుకుంటారు కూడా. కానీ చాలా తక్కువ "మంచి" రచయితలు, రచయిత్రులకే తమ మీద 'ఫాసినేషన్' కలిగించే సొంపు ఉంటుంది. చదువుతూ చదువుతూ మధ్యలో పుస్తకం తిప్పి "ఎవరీవిడ? ఎంత అద్భుతంగా రాశారు?" అని ఆలోచింపచేస్తారు ఈ రచయిత్రి.

"ఏం భయం లేదు. బ్రతికున్న ప్రతి మనిషికీ సమస్యలుంటాయి. సమస్యలు లేనిది చచ్చిపోయిన వాళ్ళకి మాత్రమే. ఇంకా ఆలోచిస్తూ కూర్చుంటే బుర్రవేడెక్కిపోవడం తప్ప ఇంకో ప్రయోజనం లేదు. ఇలా విను మైడియర్ కృష్ణమూర్తీ! ఈ విషయంలో నీ తత్వమో, నా తత్వమూ ఒకటే గానీ, ఐనా, ఇది నువ్వు నా మెడలో తాడు కట్టిన రాత్రి గనుక ఇంకొక్కసారి చెబుతున్నాను విను. నీకు ఆయుర్దాయం ఎన్నాళ్ళు అంటే నీ జీవిత కాలంలో నిండుగా బతుకు. నిర్భయంగా బ్రతుకు. రోజుకు పదిసార్లు చావకు. ఇంకొకళ్ళను చంపకు. నీకు తారసిల్లిన మనుష్యుల్లో తిరిగి, ఒకరిని ఎక్కడైనా లోలోపల కొంచెం మానవత్వం ఉంటే - దాన్ని బైటకు తీయడానికి ప్రయత్నించు. దాన్ని బైటకు రానియ్. మానవత్వం ఉండటం సిగ్గు పడవలసిన నేరం ఏమీ కాదు. నువ్వు నమ్మవేమో కానీ, ఈ శరీరాన్ని ఎన్నడూ నేను అతిగా ప్రేమించలేదు. అలాగని ద్వేషించనూ లేదు - లేదు - దాని అవసరాలను అసహ్యించుకోనూ లేదు. అది తప్ప ఇంకో పరమార్ధం లేదని అనుకోనూలేను. మన చుట్టూరా ఉన్న స్వార్థం, రోషం, క్రౌర్యం, భయం ఇవి మనలోనూ ఉన్నాయి. కాబట్టి వీటికి భయపడకు. సర్వత్రా వ్యాపించి ఉన్నదాన్ని చూసి భయపడటం దేనికి? ఈ ప్రపంచంలో వికృతాన్నీ, వికారాన్నీ అసహ్యించుకో ఫరవాలేదు... ఆశలూ, స్వప్నాలు, అనురాగాలూ, అభిమానాలూ అన్ని పెంచుకో, కానీ, వాటికి శస్త్ర చికిత్స అవసరం అయినప్పుడు సంకోచం లేకుండా కోసి అవతల పారెయ్. ఏనాడో పగిలి పోయిన కలలు, విరిగిపోయిన అనురాగాలూ, ఆటకలోంచీ తీసి అవతల పారెయ్... ఆయుర్దాయం ఉన్నన్నాళ్ళూ బతుకుదాం కృష్ణమూర్తీ. కాబట్టి రేపటి సమస్యలు తలచుకుని బరువెక్కిపోకు; తెల్లవారితే ఇంకొక్క రోజు.." ఇలా అనగల రచయిత్రి, ఇందిర పాత్ర చేత అనిపించగల రచయిత్రి ఎవరా అని ఆలోచించామా? చెప్పండి.

కాలాతీత వ్యక్తుల్లో ' ఇందిర' ఒక అద్భుత చిత్రీకరణ: అసలు ఈ నవలలో ప్రతి పాత్రా అద్భుతమైనదే. అన్నీ సజీవతతో స్పందించేవే. కృష్ణమూర్తి, ప్రకాశం, కల్యాణి, డాక్టరు, ఇందిర, వసుంధర, వైదేహి - ఒకటేమిటి? ఏ పాత్రకైనా ఒక సజీవమైన శరీరము, మనస్సు, ఆలోచనలు, తుదిమొదలు - కల్పించారు రచయిత్రి. ఏ పాత్రా అసంపూర్తిగా ఆగిపోదు. మరోలా ప్రవర్తిస్తే ... అనిపించదు.

ఎందుకంటే ప్రతి పాత్రా దానంతట అది విడిగా తోలుబొమ్మలా ప్రవర్తించదు: ఈ పాత్ర ఇంతే అనిపిస్తుంది. వీటన్నిటిలో నాటికీ నేటికీ ఆకర్షణ కలిగించే స్త్రీ పాత్ర "ఇందిర"

ఇందిరే ఎందుకు? అంటే.. ఇది సజీవతను ఎలా పొందింది? అంటే ... కొంచెం ఆలోచించగలిగి, అర్థం చేసుకోగలిగిన ప్రతివ్యక్తికీ మనలో ఇందిర, మన చుట్టూ మనుష్యుల్లో ఇందిర ప్రత్యక్షమౌతూనే ఉంటుంది. బాలల బొమ్మల కథల్లోలా ఉదాత్తతంతా నాయికా నాయకులుగానూ, క్రూరత్వం, అసూయ మొదలైన దుర్గుణాలన్నీ ప్రతినాయకులుగానూ రూపొందదు నిజజీవితంలో. ఇక్కడ ప్రతి మామూలు మనిషిలోనూ రాగ ద్వేషాలుంటాయి. వాటి అనుభూతి, ప్రభావం చుట్టు పక్కల జీవితాల మీద తప్పకుండా ప్రసరిస్తాయి. "ఇందిర" అంతే!

బాధ్యతారహితుడు, వ్యసనపరుడు అయిన తండ్రిని నిరంతరం భరిస్తూ, చిన్న టైపిస్టుగా ఉద్యోగం చేస్తూ ఉంటుంది ఇందిర. సౌందర్యం కన్నా ఆమెలో ఆకర్షణ ఎక్కువ. అలంకరణలో స్పెషాలిటీ ఉంటుంది. చిన్నప్పుడే తల్లిపోతుంది. దగుల్బాజీ పనులు చేసి తండ్రి నాలుగైదు సార్లు జైలుకు వెళతాడు... ఒంటరిగా ఎదుగుతూ, ఆర్థిక స్థోమత లేక ఇంటి బాధ్యత వహించడానికి చిన్న ఉద్యోగంలో చేరిన ఇందిర ప్రపంచాన్ని భయపెట్టి, డబాయించి బ్రతకడానికి ప్రయత్నిస్తుంది.

కల్యాణి అని ఒక మంచి అమ్మాయి - ఆత్మాభిమానం, పౌరుషం, అందం అన్నీ ఉన్న ఒక అమ్మాయికి తన ఇంట్లో మొదట్లో జాలితో ఆశ్రయమిస్తుంది ఇందిర. అదే ఇంట్లో మరొక గదిలో బలహీనుడు, భావకుడు, పరిస్థితులతో ఎప్పటికప్పుడు పోరాడుతున్నాననుకుంటూనే రాజీ పడే మెడికో ప్రకాశం ఉంటారు. ఇందిర దృష్టి ప్రకాశం మీద ఉంటుంది. కానీ కల్యాణీ ప్రకాశం మధ్య పరస్పర సానుభూతి మంచితనాల ప్రకటనలు కొంచెం విసుగనిపిస్తాయి జీవితం తెలిసిన ఇందిరకు.

"ఏమిటో ఈ ప్రపంచం ఏమిటో... ఈ మనుష్యులు ఇలాంటి వాళ్ళు తనకెన్నటికీ అర్థం కాదు..." అని ఆలోచిస్తుంది.

తండ్రి ఇందిరతో ఎవరో ఇద్దరు లేచిపోవడం గురించి చిద్విలాసంగా హింట్ ఇస్తూ ఉంటే -

"వాళ్ళకేం నాన్నా! రైలు టికెట్టుకు డబ్బులుండి ఉంటాయి.." అనే ఇందిర మనకు ఇట్టే అర్థమౌతుంది. ఆమె బుల్లి ప్రపంచం విశాలం కాకుండా అన్ని సమయాల్లోనూ ఆర్థిక న్యూనత ఆమెకు "నా పరిధి ఇది" అని తెలియజెప్పడం విసుగేస్తుంది ఇందిరకు. ఇందిర అలంకరణను వర్ణిస్తారు రచయిత్రి ఒకచోట - మనకు ఇందిర ప్రత్యక్షమయ్యేటట్లు.

"లేత పసుపు రంగు జార్జెట్ చీర కాలిబొటన వేలు దాకా జీరాడుతుంది. ఆమె విలాసంగా కాలాడించినప్పుడల్లా సన్నని చీర పొరల్లోంచీ లోపలి పరికిణీ మీద కుట్టుకున్న చెమికీ పువ్వులు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. ముదురు కుంకం రంగు వెల్వెట్ చోళీ కడుపు మీద ముడతలను దాచలేక ఒదిగి, ఒదిగి మీదకు పోయింది. మెడ చుట్టూ కుట్టుకున్న గుండ్రని అద్దాల బిళ్ళలు ఎదురుగా ఉన్న దీపకాంతికి ధగ ధగా మెరిసి ప్రకాశం కళ్ళజోడు మీద వెలుగులను ప్రసరించాయి. మెడకు బిగించినట్లున్న నల్లపూసల ఫాన్సీ దండ ఒక వింత సోయగాన్నిస్తూంది. ఉదయం నుంచీ తిరిగిన అలసటను వ్యక్తం చేస్తూ ముఖమంతా చెమట పట్టి నుదుటిమీద పొట్టి పొట్టి తలవెంట్రుకలు వలయాలుగా అతుక్కుంటాయి..."

తండ్రికి జబ్బు చేసిందని తెలిసి ఊరెళ్ళిన కల్యాణిని గురించి దిగులు పడుతున్న ప్రకాశాన్ని సినిమాకు తీసుకు వెళుతూ -

"కల్యాణికి ఎలాగో అలాగ చదువు సాగుతోంది... నాకదీ లేదు. కానీ వీటన్నింటినీ తల్చుకుని గడియ గడియకూ కాళ్ళు చాపి కూర్చుని ఏడవటం నాకు చేతకాదు... ఆమె నంగనాచితనం నా దగ్గరలేదు. అంత బరువుతోనూ ఇంకొకరి మీద ఒరిగి పోయి కాలక్షేపం చేద్దామన్న దురాశ అంతకన్నా లేదు - "ఈ మాటల్లో ఆమె స్త్రీత్వంలో ఆమెకే అర్థమయిన వెలితి, అసూయ ద్వారా బయట పడటం గమనిస్తాము మనం.

"అర్ధరాత్రి ఇంత అలంకరణ దేనికి ఇందిరా?" అని ప్రకాశం అయోమయంగా అడిగితే -

"వెర్రి నాయనా! అలా వచ్చేస్తే ఎంత ప్రమాదం? దారిలో ఏ మహా ప్రేమికుడో నన్ను ప్రేమించే అవకాశం తప్పిపోతే, దానికి జవాబుదారీ ఎవరు? ఆడవాళ్ళ అవసరాలు నీకు తెలియవులే పద"... అనే ఇందిరలో అంతరంగికంగా ఉండే ఏదో అందర్నీ ఆకర్షించాలన్న చాపల్యం సన్నటి పొరలా మనని స్పర్శిస్తుంది.

పట్టపగలు నడవలేననే ఇందిర, చీకట్లో నడుస్తానని మొరాయిస్తే, అర్థం కాదు ప్రకాశానికి.

"అప్పటికింకా కొంచెం వెలుతురుంది. సూర్యుడు కూడా సరిగ్గా అస్తమించలేదు. నీకు తెలుసో తెలియదో కానీ ప్రకాశం సూర్యకాంతితో చెయ్యలేని కొన్ని పనులు దీపకాంతిలో మనం నిర్భయంగా చేసెయ్యగలం... ఇదీ అంతేననుకో..." అని పెంకెగా సమాధానం చెప్పే ఇందిర మనకు ఒక సన్నటి కోణంలోనించీ చూస్తే కనబడే అబ్స్ట్రాక్ట్ ఫిగరు తాలూకు ఒక భాగంలా అనిపిస్తుంది.

ఇందిర ఎప్పుడూ ఒక ప్రశ్నార్థకమే ప్రకాశానికి. "జీవితం అంటే అంత ధీమా ఎలా వచ్చింది ఆ అమ్మాయికి? ఆలోచించి చూసుకుంటే ట్రెపీజ్ మీద ఫీట్లు చేసే అమ్మాయితో పోలుస్తారు రచయిత్రి ఇక్కడ జీవితంలో ఏ ఘట్టమైనా సరే, అవలీలగా, విలాసంగా ఎగిరి వచ్చే ఊతను అందుకుని, హాయిగా మొగ్గవేసి అవతలి గట్టుకు చేరుకుంటుంది" అనుకునే ప్రకాశం ఆ సాహసంలో ఉండే ప్రమాదం ఏమిటో తెలుసుకోలేడు.

అందుకే చాలా ధైర్యం నటించే ఈ అమ్మాయి డాంబికత వెనకాల ఒక భీరువు దాగి ఉంటుంది. బ్రతకక తప్పనప్పుడు తెచ్చుకున్న మొండి ధైర్యం ఆమెది. కృష్ణమూర్తి ఆర్థిక సహాయం చేసినప్పుడు ప్రకాశం మేనమామ వచ్చి జాతర పెట్టినప్పుడు ఆ సన్నివేశాన్ని దాటెయ్యడానికి అబద్ధాలాడి నటించేస్తుంది ఆ పిల్ల. తండ్రి తన స్నేహాన్ని ఉపయోగించుకుంటున్నాడని తెలిసినా ఆ సమస్యను ఎదుర్కోలేదు ఇందిర. కారణం ఆర్థిక దాస్యం. అందుకే ఆచరించలేని ఆదర్శాలు మాట్లాడే వాళ్ళంటే ఇందిరకు మంట.

కల్యాణి కోసం వెళతాననే ప్రకాశాన్ని "నువ్వేంచెయ్యగలవని వెళతావు? నీ దగ్గర డబ్బుందా?" అని ప్రశ్నిస్తూ, తనతో తిప్పుకుంటూ -

"ఉంది బాబూ! బాధ నాకూ ఉంది... కష్టంలో లేని వాళ్ళెవరూ? నా సంగతి ఒక్కసారి ఆలోచించు... అందరం ఒక్కలాంటి వాళ్ళమే... అడుగులేని పడవలం ఏదో అలా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నాము. వెనక్కి తిరిగి చూసుకుంటే భయం" అని జీవితాన్ని నూరిపోస్తుంది.

"నీ సంగతి వేరు ఇందిరా" అనగానే మండిపడి, నాలుగూ అడిగి, కల్యాణిని తిట్టి, "నేను బలపడి, ఇంకొకరికి బలమివ్వాలనే తత్వం నాది -" అంటుంది. అంత ఆడతనపు అసూయలోనూ, ఇందిరలో అంతరగికమైన ఈ ఆదర్శం - ఆమెకే తెలియని ఆదర్శం అయ్యుంటుంది బహుశః

ప్రకాశాన్ని అసమర్థ దుఃఖంలోనించీ మళ్ళించాలని, అతనికి తల్లిలా సేవచేసి, అన్నం తినిపించి,

"ఏమిటి ప్రకాశం? ఎందుకింత భయం... దేనికి దిగులు, చూడు. ఇది కాదు బతికే విధానం.." అంటుంది. కల్యాణి నుంచీ ప్రకాశాన్ని దూరం చెయ్యడానికి ఎంత దూరమైనా వెళ్ళగలదు ఇందిర. ఏ పరిధులన్నా దాటగలదు.

అంత బాధపడ్డ కల్యాణి తండ్రిని పోగొట్టుకుని వచ్చిందని తెలిసి, "ఇందిర ఇంకా నిన్ను చూడలేదులా ఉంది" అని నంగిగా ప్రకాశం అన్నప్పుడు, అతణ్ణి ఇందిర ఎంత లొంగదీసుకుందో అర్థం చేసుకుంటుంది కల్యాణి.

ఇందిర పలకరింపులో ముభావత, మాటరాఫ్ ఫాక్ట్ మాటలు గుర్తించగలుగుతుంది ఆమె. ఇంట్లో నుంచీ వెళ్ళిపోతానన్న ఆ అమ్మాయిని "ఈ ఇంటికి వచ్చినప్పటి నుంచీ నీకు కష్టాలే..." అనే ఇందిర గడుసుదనానికి ఆశ్చర్యపోతుంది ఆమె.

కల్యాణి వెళ్ళిపోగానే, ఆ గది కృష్ణమూర్తికి ఇవ్వచ్చు అనుకుని మళ్ళీ "డబ్బు కోసం ఎప్పుడూ వెతుకులాట, లెఖ్ఖలు" అని తనను తనే విసుక్కుంటుంది.

"ఇది ఉత్త వెధవ ప్రపంచం నాన్నా!" అంటుంది అందుకే. అది వెధవ ప్రపంచం కాబట్టే ప్రకాశంతో అబద్దాలాడటానికీ, కళ్యాణిలాంటి అమాయకురాల్ని నిస్సహాయంగా ఏ మాత్రం జాలి లేకుండా నిందలు వేయడానికి ఏ మాత్రం సంకోచించదు... ఏమాత్రం సున్నితమైన ఆలోచనలను గౌరవించాలని అనుకోదు.

"ఎప్పుడు వచ్చినా గాలివానలా వస్తుందీ పిల్ల... అందులో పడి కొట్టుకుపోవాల్సిందే.. ఎందుకు ఈ అమ్మాయి నన్ను వెంటాడుతుంది? ఇందిర ముందు ఎవరి ఇష్టాఇష్టాలూ సాగవు..." అని వాపోతూ ఉంటాడు ప్రకాశం.

ఒకప్పుడు నెచ్చలిలా ఆదరించిన కళ్యాణి తన సలహా వినలేదని "కట్ట కట్టుకుని ఏ గంగలోనన్నా దిగు" అనేసి వెళ్ళిపోగలదు.

"ఉత్తరాలు రాసి, తియ్యటి కబుర్లు చెప్పి ఎవరూ ఎవరినీ ఉద్ధరించ లేరు"... అని ప్రాక్టికల్‌గా మాట్లాడే ఇందిర అంటే వణుకు ప్రకాశానికి.

కానీ, ఇందిర ప్రయత్నాలలో, బ్రతకాలన్న జీవనవాంఛలో అన్ని కోణాలనించీ ఎప్పుడూ సక్సెస్ కాదు. "ఆమె పరిష్వంగంలో అతనికి శాంతి లేదు. పైగా వేదన: అది లేకపోతే మరింత బాధ. ఇందిర సేద తీర్చే శీతల పానీయం వంటిది కాదు. కడుపులో మంటలు పుట్టించే బ్రాందీ లాంటిది. ఎంత తప్పించుకుందామన్నా ఇందిర దాసుడుగా మారతాడు. అదే వచ్చిన చిక్కంతా ఆమెతో కలిసి బ్రతకలేము... ఆమె లేక అంతకంటే బ్రతకలేను.." అనే ప్రకాశం స్వగతంలో ఇందిర మనకు చాలా అర్ధమయ్యేట్లు చెపుతారు రచయిత్రి.

బల్ల మీద టైపు చెయ్యాల్సిన ఫైల్సు చూసుకుని ఏడ్చుకుంటూ, "చిన్నప్పుడు గంపెడు అంట్లు, గిన్నెలు ముందు వేసుకుని తోముకుంటూ కూర్చునే నాయనమ్మకీ నాకూ ఏమిటి తేడా? ఆ మాటకొస్తే ఆవిడే నయం... ఆవిడ ఎవరికీ పనిమనిషి కాదు కానీ, తనో... ఇంకెవరి అంట్లో జీతానికి తోముతుంది.." అనే ఫీలింగ్‌ను చాలా గమ్మత్తుగా చెప్పిస్తారు డాక్టర్ శ్రీదేవి.

ఆవిడ సృష్టించిన కల్యాణి, వసుంధరల జీవితాలు ఆలోచనలను పరిధిగా పెట్టుకుని ఆలోచిస్తే ఇందిర మనకు మరింత గళ్ళ లెక్కలలో గ్రాఫ్‌లా రూపకల్పనకు తేలుతుంది.

మంచి నవలా రచయిత గొప్ప లక్షణమిదేనేమో కూడా! పాత్రకూ, పాత్రకూ ఉన్న వైవిధ్యపు ప్రతిబింబమే విచిత్రంగా కెలడియో స్కోపులో లాగా కొత్త రంగవల్లులు దిద్దుతుంది. మన ఆలోచనా పరిధిని పెంచుతుంది. వాటిని అక్కడక్కడ రచయిత్రి ఇలా వ్యాఖ్యానిస్తారు.

"పోవడమూ, పోగొట్టుకోవడమూ అనేది మన చేతుల్లో లేదని తెలిసినప్పుడు ఆ ఆశలన్నీ తగ్గుతాయి. మన చుట్టూ ఉన్న మనుష్యుల విలువ కష్టదినాల్లో తెలుస్తాయి."

"అవును బ్రతుకే ఒక పెద్ద అనుమానం. మనిషిని మనిషిని నమ్మడు. చావు బతుకులను నమ్మడు. అవి కలిగించే దుఃఖాలను కూడా నమ్మడు. బతుకనేది అంత కంతకు పదునెక్కిపోతూంటే, ఎంత జాగ్రత్తగా అడుగు వేసీ, ఏం లాభం?" అనే రచయిత్రి మనకు మహా రచయిత మామ్ "రేజర్స్‌ఎడ్జ్" అని తన గొప్ప నవలకు ఎందుకు పేరు పెట్టారో తలపింప చేస్తారు.

ఇందిరను సకల సుగుణోపేతురాలైన ఒక కావ్య నాయికగానో, శృంగార రూపిణి అయిన ఒక అద్భుత సౌందర్య రాశిగానో, త్యాగమూర్తి అయిన ఒక ఆదర్శయువతిగానో, సృష్టించలేదు. సగటు ఆడపిల్లగా ఆమె కోరికల్ని ప్రలోభాలను, నిరాశలను, కన్నీరును దాచుకునే ప్రయత్నంలో దబాయింపును, విశృంఖలతతో మాట్లాడి ఎదటివారి నోరు మూయించగలగడం - వీటన్నింటి రంగుల వెలుగు నీడలతో శ్రీదేవి చెక్కిన అబ్స్ట్రాక్ట్ అక్షర శిల్పం "ఇందిర".

అందుకే ఇందిర ఒక అద్భుతం. ఇందిర అర్ధమైతే, సగటు మధ్య తరగతి ఆడపిల్ల 'స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్' అర్ధమౌతుంది. ఇందిర అర్ధమైతే జీవితం అర్ధమౌతుంది. కాలాతీత వ్యక్తి "ఇందిర" అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడూ దర్శనమిస్తూనే ఉంటుంది. ఇది శ్రీదేవిగారి అపూర్వ సృష్టి. ***

# "బీనాదేవి" గారి "పుణ్యభూమి కళ్ళుతెరు"లో 'రాజమ్మ' పాత్ర

**సాహిత్యం ఒక ఉద్యమం.** అది కొద్దిమందితో ఆరంభించినా, సంఘానికి సంక్రమించాలి. సంఘం ఛాయలు సాహిత్యంలోనూ, సాహిత్యం ఛాయలు సంఘంలోనూ అల్లుకుపోవాలి.

ఈ సాహిత్యాభిలాష పెంచడానికి రచయిత చెయ్యవలసిన కృషి ఏమిటి?! ఒకవేళ అలా పెరిగినా, పుస్తక పఠనం వలన పాఠకులు జీవితాన్ని ఎంతవరకు కరతలమలకం చేసుకుంటారు?! ఇది తేల్చుకోవలసిన విషయం. ఎందుకంటే సాహిత్యం జీవితపు మారుమూలలలోనికి వెలుగు తీసుకురానిదే దానికి ఔన్నత్యం ఆపాదించలేము.

సాహిత్యాభిలాషులమంటూ సాహిత్యం గురించి చదివేవారిలో కూడా కొన్ని తెగలున్నాయి. మళ్ళీ కొందరు సాహిత్యం రాయడం కేవలం పూర్వజన్మ సుకృతం అనుకునే రకాలు. ఒకసారి వీరికి రచయిత నచ్చితే, అతను ఏం రాసినా చదివి బావుందని సరిపుచ్చుకుంటారు. ఇది నిర్జీవ సాహిత్యాభిలాష. దీనివల్ల రచయిత ఒక స్థాయికి ఎదిగి, ఇక తన అభిమానుల పుణ్యమా అని అక్కడే ఆగిపోతాడు. అతను ఎదగాలనుకోడు. దానితో అతని సాహిత్యానికి సమకాలిక పరిణామ దర్శన జ్ఞానం పోతుంది.

ఇంకొక తెగ పాఠకులకు సాహిత్యం ఒక వినోదకళ. సినిమాలలోంచి లాగే, సాహిత్యంలోనించీ వీరు ఏదీ ఆశించరు. కాలక్షేపానికి తప్ప పుస్తకం చదవరు. అందులోనుంచీ ఒక జీవిత సత్యాన్ని కూడా వీళ్ళు కోరుకోరు. నూరు పుస్తకాలు చదివిన తరువాత కూడా వీరి మేధస్సులో కానీ మానసిక పరిణితిలో కానీ మార్పురాదు. కనీసం "అదేమిటీ?" అనిపించదు. అట్టమీద బొమ్మ, ప్రఖ్యాతి చెందిన రచయిత పేరు - ఇవి చాలు వీరికి.

ఉత్తమ పాఠకులు సాహిత్యంతో జాతి చైతన్యం కొలుస్తారు. అది తమ జీవితాన్ని ఎంత ప్రభావితం చేస్తోందా అని పరిశీలిస్తారు. ఒక్క ఆలోచనా బీజం జనం మధ్యకు విసిరేస్తే, అది విస్తరించి ఎలా వ్యాపించి జీవచైతన్యం కలిగిస్తుందా అని గ్రహిస్తారు.

దేశంలో సరి అయిన సాహిత్యాభిలాష పెంపొందించడం ఉత్తమ సాహితీపరుల ప్రధాన కర్తవ్యం. చదివించడమే కాదు చదివించి ఆలోచింపచెయ్యాలి. వ్యక్తి వికాసం కలగాలి.

కానీ చదువుకున్నవాళ్ళు సహితం బుద్ధులకు సెలవిచ్చి, పంచేంద్రియాలకు వాటి ఆనందానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. మేకప్ సామాన్లు, కెమేరాలు, త్రివర్ణచిత్రాలు, మంచి పేపరు, చక్కటి అచ్చువేసే యంత్రాలు - ఇవన్నీ ఇప్పుడు మన కళలకు శాసనకర్తలైపోయాయి. వీటన్నింటి సహాయంతో "ఉత్తమాభిరుచి" శాసించాలి అన్న అసలు విషయం మరుగున పడిపోయింది. సాహిత్యం అందుకే ఒక ఉద్యమమవ్వాలి. ఇది ఎప్పటికైనా ఉత్తమాభిరుచులుగలవారి ద్వారానే సాగాలి.

పై మాటల్లో చాలావరకూ సాహితీ విమర్శకులు ఉత్తమ కథా రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు గారి అభిప్రాయాల్లో కొన్ని ఆయన ఈ మాటలతో ఆలోచించమన్నారు. అవసరమైన సాహిత్యం ఏదో చెప్పారు.

పై భావాల్లో కొన్నింటిమీదనన్నా గౌరవం, వాటి గురించి అవగాహనా ఉంటే మంచి సాహిత్యం జోలికి, ఆలోచించమని నిర్బంధించే సాహిత్యం జోలికి వెళతాం మనం. బీనాదేవిగారి "పుణ్యభూమీ కళ్ళుతెరు"లో అలాంటి కృషి చెయ్యాలని రచయిత పడ్డ తపన మనకు అర్ధమౌతుంది.

ఇందులో రాజమ్మ పాత్ర రచయిత వర్ణించినట్లు కనబడుతుందా ఎక్కడైనా? అంటే దానికి వారే జవాబు చెపుతారు.

"ఆమె ఎదురుగా భూమిలోనుంచీ పుట్టుకు వచ్చిన దంతపు మొక్క"

"ఆమె మీద నుంచీ వచ్చిన గాలికి గులాబీవాసన..."

"పనిచేసిన ఆమె చెయ్యి పురుగులు తినేసిన గులాబీలాగుంది -" ఇలా వర్ణిస్తారు రచయిత.

మౌలికమైన కొన్ని గుణాలుకల "రాజమ్మ" మనకు నిత్యజీవితంలో ఎక్కడైనా తటస్థపడుతుంది.

రాజమ్మ పాత్రను నగిషీ చెక్కడంలో ఒక ప్రత్యేకత చూపించారు రచయిత.

చిన్న రైతాంగంలో పుట్టిన రాజమ్మకు రెండో ఏట మనువు నిశ్చయమవుతుంది.. అందగత్తె రాజమ్మకు, ఎదుగుతున్న రాజమ్మకు 'నీతి' చాలా ముఖ్యమయిన పాయింటు. నిజాయితీ, భర్తపట్ల గౌరవం ఉంటాయి. స్త్రీ ఇలా ఉండాలి అని శాసించే చాలా మంచి గుణాలు ఆమెలో కనిపిస్తాయి. అవి నటన వల్ల, సూడో అరిస్టోక్రసీ, హిపోక్రసీ... వీటివలన సంక్రమించినవి కావు.. అవి ఆమె సహజమైన గుణాలు. అమాయకురాలు మొక్కల్నీ, సూరీడ్నీ నమ్ముకుంటుంది.

'పెపంచక దరమమంతే గదయ్యా, మనలాటోళ్ళం కష్టపడడానికే పుట్టాం...' అని సర్దుకుపోతుంది.

"సుక్కల్లో పువ్వు - పువ్వుల్లో సుక్కా అయిన రాజమ్మ తననే ఎందుకు పెళ్ళి చేసుకుంటాది? సేసుకున్నా వొగ్గేయకుండా సీతామ్మోర్లా ఎందుకుండి పోద్ది?" - ఆలోచిస్తాడు వేదాంతం తరతరాలుగా వంటబట్టిన వాళ్ళ ఇళ్ళల్లో పిల్లలు ముసిలి మనసుతో పుట్టినట్టే పుట్టిన సింహాచలం.

అతనికి గులాబీ కలలూ - పన్నీటి వానలూ - పూల జల్లులూ, వేణుగానం - వీణానాదం - ఏమీ ఉండవు. పులికోరా - షావుకారి పంచె - దొంగఏరు పాము మెలికా - ఇవ్వే గుర్తుంటాయి.

ఇల్లాంటి వ్యక్తికి నవ్వే పువ్వులాంటి రాజమ్మ భార్య అయినా, ఆమెను కాపాడుకునేందుకు అతడు అశక్తుడు. ఆ విషయం గురించి ఆలోచించదు. తెలుసుకుందామని కూడా ప్రయత్నించదు రాజమ్మ. "ఎనకజన్మ కర్మలు" నమ్మే రాజమ్మ జీవన సర్వస్వాన్ని భర్త పాదాలదగ్గర పరుస్తుంది.

షావుకారు చేసిన అన్యాయంతో అన్నీ కోల్పోతారు సింహాచలం, రాజమ్మ. తన బిడ్డను పోషించుకోడానికి కాయకష్టం చేసుకోడానికి కూడా వెనుకాడదు. ఆమె భర్త కళ్ళంబడి నీళ్ళని చూసి, ఆత్మాభిమానంగల ఆమె -

"సీస్సీ.. ఏటది ఆడదాన్లా బూవిపోతే బతకచ్చు. కాసునేకపోతే బతకచ్చు కానీ ధయిర్యం పోతే బతకలేం..." అని హితం చెపుతుంది.

ఆమె చాల చిలిపిది. ఆమె అందం, సింగారం రెండు గుణాల మధ్య అప్పుడప్పుడు అది బయట పడుతుంది ఎవరి గురించో చెణుకు -

"ఏటా రగుడీనుమాటలు?" అంటాడు చలం "రగుడీనుపన్లు, రగుడీనుమాటల్లో కాక, పేర్దన పజ్యాల్లో సెప్తారేటీ?" అనేస్తుంది.

'నాకు మణులొద్దు, మాన్యాలొద్దు, భాగ్యమొద్దు... నాకు నువ్విచ్చిన సెక్క నిలపమ'ని నంది పక్కన పశు భక్తితో సాష్టాంగపడతాడు సింహాచలం. గుండెలవిసేలా ప్రార్ధిస్తాడు. కానీ వాళ్ళకు అది దక్కదు. పొట్ట చేత్తో పట్టుకుని పట్నం బయలుదేరుతారు. రాజమ్మ భర్తను ఒప్పించి కూలిపని చేస్తుంది. రెక్కలు ముక్కలు చేసుకుంటుంది.

భర్త ఓడిపోయి సర్వం పోగొట్టుకుని అసమర్థ కోపాన్ని, ఆమెను తాగి కొట్టి ప్రపంచం తన పట్ల చేసిన అన్యాయానికి ప్రతీకారం చేశాననుకుంటాడు. నోరెత్తి ఇదేమనదు రాజమ్మ. అతనికన్నా ఒక వందరెట్లు అద్భుతంగా ఆలోచించగలదు ఆమె. బిడ్డను, తనను చితకబాదేసినప్పుడు -

"అసల్నీకు తెలుసా నువ్వెంక్కొట్టినావో...నానసలు మాట్టాడకూడదనే అనుకున్నాను. ఆడు వణ్ణం మానేసినంత మాత్తరాన ఆకలి ఎయ్యడం మానేసాదేంటి తిండిలేని సైతిదీ ఏటి సేస్తాది? గట్టు మీద గడ్డేడుస్తాది, సెట్టు మీద పిట్టేడుస్తాది. అడవిలో పులేడుస్తాది. అలాగే ఈడూ ఏడిసినాడు..." అంటుంది నోరెత్తకూడదనే అనుకుంటుంది. కానీ పరిస్థితులు ఉండనివ్వవు. బిడ్డ ఆకలి ఆగనివ్వదు. రైతు స్థితి నుంచీకూలోళ్ళ జీవితానికీ, ఆ తరువాత ముష్టోళ్ళ జీవితానికీ దిగజారిపోయే భవిష్యత్తు ఆమె కళ్ళకు ఎదురుగా కనబడుతోంది. అందుకే ఎదురు తిరుగుతుంది. నేను పని చేస్తానంటుంది. వంశం తీసి పక్కన బెట్టమంటుంది.

కానీ, ఆర్థికవనరు కోసరం గూటి బైటకు తలెత్తి చూసిన రాజమ్మకు ప్రపంచం చాలా పచ్చగా, నమ్మకంగా కనబడుతుంది. కానీ ఆ పిచ్చితల్లి మగవాళ్ళ వాంఛకు ఎరగా, అందంగా కనబడుతుంది.

ఇక్కడ ఒక తరహా మగవాళ్ళు ఆలోచించే విధానం చెప్తారు రచయిత... విమల అనే ఒక అమ్మాయిని వర్ణిస్తూ, ఆమెను చూస్తే తల్లి, చెల్లెలు, కూతురు గుర్తురారు.. పట్టెమంచం గుర్తొస్తుంది... విమలకు మనుష్యుల గురించి బాగా తెలుసు.

"తనకున్న కంపునీ, చారలనీ, కోరలనీ దాచుకోగలిగిన జాతి మనుష్యులదేననీ, తన కొవ్వుని కవిత్వం అనీ స్వార్థాన్ని ప్రేటియాటిజం అనీ, తన ఆకలి సంఘం ఆకలి అనీ, తన బాధ్యతలు సంఘానివే అనీ, తన పిరికితనం అహింస అనీ తన పిసినిగొట్టుతనం నిరాడంబరత్వం అనీ... సమర్థించుకుంటారనీ డబ్బున్న మగాళ్ళకి డబ్బుకంటే సెక్సు ముఖ్యమనీ, ఈకాలంలో ఏకపత్నీవ్రతులు చాలా అరుదు అనీ అలా ఉండటానికి పత్రాలు కారణం కావనీ గ్రహిస్తుంది... ఇల్లాంటి 'వల్గర్' ప్రపంచంలోకి అవసరానికి అడుగుపెట్టిన రాజమ్మ సొంత తల్లిని, చెల్లెల్ని కన్నకూతుర్ని కట్టుదిట్టాల్లో పెట్టే మగాడి మనసు నరకకూపమనీ, ప్రతి ఆడదాన్నీ కాముక దృష్టితో చూసి తనలా మరొకరు తనవాళ్ళ గురించి ఆలోచిస్తారేమోనన్న భయంతో సంప్రదాయపు గిరి గీస్తాడని తెలుసుకునేంత తెలివిగలది కాదు. ఆ చీకటి ప్రపంచం ఆమెకు తెలియదు. ఆమె పనిచేస్తున్న కూలీల మేస్త్రీ గవర్రాజు.. ఒక్కరేమిటి? కనబడ్డవాళ్ళంతా ఆమె అందాన్ని, నిస్సహాయతను, అవసరాన్ని అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకుని అనుభవించాలని చూస్తారు.

రాజమ్మకు హిపోక్రసీ తెలియదు... కానీ, ఇల్లాలి తనం అడ్డం పెట్టుకుని గద్దరిగా సొసైటీని, భర్తను, సంసారాన్ని మొత్తం గుత్తకు తీసుకుని సాధించి చంపే ఒక తరహా ఆడతనాలు రాజమ్మ కాళ్ళ కింద నిప్పులు పోస్తారు.. ఇరవై నాలుగు గంటలూ భర్తను అనుమానిస్తూ, సాధిస్తూ, బ్లాక్‌మెయిల్ చేస్తూ, మళ్ళీ ఏ మాత్రం ఆత్మాభిమానం లేకుండా అతని స్టేటస్‌ను, జీతాన్ని, సెక్యూరిటీని వాడుకోవడానికి సిగ్గుపడని ఆ జాతి యజమానురాలు - పనిమనిషి రాజమ్మను "నీతి తక్కువ ముండ" అంటుంది... కానీ రాజమ్మలో వ్యక్తిత్వం ఎదురు తిరిగి, నాలుగూ అడిగి పనిమానేస్తుంది.

ఆ తరువాత విద్య తప్ప సర్వం అర్థం చేసుకునే విద్యార్థులకు పనిమనిషిగా మారుతుంది. తనను "ఆడది" అనే దృష్టితో యవ్వన చాపల్యంతో చూస్తారన్నది ఆమెకు తెలియని విషయం... "నా కష్టం నేను చేస్తున్నాను.. వాళ్ళు డబ్బిస్తారు.." ఆ అమాయకత్వం ఈ సంఘంలో పనికిరాదని, చాకిరికి, జీతానికీ మించిన సాంఘిక, మానసిక చీకటి కోణాలు ఆర్థిక వ్యవస్థను డామినేట్ చేస్తాయని తెలియదు ఆమెకు.

"రాజమ్మ అలాంటి ఇల్లాంటిది కాదోయ్.." అని ఒక స్టూడెంటు అంటే -

"మధ్య నీ గ్యారెంటీ ఏమిటీ? దాని మొగుడేమన్నా కలక్టరా? కమీషనరా? ఆఫ్టాల్ రిక్షావాడు?" అని ఆమె మీద, ఆమె నీతి మీదా పందాలు కాసుకుంటారు భావిభారత పౌరులు. సాహసం చెయ్యబోయిన "రవి"ని చాచి లెంపకాయ కొట్టి బైట పడిపోతుంది రాజమ్మ.

కానీ ఆలోచించడం అప్పుడే ప్రారంభించింది ఆమె. నులకమంచం మీద పడుకున్న 'రాజమ్మ'కు బుర్ర తెల్లగాగితంలా అయిపోతుంది. తన ఇంటి చుట్టూ కొన్ని వేలమంది మగవాళ్ళు తనను నిర్బంధిస్తున్నట్లు భయపడుతుంది ఏడుస్తుంది కచ్చగా.

"అసలీ మొగాళ్ళు సదువుకున్నోళ్ళయినా, సదువుకోని వాళ్ళయినా, ముసలాళ్ళయినా, కుర్రోళ్ళయినా సరే... ఆడదాన్ని సూడగానే ఎందుకలా ఎర్రెత్తిపోతారో? సిస్సీ.. మొగాళ్ళంతా ఒకటే జాతి... గొప్పోళ్ళకు గొప్ప బుద్దులుంటాయేమో కానీ, ఆడదాని దగ్గర మాతరం ఉండవు..." అని అనుకుంటుంది.

కానీ, స్టూడెంట్స్ ద్వారా ఏదేదో విన్న సింహాచలం ప్రవర్తన ఆమెకు భయంకరంగా ఉంటుంది. అతని కళ్ళల్లో దాచి పెట్టిన కోపం లాంటిదీ, "నువ్వెలా పోయినా నాకు ఫర్వాలేదు" అన్న నిర్లక్ష్యం మొదటిసారి చూస్తుంది.

"మనిషి కళ్ళుపోతే చూపు పోతుంది. కాళ్ళు పోతే నడకపోతుంది. గొంతు పోతే, మాట పోతుంది. కానీ, ఇవన్నీ పోయినా సరే, ఊపిరి ఉన్నంత వరకూ ఆకలి మాత్రం పోదు.."

ఈ మాటలు - వాళ్ళ జీవితాల్ని "ఆకలి" అనే కారణం ఎంత భయంకరమైన సుళ్ళు తిప్పుతుందో అర్థమౌతుంది.

సింహాచలాన్ని ఎన్నికలలో ఉపయోగించుకుని అతని కాళ్ళు పోవడానికి కారణమైన 'నాయుడు' ప్రిన్సిపాల్‌గారింట్లో తప్పనిసరై ఉద్యోగం ఇప్పిస్తాడు రాజమ్మకు, సింహాచలానికి.

కానీ రాజమ్మ ఎంత అవసరమైన పరిస్థితుల్లో ఆ ఉద్యోగంలో చేరిందో మర్చిపోతాడు సింహాచలం. ప్రిన్సిపాల్‌గారి భార్య ఇల్లు పట్టించుకోకుండా తిరగడం వల్ల రాజమ్మ ఆ ఇంటి బాధ్యత వహిస్తుంది.

"ఆలెల్లా పోతే నీకెందుకు? నీకసలు మొగాడున్నాడనా లేక లేనోడికింద జమ అనుకున్నావా?" - అని అసహ్యాకరమైన ఆలోచనలు, మాటలు ప్రారంభిస్తాడు సింహాచలం.

ఇక్కడే రాజమ్మ ఇంతకాలం కేవలం శరీరంతోను, చిన్నప్పటి నుంచీ పెరిగిన వాతావరణ ప్రభావంతోనూ బతికిన వ్యక్తి మనస్థత్వంలో మార్పు ప్రారంభమౌతుంది. ఒక రకమైన అసహ్యత పెరుగుతుంది. జీవన లాలన చచ్చిపోయిన ఆడదాన్లో ఉండే నిర్లిప్తత ప్రారంభమౌతుంది. పతనానికో, వేదాంతానికో ఇదే మలుపు మరి. ఆమె శరీరం ఏ సుఖాన్నీ కోరకపోవడం, ఆలోచనలు ఎక్కువవడం, ప్రిన్సిపాల్‌గారి భార్య విజయ ఇచ్చే చీరలు - వాటన్నింటితో మరింత అలుసుగా మాట్లాడతాడు సింహాచలం.

రాజమ్మలో ఒక కొత్త మార్పు ప్రిన్సిపాల్‌గారింట్లో నాగరికతతో కూడిన అలవాట్లు, మనుష్యులు, ప్రిన్సిపాల్‌గారి హుందాతనం - ఇవన్నీ ఆమె తన చుట్టూ ప్రపంచం గురించీ, మనుష్యుల గురించీ తెగ ఆలోచింప చేస్తాయి. ఆమెకు ఆలోచనా జ్ఞానం ఎక్కువైన కొద్దీ కష్టాలే తప్ప పెద్ద సుఖమేమీ ఉండదు. పైగా, అసమర్థత, అవిటితనం ఈ రెండింటితో సింహాచలం ఇన్ఫీరియారిటీతో రాజమ్మను సాధిస్తున్నది చాలదన్నట్లు వీరాచారి అనే వ్యక్తి కొలిమి దగ్గర పని చెయ్యడం ప్రారంభిస్తాడు. వీరాచారి అనే వ్యక్తి ముగ్గురు ఆడవాళ్ళ వల్ల మోసపోయాడు. అతని ఆలోచనలలో లేకితనం, అసహ్యత నిండి ఉంటాయి. ఆడది, కామం ఈ రెండూ ఒకదానికొకటి పర్యాయపదాలతనికి... అతని భయంకరమైన మాటలకు సులభంగా లొంగిపోతాడు సింహాచలం. మరింత తాగుబోతవుతాడు. మనసుకు పట్టిన కుష్టువ్యాధి లాంటి అనుమానరోగంతో బాధ పడుతూ ఉంటాడు. అయినదానికీ కాని దానికీ రాజమ్మను కుళ్ళ బొడుస్తాడు.

కానీ రాజమ్మ ఇది వరకులా లేదు. ఆలోచిస్తోంది..."ఎందుకు?" అన్న ప్రశ్న ఉదయిస్తోంది. "నేను ఆడదాన్నవడమే నేను చేసిన తప్పా?" అని ఎదురు తిరగాలనిపిస్తోంది ఆమెకు. అర్థరాత్రి ప్రిన్సిపాల్‌గారింటికి రాజమ్మ వెళ్ళి భర్త తాగుడు కోసం డబ్బు తెచ్చే దృశ్యం ఆమె ఏమిటో, ఏరకమైన యువతో చెపుతుంది. కానీ గీత తప్పదు రాజమ్మ అప్పటికీ. జీవన పోరాటం సాగిస్తూనే ఉంటుంది. ఆమెను ఆపేదేమిటి? నీతా? సింహాచలం మీద ప్రేమా? బిడ్డ ఏమైపోతాడో అన్న మమకారమా? సంసారం చితికి పోతుందన్న అధైర్యమా?! ఇవన్నీ మాత్రమే కావేమో.. రాజమ్మ స్వాభిమానం కోసరం పూట కూడా తినకుండానే బతికాను... ఆ పోలీసోళ్ళు నన్ను "కూనీకోరు ముండా!"

అని తిట్టినప్పుడు సచ్చిపోదారనే అనుకున్నాను. కానీ, నాను సస్తే మీకు నీళ్ళుండవ్... నాకోసం నోరు తెరుసుకుని పిలుస్తున్న ప్రతీ సుయ్యి తప్పించుకుని నీ గుమ్మం కాడ వాలేను. నీ కోపం తీరా కొట్టు. లేకపోతే పీక పిసికేసి పారేయ్... నువ్వేటి జేసినా సరే. కానీ, అందరిలాగా నువ్వు కూడా 'రంకుముండా' అని తిడితే నానేటి జేస్తానో నాకే తెల్దు.."

కానీ, రాజమ్మలాంటి 'ఇంటెగ్రిటీ' ఉన్న ఆడదాన్ని కాపాడుకోవడానికి సత్తా ఉన్న మొగవాడు ఈ పుణ్యభూమి మీద పుట్టబోడేమో... పరిస్థితులు మాట్లాడినట్లు వ్యక్తి అర్థం కాదు ఈ వ్యవస్థకు. పేగులు తెగేలా ఏడుస్తున్నా ఆమెది నాటకమల్లే తోచి ఆమె ముఖాన్నే తలుపేస్తాడు సింహాచలం.

పిచ్చెత్తిన సుడిగాలిలా లేస్తుంది - అప్పుడు ఆమెలోని రాజమ్మ.

తనను కరుణగా చూసిన ప్రిన్సిపాల్‌గారు, ఆయన తల్లిలేని బిడ్డలు ఆమెను లొంగదీస్తారు.

ప్రేమించి, గౌరవించిన ఆడదానిచేత మోసగించబడి, దగా చేయబడిన ఉన్నతుడైన ప్రిన్సిపాల్‌గారికి లొంగిపోతుంది రాజమ్మ... 'ఒద్దనకు రాజమ్మా!' అంటున్న అతన్ని ఎందుకు రాజమ్మ వద్దనలేదు?! నీతి కోసరం నిప్పులు దాటిన రాజమ్మను ఆ క్షణం ఏది లొంగదీసింది?! అది అర్థమవ్వాలంటే ఆడదాని మనసు అర్థమవ్వాలి. కానీ ఆ పాటి తీరికా ఓపికా ఎప్పుడూ లేవు సంఘానికి. "ఆమెకు తనలో తల్లి అప్పుడే నిద్ర లేచినట్లు అనిపిస్తుంది."

అక్కడే, ఓదార్పు కావలసిన వాళ్ళ కుటుంబానికి సేవ చేస్తున్న రాజమ్మకు ఓదార్పులేదు.

తనకు ఏ శిక్ష వేసినా, భర్తను, కొడుకును తిన్నగా చూడమని దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉంటుంది. ఆమెలోని వ్యక్తికి ఆమె ఇచ్చే గౌరవం చాలా గొప్పది.

ఇంత ఔన్నత్యం ఉన్న రాజమ్మను ప్రిన్సిపాల్‌గారి భార్య విజయ నీతి చెడి ఆత్మహత్య చేసుకుంటే ఎప్పుడూ నిజం తెలుసుకుందామని ప్రయత్నించని కొందరు పోలీసులు రాజమ్మని అనుమానించి అరెస్టు చేస్తారు.

దగా, మోసం, దుర్మార్గం, రాక్షసత్వం అన్నీ మూటగట్టి పోలీసు స్టేషనుకు చీకటి మూలల్లో ఉన్నట్లనిపిస్తుంది ఆమెకు. నాలుగు రోజుల తరువాత, ప్రిన్సిపాల్‌గారి దయవల్ల రాజమ్మను వదిలేయాల్సి వచ్చినప్పుడు -

"కానీ, దీని ప్లాను నాకు నచ్చలేదొరే... ఏదో గోడచాటు బతుకు బతికేవాలసింది... కానీ ఆడదాన్తో అక్కడే ఉంది పేచీ.. ఆ బాబును పర్మనెంటుగా సేతులో ఎట్టుకుందామని ఎత్తు ఎత్తింది... మిగిలిన కత మామూలే.. ఒక్క మాత్రన్నా మిగల్చకుండా ఏ పాల్లల్లోనో కలిపి ఇచ్చేసినాదీ ముండ... ఆ బాబేదో పెద్ద పతివ్రతలాగా రిజిస్టర్ చేయించాడీ కేసు...

'ఇంతకీ నీ అదురుష్టం బాగుండి పోనాది... బతికి పోనావ్... పోయే" అంటూ నీతికి నాలుగు పక్కలా నిలబడాల్సిన పోలీసు వాళ్ళు వీడ్కోలు చెపుతారు.

అన్ని అవమర్యాదలూ తప్పించుకుని గుడిసెకు వస్తే "కాలు లోపల ఎట్టకు... నీకాలుపడి కొంపలు కూలిపోతాయి" అంటాడు సింహాచలం.

బావురుమంటుంది రాజమ్మ. అప్పుడు ఆమెకు కావల్సింది ఓదార్పు... శరీరానికీ, మనసుకూ కూడా - కానీ, ఆ దురదృష్టవంతురాలికి అవి లేవని తెలిసి కుప్పకూలిపోతుంది.... అప్పుడు రాజమ్మ అనే మాటలు ఆమె ఏమిటో మనకు చెపుతాయి.

ప్రిన్సిపాల్‌గారు ఊరు వదిలిపోతారు... రాజమ్మ కొడుకు చావుబతుకుల మీదుంటాడు. దారిలేక, తన బిడ్డ కోసరం తనను తాను అమ్ముకోడానికి సిద్ధపడుతుంది రాజమ్మ.

"నానూ ఒక అమ్మ కన్న పిల్లనే నానూ ఒక అయ్య నీడను బతుకుదామనుకున్నదాన్నే నాను చేసిన పాపమేమిటి?"

ఈ ప్రశ్నలతో నీతి అనే గుడిసె దాటి, తనకున్న స్త్రీత్వానికి వెలకట్టికోవడానికి చీకట్లో కలుస్తున్న రాజమ్మను ఆపడానికి, ఆమె స్వాభిమానాన్ని గౌరవించడానికి ఏ సాంఘిక నియమం ముందుకు రాదు. రాజమ్మను పోగొట్టడానికే సిద్ధపడుతుంది సంఘం తాలూకు అజ్ఞానం.

విధి అంతటితో వదలదు రాజమ్మను.

జె.జె అనే విదేశీయుడు, స్నేహితుడి భార్యతో తప్పు చేసి, భంగపడి, ఇండియా పారిపోయి వచ్చి, ఆశ్రమంలో చేరి, కోరికలకు తట్టుకోలేక, ఉన్నత వంశస్తురాలి ప్రేమలో పడి, తృప్తిపడలేక, "పాము కాటుకు పాము విషమే ఇంజక్షన్ ఇస్తారు తెలుసా? ఆడదాని కాటు ఆడదే మరిపించగలదు: ఇన్నాళ్ళు సాంఘికంగా ఉన్నత స్త్రీలే నీకు పరిచయం. ఫర్ ఏ ఛేంజ్ చౌకబారుని ప్రయత్నించు... నా మట్టుకు నాకు బజారు మనిషి నచ్చినట్టు బంగళా మహిళలు నచ్చరు.." అని స్నేహితుడిచ్చిన సలహా ఒంటబట్టిచ్చుకుని ఆడదాని సౌఖ్యంలో నరకానికి మెట్లు వేసుకుంటూ ఉంటాడు. అతని కోసరం పంపబడుతుంది రాజమ్మ. కారు వెనకసీట్లో ఉన్న రాజమ్మకు నిన్న తినలేదన్న విచారం కన్నా నేడు తిన్నానన్న తృప్తి ఉంది.

"ఈ దీపాల వెనక ఎంత చీకటి?!" అన్న ఆలోచనలతో ఎదిగిపోయింది రాజమ్మ.

జె.జె.కు ఆమె - మెత్తగా కదిలే తలుపు అవతల పాపాల అందం అంతా కలిసి చేసిన ఆడది - స్వర్గం నుండీనరకానికీ, నరకం నుండీ స్వర్గానికీ తీసుకువెళ్ళగల ఆడది - అనిపిస్తుంది.

అతడు ఆమెకు కానుకలు, నగలు ఇచ్చి ఆమె స్త్రీత్వానికి నమస్కరిస్తాడు. రాజమ్మ వెళ్ళిపోగానే చచ్చిపోతాడు.

రాజమ్మ మళ్ళీ హత్యా నేరం మీద పోలీసు కబంధ హస్తాల్లోకి వెళ్ళిపోతుంది. అక్కడ అవినీతి నరకంలో, ఓదార్పు లేని దుఃఖంతో, కన్నీరు ఎండిపోయి, రక్తం కారుతాయేమో అన్న కళ్ళతో భర్త, బిడ్డ ఏమైపోయారో, వాళ్ళ జాడ ఏమైనా తెలుస్తుందేమోనన్న ఆశతో ఎదురు చూస్తుంది.

కానీ అక్కడా ఆమె ఆఖరి జీవిత మమకార బంధం పుటుక్కున తెగుతుంది. ఆమె భర్త బిడ్డను తీసుకుని వెళ్ళిపోతాడు. అది తెలిసి తన పేగుల్ని ఎవరో ఎదుటే తీసి కాలుస్తున్నారనిపిస్తుంది రాజమ్మకు.

ఆమె త్యాగం, జీవితం ఎంత అర్థరహితమో ఆమెకు అర్థమౌతుంది.

అందుకే, రాజమ్మ ఫారిన్ మేగజైన్ నుంచీ ఎవరో రిపోర్టరు వచ్చి, "నీకు బోలెడు డబ్బిస్తాము. నీ జీవిత కథ చెప్పు జె.జె గురించి చెప్పు -" అన్నప్పుడు

" మీ డబ్బూ వద్దు, మీ బ్రతుకూ వద్దు.. సేతనైతే సెప్పి ఉరేయించి పెట్టు బాబూ!" అని గిర్రున తిరిగి చీకటిలోకి నడుస్తుంది...

"రాజమ్మ" - పాత్ర మనలో చాలా ఆలోచనల గూళ్ళను కదుపుతుంది... జీవితపు నీడలు అడుగు వేసినప్పుడల్లా వెంటాడి ఊపిరాడనివ్వవు ఆమెను.. ఈ నవలలో మిగతా స్త్రీ పాత్రలు ఉన్నాయి. మార్గరెట్, రాణి, అప్పల నరుసు, విమల, రంగాచారి భార్యలు... వీరందరూ తలొక కోణం నుంచీ నీతిని చూసి నవ్విన వాళ్ళే... కానీ, రాజమ్మ నీతిని గౌరవించింది... మరి మిగతా వారికుండే సాంఘిక భద్రత , ఆర్థిక భద్రత రాజమ్మకు ఎందుకు లేకపోయింది?!

ఈ నెగిటివ్ ఎలిమెంటు ప్రశ్నార్థకంగా మిగిలి మనను ఆలోచించమంటుంది.

ఇది ఒకరకమైన విచిత్ర ప్రక్రియ...

ఎలా బ్రతికించాలి ఇల్లాంటి స్త్రీని? ఏమిచ్చి బ్రతికించుకోవాలి సంఘం?!

అసలు ఎందుకు బ్రతికించుకోవడం?అంటే...

స్త్రీకి సంఘం శాసించే కోమలత్వం, అమాయకత్వం, బలైపోగల తృష్ణ, నీతి మీద అపార గౌరవం, కర్మ సిద్ధాంతం మీద నమ్మకం, భర్త అనే స్థానానికి ఇవ్వవలసిన గౌరవం, సౌందర్యం, కష్టాల్లో నిర్లిప్తతా, ఏ పరిస్థితుల్లోనైనా తన వాళ్ళ కోసరం తలవంచుకుని బాధ్యత తీసేసుకుని "సరే" అని అనగలగడం, తన సంసారం కోసరం ప్రాణం, మానం, రోషం, పౌరుషం, అహం, అందం - అన్నీ త్యాగం చెయ్యగలిగిన నియతి - ఇవన్నీ కలబోస్తే రాజమ్మ...

ఏమిటి రాజమ్మకు లేందే?! మరి రాజమ్మకు సంఘం ఏమిచ్చుకోగలిగింది?! ఇక్కడ ప్రశ్న సాంఘిక భద్రత.... అది ఎందుకివ్వలేదు సంఘం?! ఎందుకు ఓడిపోయింది?! ఆర్థిక, సామాజిక భద్రత రెండూ ఉంటే కానీ, స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వలేని సంఘం, తన నుంచీ ఏమీ ఆశించని వాళ్ళకు, తనను గౌరవించని వాళ్ళకు, తన మీద ఆధారపడని వాళ్ళకూ అన్నీ ఇచ్చి గౌరవిస్తుందే కానీ, తనకు తనుగా, తన నీతి చట్రాల్లో నిలబడి ఆక్రోశించే వాళ్ళను బలి చేస్తుందా?! తన ఊపిరి తను తీసుకోనివ్వదా!?

జె.జె స్నేహితురాలు రాణికి సాంఘిక భద్రత ఎలా వచ్చింది? ఇది వర్గ విశ్లేషణ వల్లా?! సౌకుమార్యం, సౌందర్యం, స్పందన - ఇవన్నీ రాజమ్మకూ ఉన్నాయి. కానీ, రాణికి జబ్బు చేస్తే పదముగ్గురు డాక్టర్లు రాగలరు. కానీ, రాజమ్మ దిక్కులేని ఘోషకు కనీసం ప్రకృతి కూడా సమాధానం చెప్పదు... ఎక్కడ ఈ తేడా? మాట్లాడదేం సంఘం?!... విప్లవ కారులు, సోషలిస్టులు ఆదర్శవాదులు, సాంఘిక సేవాకర్తలు... దేనికోసరం పోరాడాలో చెపుతుంది రాజమ్మ మనకు.

ఆఖరున రాజమ్మకు కావలసిన ఆర్థిక స్థోమత ఇస్తామని, ఆఖరుకు నిజాయితీని అమ్ముకోమని బేరం జరుగుతుంది. కాదన్న రాజమ్మకు కావల్సిందేమిటి?! మడులు, మాన్యాలు , కార్లు, హోదాలూ కావే?!

తన ఇంట్లో దీపం, తన వాకిట్లో ముగ్గు, తన భర్త బిడ్డతో కనీసం ఒక పూటన్నా తిని, ఒక కప్పు కింద ఉండటం...

ఈ మాత్రం ఇవ్వలేదా సంఘం తన రూల్స్ ప్రకారం బ్రతికిన వాళ్ళకు... ఇదే చేతకానప్పుడు తన బిల్లుల కాగితం లాంటి తన వ్యవస్థను తగలబెట్టుకోడానికి తనే అగ్గిపుల్ల వెలిగించుకుంటోదన్న మాట.

తన వెన్నెల గూడు విరిగిపోయిందని తెలిసినప్పుడు "హాంగ్ మీ క్విక్" అనే రాజమ్మలు -

ఈ పుణ్యభూమిని కళ్ళు తెరవమంటారు... ఒకసారి అటు నుంచీ ఆలోచిస్తే రచయిత చాలా అవగాహనతో నవలకు ఈ పేరు పెట్టారనిపిస్తుంది.

చదివి, ఆలోచిస్తూ మరొకసారి చదివి, ఆ తరువాత ఆడదాన్లో రాజమ్మ ఉందేమోనని ఉలిక్కి పడటం, కొంచెం గౌరవించడం నేర్చుకోవాలనిపిస్తుంది - హృదయము, మేధస్సు ఉన్న పాఠకులకు.

ఆడదాన్లో 'ఫీమేల్' 'ఉమెన్', లేడీ' అనే మూడు అవస్థలు' వర్గానికి, ఆర్థిక పరిస్థితికీ సంబంధించినవి కావనీ, అవి గుణాలను బట్టి ఏర్పడ్డాయనీ, పని మనిషిల్లోను పతితలోనూ కూడా అప్పుడప్పుడు మనకు 'లేడీ' దర్శనమిస్తుందని, అందుకే ఆర్థిక స్థితి కాక, ఔన్నత్యాన్ని గౌరవించి, మనను మనం గౌరవించుకోగలిగే స్థితికి ఎదగమంటుంది 'రాజమ్మ' పాత్ర.

❊❊❊❊❊

# వాసిరెడ్డి సీతాదేవి గారి 'సమత'లో అరుంధతి

**రచయితలకు ఆడ - మగ పరిధిలు వేసి,** వారి మధ్య అర్థంలేని బేదాభిప్రాయాలు పెరిగిపోయిన రోజుల్లో వాసిరెడ్డి సీతాదేవిగారి లాంటి రచయిత్రులు ఈ గాలిగోడలను చెదరగొట్టారనే చెప్పాలి. మేధస్సుకు, జండర్‌కు సంబంధం లేదని చెప్పగలిగిన రచయిత్రులు, చాలా తక్కువమంది. ఒకప్పుడు, రచన "కుటీరపరిశ్రమ" అయిపోయి, తమకు తెలిసిన బానిసత్వాల కింద, స్త్రీత్వపు ప్రలోభాలకింద కూరుకుపోయి, అక్షరాలకు కూడా "ఆడతనం" చీరకట్టి, ఆలోచనలకు పరిధుల పాంజేబు పట్టాలు పెట్టి ఆపేయ్యకుండా, అక్షర విహంగాలను స్వేచ్ఛగా ఆలోచిస్తూ పొద్దెరుపు సూర్యుడికి స్వాగతం పలకమన్న రచయిత్రులలో కుమారి వాసిరెడ్డి సీతాదేవిగారొకరు.

సాహిత్య ఎకాడమీ బహుమతి రెండుసార్లు పొందిన రచయిత్రి ఈమె. ఆ అవార్డు పొందిన నవలల్లో 'సమత' ఒకటి. ఆమె రాసిన "మరీచిక" నవలను ప్రభుత్వం 'బాన్' చేసిన రోజుల్లో సీతాదేవిగారు.

"రచయిత బోధకుడుకాదు. ప్రవక్తకాడు, ఉపదేశకుడు కాడు. రచన వాస్తవికతను ప్రతిబింబించాలి. హిప్పీ పోలీసులా మాట్లాడడు. పోలీసు నక్సలైట్‌లా మాట్లాడడు. నక్సలైట్ గాంధీవాదిలా మాట్లాడడు. ఏ రచన అయినా ప్రజలలోకి వెళ్ళాక దానిని పొగడినా, తెగడినా, నిషేధిస్తే మౌనం వహించినా, ఆందోళన చేసినా ఆ బాధ్యత పాఠకులదే. ఏ రచయితా నవలద్వారా సిద్ధాంతాలను ప్రతిపాదించడంగానీ ఉద్యమాలను నిర్మించడంకానీ ప్రపంచ సాహిత్య చరిత్రలోనే జరగలేదంటారు. పోతే రచయితకు సమాజం పట్ల నిర్దుష్టమైన కొన్ని బాధ్యతలున్నాయి. ఏరచయిత అయినా సమకాలీన సమాజ జీవితాన్ని తన అవగాహన మేరకు అర్థం చేసుకోవడం కూడా పాఠకుల అవగాహన స్థాయి మేరకే పరిమితమై ఉంటుంది -" అన్నారు.

ఈ కొద్ది వాక్యాలలోనే ఈమె అక్షరాలలో అస్పష్టత ఉండదని మనకు అర్థమైపోతుంది. సమసమాజం కోసం ఎలా పోరాడాలంటారో వ్యక్తి స్వేచ్ఛకు గౌరవానికి కూడా అలాంటి ప్రాతిపదికనే కలిపించగలిగిన వ్యక్తి ఈవిడ.

"సమత"లో అరుంధతి ఒక మంచి సృష్టి. ఈ పాత్ర పరిస్థితులకు, ప్రలోభాలకు లొంగిపోయిన పాత్ర. "అరె.. ఇలా జరుగుతుందేమిటి?" అని మనసుని అరుంధతి ఆశ్చర్యపరచదు, "అవునూ! ఆ మనిషి ఇలాగే ప్రవర్తిస్తుంది మరి.. అంతే.." అనిపిస్తుంది. మన జీవన గమనంలో తటస్థపడే కొందరు స్త్రీ మూర్తులలో "అరుంధతి" ఛాయలు మనకు చాలా సులభంగా గ్రహింపుకు వస్తాయి.



అరుంధతి ఒక లేనింటి పిల్ల. పేదరికము, సవితితల్లి అసూయ, పుట్టుకతో వచ్చిన సౌందర్యం, వయస్సు తెచ్చిపెట్టే అలజడులు, ఏమాత్రం ఎదగడానికి అవకాశమివ్వని చచ్చు సాహిత్యపఠనం - ఇవన్నీ అరుంధతిని మేధాపరంగా చాలా అస్థవ్యస్తంగా పెంచుతాయి. కష్టాలు, కన్నీళ్ళు ఒక "సుగుణ సుందరి"గా ఈ పిల్లను మార్చవు. అంతర్లీనమైన కచ్చ ఏదో ఆమెలో పడగవిప్పడం ప్రారంభిస్తుంది.

తన చుట్టూ మగపిల్లలు తిరుగుతున్నారని తెలిసి తన సౌందర్యపు ప్రత్యేకత, ఆకర్షణ ఏమిటో గ్రహించుకుంటుంది అరుంధతి. ఈమె వెర్రివేషాలు సవితి తల్లికి మరింత ఆలంబన ఇచ్చి చదువు మాన్పిస్తాయి.ఎన్ని దెబ్బలు కొట్టినా బెల్లం కొట్టిన రాయిలా నిలబడే అరుంధతి మొండితనం అప్పుడే ప్రస్ఫుటమౌతుంది. తన దోషం ఏమిటో ఆలోచించుకోవడం కన్న, "ఈ నరకంలోనించీ ఎవరైనా అబ్బాయితో పారిపోతే.." అని ఆలోచిస్తుంది ఈ పిల్ల.

కానీ అరుంధతిని విధి అంత త్వరగా శిక్షించదు. ఆమె మారడానికి కొన్ని వరాలిస్తుంది. "బీదకుటుంబాన్ని ఆదుకున్నవాళ్ళమౌతాము" అని రహస్యంగా రెండువేల రూపాయలు ఇచ్చి, అరుంధతిని తన ఒక్కగానొక్క కొడుకు, సౌమ్యుడు, ఆస్థిపరుడు, బుద్ధిమంతుడు అయిన సీతాపతికి ఇచ్చి చేసుకుంటుంది, బంగారు తల్లిలాంటి శాంతమ్మ. కానీ ఆ అత్తగారి మంచితనం అర్థమయ్యే సంస్కారం అరుంధతిలో లేదు. పల్లెటూరు రైతులా పంచెకట్టు, కిర్రుచెప్పులు ఉన్న సీతాపతి నచ్చలేదు ఆమెకు. అయినా పెళ్ళి ఆగదు. స్నిగ్ధమనోహరంగా వయస్సు పసిడి పూతలు తొడిగి ఆమె బాహ్యసౌందర్యం భర్తను వివశుణ్ణి చేస్తుంది. తల్లి, ఆమె ఆప్యాయత, ఇంటి పరువు, ప్రతిష్ఠ - వీటికి ప్రాముఖ్యత లేకపోయి ఉంటే ఆమె పెంపుడు కుక్కలా మారుండేవాడు సీతాపతి. మంచి వాతావరణం, ప్రేమ, అత్తగారి ఆదరణ అరుంధతిలో మౌలికమైన గుణాల్లో మార్పు తీసుకురాదు. భర్త ఆదరణకు గర్వపడ్డా, అతను తల్లికి ఇచ్చే గౌరవాన్ని భరించలేకపోతుంది. ఆమె పెంకి పట్టుదల, జాలితనం పసితనం కింద తీసుకోగలిగిన భర్త, అత్తగారి మంచితనం అర్థంకాదు ఆమెకి.

"ఎందుకమ్మా? ఏడుస్తున్నావు?" అని అడిగితే? "నాన్న గుర్తుకు వచ్చి..." అని నమ్మకంగా అబద్దమాడెయ్యగలదు అరుంధతి. "పోనీ చూసిరాకూడదూ?" అంటే, పుట్టింట్లో ఏ వ్యక్తితోనూ అనుబంధంలేని అరుంధతి వొద్దు పొమ్మంటుంది.

తమ గదిలో ఉండే రాజారావు ఫోటో అతడి గురించి అతని గొప్ప ఆదర్శాల గురించి, భర్త, అత్తగారూ ఆ ఇంటి బిడ్డను గురించి చెపుతున్నట్లు వర్ణిస్తూంటే, అర్థంకాదు అరుంధతికి. ఆశ్చర్యం కూడా కలుగుతుంది. కానీ, తెలియని కుతూహలమేదో ఆమెలో అనవసరంగా పెరిగి పెద్దదౌతుంది.

ముగ్గుపెట్టి లాంతర్లు తుడుస్తున్న అరుంధతి ఎదురుగా గడ్డంతో మాసిపోయిన బట్టలతో తననే పరికిస్తూ ఆశ్చర్యంగా నిలబడిపోయిన వ్యక్తిని చూసి లోపలికి పారిపోతుంది. "దొంగ" అని ఒణికిపోతుంది. పరిచయస్థుడిలా తమ పడకగదిలోకి వచ్చి, "ఆ ఫోటో ఎవరిదని?" అడగగానే అప్రయత్నంగా రాజారావు ఫోటో గుండెల్లో దాచుకుంటుంది.

ఆమెలో ఆ క్షణం కనబడ్డ భయదసౌందర్యం అతణ్ణి వివశుణ్ణి చేస్తుంది.

"ఫోటోను గుండెల్లో దాచుకుంటున్నావు. మనిషిని ఇంట్లోనించి బైటకు పొమ్మంటున్నావు. విచిత్రంగా ఉందే..." అంటున్న ఆ వ్యక్తి "రాజారావు" అని తెలిసి అతని ఎదట నుంచీ పారిపోతుంది.

సున్నితంగా ఎదిగే మేధోబలం ఒక వ్యక్తికి సరికొత్త వింతస్ఫూర్తిని, కాంతిని ఇవ్వచ్చు. కానీ అది లేకపోయినా, కేవలం శారీరక సౌందర్యం భౌతికమైన జీవన వాంఛలను నిద్రలేపటానికి చాలా సులభంగా నాదస్వరం పట్టగలదని స్ఫురింపజేస్తారు రచయిత్రి. రాజారావులాంటి ఆదర్శవాది, మంచివాడు, త్యాగశీలి కూడా ఈ "కనికట్టు" నుంచీ తప్పించుకోలేకపోతాడు.

"ఎవరీ అద్వితీయమైన సౌందర్యరాసి? ప్రపంచాన్ని తనముందు మోకరిల్ల చేసుకునే సౌందర్యం ఈమెది. ఈమెను చూస్తే తన అలసట అంతా తీరిపోయినట్లయింది. ఒక అందమైన చిత్రాన్ని చూసినట్లూ పాలరాతి శిల్పాన్ని తాకినట్లు, మంచికవి రచించి అతని మొదటి భావగీతాన్ని చదివినట్లు -" ఇలా భ్రాంతిలో పడిపోతాడు రాజారావు.

ఒకవారంలో రాజారావు అంటే, తన భర్తకు అత్తగారికీ ఉండే సహజ సిద్ధమైన ప్రేమ, మర్యాద, అతని ఆదర్శాలు, వాస్తవ దృక్పథాలు, అతను పార్టీకోసం చేసిన త్యాగాలూ - ఇవన్నీ తెలుసుకున్న అరుంధతికి అర్థంలేని లోకాల్లో ప్రయాణం చేస్తున్నట్లనిపిస్తుంది. అతను అండర్ గ్రౌండ్ జీవితం వర్ణిస్తూంటే రాజకుమారుడి సాహసగాథలు విన్నట్లుగా ఉంటుంది. కానీ అతనిపట్ల వీటన్నింటినీ మించిన ఆకర్షణకు కారణం అతనికి తన సౌందర్యం పట్ల ఉన్న విభ్రాంతి.

ఆమె చదివే "శృంగారి" మొదలైన చెత్తపుస్తకాలు చూస్తాడు రాజారావు. అవన్నీ కుప్పపోసి తగలపెడతాడు. "ఇలాంటివి ప్రాథమిక పాశవిక ప్రవృత్తుల్ని రెచ్చగొడతాయి" - అని మందలించి, మంచి సాహిత్యం తెప్పించి ఇస్తాడు. అవి ఎలా చదవాలో, ఎలా అవగాహన చేసుకోవాలో చాలా సున్నితంగా చెప్తాడు. న్యాయానికి ఈ 'మలుపు' అరుంధతిలో ఆరోగ్యకరమైన మార్పు తీసుకురావలిసింది.

కానీ, అది జరగదు. ఈ పరిచయ పరిణామంలో ప్రతిక్షణం తను అందమైన ఆడదాన్నన్న సంగతి, రాజారావుకు తనపట్ల పెరుగుతున్న ఆకర్షణ సంగతి మర్చిపోదు అరుంధతి. అతడు తనను తప్పించుకు తిరగడానికి కారణం, తన నుంచీ దూరం కావడానికే అని అర్థమౌతుంది. అతని చూపుల్లోని బాధ, కన్నీరు - వీటికి తనే కారణం అన్న గ్రహింపు ఆమెకు అత్యంత హాయిని కలిగిస్తుంది. వివాహిత, గౌరవనీయురాలైన ఇల్లాలు అయిన తనకు, భార్యాబిడ్డలు, వాటికి మించిన పార్టీఆదర్శాలు ఉన్న అతనికి మధ్య పెరుగుతున్న ఆకర్షణ ఎంత భయంకరమైన పరిణామం చెందుతుందో అరుంధతికి తెలియదు.

శ్రావణ మంగళవారం నోము నోచుకుని, ఆకుపచ్చచీర, చేతికి పసుపు తోరం, ప్రలోభపెట్టే చూపుల్తో నిలబడ్డ అరుంధతిని రాజారావు చూసిన చూపు ఆమెను భయపెట్టి, తప్పించుకుని పోయేటట్లు చేస్తుంది. ఇద్దరి మధ్య బంధం మరింత బలం చేకూర్చుకుంటుంది.

అతని భార్య దగ్గర నుంచీ రమ్మనమని ఉత్తరం వచ్చినప్పుడు,

"నన్నడుగుతారేం..." అన్న అరుంధతిని"నువ్వు నాకేమీ కావా?" అని సూటిగా అడుగుతాడు, ఆ కంఠంలో మార్దవం, ధ్వని ఆమెను దిగంతాలకు తరుముతాయి. తన బలహీనతను చెపుతాయి.

"అతను తనను పరీక్షిస్తున్నాడా... స్నేహితుడికి ద్రోహం చేస్తున్నానన్న బాధ లేదా...?" ఇలా ఆలోచిస్తుంది కొంచెం వివేకంతో అప్పుడప్పుడు అరుంధతి. కానీ వివేకం కన్నా అందమైన అహం బలవత్తరమైంది.

దాని బలం ఎంత కాకపోతే, ఆదర్శవాది, వివేకవంతుడు అయిన రాజారావును వివశుణ్ణి చేస్తుంది?! దేశం కోసం ధనం, సుఖం, స్వలాభం - అన్నీ త్యాగం చేసిన వ్యక్తికి వివేకం భవిష్యత్తులో ఏముందో తెలియ చెప్తూనే ఉంటుంది. కానీ తెలిసీ ఏమీ చెయ్యలేని స్త్రీత్వపు ఆకర్షణలో చిక్కుకుంటాడతను.

"నాలో ఏదో బలహీనత ఏర్పడింది. పార్టీ ఆదర్శాలకు కూడా ద్రోహం చేస్తానేమోనని భయంగా ఉంది..." అంటాడు రాజారావు సీతాపతితో. ఆ మాటలకు ఉలిక్కిపడుతుంది అరుంధతి. బలవత్తరమైన ఆకర్షణ, సుకుమారమైన ప్రేమ, ఆరాధన ఎంత మాములు మనిషిలోనైనా కొంత మార్పు తెస్తాయి. అది తాత్కాలికమా? శాశ్వతమా? అన్న ప్రశ్న వారి సంస్కారపు ఎదుగుదలను బట్టి ఉంటుంది... ఈ తన ఆకర్షణ తన భర్తకు ద్రోహం చేయిస్తుందేమోనన్న భయం అరుంధతికి ఉంటుంది.

"మీ స్నేహితుణ్ణి వెళ్ళమనండి. ఇక్కడకు ఎప్పుడూ రావద్దని చెప్పండి..." అని భర్తతో వాదిస్తుంది.

"ఎందుకు?" అంటాడు అర్థంకాని సీతాపతి. ఏమని చెప్పగలదు ఆమె?! అతణ్ణి చూసి తను నిగ్రహించుకోలేదని, అతను తప్ప ప్రపంచంలో తనకు కావలసినదేదీ లేదని ఎలా అనగలదు!

అమాయకుడైన సీతాపతి పోలీసుల బారినుంచీ తనను రక్షించడానికి అలా అంటోందనుకుంటాడు. కానీ, అరుంధతి మరునాడు తనకు చెప్పకుండా వెళ్ళిపోయిన రాజారావును తలుచుకుని వెక్కి వెక్కి ఏడుస్తుంది. అతని గొప్పతనం తను గుర్తించలేదు. అతను వెళ్ళిపోడు తనకోసం ఉండిపోతాడని ఆశిస్తుంది పిచ్చిదానిలా. కానీ, అంతకన్నా అతను బలహీనతను ప్రదర్శిస్తాడని, తనను తాను దిగజార్చుకుంటాడని అనుకోలేకపోతుంది. రాజారావు ఫోటో గదిలో వద్దని అభ్యంతరపెడుతుంది. కానీ, పారెయ్యకుండా తన గదిలో చీరల అడుగున దాచుకుంటుంది.

కాలం ఎవరికోసమూ ఆగదు. గర్భవతి అయిన అరుంధతిని అపురూపంగా చూస్తారు అత్తగారూ, భర్తాకూడా. "సీతాదేవి" పుట్టిన రోజున ఆడపిల్ల పుడుతుంది. "మాధవి" అని పేరు పెట్టుకుంటుంది. మాతృత్వపు మధురిమతో తన ఆశలు, ఉద్వేగాలూ నిద్రబుచ్చుతూ కాలం గడుపుతుంది అరుంధతి.

కానీ, వెళ్ళిపోయిన రాజారావు ఆమె జీవితం నుంచీ నిష్క్రమించి ఉంటే కథ ఎలా ఉండేదో?!! అతని స్థావరాన్ని పోలీసులు పట్టుకోగానే పారిపోతూ దారిలో ఆ ఇంటితోటలో నక్కి ఉన్న అతను "మాధవి"ని ఎద్దుకుమ్మబోవడం చూసి రక్షిస్తాడు. అతని గుండెకు బలమైన

దెబ్బ తగులుతుంది. అతనిపట్ల ప్రేమ, కృతజ్ఞత, ఆరాధనతో రెట్టింపు అయిపోతుంది ఆమెకు. ఏనాడూ అసహ్యకరమైన పనులు చెయ్యదు అరుంధతి. కానీ, రాజారావు రక్తం వాంతి చేసుకోగానే బూడిదవేసి శుభ్రం చేసి, పేడపెట్టి అలుకుతుంది. ఆరోజు బహుశా ఆమె గురించి అత్తగారు గమనించి ఆలోచించడం ప్రారంభించి ఉండాలి కానీ, అరుంధతి ఎవరినీ గౌరవించే స్థితిలో కానీ, ఎవరినీ లెఖ్ఖ చేసే స్థితిలో ఉండదు...

ఇద్దరి మధ్యా ఆకర్షణ వెల్లువలా ఎప్పుడు గట్టుతెగి పోతుందేమోనన్న భయం ఇద్దర్నీ కట్టి కుదుపుతుంది. ఒకనాడు దేశం కోసం ప్రాణం అర్పించడానికి సిద్దపడ్డ ఆ సాహసి తనకోసం తనను వదులుకోలేక కన్నీరు కార్చడమేమిటి? అని ఆలోచిస్తుంది అరుంధతి. కానీ ఆమెలో వివేకం కన్నా ఆడతనం తాలూకు ఉద్వేగం ఎక్కువ. అందుకని ఇద్దరి క్షేమం గురించి, కుటుంబ క్షేమం గురించి ఆలోచించలేక పోతుంది.

వీరిద్దరి మధ్య అల్లుకున్న సున్నితమైన ఆకర్షణవలయం అల్లడంలో రచయిత్రి చాలా మంచి నేర్పు చూపిస్తారు. సంభాషణలలో నాటకీయత ఉంటుంది... స్పందన ఉంటుంది.

"కొన్ని విషయాలు చెప్పేవి ఉంటాయి. కొన్ని అర్థం చేసుకునేవి ఉంటాయి. అర్థం చేసుకునేవి చెబితే వాటి విలువ పోతుంది.."

"నీకు భగవంతుడి మీద నమ్మకం ఉన్నదా? నాకు లేదు. అందుకనే అడుగుతున్నాను..." రాజారావు అడుగుతాడు.

"ఉంది.."

"నీ భగవంతుణ్ణి ఒక కోరిక కోరుకో.."

"ఏమిటది?"

"నిన్ను నానుంచీ రక్షించమని, అమ్మకూ సీతాపతికీ ద్రోహం చెయ్యకుండా నిగ్రహించమనే శక్తి నాకు ప్రసాదించమనీ.."

గుండె నిబ్బరించుకోలేక, ఆ మాటల మధ్య స్పందించే వాంఛను, ఆరాధనను భరించలేక అక్కడినుంచీ పారిపోతుంది ఆమె. ఒక పక్క విప్లవం గురించిన మధన, సమసమాజం సృష్టించడానికి ఏ త్యాగానికైనా మనుష్యులు సిద్దపడాలన్న ఆదర్శాలు ఉన్న ఈ రచయిత్రి కలం అప్పుడప్పుడు కత్తిలా మారినా చాలా సౌందర్యవంతమైన హృద్యమమైన అమృతపు వెలుగుతో కలాన్ని నింపి అక్షరాలను వెలిగించి రచించగలరనిపిస్తుంది. దీనికి చాలా కరుణ, స్త్రీ హృదయం పెట్టే అలజడి, సామాజిక ముద్రపడని స్నేహాలను పెంచుకున్నప్పుడు ఎటు అడుగువెయ్యాలో తెలియని పరిస్థితి ఇచ్చే ఒత్తిడి గ్రహించగల నేర్పుకావాలి. హృదయానికి ఎంతో విశాలత, ఆలోచనలకు ఎంతో తెరిపి, విచక్షణ కావాలి.

ప్రేమ గురించి అరుంధతిలాంటి ఉద్వేగ స్వభావురాలికి చెపుతూ, రాజారావు -

"లేదు అరూ! నువ్వు పాపం చెయ్యడం లేదు. నువ్వు ప్రేమిస్తున్నావు. సృష్టి యావత్తూ ప్రేమ సూత్రం మీద ఆధారపడింది. మనం ఎన్నింటినో, ఎందరినో ప్రేమిస్తాము. కానీ, కొందరు మానవత్వాన్నే ప్రేమిస్తారు. ప్రేమించడం పాపం కాదు.
కానీ, ప్రేమ పేరుతో క్షణిక వ్యామోహాలకు లొంగిపోయి కర్తవ్య భ్రష్టులంకాకూడదు." అంటాడు.

"మీవంటి విప్లవకారులు కూడా ఇల్లాంటి మిధ్యాచారాలకు, సాంఘిక కట్టుబాట్లకూ, మూఢనమ్మకాలకు భయపడాలా?" అంటుంది అరుంధతి. ఆ మాటల్లోనే ఆమె అపరిక్వత, తనకు కావలసినదాన్ని పొందడానికి, విశృంఖలతకు విప్లవం అని పేరు పెట్టి పారిపోదామన్న ప్రయత్నం మనకు అర్థమవుతుంది.

తనకు కావలసినది తనకు దూరమౌతుంది అన్న కచ్చ ఉన్న అరుంధతి, తన భర్తనూ, అత్తగారినీ అర్థం చేసుకోవడం, వారి ఇష్టా ఇష్టాలను గమనించడం మానేస్తుంది. తనకూ, రాజారావుకూ మధ్య పెరుగుతున్న ఆకర్షణను వాళ్ళు గ్రహించుకోవడం వాళ్ళు చేస్తున్న పాపంలా భావిస్తుంది. ఎవ్వరినీ లెక్కచెయ్యనట్లు ప్రవర్తించి మరింత అనుమానానికి గురి అవుతుంది.

రాజారావును పోలీసులు అరెస్టు చేస్తారు. కానీ అతని మైకంలో ఉన్న అరుంధతి తన భర్త బస్తీ వెళ్ళి పోలీసులకు అతణ్ణి అసూయతో, కచ్చతో పట్టి ఇచ్చాడని అర్థం చేసుకుంటుంది.

కానీ పాపం సీతాపతి తన స్నేహితుడి మనోదౌర్బల్యం గ్రహించి, అతణ్ణి రక్షించుకోవాలని, దానికి అతని భార్యాబిడ్డలు ఆసరాగా ఉపయోగిస్తారని, ఆమెను ప్రాధేయపడటానికి వెళ్ళి ఆ మూర్ఖురాలు కాదనడంతో నిరాశగా వెనక్కు వస్తాడు. రాజారావును పోలీసులు తీసుకెళ్ళారని తెలిసి నిర్ఘాంతపోతాడు. తనను అపార్థం చేసుకుని దుర్భాషలాడిన భార్యకు "ఎందుకు సంజాయిషీ ఇచ్చుకోవాలి?" కచ్చ ఏర్పడుతుంది అతనికి. ఇది సాధారణంగా మనుష్యుల జీవితాల్లో జరిగే ప్రహసనమే. ఎదుటివారు నన్ను ఆమాత్రం అర్థం చేసుకోలేకపోయారా?" అన్న కచ్చతో, ఉక్రోషంతో మనం ఒక్కసారి ఎవరికీ పరిస్థితి విడమరిచి చెప్పాలనుకోము. అది ఒక్కొక్క మనిషి వారి వారి స్థాయికి తగ్గట్టుగా దానికి చిలువలు, పలువలు కల్పించి, ఊహించి మరొక కొత్త పరిస్థితి, మిథ్యాపరిస్థితి ఏర్పరుచుకుని అదే జీవితమని కొట్టుమిట్టాడతారు. ఈ మానసిక స్థితి తెచ్చే పరిణామాన్ని ఈ నవలలో ఒక మంచి మలుపుగా చాలా అద్భుతంగా ఉపయోగించుకున్నారు రచయిత్రి.

భార్యాభర్తలు ఎడమొగం పెడమొగంగా బ్రతుకుతూంటే చూసి కుమిలిపోతుంది శాంతమ్మ. సంవత్సరాలైనా ఆ దూరం తరగదు. భార్య దుఃఖం చూసి తను మరీ కరుకుగా ఉన్నానేమోనన్న జాలితో ఆమె గదిలో అడుగుపెట్టిన సీతాపతికి రాజారావు ఫోటో ఒళ్ళో పెట్టుకుని ఏడుస్తున్న భార్యను చూడగానే విపరీతమైన కచ్చ పెరిగిపోతుంది. అరుంధతిలోని మొండితనం, కచ్చ పరిస్థితులను సరిదిద్దకపోగా, వాతావరణాన్ని మరింత పాడుచేస్తుంది.

కానీ మనిషిలో మరొకరిని విపరీతంగా బాధపెట్టే బలహీనతలు, భావాలూ కొద్ది కాలంలో ఆ మనిషి దిగజార్పుకే కారణం అవుతాయన్నది రాజారావు విషయంలో నిజం అవుతుంది.

రాజారావు పోలీసులకు లొంగిపోయి ఇన్‌ఫార్మర్‌గా మారిపోయి తన ఆదర్శాలను మర్చిపోయి ఫక్తు రాజకీయవేత్తగా మారిపోతాడు. ఈ విషయం తెలిసి మరింత అసహ్యించుకుంటాడు సీతాపతి. ఆ దిగజారడంలో ఆదర్శపతనమే కాక, నైతిక పతనం కూడా అర్థం చేసుకుంటాడు. కానీ అరుంధతికి గుడ్డి ఆకర్షణలో ఈ "మార్పు" అర్థం కాదు.

తమ ఊళ్ళో గొప్ప రాజకీయవేత్తగా మారిన రాజారావుకు సన్మానం అని తెలిసి ఉద్వేగంతో గుండెలు దడదడలాడుతుండగా చూద్దామని బయలుదేరుతుంది అరుంధతి. ఆ ఆక్షణంలో ఆమెకు "రాజారావు దర్శనం" తప్ప మరేమీ కావాలనిపించదు. క్షణంలో తీసుకునే ప్రతి నిర్ణయం ఆమె జీవితానికి శాపంగా మారుతుంది.

"ఇల్లు కదలడానికి వీల్లేదనీ అక్కడికి వెళితే మళ్ళీ ఈ ఇంట్లో స్థానం ఉండదనీ" కాలరుద్రుడిలా అరుస్తూ చెప్తాడు సీతాపతి. కానీ ఆ మూర్ఖురాలు భయపడదు. అస్సలు పరిణామాల గురించి ఆలోచించదు. "ప్రపంచంలో మరేమీ లేదు, రాజారావు సాన్నిధ్యం తప్ప" అనిపిస్తుంది.

"నువ్వెందుకు వచ్చావు? వాడేడీ?" రాజారావు మీటింగ్ తర్వాత అడిగిన మొదటి ప్రశ్న అది. తన ప్రేమికుడిలోని లౌక్యుణ్ణి మొదటిసారిగా, లీలగా గుర్తించగలుగుతుంది ఆమెలో కొద్దిగా మిగిలిన వివేకం.

"నువ్వు ఇంటికి వెళ్ళు, ఇంట్లో వాళ్ళు ఒద్దంటే రాకు.." అని ఆమె సంసారంలోకి ఆమెను తిరిగి పంపించేసి బాధ్యత ఒదిలించుకుంటాడు రాజకీయవేత్త రాజారావు.

బలవంతంగా తన ఇంటిలో అడుగుపెట్టలేనని, ఆ ఇంటి తలుపులు తనకు శాశ్వతంగా, మూసుకు పోయాయనీ తెలిసి చుట్టుపక్కల జనం వింతగా చేరడం చూసి అరుంధతిలోని రాక్షసత్వం నిద్రలేస్తుంది. రాజారావు దగ్గర తగిలిన దెబ్బ గుండెమీద పచ్చిగా ఉండి ఈ పరిస్థితి వల్ల మరింత కచ్చగా మారుతుంది.

"ఈ ఇంట్లో నీదేం లేదు.." అన్న భర్తతో చాలా అసహ్యాకరమైన స్థితికి దిగజారి, మానవత్వం, మాతృత్వంకూడా మరిచిపోయి, అతడి మనసు మీద దెబ్బ తీయడం ఒక్కటే ముఖ్యంగా పెట్టుకుని

"ఈ బిడ్డమాత్రం నీదా? నీకు పుట్టిన బిడ్డ కాదు.." అని భయంకరమైన అబద్ధాన్ని అరిచి మరీ చెబుతుంది అరుంధతి. ఆమెలో ఆ క్షణంలో "తల్లితనం" ఉండదు. కేవలం అరిషడ్వర్గాలు త్రాచుల్లా తలెత్తిన స్త్రీ మూర్తి అంతే. తను ఉచ్చరించిన మాటలు తన బిడ్డకు ఏ ద్రోహం చేస్తాయో తెలియని మూర్ఖత్వంతో రాజారావును వెతుక్కుంటూ వెళ్ళిపోతుందామె.

కానీ అతడు ఆమెను తిరిగి వెనక్కివెళ్ళమనే అంటాడు. సంసారం చెడగొట్టుకోవద్దని లౌక్యంగా చెపుతాడు. పరస్త్రీతో స్నేహం రాజకీయంగా అతని పలుకుబడికి దెబ్బ అని, మొండికేసిన ఆమెను ఎలక్షన్ అయ్యేవరకూ మిసెస్ వైకుంఠం ఆశ్రయంలో ఉండమంటాడు. అప్పటికి అరుంధతిలో ఆత్మాభిమానం సహనం పోయాయి. తను ఈ 'అర్థింపు' స్థితికి
ఒకప్పటి ఇల్లాలితనం నుంచీ ఎలా దిగజారిపోయానా? అన్న మథన లీలగా ఉన్నా ఆమెను జీవితం, అహంకారం సరిగ్గా ఆలోచించనివ్వవు.

మిసెస్ వైకుంఠం ఇంట్లో జరిగే ఆడపిల్లల వ్యాపారం, సంఘసేవ కింద జరిగే దగుల్బాజీ పనులు, తనను ఆ ఇంట్లో ఉంచి రాజారావు వచ్చి చూసిపోవడమూ ఆమెకు తన "స్థితి" తెలియచేస్తాయి.

రాజకీయంగా రాజారావు ఎదుగుతాడు. అతణ్ణి అడ్డంపెట్టుకుని అరుంధతి లక్షాధికారిణి అయిపోతుంది. కానీ ఆమెకు మనుష్యులంటే జుగుప్స, కోపం. తనకు రాజారావు మీద హక్కు లేదనే సాంఘిక కట్టుబాట్లు, వీటిమీద విపరీతమైన ద్వేషం - ఇవన్నీ అరుంధతిని బ్రహ్మరాక్షసిలా మారుస్తాయి. ఎంతగొప్ప వారినైనా, తన గేటు దగ్గర కుక్కలా కాపలా కాయించి ఆనందిస్తుంది. రాజారావు చేత రాజకీయ లాభాలు పొందాలనుకునేవారు ఆమె ముందు లక్షలు గుమ్మరిస్తారు.

కానీ ఆమెకు మనశ్శాంతి ఉండదు. రాజారావుకు ఉండనివ్వదు. ఆమె అహంకార దర్పాన్ని కొంచెం సడలించుకుని మంచి పేరు తెచ్చుకోమన్నాడని అతని మీద విరుచుకుపడుతుంది. ప్రతి మీటింగుకూ అతని ఆదర్శాలమీద కానీ, అతనిమీద కానీ ప్రేమా గౌరవం రవ్వంత లేని అతని భార్య అధికారహోదాలోకి వెళ్ళగలగడం, అతనికోసం సర్వం త్యాగం చేసిన తను చాటుగా "అతని తాలూకు మనిషిగా బ్రతకవలసి రావడం,ఈ పరిస్థితిలో ఏమాత్రం అసందర్భం లేనట్లు రాజారావు ప్రవర్తించడం ఆమె భరించలేకపోతుంది తను కనీసం అతని ప్రాపకంలో ఒక ఎమ్.ఎల్.ఏ కూడా కాలేదని తెలుసు ఆమెకు. ఎప్పుడు ఆమెను చూడటానికి వచ్చినా, తనలో గిల్టీకాన్షియస్ నిద్రలేపి, మాటలతో చిత్రహింస పెట్టే ఆడదాని సన్నిధిలో "అలనాటి ఔన్నత్యాలు" ఊహించుకుంటూ బ్రతికే త్యాగం, అవసరం ఏ మగవాడికీ ఉండవేమో... పైగా లౌక్యుడు, రాజకీయవాది అయిన రాజారావు అవకాశం కోసం ఎదురుచూసి చాలా మెత్తగా ఆమె జీవితం నుంచీ తప్పుకుని ఒంటరిదాన్ని చేసి వెళ్ళిపోతాడు.

ఇంక ఇంతకాలం అహంకారంతో ఆమె అవమానించిన వ్యక్తులందరూ ఆమెను ఏ బలం లేకుండా చేసి హేళన చేస్తారు. కనీసం పనివాళ్ళను కూడా ఏ నిమిషం ఆదరంగా చూడని ఆమెకు అంతటా శూన్యమే మిగులుతుంది.

ఆస్థితిలో ఆమెకు ఫోన్‌కాల్ వస్తుంది. ఆమె కూతురు, పదిహేనేళ్ళ క్రితం వదిలిపెట్టిన మాధవిని చూడాలంటే ఆ అర్థరాత్రి పన్నెండు గంటలకు రావాలనీ లేకపోతే జీవితంలో మరెప్పుడూ ఆమెను చూడలేవనీ అంటాడు అవతల వ్యక్తి.

వెళుతుంది అరుంధతి భయంగా, బాధగా. ఇన్నాళ్టికి ఆమెలో ఎక్కడో దాగి ఉన్న మాతృత్వం నిద్రలేస్తుంది. తన బిడ్డ మంచి బొమ్మ, తండ్రి శిక్షణలో పెరిగిన పరమపవిత్రమైన దేవతామూర్తిలా ఊహించుకుంటూ వెళుతుంది.

శవాకారంలాంటి తన భర్తను మృత్యుగుహలా ఉన్న ఇంట్లో చూస్తుంది. అతను మాటలతో చిత్రహింస పెడితే భరిస్తుంది. తన బిడ్డను చూపమని ప్రాధేయపడుతుంది.

"ఆబిడ్డ ఎవరి బిడ్డ? ఇప్పటికైనా నిజం చెప్పమంటా"డు ఆమె భర్త.

"నీ బిడ్డే ఆ నాడు కచ్చతో అబద్దం చెప్పాను." అని ఒప్పుకుంటుంది. ఏడుస్తూ అరుంధతి. "నువ్వు రాజారావును పోలీసులకు అప్పగించావనీ నాకు దూరం చేశావని కచ్చ నాకు," అంటుంది. అతను చెయ్యని ఆ నేరం, ఊహతో ఎంత ఊపిరిపీల్చుకుందో ఎంత సర్వనాశనాన్ని సృష్టించినదో ఇద్దరూ తెలుసుకుంటారు. కానీ అప్పటికే జీవితకాలం లేటు అయింది. పశ్చాత్తాపంతో జీవితాన్ని సరిదిద్దుకునే ఛాన్సు అందరికీ ఉండదు.

మాధవి పెళ్ళి కాకుండానే గర్భవతి అయి బిడ్డను కని చనిపోయింది. పదహారేళ్ళు కూడా నిండని ముక్కుపచ్చలారని తన బిడ్డ తను ఆడిన అబద్దంవల్ల, తండ్రి ప్రేమకు దూరం అయి మృత్యుదేవత చల్లని ఒడిలోకి వెళ్ళిపోయింది.

దెబ్బతిన్న పావురంలా గిలగిలలాడుతూ ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా గుంటూరు హాస్పటల్‌కు తన మాధవి బిడ్డ అనాధగా ఉంచడం ఇష్టంలేక అమ్మమ్మగా పెంచాలని పరిగెడుతుంది అరుంధతి.

ఇక్కడ ఒక హృద్యమమైన సన్నివేశం వర్ణిస్తారు రచయిత్రి. అసలు మనుష్యుల పట్ల వాత్సల్యం, తన కింద పనిచేసేవాళ్ళ పట్ల ఏమాత్రం మానవత్వం ప్రకటించదు అరుంధతి. ఆమెకు వాళ్ళను బానిసలుగా చూడటం అలవాటు. కానీ ఆమె అంత దుస్థితిలో, డ్రైవరు చెలమయ్య ఆమె ఆకలి, అలసట గమనించి ఆమెకు సేవ చెయ్యడం చూసి, మొదటిసారిగా ఆమెలో మానవత్వం నిద్రలేస్తుంది. అటు భర్త, ఇటు ప్రియుడు, మరెందరో పరిచయస్థులు తేలేని మార్పు ఆమెలో ఉన్నట్లుండి సూర్యకాంతిలా ప్రతిఫలిస్తుంది. పరేంగిత జ్ఞానం రేకులు విప్పుకుంటుంది. ఆమె పుట్టి బుద్దెరిగిన తరువాత తన కోసం నిష్కామంగా, నిండు మనస్సుతో బాధపడిన వాళ్ళు ఎవరూ లేరు.
తండ్రికి తను రొమ్ముమీద కుంపటే. భర్త తనను ఒక పువ్వులా చూశాడు. మనిషిగా చూడలేదు. రాజారావు ప్రేమించి ఆరాధించినా, తన స్వార్ధానికి ఆమె భవితవ్యం బలిపెట్టాడు.

తండ్రి, భర్త, ప్రియుడు - ఈ ముగ్గురూ ఇవ్వలేనిదేదో ఈనాడు డ్రైవరు ఇవ్వగలిగాడు. ప్రకృతిలో సహజంగా పురుషుడు, స్త్రీకి ఇచ్చేదానికి చాలా భిన్నమైనదేదో దాన్ని ఇచ్చాడు. ఒక వ్యక్తి మరో వ్యక్తికి, ఒక మానవుడు మరొక మానవుడికి ఇవ్వగలిగింది అదే అయినా అది అందరూ ఇవ్వలేనిది. అలాంటి సహృదయత, కరుణ, సానుభూతి, మానవతా ఆమెను మొదటిసారిగా ఆలోచింపచేశాయి.

ప్రశాంతంగా కళ్ళు మూసుకున్న ఆమెకు, మారిపోక ముందు రాజారావు కలలుకన్న సమసమాజం, అతని ఆదర్శాలూ గుర్తుకు వస్తాయి. తను తన మనుమరాలికి "సమత" అని పేరు పెట్టినట్లు, చెలమయ్య బిడ్డా సమత కలిసి ఆడుకుంటున్నట్లు తను ఒక సమసమాజాన్ని స్థాపించినట్లు పగటి కలలు కంటుంది. అదే తన జన్మరాహిత్యం అనుకుంటుంది.

కానీ విధి ఆమెకు అంత సులభంగా ఆ "కల" నిజం కానీయదు. హాస్పటల్ స్ట్రయిక్‌లో పోలీసుల కాల్పుల్లో దెబ్బతిని పడిపోతుంది అరుంధతి. చచ్చిపోతూ, తన ఆస్థిని పేద ప్రజానీకానికీ వారిలో ఒకరిగా పెరగబోయే తన మనుమరాలు "సమత" కు అందజెయ్యమని కోరుకుంటుంది.

"నేను చూడలేని "సమత"ను మీరు పెంచి పెద్దచెయ్యండి" - అని కోరుకుంటూ కన్నుమూస్తుంది.

ఆశోపహతురాలైన ఆమె తెలుసుకున్న జీవన సత్యం మన కంట తడిపెట్టిస్తుంది. సెక్స్, విప్లవవాద కథలు చదివి, పరిస్థితులు అర్ధంచేసుకోకుండా సంఘం మీద తిరుగుబాటు చేసిన సంసార స్త్రీకి మనదేశంలో సంప్రాప్తించే అంత్యపరిణామాన్ని వర్ణించడంలో చాలా పాటవం చూపించారు రచయిత్రి. ఈ నవలలో సీతాదేవిగారు విప్లవాన్ని విప్లవవాదులను గౌరవించి, వారిగురించి అద్భుతంగా రాసారు. అవి సరిగా అర్ధంచేసుకోకలేకపోయినా, ఆదర్శాలు కాక, అవి మాట్లాడ్డం వల్ల వచ్చే ఏదో కొత్త గ్రూపిజం, స్వాతంత్ర్యం మాత్రం కావాలనుకునేవారి జీవితం కత్తి మీద సాముగా మారుతుందని, చాలా అద్భుతంగా ప్రారంబమైన గొప్ప ఉద్యమాలు ఈ అవగాహన లేకపోవడం వల్ల భ్రష్టత పట్టవచ్చు అన్న వివరణ ధైర్యంగా సూచించారు రచయిత్రి. అజ్ఞానం, అమాయకత్వం మంచిది కావేమో కాని అవగాహన లేని ఆదర్శం, విప్లవం గుడ్డివాడి చేతిలో రాయిగా మారే ప్రమాదం ఉంటుంది.

ఈనాడు ఈ రాజకీయ చదరంగంలో ఎందరో అరుంధతులు... మనకు నిత్యం తటస్థపడే అనేకమంది స్త్రీ మూర్తులలో అరుంధతి ఛాయలు మనకు కనిపిస్తూనే ఉంటాయి. రాజకీయ చదరంగంలో "పావు"గా మార్చబడే ప్రతిస్త్రీమూర్తి ఒక్కోసారి "సమత"లోని అరుంధతిని చదివి తెలుసుకోవడం మంచిదేమో.

****

## దాశరథి రంగాచార్య "చిల్లరదేవుళ్ళు"లో 'నీరజ'

**"తన పేరు నీరజ.** అది అందమైనదని దానికి అర్థం తామరపూవనీ తెలియపరచింది అతడే అతణ్ణి ప్రేమించింది తను. వలచింది, వరించింది. కానీ తానెవరు? "దాసి", "ఆడబాప." వేశ్య అని అర్థం. వేశ్య డబ్బుకై తను తనువును అమ్ముకుంటుంది. కానీ తన బ్రతుకు అంతకన్నా నికృష్టమైనది. తన తల్లి, ఆచారాలు తనను అమ్మివేశాయి. జంతువును అమ్మినట్లు, తాను బ్రతికి ఉన్నన్నాళ్ళూ ఈ దొరకు బానిసే. తాను వేశ్య కంటే కడుహీనం. వేశ్య తను "ఒద్దు" అనుకుంటే, తనకు డబ్బు అవసరం లేదనుకుంటే, తనను తాను అమ్ముకోవాల్సిన పనిలేదు. కానీ, తాను? తనకు ఇష్టం ఉన్నా, లేకున్నా, అవసరం ఉన్నా లేకున్నా, అర్పించేయాల్సిందే కోరినవారికి, "గడి"కి వచ్చినవారికి

(మేడకు వచ్చినవారికి). ఇది గుండె లేని జీవితం. ఇట్లాంటి జీవితాన్ని కోరి తెచ్చుకునేవారెవ్వరూ ఉండరు. అది వచ్చిపడినప్పుడు అందులోని కుళ్ళును గ్రహించి, దాన్నుంచి బైటపడాలన్న ఆలోచన ఉన్నవారు కూడా తక్కువే. అతడు వచ్చాడు. తనకు బ్రతుకుకూ, ప్రేమకూ అర్థం తెలిసింది. తాపత్రయం పెరిగింది. ఈకుళ్ళులోంచి బైటపడాలని నాటినుంచీ మథనపడుతుంతోంది తాను. కానీ.. దైవంలాంటి వాడికి కుళ్ళిన పండులాంటి తనను ఎలా అర్పిస్తుంది? తన వృత్తాంతమంతా అతడికి చెపితే, చెయ్యి జారిపోతాడు. ఎలా?!" ఇలా తనలో తాను విపరీతంగా మథనపడుతూ, దుఃఖపడుతూ దాశరథిరంగాచార్య కలం నుంచీ కన్నీరు బొమ్మగా, కలల పూరెమ్మగా రూపొంది, అక్షర రమ్యత, హృదయార్థభావనతో నీరజగా శాశ్వతరూపం దాలుస్తుంది. సంఘ పరిరక్షణలో ఉంటూ, గౌరవించబడుతున్న స్త్రీ జనం, జనానాల్లో, గ్రామాలలో అమాయక పాటక జనాన్ని భయపెట్టి, హింసించి, హత్యలు చేసి, ఆత్మహత్యలకు కారకులైన చిల్లరదేవుళ్ళుగా చలామణి అయిన అమానుష ప్రభువుల మేడల్లో సార్థపూరిత సంఘువాదానికి అనువాదానికి ప్రతీకగా మిగిలిన ఆడపాపల బ్రతుకులు గురించి తెలుసుకుంటే, తమకు ఉన్న స్వాతంత్ర్యం అర్థం చేసుకోవచ్చు.

తెలంగాణా దొరల గడి అంటే భవంతి. అక్కడ ప్రభువు కన్ను పడిన ఆడదల్లా బానిసై పోతుంది. ఆడపాపగా, ఆ గడికి వచ్చే ప్రతి అతిథికి, అభ్యాగతికి శారీరక ఆహారమవుతుంది. మనసును చంపేసుకుంటుంది. అది ఇంతటితో ఆగదు. ఆమెకు పుట్టే బిడ్డలకు కూడా స్వతంత్ర్యం ఉండదు. వారికి ఆడపాపతనం వారసత్వంగా సంక్రమించాలన్నది శిలాశాసనం. ఈ సాంఘిక (అవ) మర్యాదను ఎదిరించి బ్రతికేవాళ్ళుండరు.

సారంగపాణి, రెడ్డిగారింటికి పొట్టచేతపట్టుకుని ఆదరణకు వస్తాడు. అతడి హృదయ సౌందర్యం అంతగా అర్థం కాకపోయినా, అతని నమ్రత, సంగీత పరిజ్ఞానం, లాలిత్యం, అమోఘమైన తెలివితేటలు రెడ్డిగారిని ఆకట్టుకుంటాయి. అతణ్ణి గడిలో అతిథిగా ఉంచుకుంటాడు. గడిలో ఆడపాప నీరజ అతని సేవలకు నియమించబడుతుంది రెడ్డిగారి భార్యకు, బిడ్డకు ఘోషా, ఆడపాప మాత్రం ఎంగిలి విస్తరి.

" నీరజ, నీపేరు అర్థం తెలుసా? తామరపువ్వు..!! ఎంత అందమైనది నీపేరు?" - తనను వాంఛించకుండా, నీచమైన దాసీదానివి అని గుర్తుచెయ్యకుండా, తనను మొట్టమొదటిసారిగా జీవితంలో "మనిషి"గా గుర్తించి మాట్లాడిన మొదటి వ్యక్తి పాణి.

నీరజకు ఒక్కసారిగా తన జీవితమంతా గుర్తుకు వస్తుంది. తాను పుట్టిందీ, పెరిగిందీ ఈ గడిలోనే. ఇక్కడే చాకిరీ చేస్తూంది పశువులా. తిండిపెడతాడు దొర. తిండి పెట్టి పశువులా చాకిరీ చేయించుకున్నా బాగుండేది. కానీ, తాను వారికి విలాస వస్తువు. దొరలెవరైనా వస్తే వారి గదుల్లోకి భోజనాలూ, ఫలహారాలూ మోసుకెళ్ళాలి. అవి అక్కడ పెట్టి వస్తే సరిపోతుందా? వారి పశువాంఛకు లొంగిపోవాలి. కిమ్మనకూడదు. ఇదీ తన బ్రతుకు ఈ కుళ్ళు నుంచీ దూరం కావడానికి గడి వదిలి పారిపోయినా, తిరిగి తెప్పిస్తాడు దొర.

ఆ మొదటి రాత్రి... ఇందిరమ్మ దొరసాని తమ్ముడు ఇంద్రారెడ్డి వచ్చాడు. వేటకు వెళ్ళి ఎనుబోతును కొట్టి తెచ్చాడు. జీతగాండ్లు దాన్ని కోసి కుప్పలేశారు. తలంటిపోసింది తల్లి తనకు. పాలపిట్ట చీర కట్టించింది దొరసాని. కడుపు నిండా దగ్గర కూర్చుని తిండి పెట్టింది. విపరీతంగా తాగారు దొరలు. ఫలహారాల పళ్ళెం ఇచ్చి గదిలోకి పంపింది దొరసాని. తన తల్లి కళ్ళు చెమ్మగిల్లడం గమనించింది తను. భయపడితే గద్దించింది దొరసాని. తనను చూడగానే "రావే ఒయ్యారి" అని దొర చెయ్యి పట్టుకు లాగాడు. భయపడి, కేకవేసి తల్లి మీద పడి పెద్దగా ఏడ్చింది. తన తల్లి కన్నీరు మున్నీరుగా బలవంతంగా గదిలోకి తోసింది - ఆ దృశ్యం తలుచుకుంటూనే ఆమె ఒళ్ళు జల్లుమంటుంది. ఆనాటి నుంచీ గడికి వచ్చిన దొరల్లో చాలామంది ఆమెనే కోరుకునేవారు. తనమీద పిడుగు పడినట్లున్నా, యంత్రవతుగా వ్యవహరించాలి. ఇందరూ, తనను అత్తరులా, పన్నీరులా, సారాయిలా వాడుకున్నారే కానీ, ఒక్కరైనా పాణిలా మనసుకు నచ్చే మాటలన్నారా?!

కానీ, ఆడపాప గుండెల్లో గుబులు , ప్రేమ, దుఃఖం ఎవరికి కావాలి?!

ఆమె నీరజ. పంకంలో పుట్టిన పంకజం. ఒకరి దుఃఖాన్ని పంచుకోలేని జీవితం ఏం జీవితం? తానెవరికోసం దుఃఖపడగలదు? ఎవరున్నారు తనకు? దొర తిండిపెడతాడు. జబ్బు చేస్తే మందిప్పిస్తాడు. కానీ, దొరకు తానేమీ కాదు. ఎవరికీ ఏమీకాదు. తల్లి చనిపోయినప్పుడు వచ్చిన దుఃఖం మరెవరికోసమైనా వస్తుందా?!

ఈ స్వగతం చాలా గొప్పది. ఆడపాపగా మనసనేది ఒకటుంటుందని తెలియని పల్లె బానిసలో ఇంత గొప్ప ఆలోచనా సరళి కేవలం నిష్కల్మషంగా పాణిలాంటి సహృదయుడి ఆదరణవల్ల కలుగుతుంది. ఇది ఎంత గొప్ప ఫినామినన్?! ఎంతో డబ్బు, ఎన్నో సుఖాలు మనిషికి ఇవ్వలేని అనుభూతి కేవలం నిష్కామమైన ఆదరణ ఇస్తుందన్న సత్యాన్ని ఎంత సున్నితంగా చెప్పారు రచయిత!

సారంగపాణి, కరణం ఉంపుడుగత్తె కూతురు తాయారుకు వయొలిన్ పాఠాలు చెపుతాడు. నారయ్య కూతురు సీత నమ్రత అతనికి నచ్చుతుంది. తాయారులో విశృంఖలత, నైత్యం అతనికి అర్థమౌతుంది. ఇంత మందిలో ఆడపాప నీరజ మాత్రం ఎంతో ఆప్యాయంగా "ఏదో కొత్త గుండె వచ్చి రొమ్ములో చేరినట్లు మాట్లాడుతుంది" అనుకుంటాడు పాణి.

కరణంలో నైత్యం, రెడ్డి ప్రభువులలో క్రౌర్యం, తురక స్వామాజ్యంలో, మాల మాదిగల్ని తురకలుగా మార్చాలన్న ప్రయత్నం, వారికి ఎదురు పోరాటంగా ఆర్య సమాజం వారి ప్రయత్నాలు, వీటన్నింటి మధ్య తమకేమిటి లాభం? అని ఆలోచించే ఈ చిల్లర ప్రభువులు - వీళ్ళందరిలో ఎంత విషం? ఎంత అగ్గి?!

తట్టుకోలేక సతమౌతాడు పాణి.

పట్నం వెళ్ళినప్పుడు రెడ్డిగారి ఆజ్ఞగా అందరికీ అన్నీ తెస్తాడు పాణి. వెళ్ళేముందు "నీకేంకావాలి?" అని అడిగిన అతణ్ణి ఆశ్చర్యంగా చూస్తుంది నీరజ. తనను మనిషిగా ఆ ప్రశ్న అడిగినవారే లేరు. తనకు మబ్బు నీలం చీరంటే మనసు. కానీ, ఎవర్ని అడుగుతుంది. దొరసానులు ఇష్టపడి ఇచ్చేవే తను కట్టుకోవాలి కానీ, తనకేమి ఇష్టాలు? ఇప్పుడు ఆ విషయం పాణికి చెప్పినా, ఎంత ఖరీదవుతుందో ఆ చీర? దొర పంతుల్ని ఎందుకు తెచ్చావని నిగ్గదీసి, నిందితుణ్ణి చేస్తే?! తన తీరకపోయినా ఫరవాలేదు. ఆ దేముడిని ఎవరూ నిందించకూడదు అనుకుంటుంది నీరజ. అందుకే -

"గులాబీ పూవులు కావాలి" అంటుంది ప్రేమించిన మనస్సు. ప్రేమించిన వ్యక్తిని కాపాడుకోవడానికి ఇబ్బందుల్లో, ఇరకాటాల్లోనించీ రక్షించుకోడానికి ఎన్ని ప్రయత్నాలు జరుగుతాయో గొప్ప గొప్ప సంస్కారవంతులైన నాయికా నాయకుల విషయంలో నిజమవ్వచ్చు. కానీ, దిక్కులేని ఆడపాపలో ఈ ఆలోచన నిద్రలేవడం ఆశ్చర్యంకదూ?! అందుకే, అద్భుతమైన అనుభూతులకు జాతి మతాలు, ఆర్థిక వ్యత్యాసాలు, ఖగోళ పరిధులు అడ్డుపడవు అన్న దైవీకమైన చట్టం ఒకటి ఎప్పుడూ ప్రవరిల్లుతూనే ఉంటుంది. దాని ఆధారంగానే కళలు, కథలు, కావ్యాలు, కన్నీళ్ళ మేడలుగా నిర్మించబడ్డా కలకాలం నిలబడతాయి ఈ కలికాలంలో కూడా.

రెడ్డి దొర కూతురు మంజరి పాణిని ప్రేమిస్తుంది. పాణి కూడా ఆమె సౌందర్య సౌకుమార్యాలకు ముగ్ధుడవుతాడు. గమనించి, నిర్ఘాంతపోయినా పెదవి విప్పలేదు నీరజ.

"అవునూ?! రెడ్డిగారి అమ్మాయి మంజరికి నీకూ కళ్ళమెరుపుల్లో అన్ని పోలికలున్నాయేమిటి? " అన్న పాణి మాటలకు ఉలిక్కిపడి, దుఃఖపడి పారిపోతుంది ఆ పిచ్చి తల్లి.

ఏం సమాధానం చెపుతుంది?

ఆమె తల్లి కొత్త పెళ్ళికూతురిలా భర్తతో కలిసి వీధి దాటుతుంది. పరాయి ఊరువాడైన ఆమె భర్తకు రెడ్డి ప్రభువులు వాకిట్లో ఉంటే, దాటిపోవడం నిషిద్ధమని తెలియదు. అంతే, అతణ్ణి పిలిపించి, రెక్కలు పెడకట్టి, అందమైన అతని భార్యకు గర్భాదాన ముహూర్తం తానే పెడతాడు రెడ్డి. ఆమె భర్త చంపబడ్డాడు. ఆమె మానం అమానుషంగా దోచబడింది. దిక్కులేక ఆడపాపగా మారింది. ఆ భయంకారానుభవానికి ఫలితమే నీరజ. తల్లులు వేరైనా, తండ్రి ఒకడే కనుక దొరసానికి ఆడపాపకు పోలికలుంటాయి మరి.

తన భార్య, తన బిడ్డకు ఒక సాంఘిక నీతి, దిక్కులేని దానికి తనవలన కలిగిన బిడ్డ పట్ల అమానుషమైన మరొక నీతి - ఇదే ఆనాటి తెలంగాణా ప్రభువుల నీచపు శాస్త్రం. పట్నం నుంచీ తను తెచ్చిన గాజు బిందెల్లో ఒకదాన్ని చెయ్యి జార్చి బద్దలు కొట్టినవాడి ఒళ్ళు విరగకొడతాడు రెడ్డి. తిండిలేక డొక్క మాడేవాడిపై ఏనుగుల్ని తిని ఏనుగంత బలం గలవాడికి ఇంత క్రౌర్యం సంపదతో వస్తుందా?

"శుచీనాం శ్రీమతాంగే హే యోగ భ్రష్టాభిజాయతే.." సంపదలు యోగ భ్రష్టుడైనవాడికి అబ్బుతాయట. మరి యోగభ్రష్టుడు ఇంత క్రూరంగా ఉండగలడా? కృష్ణ భగవానుడు చెప్పిందే తప్పుకాదు కదా-" అనుకుంటాడు పాణి.

రాజభవనాలు కుట్రలకు అలవాలాలయ్యాయి. అవినీతికి అకరాలు, అక్కణ్ణించే నీతి, శాసనమూ పుడతాయి. అవి అమానుషంగా మనుష్యుల మానప్రాణాల్ని శాసిస్తాయి. అర్థమౌతుంది పాణికి తన ప్రశ్నకు జవాబుగా కన్నీరు కుక్కుకుంటూ పారిపోయిన ఆడపాప నీరజ కథ.

నీరజకి పాణి మీద ప్రేమ ఆరాధనా భావం పెరిగిపోతుంది. ఆమెను చంపినా అది చచ్చేది కాదు. కానీ, దీనికి పరిష్కారం ఏమిటి? ఆలోచనా మథనలో నిన్నటి రాతి మనిషి నేడు దేవతైపోతుంది.

"అన్నయ్యా!" అంటుంది నీరజ పాణిని.

ఆశ్చర్యపోతాడు పాణి. అది పట్నవాసపు సీతాకోకచిలకల అవకాశవాదపు అనుబంధం కాదు; ఆధ్వని వేరు:

"నేనంటే ప్రేమ లేదా?" పరిశీలిస్తూ అడుగుతాడు పాణి.

"కండ్ల పోలిక చెప్పిన దినం నుంచీ నా కథ తెలుస్తుందని నీ కండ్ల బడకుండా తిరిగిన. నీ మీద ప్రేమ, ప్రేమ లేకుంటే బతకలేననుకున్నా. దేవుని వంటి నీకు మచ్చబడిన మనసు ఇయ్యొద్దనుకున్నా. నీకు చెల్లెలైదామనుకున్నా. "అన్నా" అని కౌగిలించుకోవాలనుకున్న.." అంటుంది కన్నీరు జలజలా రాలుస్తూ నీరజ. ప్రేమ, ఆప్యాతలు ఉన్నాయి. కానీ, వాటికి శారీరక సంబంధం నిషిద్ధమైనప్పుడు అది స్నేహంగా మాత్రం మిగులుతుంది. కానీ, నిజమైన స్నేహాన్ని గౌరవించుకునే స్థితికి సంఘం ఎదగనప్పుడు స్నేహపరిధి హక్కుల్ని, బాధ్యతల్ని కూడా పొందదు. అటువంటప్పుడు అండ, రక్షణ ఇచ్చే హక్కు అతని నుంచీ పొందాలంటే, అది నీచంగా సృష్టించబడ్డకూడదంటే "సోదర భావం" తప్ప దారిలేదని పాపంలో పుటినా గ్రహించుకోగలుగుతుంది ఆ పవిత్రమూర్తి.

తన కూతురు మోజుపడి వీణ నేర్చుకుంటాననంటే, బిడ్డమీద మమకారంతో ఒప్పుకున్నా, తన బిడ్డ మోజు ఎటు తిరుగుతుందోనన్న భయంతో నీరజను పాణికిచ్చి పెళ్ళి చెయ్యాలనుకుంటాడు రెడ్డి. దానివల్ల, తన కూతురు మంజరికి అతనిమీద మోజు పోతుందనుకుంటాడు. కానీ, కమనీయమైన ఆర్ద్రతలు, కసాయి ప్రేమలకు లొంగవని అతనికి అర్థంకాదు.

ఆ విషయం విని ఉలిక్కిపడుతుంది నీరజ.

"నువ్వేమన్నావ్ చెల్లాయ్?" అడుగుతాడు పాణి.

"ఎందుకనలే నేను అన్నయ్యనని?" అని నిలదీస్తాడు.

"అసలే.. ఆడబాపగానే బ్రతకాల్సొస్తదని..." అంటుంది చెమ్మగిల్లిన కళ్ళతో.

పాణి గ్రహిస్తాడు ఆమె భావన. ఎంత దూరం ఆలోచించగలిగింది? పెళ్ళి ఒద్దంటే ఆడపాప అవ్వాలి. అంతమాత్రం చేత అన్నయ్యను పెళ్ళి చేసుకోలేదుగా. అందుకనే,

"మనిద్దరం అన్నాచెల్లెళ్ళమని ఎవ్వరికీ ఎరిక కాకూడదు" అంటుంది.

కానీ, దొర ఈ వివాహ విషయం చెప్పగానే మంజరి మీద పిడుగుపడినట్లౌతుంది. అమాంతంగా నీరజను పీకనులిమి చంపెయ్యాలనుకుంటుంది. ఇంతపెద్ద దేశ్‌ముఖ్ కూతురు, ఒక దాసీదాన్ని వెళ్ళగొట్టలేదు అని దుఃఖపడుతుంది. నీరజమీద ద్వేషం పెంచుకుంటుంది. నిస్సహాయతలోనించీ దుఃఖం వచ్చింది. క్షణంలో గడిలోని స్త్రీ జనం యావత్తు పోగైంది. మంజరి కళ్ళు తిరిగి పడిపోయింది.

నీరజ ఆమెను ఏదో చేసింది అన్న అనుమానం అందరికీ.

"ఏం చేశావో చెప్పు నా బిడ్డను.." అని నీరజను గొడ్డును బాదినట్లు బాదాడు రెడ్డి. అడ్డమెళ్ళి ఆ దెబ్బలకు పడిపోయాడు పాణి. మంజరికి స్పృహ తెలిసేటప్పటికి అతడిని ఆప్యాయంగా పొదవి పట్టుకు వెళుతున్న నీరజ కనబడి ఆమె గుండెలు మరోసారి మండుతాయి. వెళ్ళిపోదామనుకున్న పాణిని రెడ్డిగారి అభ్యర్ధన ఆపుతుంది. కానీ మంజరి మరింత అస్వస్థురాలౌతుంది. పాణి గానం ఆమెను తేరుకునేటట్లు చేసినా, వెంటనే నీరజ గుర్తుకురాగానే ద్వేషం ప్రబలి పాలు తెచ్చిన ఆమె చెంప పగలగొడుతుంది మంజరి.

తనకోసం కుమిలిపోతున్న మంజరికి నిజం చెప్పాలని ఎదురుచూస్తాడు పాణి.

కానీ, చింతకాయల దొంగతనానికే, ఉద్రేకంతో పేరిగాడ్ని చంపుతాడు రెడ్డి. ఆ హత్య మాపుచెయ్యాలని నీచుడైన కరణాన్ని అభ్యర్థిస్తే, అవకాశం వచ్చింది కదా అని పాణిని తన అక్రమ సంతానం తాయారును పెళ్ళిచేసుకోమని నిర్బంధిస్తే కేసు తప్పిస్తానంటాడు కుటిల కరణం. కానీ, తాయారును వివాహం చేసుకోనన్న పాణిని తన ఇంటినుంచీ వెళ్ళిపోమంటాడు రెడ్డి.

ఫలహారం తీసుకు వెళ్ళిన నీరజకు పాణి వెళ్ళిపోయాడని అర్థమౌతుంది. మంజరి కాళ్ళ మీద పడి భోరున ఏడుస్తూ, "అన్నయ్యెల్లిపోయిండు అన్నయ్యను పిలిపించు..."

మంజరికి విషయం అర్థమైంది. కానీ, ఎవరూ ఏమీ చెయ్యలేని స్థితి. పాణిని పెడరెక్కలు విరిచి తీసుకురమ్మంటే, రానన్నాడని చంపానని చెపుతాడు మదార్సాబ్. రెడ్డికి ఎక్కడ చూసినా రక్తం కనబడుతుంది.

తన పాపాలు, తను చేసిన హత్యలు, తను తయారు చేసిన ఆడపాపలు తన చుట్టూనీడల్లా భ్రాంతుల్లా తిరుగుతారు. ఊరు దాటి కుటుంబంతో సహా అనారోగ్యంతో పట్నం వెళతాడు రెడ్డి. ఊరు అతణ్ణి వెళ్ళిపొమ్మంటుంది.

కానీ, పట్నంలో పాణి చాలా పరువుగల వ్యక్తిగా, గౌరవనీయుడుగా ఆశ్రయం ఇవ్వగల పెద్ద మనిషిగా ఎదురుపడగానే ఆశ్చర్యపోతాడు రెడ్డి. పాణి ఆశ్రయంలో చెల్లిగా నీరజ, భార్యగా మంజరి స్థిరపడిపోతారు.

ఈ నవలలో తొలి పలుకులో శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు అన్నట్లు, "రచయిత, అతిదారుణములైన విషయాలన్నిటినీ, అతి సహజంగా చూపినవారే కానీ, ఎవరికో బాధకలిగించు దృష్టితో రాసినట్లు గోచరింపదు" - ఇది గొప్ప రచయిత లక్షణం. ఈ నవల

మనకు కథ మాత్రమే చెప్పదు. చరిత్ర చెపుతుంది. దిన పత్రికలలో వచ్చే వార్తా విశేషాలు మనకూ విషయాన్ని చెపుతాయి. కానీ, మంచి రచయిత, అదే విషయాల వెనక కారణభూతాలను బట్టబయలు చేసి, ఒక అద్భుతమైన జీవిత రంగాన్ని చిత్రీకరిస్తాడు. చరిత్ర రచయిత సృష్టి. వార్త మామూలు మనిషి కూర్చే అక్షరాల ప్రోగు, ఈ నవలలో మనకొక చరిత్ర కనపడుతుంది.

లంబాడీ భీక్య భార్య లక్ష్మిని కరకు తురక పట్టిబంధించి, బలవంతం చేస్తే, వాణ్ణి పురుగుకన్నా హీనంగా తృణీకరించి హత్య చేయబడుతుంది. భీక్యా ఆవేశం, సాహసం, రక్తాన్ని పొంగిస్తాయి. అలాగే, పుల్లి భర్త హత్య, పేరిగాని మృతి, కరణం భార్య పిచ్చి, నీరజ తల్లి పతనం, నరకం, నారయ్యకు, లంబాడీలకు కరణం వల్ల జరిగిన మోసం, తురక దొరలకు అవకాశవాదులైన తొత్తులు ఏర్పాటు చేసే జల్సా ఖుషీలు, నీచకరణపు జీవితం, అతడు అన్యాయం చేసిన లంబాడీలు అతణ్ణి ముక్కలు ముక్కలుగా నరకడం నాటి ఖిలాపత్ ఉద్యమం, ఆంధ్ర మహాసభ ప్రారంభం, ఇవన్నీ మనందరం తెలుసుకోవలసిన చారిత్రక సత్యాలు, పాత్రలు, సన్నివేశాలూ కల్పితాలైనా విషయం సత్యమైనదే

ఈనవలలోని నాయకుడు పాణి, నగరంలో శ్రీమాడపాటి హనుమంతరావు పంతులుగారితో జరిపిన చర్చ ప్రతి తెలుగువాడూ చదవవలసిందే

తెలంగాణా ప్రాంతపు గ్రామాలలో బ్రతికే చాలామంది చూట్టూ ఈ నవలలో చిత్రీకరించబడిన వాతావరణం సాలెగూడులా విస్తరించి ఉన్నది కానీ, "ఇది మీజీవితం" - అని చెప్పే రచయిత వల్ల, "ఇదా మన జీవితం" అని ఉలిక్కిపడి, మధనపడి, విరక్తి నుంచీ, బాధ నుంచీ సాంఘిక విప్లవానికి విత్తనాలు నాటబడతాయి. ఏ సాంఘిక నీతి అయినా న్యాయమూ, అన్యాయమూ అన్న ప్రశ్నకు అక్కడ బాధిత స్త్రీ హృదయమే కొలబద్ద అని అందరికీ తెలుసు. ఏ సంస్కృతి విలువులైనా తెలియచెప్పేది ఆ సంస్కృతిలో బ్రతికే స్త్రీమూర్తే.

ఆడపాప నీరజను తలుచుకుంటే చాలు, "నేనున్న సమాజంలో నీతి ఎక్కడిది?" అంటూ నిలదీసి ప్రశ్నిస్తుంది ఆ సజీవ మూర్తి.

***

# బలివాడ కాంతారావు

# 'సంపెంగి'లో సంపెంగి




**సాహిత్యంలో చాలా కొద్ది పాత్రలు మాత్రమే మూర్తిత్వాన్ని,** వ్యక్తిత్వాన్ని పొందే స్ఫూర్తినిస్తాయి. సహజత్వం, పాత్రకు సజీవత్వం కావాలంటే, కేవలం అక్షరాల రేఖాచిత్రీకరణ కాదు కావాల్సింది. దహరాకాశంలో శబ్దించే అనాహత మంత్రాక్షరంలా, రచయిత హృదయంలో జన్మించి, మేధస్సుతో జీవించి, అక్షర రూపాన సంస్కరణ పొంది, పాఠకహృదయంలో తేజోరూపమై గుర్తించగలిగినప్పుడల్లా వెలుతురు వెల్లువగా రూపు దాల్చాలి. వ్యాప్తి, సంకోచము, నిర్లిప్తత, తేజస్సు, కాంతి, శాంతి, శారీరాకర్షణకు అతీతమైన పవిత్రత, సౌందర్యం, సౌకుమార్యం, స్నిగ్ధత, నిశ్శబ్దత, చురుకు - ఇవన్నీ కలిసిన పాత్ర - బలివాడ వారి "సంపెంగి".

బలివాడవారు తెలుగు సాహిత్యంలోనే ఒక సుస్థిరమైన పీఠం వేసుకున్న వ్యక్తి ఆయన. వినమ్రతతో అంగీకరించక పోయినా, చాలా విషయాలకు అగ్రతాంబూలం

అందుకోవలసిన వ్యక్తి. ఔదార్యం, హృదయౌన్నత్యం కలసిన బుద్ధిజీవి ఈయన పాత్రలలో వ్యక్తమౌతూ ఉంటారు.... ఎంతో విద్వత్తు ఉండీ నిండుకుండలాంటి ఈ రచయిత, ఆంధ్ర సారస్వత తేజోమూర్తికి అనేక అక్షర మాలికలు సమర్పించారు. ప్రతి అక్షరం ఒక తులసీదళం – ఆ స్పర్శానుభూతి ఆర్ద్రతతో స్పందించే ఆ దేవికి, ఆమెను సంస్మరణ చేసే పాఠకులకే వ్యక్తమౌతుంది మరి.

సంపెంగి నవలలో నరహరి, సంపెంగి ప్రధానపాత్రలు. వారిద్దరి జీవితాలు వారి చుట్టుపక్కల ఉంటూ, లౌక్యప్రపంచాన్ని అనుసరించి బ్రతుకుతున్న వ్యక్తుల చుట్టూ పరిభ్రమిస్తాయి. కానీ వారిద్దరూ, ఒకరిపై ఒకరు భ్రాంతితో ఒకరి నుంచీ ఒకరు, స్ఫూర్తి పొంది ఒకరికి తోడుగా మరొకరు బ్రతుకుతారు.

నారయ్య తాత వంటి ఉత్తముడి నీడలో రూపుదిద్దుకున్నాడు నరహరి. దిక్కులేని రాములమ్మ కుటుంబం ఆకలి భరించలేక ఆత్మహత్య చేసుకోబోతుంటే నారయ్య తాతచే రక్షించబడి, ఆయన ఒడిలో చేరువై తన కుటుంబాన్ని రక్షించాలి అన్న భీష్మ ప్రతిజ్ఞ తీసుకుంటాడు నరహరి. ఆయన చలవతో ఆయనంతటివాడవుతాడు. నారయ్య తాతకు పక్షవాతం అని పావురాయి రక్తం వైద్యం కోసం పెంకుటిల్లు ఎక్కుతాడు నరహరి. పావురాయి దొరకపోగా పెంకులు జారి కిందపడతాడు... కిసుక్కున నవ్వు వినబడి తిరిగి చూస్తాడు.. అలా అతని జీవితంలోకి తొలిసారిగా అడుగుపెడుతుంది సంపెంగి.




”పడిపోతే నవ్వాలా?!.. చూడు మళ్ళీ పడతాను. నవ్వావంటే పళ్ళూడగొడతాను...” అని కొప్పు పట్టుకుని బెదిరిస్తున్న నరహరిని –

”నువ్వు ఎక్కడమేల? పడనేల? అయినా దణ్ణం పెడితే వదిలేస్తావులే....” అంటుంది సంపెంగి.

కలువపూలు కోసుకురావడానికి వెళ్ళి తడిసిన అతడికి కొంగు అందించి, తలలో పూవు ధైర్యం చేసి తురిమిన అతణ్ణి చూసి కొంటెగా నవ్వింది... ఆ క్షణాన మన్మథుడు, మాధవుడు కూడా ఆశీర్వదించిన ఆ క్షణాన్నించీ వారిద్దరూ మానసికంగా, మౌనంగా ఒకటై పోయామన్న భావనకు, భ్రాంతికిలోనవుతారు. అప్పుడే ప్రవేశించి పెరుగుతున్న ఒయ్యారాలతో, మమకారపు మాటలతో నూనూగు మీసాల కుఱ్ఱాడి హృదయాన్ని తను నివసించే పిచ్చికగూడుగా మార్చుకుంటుంది సంపెంగి.

ఆ తరువాత చాలా కాలం సంపెంగిని చూడలేదు నరహరి. అతడికి అప్పట్లో సంపెంగి ఒక తియ్యటి పరిమళము, జ్ఞాపకం మాత్రమే... కృతజ్ఞతతో అతను నారయ్య తాత మనుమరాల్ని ఈడేరని పిల్లను వివాహం చేసుకున్నాడు. నారయ్య తాత మృత్యువును సమీపిస్తూ చేపకూర మనసైనదంటే, జాలారత్త ఇంటికి చేపను కొనుగోలు చెయ్యడానికి వెళ్ళిన నరహరి పక్కింటి తలుపు తీసుకుని బైటకు వచ్చిన సౌందర్యమూర్తిని చూసి తబ్బిబ్బవుతాడు. ఆమె ఎదిగిన సంపెంగి.

”ఈ సంపెంగి పువ్వు ఇదివరకు మొగ్గగా ఉన్నప్పుడు చూశాను. శుద్ధ దశమి రేయి తరువాత పున్నమినాడే చందమామ వైపు చూడడం జరిగింది. అలంకరించిన కలువలు ఆమె ముఖాన్ని చూసి వాడిపోయాయి” ఆమె విప్పారిన యవ్వనం అయస్కాంతమై అతణ్ణి

గజగజ ఒణికించింది. నదీనదాలు మంచుకొండలు, పచ్చని అడవులు, లోతైన సముద్రాలు, నల్లని మేఘాలు. వీటిలో ఈ ప్రకృతి మనిషి తాకలేని, పొందలేని అందాల సృష్టి. ఈ అందాన్ని తాకి, పొంది, కౌగిలించి, ముద్దాడి తనలో ఐక్యం చేసుకోవడానికి ఆడదాన్ని దేముడు సృష్టించాడు" - సౌందర్యరసాధి దేవతకు, ప్రకృతికి ఉండే సారూప్య సాన్నిధ్యతత్వాన్ని ఇంత అద్భుతంగా ఆవిష్కరించారు రచయిత.....

దేముడు చేతకాని శిల్పి ఎలా అవుతాడు?! సౌరభంతో గుబాళిస్తున్న ఈ సంపెంగిని సృష్టించాడు?! కానీ ఆమెను ఏలుకోలేని భర్తను సృష్టించి లీలామానుషుడిని అనిపించుకున్నాడు.

తనకు ఉన్న ఒక్క వృద్ధస్నేహితుడు, గురువు, ఆత్మీయుడు అయిన నారయ్య తాతను పోగొట్టుకుని,గుండె ఖాళీగా బ్రతుకుతున్న "నరహరికి అర్థం లేని ఆరాటం, గమ్యం లేని తిరుగుడుతో కాలమనే పరుగు పందెంలో ఎగిరే బూడిదే మనస్సు గాయాలకు మంచు బిందువు అవుతుంది. బాధ తగ్గగానే, మనసులో కోరికలు మమకారం పెరుగుతాయి" అని మనిషి ప్రవృత్తి గురించి చెప్పి ఈ రచయిత మనిషిలో ఆదర్శం వేదాంతం అట్టడుగు పునాదులు లేనినాడు ఎలా కూలిపోయి ఆ మొండిగోడల మీద కోరికల వెన్నెల పూవులు, పడగెత్తిన వాంఛల సర్పాలు ఎలా స్పష్టమౌతాయో చాలా చక్కగా చెపుతారు.

కాలగమనంలో ఎగిరే ధూళి ఈ సంపెంగి. నీటిలో నుంచీ తేలిన దివ్య సుందరిలా నాలో పడుతున్న సూర్యకాంతి ఈమె. చంద్రబింబంపై పడి చల్లని మరులు చల్లినట్లైంది. నీటిపై మోదంతో సవారీ చేస్తున్న పిల్లగాలి, కళ్ళెమనుకుని పయ్యెద చెంగు పట్టుకుని లాగింది. అతణ్ణి చూచి ఆమె వలపు సిగ్గెరిగింది. ఈ మందారపూవు అందంతో, మకరందమాధుర్యంతో తేలుతోంది. ఎవరో తెంపకముందే తుమ్మెద పూవుపై వాలాలి రుచి ఎరగకముందే తన ఆకలి తీర్చుకోవాలి. ఈ తలపుతో ఆమెను చేరిన నరహరికి ఆవేశంతో, అమరత్వం ప్రసాదించిన మైకంలో మత్తెక్కిన పుష్పమైపోయింది సంపెంగి. రూపు ఛాయ సౌరభంతో విప్పారిన సంపెంగి చేసిన వలపు తపస్సు అలా ఫలించి మన్మథ ద్వారాలను మాధుర్యపు ఊపుతో తెరిపిస్తారు రచయిత. ఇప్పటికి అతడిలో రసికుడు, కాముకుడు, పురుషుడు మాత్రమే ప్రస్ఫుటమౌతారు. కానీ, సంపెంగి వలపుల ఒప్పుకోలు వెనకాల అనేక జన్మల తపస్సు, నిత్యజపం, ఆరాటాల హవిస్సు పుప్పొడిగా మారి అతడిలో ప్రేమను జ్వలింపచేస్తాయి. అతడిలో మనిషి ప్రపంచం దృష్ట్యా వ్యవహర్త. డబ్బుకు ప్రాధాన్యం ఇచ్చే లౌక్యుడు. తన సంసార బాధ్యతలకోసం స్వార్థంతో ప్రవర్తించినట్లు కనబడిన నరహరిలో మార్పు వచ్చి మనిషి, మహా ప్రేమికుడు రూపుదాలుస్తారు. ఈ గొప్ప పరిణామాన్ని చూపించి, నిరూపించడంలో రచయిత కృతకృత్యులయ్యారు.

నరహరి, సంపెంగి ప్రేమ, ప్రపంచానికి కంటకమై పోయింది. ఆమెలో ఉండే అన్ని మంచిగుణాలు కొండంత దూది కాగా, ఈ ఒక గుణం నిప్పురవ్వగా మారింది. కులంలో బలం లేనిదైంది. కానీ, ఆమె ప్రేమఫలం రోజురోజూ పలకబారి మగ్గి, మధురాతి మధురమైపోతోంది. నరహరి చూపులో సంపెంగి సామ్రాజ్యాలు నిర్మించుకున్నది. అతని కౌగిలిలో కమనీయ సౌఖ్యాలను అనుభవిస్తోంది. అతడి తాకిడి ఆ బంగారు మేనుకు మెరుగు పెట్టింది. ఆమె ఇప్పుడు మందాకినీ తీరంలో పండు వెన్నెలలో మరునితో విహరిస్తున్న రతీదేవి. యవ్వనం ఎంచుకున్న రూపం ఆమెది. మగవాళ్ళు తపస్సు చేసి కోరుకున్న వరం సంపెంగి.

తనకు దైవం ఇచ్చిన భార్య సంపెంగి. వివాహం అయినంత మాత్రం చేత భార్యను ఎలా ముట్టుకోవడం? భార్య పరస్త్రీ - అన్న భావన సంపెంగి అతనిలో కలిగిస్తుంది. పరమ లౌక్యుడిలా కనబడే సామాన్యుడైన మనిషి నరహరి - అతనిలో స్త్రీ వాంఛ కేవలం శారీరకమైన స్థితిలో ఉండి ఉంటే, ఈ ఆలోచనతో ఆతడు బాధపడి ఉండేవాడు కాదేమో. అతనిని వలపులో ముంచిన స్త్రీమూర్తి మామూలు ఆడదై ఉంటే, ఇంట సంసారాన్ని బయట ప్రియురాల్నిని కూడా ఏలుకుని చాలా మామూలు మనిషై ఉండేవాడు నరహరి. కానీ అతని జీవితాన్ని ప్రేమ సామ్రాజ్యాన్ని ప్రభావితం చేసిన వ్యక్తి సామాన్య స్త్రీ మూర్తి మూర్తి కాదు. సంపెంగి... ఆమె సంపర్కం అతనికి అసాధారణ పరిపక్వత , సంతృప్తి, పవిత్రత ఇచ్చింది... ఆ అద్భుత రసావిష్కరణను చిత్రీకరించి ఈ పరిస్థితిని అవినీతి పరిధుల్ని

దాటించి అమరత్వం ప్రసాదించాలంటే రచయిత హృదయం, మేధస్సు ఎంత దీప్తిని అమృతత్వాన్ని రససిద్ధిని పొంది ఉండాలి!... ఎంత పరిపూర్ణ స్త్రీ మూర్తిని ఊహల్లో దర్శించి ఉండాలి?!

ఆమె పరిస్థితి అతని ఆరాధన, మొండితనంతో మరింత దుర్భరమైపోయింది. ఏలుకుని కాపాడలేని భర్త తనకోసం సర్వప్రపంచాన్ని తోసి రాజనే ప్రియుడు ఆమె జీవితమనే ధర్మకాటాలో చెరొకపక్క నిలబడ్డారు. కానీ, అది ప్రకృతి ధర్మకాటా అయితే ఆమె నరహరి వైపే మొగ్గు చూపాలి. కానీ, గుండెలు చెదలు తినిపోయిన సంఘం నరహరికి వలపువాకిళ్ళు తీసిన ఆమెను "కన్నెరికం చేసిన కులపాప" అన్నది. "జారుముడి" కింద అంచనా వేసింది. ఒకసారి కాలు జారితే, ఎన్నిసార్లన్నా జారవచ్చు అన్న స్వార్థపూరితమైన సంఘం, ఆమె యవ్వనాన్ని పదిమందికి పంచమని తీర్పు చెపుతోంది. నరహరి, సంపెంగి ప్రేమికులుగా దళసరి పొగమంచులాంటి వలపులో చిక్కడి బాహ్యప్రపంచాన్ని చూడదలచుకోలేదు. నేడు సంఘం తెచ్చే వత్తిడి వాళ్ళకు పనికిమాలిన కనువిప్పు కలిగించింది. కానీ సంపెంగి పరిధిలో నరహరి నిజం.. మిగతా ప్రపంచం శూన్యం అనుకుంది. కానీ నరహరి మొగవాడు, సంఘం, సంసారంలో బాధలు, అన్నదమ్ముల బాధ్యతలు, ఆర్థికమైన చిక్కులు, తల్లిమీద గౌరవం - ఇవన్నీ అతణ్ణి స్పృశించకతప్పదు - ఆమె అతడి కౌగిలిలో మార్పు గమనించగలిగింది. ఆడదాని వలపు ఆ తాపానికి కరిగి మనస్సు కోరికలతో మగ్గిపోతుంది. అడ్డాలలో బిడ్డ ఉంటే వర్షఋతువులో భూమి చల్లబడి పచ్చనైనట్లు స్త్రీ తలుస్తుంది. సంపెంగి ఈ జన్మకు తల్లి కాలేదు. కానీ, తల్లితనం మూర్తీభవించిన ఆ సౌందర్యమూర్తి నరహరికి మరింత దగ్గరై, అతని కష్టసుఖాలను పంచుకోవాలని ప్రయత్నిస్తుంది. అతడి కష్టం అంటే అందవికారి అయిన భార్య. అతణ్ణి కోరుకునే భార్య. అతను ఏమాత్రం దగ్గర కాలేని భార్య.

'అయితే ఎందుకు పెళ్ళాడావు? మానలేకపోయావా?!" అని విసురుగా విసుక్కుంటుంది కావాలని సంపెంగి... అలా అన్నా అతను భార్య చేతుల్లో వాలి, ఆత్మన్యూనత నుంచీ, తప్పుచేస్తున్నానేమోనన్న బాధనుంచీ విముక్తుడౌతాడేమోనన్నది ఆమె ఊహ - నిజమైన హృదయార్పణతో పరిపూర్ణ స్త్రీ మూర్తి ప్రియుడి వాంఛలకు ఆలంబనమవడం ముఖ్యమనుకోదు. అతనిలో గంభీరత, గౌరవం, బాధ్యత, వ్యక్తిత్వం, పరిపూర్ణత రూపుదాల్చాలని కోరుకుంటుంది. అందుకే స్త్రీ తన సర్వస్వాన్ని చాలా సులభంగా కొన్ని విలువల కోసరం త్యాగం చెయ్యగలదు... అనుభవము, తృప్తి, అభిమానం తెలిసిన మగవాడికి ఈ స్త్రీ మూర్తి ఔన్నత్యం అర్థంకాక, తన అభిమానం మీద దెబ్బతీస్తోందన్న భావనతో ఎదురుతిరుగుతాడు. అందుకే సమాన పరిపూర్ణత లేని వ్యక్తుల మధ్య వలపు నిశ్శబ్దంగా ఆత్మహత్యకు లోనౌతుంది.

తనతో విసురుగా మాట్లాడిన సంపెంగికి తనను గురించి అర్థమవ్వాలి అని చీకట్లో ఇంటికి వెళతాడు నరహరి. కానీ, సంపెంగి విసుగు నటించి అతణ్ణి ఇంటి వాకిలి పట్టించింది. కానీ, తన జ్ఞాపకాల స్మృతులకు దూరం చేసి వలపు వాకిళ్ళను తెరిపించలేదుగా! ఆ రాత్రంతా చలిలో అరుగుమీద పడుకుంటాడు కానీ తలుపు తట్టి భార్యకు దగ్గరవలేకపోతాడు నరహరి.

సంపెంగి తెల్ల గులాబీ, గట్టిగా కోపం అనే గాలి వీస్తే రెక్కలు రాలిపోతాయి - అని గ్రహించి ఆమెకు తిరిగి దగ్గర అయిన నరహరితో

"ఆయమ్మ సౌఖ్యం నేను కూల్చానని పదుగురు ఎందుకు అనుకోవాలి?! నా కడుపు పండలేకపోతే పోయే ఆయమ్మ కడుపు పండకూడదా?!" అని మళ్ళీ నచ్చ చెబుదామని ప్రయత్నిస్తుంది. "ఆమెను ఏలుకోగానే నన్ను వదిలెయ్యఖ్ఖర్లేదు" అని భరోసా ఇస్తుంది. "నేను అర్థం అయితే చాలు. నీ చేతుల్లో బుగ్గైపోతాను" అని బ్రతిమాలుతుంది. కానీ ఇంత అద్భుత స్త్రీమూర్తి స్పర్శ పొందిన నరహరికి ఒక విచిత్రమైన బాధ ఉంది. సంపెంగి తప్ప మరే స్త్రీ మూర్తి అతడిని కదిలించలేదు. అది ఆమె వలపు ప్రసాదించిన అమృతావస్థ. అది అర్థమవ్వాలంటే, అటువంటి స్త్రీమూర్తి జీవితంలో తారసపడాలి మరి.

సంపెంగి చాలా తెలివిగా కార్యేషుదాసీ, కరణేషు మంత్రిలా అతడికి సలహాలిస్తుంది. అతని అన్నదమ్ముల స్వార్థం గురించి అతణ్ణి హెచ్చరిస్తుంది. ఆఖరి తమ్ముడిని చదివించలేకపోతానేమోనన్న భయంతో బాధపడుతున్న అతడికి తన ఒంటిమీద నగకట్టు ఇస్తానంటుంది. ఆ విషయం మరెవరికీ చెప్పవద్దని ఒట్టేస్తుంది.

"పాపం చేసినదాన్ని ఈ చీకట్లో ఒక దీపమైనా వెలిగించవద్దా చెప్పు" అంటూ అతణ్ణి నిర్వీర్యుణ్ణి చేస్తుంది. సంపెంగిని దేముడు వలపుకు సౌందర్యానికి అంతంగా సృష్టించాడు అనుకున్నాడే కానీ నరహరి ఆమె మెదడుతో ఆలోచించగలదని, కొంత వయస్సు వచ్చాక ఆడది రోజు రోజుకు అందాన్ని హరించుకుని, చందనంలా అరిగి, చందనవాసనలాంటి గుణాన్ని పెంచుకుంటుందా అని ఆశ్చర్యపోతాడు నరహరి.

"నీ బిడ్డను పెంచుకుంటాను. నీ భార్యతో సరిగా ఉండు. నా అభిమానస్తుడి బిడ్డ నా బిడ్డ కాదా!" అంటుంది.

"లోకంలో ఆడదానికి ఇంకొక ఆడదానిమీద కొండంత అసూయ ఉంటుంది. నీకేమిటి?" అని ఆశ్చర్యపోతాడు నరహరి. ఆమె ఔన్నత్యం, ప్రేమ, సాధారణ అసూయ వేషాల పరిధులు ఎప్పుడో దాటిపోయాయనీ, తన మీద ప్రేమను ఆధారంగా ఆమె ఆలోచన అతనికి ఆమె మరింత వాంఛను, గౌరవాన్ని కలిగిస్తాయి.

అందుకే ఆమె ఏమిటో తెలిసిన నరహరి ఆమెను ఎవరేమన్నా భరించలేడు. తమ్ముడు, తన వాళ్ళూ ఆమెను తేలిక చేసి మాట్లాడుతుంటే విరుచుకుపడతాడు. వదినను ఏలుకోని అన్నయ్యను, "జారుముడి"లాంటి సంపెంగిని గౌరవించే అన్నయ్యను వాళ్ళు కేవలం అవసరానికి ఉపయోగించుకుంటారు కానీ, మనసుతో మాన్యత చూపలేరు.

"నారయ్య తాత కుటుంబం వలన ఇంత ఉపకారం పొందానని, వాళ్ళ పిల్లను సుఖపెడదామని కోరి కోడలుగా చేసుకున్నాను. లోకం హర్షించని పని ఎంతకాలం చేస్తావురా?" అని, తను పూజించి గౌరవించే తల్లి నరహరిని చివాట్లు పెడుతుంది. కానీ ఇవేవీ సంపెంగి స్మృతిని అతడిలో నుంచీ తొలిగించే అంత శక్తివంతమైన ఆయుధాలు కావు. కేవలం ఆమె తలపే, అతడిలో వలపును నిద్రలేపి జీవితం ప్రేమమయం అనిపిస్తుంది. అన్ని చికాకుల మధ్య ఆమె స్పర్శ అతడికి ఔషధప్రాయం. మరి ఏ కారణం వలన ఆమెకు అతను దూరంగా బ్రతకాలి? "సంపెంగికి దూరమై బ్రతుకు" అని శాశించే సంఘం అతనికి ఏం కావాలో, అతణ్ణి ఎలా తృప్తిపరచాలో ఆలోచించదు మరి.

నేరేడు పండు అంచు గల మల్లెపూవులాంటి తెల్లని నూలు చీర కట్టుకుని రాట్నం ఒడుకుతూ ఉంటుంది సంపెంగి. చిరునవ్వు మొహం అంతా ఒలికించింది. కదులుతున్న చేతులు సౌందర్యదాహం చూసి, పండు వెన్నెల్లో వెలిగే దివ్యరూపిణిగా ఆమెను భావిస్తాడు నరహరి.... ఇక్కడ రచయిత పెయింట్ చేసిన ఒక అక్షర చిత్రం భావస్నిగ్ధతతోనూ సున్నితమైన తేజస్సుతోనూ రూపుదిద్దుకుంటుంది. కానీ రాను రాను సంపెంగి జీవదాహం, అందులో తప్పు చేస్తున్నానని అనుభూతి, ఆమెలో లేని పాపాల్ని చిత్రీకరించి ఆమెను దిగజార్చాలని చూసే సంఘం, చుట్టాలు, ఇవన్నీ కలిసి ఆమె మాటల్లో ఒక రకమైన నిరాశావాదం, మృత్యు ఆహ్వానం స్ఫురింప చేస్తాయి. అవి అసలు భరించలేకపోతాడు నరహరి. తన చుట్టూ ప్రపంచానికి తన వాళ్ళకు న్యాయాన్యాయాలతో సంబంధం లేకుండా సేవ చెయ్యడానికి సిద్ధపడతాడు నరహరి. కానీ ఈ ప్రయత్నంలో సంపెంగి విషయంలో అతడి జోలికి మరెవరూ రాకూడదు అన్న ఆశతోనే రాజీపడటానికి సిద్ధపడతాడు. కానీ జీవితాన్ని మొత్తం ఆవరించిన ఆమె మధురస్మృతి అతడి భార్యను మాత్రం దగ్గర చేరనియ్యదు. మరి ఇంక ఏ సహాయం చేసినా రాజీపడడానికి ఒప్పుకోదు సంఘం. ఆమె భర్త ఆమెను నా సొంతం అని భావించినా, చింత చచ్చినా పులుపు చావక వాంఛించాలని ప్రయత్నించినా కనీసం అతను ఆమె మీద హక్కు కలవాడన్న ఆలోచన వచ్చినా తన సొంత భార్యను ఇంకెవరో తుంటరి అల్లరి పెడుతున్నట్లు బాధపడిపోతాడు నరహరి. అదే విచిత్రం స్త్రీ పురుష సంబంధంలో సంపెంగి అతని మీద ఆరాధనతో ప్రేమతో అతణ్ణి భార్యకు దగ్గరగా బ్రతికించాలని, అతణ్ణి లోపాలు, పాపాలు లేని దేముణ్ణిచెయ్యాలని ప్రయత్నిస్తుంది. కానీ ఆమె మీద

విపరీతమైన ఆరాధన, కాంక్ష ఉన్న నరహరి ఆమెను పరిధుల్లో మూసివేసి గుడికట్టి తానొక్కడే ఏకాంత భక్తుడు కావాలని, ఆ దేవతమీద ఆమె సర్వస్వం మీద తనొక్కడికే అధికారం ఉందనీ అనుకుంటాడు, శాశిస్తాడు. ఈ ఆలోచనకు మరొక పక్క ఉందేమోనని కనీసం ప్రశ్నించుకోడు. ఈ అద్భుతమైన స్త్రీ పురుషుల సంబంధం మధ్య జరిగిన ఒరిపిడినుంచే చాలా కవిత్వాలు, కావ్యాలు ఆవిష్కరించబడతాయి మరి.

గొప్ప ఊరు పెద్ద, పలుకుబడి కలిగిన పెద్ద మనిషి నలుగురికీ తీర్పు చెప్పే మాన్యుడు, అయిన నరహరి "మనిద్దరం ఎక్కడికైనా పారిపోదాం సంపెంగి" అన్నప్పుడు, -

"ఒద్దు... అంతపని ఒద్దు హరిబాబూ! ఒక గౌరవమైన కుటుంబానికి పెద్దవి. నాలుగిళ్ళ పెద్ద మనిషివి. ఆ నీ గౌరవం నిలపడం నా పూచీ హరిబాబూ! నిన్ను చిన్నప్పటి నుంచీ వలచాను. నా బొందిలో ప్రాణం ఉండగా ఆ బాబుకు ద్రోహం చెయ్యను. అతని కీర్తికి మచ్చ తేలేను" అంటూ అతని కౌగిలి నుంచీ కాళ్ళ మీదకు తెగిన పూదండలా జారిపోతుంది సంపెంగి.

"నా సహవాసం వలన నీకు అబ్బిందేమిటి.. మిగిలిందేమిటీ?" అని ప్రశ్నించిన నరహరిని

"ఎప్పుడూ అడగంది అడిగావు బాబూ! జవాబు చెప్పాలా? నీ గొప్పతనం నాకు అబ్బింది. నేను వివరించి చెప్పను. నీలో సగంపాలు అయినందుకు నీ రక్తం నాలోనూ పారుతోంది. నా బ్రతుకులో ఏదైతే కోరుకున్నానో అది నాకు పూర్తిగా దొరికింది. నిను పొందానన్న తృప్తి నాలో ఏది పోయినా అది పోదు.. ఇది చాలదూ నాకు!" అంటుంది. ఈ జవాబు ఇమిడిన ప్రశ్నలో తరతరాల నారీహృదయం ఒక్కసారి మీటిన ధనస్సులా విపుల శబ్దంతో ధ్వనించి ఒక్కసారి కట్టుబాట్లు విధించిన సంఘపు రేఖల్ని వాంఛావాహిని ఉప్పొంగిన ఆరాధనాబలంతో ఎలా తుడిచిపెట్టగలదో చెపుతుంది.

ప్రపంచం అంతా తూలనాడినా, రాములమ్మకు మాత్రం బాధ్యతలు మోస్తూ, నిజాయితీ పరుడైన తన బిడ్డ మనసు అర్థమౌతుంది. అతని చేత ఆరాధించబడిన "సంపెంగి" ఎంత దేవపారిజాతమో ఆమెకు అర్థమౌతుంది.

సంపెంగి గురించి చెలరేగి తన మిగతా బిడ్డలు మాట్లాడి, తూలనాడి నరహరి జీవితం పాడైపోవడానికి, అన్నయ్య వదిన ఒద్దికలేకుండా బ్రతకడానికి ఆమె కారణం అన్నప్పుడు ఎదురుతిరిగి -

"మీ అన్నయ్యను చేపట్టి అది చెడింది కానీ మీ అన్నయ్య చెడలేదు, బాగుపడ్డాడు." అని తీర్పు చెబుతుంది.

సంపెంగి చెట్టుమీద విచ్చలవిడిగా విహరిస్తున్న పిచ్చికలవైపు చూస్తుంది. ఈ కట్టుబాట్లతో బ్రతికే ఈ మనిషి బ్రతుకుకంటే ఆ పిచ్చుక బ్రతుకు ఎన్నో నోములు నోస్తే కానీ రాదనుకుంటుంది. నరహరితో తన బ్రతుకు కాడలేని కలువ పువ్వు.

మూడుముళ్ళు కట్టి ముళ్ళ కంచెలు అడ్డు పెడతారు. ఆ కంచెలో బంధించబడినన్నాళ్ళూ సంఘం ఆడదాన్ని గౌరవిస్తుంది. అందులో హృదయాన్ని పాతిపెట్టి గోరీ కడితే మరింత పతివ్రత వంటుంది. ఊపిరాడక, హృదయవేదన భరించలేక కంచె దాటితే, అప్పుడు ఆ ఆడది దిగజారి పోయిందంటారు. మనసిచ్చిన మగవాడితో కాపురం చేసే భాగ్యం అందరి ఆడవాళ్ళకూ కలగదు. మనసు మలుచుకుని మగడితో కాపురం చేసే ఆడవాళ్ళెందరో, చుట్టూ ముళ్ళ కంచెలే ఆడదాని అబలత్వానికి, హృదయం చంపుకున్న స్త్రీత్వానికి సంరక్షణ ఇస్తాయి. సృష్ట్యాదినుంచీ, ఆడదానిని అదుపులో పెట్టి, మగవాడు ఆడదాని మనసు దోచుకోవాలని ప్రయత్నిస్తాడు. కానీ ఆ మనసులో నిత్యం వసించి వలపు మెరుపులతో అభిషక్తులయ్యే అదృష్టం కొందరికే కలుగుతుంది. అటువంటి అదృష్టం చేసుకున్న వాడు నరహరి. ఆ అదృష్టం లేనివాడు పరదేశి.

ఆడవేషాలలో అందెవేసిన పరదేశి, పరిషత్తు పోటీలకోసం వెళుతూ అలంకరించుకోడానికి సంపెంగి నగలు అడిగి, భార్య వాటిని నరహరి కుటుంబం కోసం త్యాగం చేసిందని తెలిసి, తగువు పెట్టుకుని, అరిచి, నాటకాల పోటీకి వెళతాడు. ఓడిపోతాడు. అతనిలో తెలియని నైరాస్యం. తను ఏనాడూ పూర్తిగా పొందలేని భార్యమీద విపరీతమైన ఇష్టం ఉంది. ఏమాత్రం తనకు గెలుపు ఇవ్వని జీవితం

మీద విసిగి, తిరిగి తిరిగి ఇంటికి వచ్చి సంపెంగి చేత అన్నం పెట్టించుకుని తిని, అంతకు ముందే సేవించిన గన్నేరు పప్పు విషం పని చేసి చనిపోతాడు పరదేశి. ఆత్మహత్య చేసుకునే ముందు తన చావుకు తానే కారణమని వరసకు తమ్ముడు, ఊరు పెద్దల్లో ఒకరైన మునసబుకు ఉత్తరం రాస్తాడు.

కానీ మునసబు స్వార్థపరుడు, అసూయాపరుడు. పరదేశి అసమర్థుడైన భర్త అని తెలిసి, సంపెంగి మీద కన్నువేసి ఎన్నోసార్లు తనకు లొంగిపొమ్మని బలవంతం చేసిన నీచుడతను. ఆమె తిరస్కారం, సాటివాడైన నరహరికి ఆమె లొంగిపోయి ఆరాధించడం భరించలేకపోతాడు మునసబు. ఇప్పుడు అవకాడం రాగానే ఆ ఉత్తరం సంగతి బైటపెట్టకుండా పరదేశికి ఆహారంలో విషం పెట్టి హత్య చేసిందని సంపెంగిని, దానికి ప్రేరణ, కారకుడు నరహరి అని పోలీసుచేత అరెస్టు చేయిస్తాడు వారిద్దర్నీ.

తమ్ముడికి పట్నం సంబంధం వచ్చిందని ఎంతో సంతోషించి తల్లితో వెళ్ళి, తమ్ముడి తరుపువారి అవమానాలు భరించి బాధపడుతున్న నరహరికి పెళ్ళి ఇంట్లోకి అరెస్టువారెంటు వస్తుంది. తనకన్నా చిన్నవారి మధ్య, అయిన వారి మధ్య బంధువుల మధ్య తలవంపులై పోతాడు నరహరి.

మునసబు సంపెంగిని జైల్లో విడిగా కలుసుకుని నరహరికి ఉరిశిక్ష పడుతుందని భయపెడతాడు.

"నన్ను ఉరితీయించెయ్. ఆ బాబు కీర్తికి మచ్చరానీయకు" అని కట్టుతెగిన బ్రహ్మపుత్ర అయిపోతుంది సంపెంగి.

"ఏమిస్తావు?" మనిషిలో లౌక్యుడు, నీచుడు ముందుకు వచ్చి, మునసబు రూపంలో బేరాలు పెడతాడు. "నాకున్న యావదాస్తీ తీసుకుని, అతణ్ణి రక్షించు..." చేతులు మోడ్చి, దీనంగా అర్థిస్తుంది దురదృష్టవంతురాలైన ఆ ప్రేమికురాలు.

"కానీ నాకు కావలిసింది నీ సొగసు..." అంటాడు ఏనాడూ ప్రేమికుడుగా బ్రతకలేని ఒట్టి కాముకుడైన ఆ నీచాత్ముడు.

సంపెంగిలో ఆవేశం కట్టలు తెచ్చుకుంటుంది. "ఈ సొగసులో ఇంకేం మిగిలింది? ఇదుగో చర్మం ముడతలు పడిపోయింది. ఈ ఎముకలు మెత్తబడి పోతున్నాయి. వీటిని ముట్టుకుని, ముద్దాడి ఏం తృప్తి పడతావు..." అంటుంది. 'ఇది తప్పించి ఇంకేం కోరుకోలేవా?" అని దీనంగా అడుగుతుంది. కానీ, మునసబు దృష్టిలో ఆమె తప్ప ఆ వ్యాపారంలో కోరతగ్గదేంలేదు. భర్తను కాదని నరహరికి లొంగిన ఈ విలాసవతి తనకు లొంగడం నీతికాదని ఎలా అనుకుంటుందో స్వార్థజీవి అయిన అతని బుద్ధికి అందదు. అందుకే, నరహరి జీవితం పణం పెట్టి, మరేదారీ లేదు అతణ్ణి రక్షించుకోడానికి అని ఆ మాన్యత కలిగిన స్త్రీమూర్తిని మభ్యపెడతాడు.

ఆఖరికి కన్నీటితో ఒప్పుకుని,

"ఆ బాబును విడిపించుముందు" అంటుంది.

"ఆడితప్పవుగా!" కామాగ్నితో కాలుతున్న ఆ కాలసర్పం.

ఒక్కసారి భూనభోంతరాలు దద్దరిల్లినట్లు ఒణికిపోతుంది. సంపెంగి... ఆమెలోని నిజాయితీ, నమ్మిన మనిషిని గౌరవించి, ప్రేమించగలగడం, మనసుకు నచ్చని విషయంలో రాజీపడలేకపోవడం, అబద్ధం చెప్పి, లౌక్యంగా బ్రతకడం చాతకాని నిజాయితీ సువాసనతో విప్పారిన సంపెంగి ఆమె.

అందుకే "నేను సంపెంగిని" అంటుంది ఆ మాటలో ఆమె ఏకాగ్రత, త్యాగం, ఆత్మార్పణ. ఈ సర్వం మూర్తీభవించిని, ధ్వనించి, రూపుదాల్చి, ఇటు మునసబును, చాటుగా ఆ సంభాషణ వింటున్న రాములమ్మను ఇద్దర్నీ ఒణికిస్తాయి. తన బిడ్డ ఏమైపోతాడో అన్న భయం రాములమ్మలో ఆవిరైపోయి.

"సంపెంగీ! నువ్వంటే ఏమిటో నాకు తెలుసు. నా బిడ్డ జాగ్రత్త" - అని సంపెంగిలో సౌగంధం గ్రహించి అప్పగింతలు పెట్టి వెళ్ళిపోతుంది ఆ మాతృమూర్తి.

కోర్టులో సంపెంగి మీద అభియోగం వచ్చినప్పుడు

"ఇదుగో తాళి..- ఈ తాళి ఎందుకు కట్టారో, ఎప్పుడు ఎవరు కట్టారో నాకు తెలియదు. నేను వలచింది తలచింది ఒక్కరినే... ఆ నరహరి బాబును తప్పించి నాకు ఎవ్వరూ తెలియదు..." అని గర్జిస్తుంది.

"మేము మనుష్యులము చంపే నీచులం కాము - ప్రేమకు భాష్యం తెలిసిన మాటల్లో నైత్యం ఉండదు" అని ధ్వనిస్తుంది.

మునసబు అన్న మాట మీది గౌరవం కన్న సంపెంగి పొందు కోసం పడే తపనతో పరదేశి రాసిన ఉత్తరం అప్పుడే తను చూసినట్లు కోర్టులో సమర్పించి నరహరిని సంపెంగిని విడుదల చేయిస్తాడు.

కోరి ఉపకారం అందరికీ చేసే నరహరి పాలిట సంపెంగి కామధేనువు. కోరని వరాలిచ్చే దేవత. చెట్టు ఆకులు రాలుస్తుంది, మళ్ళీ చిగురించడానికి దుఃఖం మొదళ్ళలో కనబడని చిగురులా సంతోషం దాగి ఉంటుంది. జీవితధ్యేయం ఆనందోపాసన... అది ఏ తరగతి మనిషికి ఆ తరగతి అంచుల్లో దర్శనమిస్తూనే ఉంటుంది. దుఃఖాన్నుంచీ తేరుకుని ఆనందపుటంచులు చేరడానికి జీవితాల్లో కొందరు వ్యక్తులు, కొన్ని అనుభూతులు కొన్ని భ్రాంతులు, ఎన్నెన్నో సహజ సంఘటనలు పనిముట్టులా ఉపకరిస్తాయి. వీటిని ఉపయోగించుకోలేని మనసు సాధారణంగా ఉండదు. ఇవి మనసు దాటి మేధస్సును స్పందించే అనుభవావేశాలు కాకపోవడం వలన మనిషి ఆలోచించడు, అనుభవమే కోరుకుంటాడు నరహరికి అలాంటి పనిముట్టు సంపెంగి. ఆమె మీద ఉండే ప్రేమానురాగాలే అతణ్ణి విషజ్వాలలాంటి అన్నదమ్ముల విశ్వాసరాహిత్యాన్ని, వాత్యల్యంతో కూడిన తల్లి మృత్యువుని, ప్రపంచం చూపించే నమ్మక ద్రోహాన్ని భరించగలిగేలాచేశాయి.. కానీ... సంపెంగి మాత్రం వాడిపోతుంది. కారణం అతనికి తెలియదు. నోరెత్తి మాటాడని సంపెంగిని చూసి కినుక చెందాడు. అలిగాడు.

"ఈ లోకంలో అంతా మాయే అనుకున్నాను నిన్ను తప్పించి..." అని నిట్టూర్చాడు. ప్రశ్నార్థకమయ్యాడు.

"నేనూ అలాగే అనుకున్నాను. మనం అనుకున్నది అనుకున్నట్లు జరిగితే దేముళ్ళమై పోమూ - కీడెంచక ఏం చెయ్యను? మేలెంచడం మర్చిపోయాను." దుఃఖం కన్నీరు మర్చిపోయిన సంపెంగి నిర్లిప్తంగా అంటుంది. అనక ఏం చేస్తుంది?!

మునసబు చుట్టూ చెరలా ఉన్నాడు. ఆ మధ్య ఉన్న ఈ రామరాజ్యంలాంటి ప్రేమ సామ్రాజ్యంలో తనెంతకాలం సుఖంగా ఉండగలదు?! ఆత్మహత్య చేసుకుందామనుకుంటుంది. కానీ ఆమెకు తన మానం ప్రాణంతో సమానం. ఆడినమాట ఆ తన మానం కన్నా గొప్పది. గట్టు చేరిన వెనక ఉట్టి వానితో ఎలా పోట్లాడుతుంది?! ఆ అయోమయ పరిస్థితి నరహరికి చెప్పేదికాదు. అలా తను ఎంతకాలమో భరించలేదు.

బలవంతపరిచే మునసబును "ఇంకా కొద్ది రోజులు ఆగలేవా?" అని జాలిగా అడుగుతుంది. నరహరిమీద మమకారం చంపుకోలేని ఆ జీవిలోని ఆర్తి అర్థం కాక పోయినా ధ్వనించిందేమో.

ఉన్నట్లుండి వృద్ధాప్యం వచ్చినంత కృద్ధుడైపోతాడు అతను.

"నువ్వు మరింత ఎముకుల పోగువైపోతే నాకేం సుఖం?" అంటాడు. "నా మాట నేను నిలబెట్టుకున్నప్పుడు నీ మాట నిలబెట్టుకోవడం నీ ధర్మం.." అంటాడు.

అతడు ఆమెకు అర్థమౌతాడు. అతడేమిటి?! అతడి రూపంలో నిలబడ్డ సంగం తాలూకు పశుబలం, అధర్మ రూపం ఆమెకు వెంటనే గోచరిస్తాయి.

"ధర్మం...అవును. అది నా ధర్మం..." నవ్వుకుంటుంది సంపెంగి. తనను ఏలుకోలేని భర్తను, తనంటే ఏమిటో తెలియని భర్తకు విశ్వాసంగా లేనని నిందించిన ఈ ప్రపంచం, ప్రియుణ్ణి మనసావాచా కర్మణా ఆరాధించిన వ్యక్తిని విడిపించడానికి ఆమె శీలాన్ని పణంగా కోరుకుంటోంది - ఎంత విచిత్రమైన నీతి సంఘానిది?! ఆడదాని అభిజాత్యమంటే ఎంత తేలిక? ఆమె తన ఆదర్శాలకు ఇచ్చుకునే విలువలంటే ఎంత అర్థంలేదు ఈ ప్రపంచానికి "వారంలో అప్సరసనై నీ పక్కన చేరుతాను, కానీ ఒక్కసారే" అంటుంది సంపెంగి.

ఆమె మెదడులేని మగువలా గుండెలేని పాషాణంలా మారిపోతుంది. మనసు, మమతలకు గుడికట్టి శరీరం నుంచీ దూరం చేసుకుని, ఊహాసామ్రాజ్యంలో ఆరాధించుకుంటోంది. శరీరాన్ని వాటినుంచీ విడదీసి సౌందర్యరూపంగా తయారైంది. కానీ విచిత్రం! అంత ప్రేమించి, ఆరాధించి సొంతం చేసుకున్న నరహరి ఆమె దుఃఖానికి అర్థం వెతుక్కున్నాడేమో కానీ ఆమెలో ఉప్పొంగుతున్న నిశ్శబ్దసాగరాల దుఃఖఘోషను అర్థంచేసుకోలేకపోయాడు. కారణం ఏమిటి?! ఇక్కడ రచయిత చాలా గొప్పగా మనని ఆలోచింపజేస్తారు, ప్రేమించిన స్త్రీ, తనను తాను సమర్పించుకున్న స్త్రీ. ఈమెతో పురుషుడు ఆద్యంతాల మధ్య వరకే ప్రయాణం చెయ్యగలడు. ఆ తరువాత ఆమె ఎదుగుదల, అద్భుత భావాతిక్రమణ ఆమె తేజోరూపం అతణ్ణి మించీ ఎదిగిన పరిణితిని (ఎక్కడో మహాపురుషుడు తప్ప) మామూలు వ్యక్తి అర్థం చేసుకోలేదు.

అటువంటి ఎదుగుదల ఆమెలో ఉంటుందని కూడా అతడు ఊహించుకోలేడు. ఇక్కడే స్త్రీ సంకీర్ణమై, జటిలసమస్య అయి పురుషుణ్ణి మోసగించిందనో అభిమానానికి దూరం చేసిందనో, వెనుకటి ఆప్యాయత లేదనో ఆమెను నిందించి, పీడించి, దుఃఖపెడతాడు మొగవాడు. ఏ వ్యక్తి ప్రేమాలంబనతో ఎదిగి, ఏ మనిషి ఆరాధనా వీచికలతో, తన వింతలోక ప్రయాణానికి, నిర్లిప్తత, కామం లేని ప్రేమ ఆలంబనగా ప్రయాణం సాగించే యోగినీ స్వరూపాలు చాలా నక్షత్తుగా ఉంటారు. అందరూ ఆ స్థితికి చేరలేరు కాబట్టి ధూళి రాలిన ఆత్మార్పణాన్ని, పిరికితనపు ఆత్మహత్యగా చిత్రీకరించుకుని సంఘం, అందులో భాగమై శేషప్రశ్నలా మిగిలిపోయిన ఆమె ప్రియుడు కూడా సమన్వయపరుచుకుంటారు.

అందుకే నరహరికి ఆమె దుఃఖం, నిర్లిప్తత అర్థంకాక విసుక్కుంటాడు. శరీర పొంకం చూసి, ఆరాధకుడుగా ఆశ్చర్యపోతాడు. కానీ, ఎందుకు ఆమెలో స్పందన మూగవోయిందో అర్థంకాక అలుగుతాడు.

నరహరి పక్క ఊరు వెళ్ళాడు. అది అవకాశంగా తీసుకుంటాడు మునసబు. ఆడిన మాటకు కట్టుబడి లొంగిపోతుంది సంపెంగి. ఆమె లావణ్యంలో తపన తీర్చుకోవాలని ఊరునుంచీ వచ్చిన నరహరికి మూగ శిల్పం ప్రత్యక్షమౌతుంది. కన్నీటి కాలువ కళ్ళబడుతుంది. అతనికి ఆమె ఏమాత్రం అర్థకాదు. ఆమె ప్రేమ పరిధులు తుడిచేసి ఊహావిహంగమై పోయింది.

"అభిమానం అదివరకు నీ ఒక్కడి మీదే ఉండేది. ఇప్పుడు అందరి మీద. వీధిలో ఉన్న కుక్క మీద, వాకిట ఎగురుతున్న కాకి మీద కూడా ఉంది. నేను తప్పులు చేసే జారుముడిని. నీవు దేముడివి. నీ మీద నాకిప్పుడు ఉన్నది అభిమానం కాదు భక్తి..." అంటున్న ఆమె జీవ పరిణితి అర్థం కాదు పాపం నరహరికి.

"పల్లెపడుచువు. నీకీ పెద్దమాటలేమిటీ?" అంటే, -

"నా దేముడితో సహవాసం ఉత్తినే పోతుందా?! నా మనసు మారిపోయింది. నా ఊహలు మారిపోయాయి. శాశ్వతమైంది ఈ కండల అందం కాదు. ఊహల అందమే..." అంటున్న ఆమెను చూసి నిర్విర్ణుడౌతాడు నరహరి. "ఆమెలో ఏ గంధర్వాంగనో ప్రవేశించింది -" అనుకుని ఆశ్చర్యపోతాడు.

ప్రేమతో పునీతమైన ఆ దేవతా స్వరూపిణిని అతడు ముట్టుకోవడానికే వెనుకంజ వేస్తాడు.

చాలామంది నైసర్గిక ప్రేమల గురించి చెప్పిన విప్లవాత్మక రచయితలు, నైతిక సమస్యల గురించి గర్జించి భయపెట్టిన విశృంఖల రచయితలకన్నా సున్నితంగా స్త్రీమూర్తి హృదయాన్ని కన్నీటిలో ముంచి సంపెంగి రూపాన్ని చిత్రీకరించిన శ్రీ బలివాడ కాంతారావుగారు అత్యంత అద్భుతంగా ఆలోచించగల మేధస్సు ఉంటే అర్థ చేసుకోండని సవాలు చేశారు ఈ సన్నివేశాన్ని శారీరక పవిత్రత, అనే పదాన్ని సంఘం ఎంత అర్థం లేకుండా విశ్లేషిస్తుందో, మానవ జీవితాన్ని పునీతం చేసే పవిత్రత ఏ ఔదార్యం, అద్భుతం వల్ల జీవితం చుట్టూ మెరుపులా వ్యాపించి, జీవనాన్నే తపోవనంగా మారుస్తుందో చాలా గొప్పగా చెప్పారు.

భర్తను కాదనలేక, తనకు మాత్రం లొంగిన సంపెంగి ప్రేమైక మూర్తి. కానీ, తన కోసం, తన క్షేమం కోసం శరీరాన్ని పణంగా పెట్టి, ఆత్మను ఉద్ధరించుకున్న సంపెంగిలో దేవతా స్వరూపాన్ని దర్శిస్తాడు నరహరి. జరిగింది ఏమిటో తెలియక పోయినా... ఇది చాలా హృదయమున్న రచయిత మాత్రమే చిత్రీకరించ గలిగిన గొప్ప సహేతుక సమస్యాపూరణం. సంపెంగి మందులేని జబ్బుతో బాధపడుతోంది. మనుష్యుల్లో నివసించే యోగ్యత ఒదులుకుంది. తన విష రక్తం అతడికి సోకకూడదనే ఆమె దీక్ష ఆమె గుండెల్లో గుచ్చుకున్న సూదుల్ని అతని గుండెల్లో నాటకుండా చూడటమే ఆమె పరమావధి. కోరి మృత్యువును ఆహ్వానించి, చివరి క్షణాల్లో అతని పాదాలపై కొన ఊపిరితో ఒరిగి, "నరహరిబాబూ! నా దేముడా! ఈ చివరి దశలో నీ పాదాలపై సంపెంగ పూవును కాలేకపోయాను. నా అపరాధానికి క్షమించు దేముడా!" అని ప్రాణత్యాగం చేస్తుంది... సంపెంగి లాంటి దేవతలో తప్పు చేశానన్న భయం కలిపించిన సంఘం నీతి శాస్త్రాలన్నీ నిప్పులు పోసి తగల పెట్టాలనిపించే ఆవేశం అతి సున్నితమైన అక్షరాల ఊపిరితో రగిలించ గలిగిన బలివాడకాంతారావుగారు సామాన్యులుగా కనబడే అసామాన్య రచయిత.

రేకులు రాలిన సంపెంగిని ఒడిలోకి తీసుకుంటాడు నరహరి.

ఆమె చిరంజీవి. అతని మనసంతా ఆమె తలపే. అతని కళ్ళల్లో ఆ సౌందర్యాది దేవత ఇల్లు కట్టుకుంటుంది. అది శారీరక సౌందర్యాన్ని దాటిన మూర్తిత్వం, మనస్సు వాక్కు కర్మలతో ఆమెను ప్రేమించిన అతను, ప్రాణత్యాగం చేసిన ఆ స్థూలదేహాన్ని బుగ్గి చేశాడు.

అతణ్ణి, సంపెంగిని అర్థం చేసుకోలేని తనవారి కందరికీ దూరంగా, విశ్వాసం గల కుక్క తోడుగా, ఆ కుక్కకు తన సంపెంగి ముచ్చట్లు చెపుతూ, జీవితమంతా ఆమె జ్ఞాపకంగా చివరికాలం వెళ్ళదీస్తాడు సంపెంగి ప్రేమను పొందిన అదృష్టవంతుడు నరహరి. సంపెంగి గురించి ఎవరైనా చిల్లర మాట మాట్లాడితే "మనిషి కళ్ళు మూసినా అనుకోడానికి ఎంత ఉంటుంది?! మూఢులు మగ ఆడ మధ్య ముద్దులు, ఆలింగనాలు తప్పించి మరే సంబంధం తెలుసుకోలేరు. చావు అంత్యంగా పుట్టిన మనుష్యులు ఇలాంటి చచ్చు ఆలోచనలే చేస్తారు. తాగినంతసేపూ తీయగా ఉండే పంచదార పాకంలా ప్రేమను ఆరాధిస్తారు. ఆ తీపి దూరం అవగానే ప్రేమంతా చచ్చిపోతుంది ఈ మనుష్యులకు."

"నా సంపెంగికి చావులేదు. ఆమెపై ఉండే ప్రేమ దివ్యలోకంలో అమృతం వంటిది. అమృతమూర్తికి జరామరణాలుండవు. నా సంపెంగి తరతరాలు జీవిస్తుంది. ముత్తాతల కాలం నాడు నిర్మించిన పాడుబడ్డ కోటల్లాంటి నీతులూ, కట్టుబాట్లు, విశ్వాసాల మధ్య నేటి జీవితాలను బంధించాలని చూస్తారేం? అంకెలు చెదిరిన కొలబద్దలతో కొలుస్తారేం?!" అని ఆలోచిస్తూ, వాపోతూ ప్రపంచానికి చాలా అర్థరహితంగా కనిపించే నరహరి సంపెంగి స్నేహంతో ఆమె పరిమళాలందుకుని మహా మనిషిగా జీవిస్తాడు చివరి రోజుల్లో.

కన్నీటి నిజస్వరూపం, దానికి కారణం అయిన భావోద్వేగం, నిశ్శబ్ద హృదయార్పణం వెలువరించే కనిపించని అయస్కాంతపు వెల్లువల్లాంటి ఆలోచనలు ఇవన్నీ ఈ నవలను, సంపెంగినీ ఆవరించి ఉంటాయి. పుస్తకం మూసి పాఠకులు విడిచే నిట్టూర్పులో శక్తే ఉంటే, సంపెంగిలాంటి స్త్రీమూర్తిని అర్థం చేసుకోలేని సమాజం గజగజ వణికి నీరై ప్రవహించాలి మరి...

ఇంత సున్నితంగా సామాజిక, ఆర్థిక, వ్యవస్థలను వివరిస్తూ, తెలుగు జాతిని విపరీతంగా గౌరవించి ప్రేమించ గలిగిన ఈ ఉన్నతమైన రచయితను అర్థం చేసుకుని ఆస్వాదించే స్థితికి పాఠకలోకం ఎదగాలేమో.......

ఆయన సామాన్యులుగా కనబడే మాన్యులు. విశాఖ పట్టణంలో సాహితీ వసంతాలను పూయించిన మంచి వ్యక్తి. ఈనాడు ప్రసిద్ధులైన రచయితలు, రచయిత్రులకు చాలామందికి స్ఫూర్తినిచ్చి, వెనక నిలబడి, రచనలు చేయించిన వ్యక్తి బలివాడ. "ఒప్పుకునే ఆత్మోన్నత్యం వారికి ఉందో లేదో కానీ, చాలా మంది వెలుగు చూపిన సాహిత్య మిత్రులకు నిశ్శబ్ద మైత్రిదాత బలివాడ." అన్నారు ఒక

సాహితీ మిత్రులు... నక్షత్తుగా సాహిత్యంలో కనబడే ఔన్నత్యం రచయితలో పల్లవించి ప్రజ్వరిల్లడం జరుగుతుంది... అటువంటి వ్యక్తి "సంపెంగి"ని సృష్టించి, తన పాఠకులకు కానుకగా ఇవ్వడంలో ఆశ్చర్యపోవలసింది ఏమీలేదేమో.

## వడ్డెర చండీదాస్ హిమజ్వాలలో గీతాదేవి

"దుఃఖమే ఆమెను ఊరడించగల నీలపు నిప్పురవ్వ ఆమె తన రసభావన మీద తన మనసును నిశ్చలంగా మౌనంగా ముద్రించుకోగలదు.

"సన్నటి తెల్లని మస్లిన్ బట్టలలోంచి ఆత్మల్ని నిద్రపుచ్చాలని చూసే శరీరం, ఘనీభవించిన సంగీతంలా నిలిచిన శరీరం, శతాబ్దుల నాదం పెల్లుబికిన లావానీ గుండెల నిండా దాచుకుని మంచు కొండలు ముంచెత్తి వేస్తే అది విశ్వచలన పరికంపనకి సర్వమేళన చేస్తూ పరిశ్రమిస్తుందేమో అనిపించే శరీరం - ఆమె లేదు ఆ శరీరం ఆమెది కాదు. ఆశరీరం ఆమెకి అక్కర్లేదు.ఆమెకి కావాలిసింది ఆ శరీరాన్ని రసజ్వాలలో మండించి తను ఆత్మ అయిపోవడం.

"ఆమె స్వేత సౌదామిని. మనిషి కాంతితో పాటు ప్రయాణం చేస్తే ఆ రసరూపు మృత్యుంజయి."

ఆమె - 'హిమజ్వాల' నాయకి గీతాదేవి!

గత దశాబ్దాలలో వచ్చిన గొప్ప తెలుగు నవలల్లో "హిమజ్వాల" ఒకటి. ఒక్క నవలతోనే పాఠక హృదయాల్లో అగ్రసింహాసనం వహించగలగడం స్థితప్రజ్ఞత ఉన్న వ్యక్తులకు తప్ప వీలుపడదు. కేవలం పాండిత్యమో, శాస్త్రజ్ఞానమో, భాషాసౌలభ్యమో, కథనాసక్తో, భావ విప్లవమో, ఆదర్శాల ప్రకటనో రచయితను గొప్పవాడిని చెయ్యవు చెయ్యలేవు. అతనిలోని మహనీయత కొంత అక్షరాలలో మెరిసి, ఆ మెరుపు పరమాద్భుత సజీవ చేతనా ప్రవాహమైనప్పుడు అందులోని పాత్రలు క్షణికతను బుద్బుదప్రాయమని చెపుతూ మెరుస్తూ కొట్టుకుపోతూంటే, రచయిత హృదయమొక గొప్ప తీక్షణతతో కాంతితో, సౌలభ్యంతో శక్తితో సూర్య సంపదగా,ఫోర్త్ డైమన్షన్ నుంచీ మెరిపించి జ్వలింపజేసి ప్రస్ఫుటం చేస్తూన్నే వాటి అనిశ్చలతను, మార్పును, పరిమాణాన్ని ఏ మాత్రం తన ప్రభావం పడనీయనట్లుగా విప్పి చెప్పినప్పుడు ఒడ్డుననిలబడిన పాఠకుడు అచ్చెరవొందుతాడు. కంటి ముందు జరుగుతున్న పరిణామక్రమాన్ని ఒకింత అర్థం చేసుకోగలుగుతాడు. ఒక్కసారి భ్రాంతీ, భ్రమకులోనవుతాడు. కాసేపు ఆ ప్రవాహంలో తన అస్థిత్వాన్ని అణుకణ సముదాయంగా మార్చుకుని జలకణంగా మారి దీప్తి పొంది "తానే ఆదిగా"భావన పొందుతాడు. ఆ అస్పష్టతను అర్థం చేసుకోగలుగుతాడు. ఆ కొద్ది క్షణాలైనా "ఋషి"యై జ్వలిస్తాడు.

పాఠకుడు రచనా హృదయాన్ని కొత్త అసంపూర్ణంగానైనా అర్థం చేసుకోవడం చాలా నక్షత్తుగా జరగవచ్చును కానీ రచయితే చాలా మౌనంగా, యోగంలా, తపస్సులా తను జ్వలించి తనలోని అంతఃచేతన సృష్టించే పాత్రలౌన్మీలనాన్ని పాఠకుడిగా, మౌనిగా ఏమాత్రం

"తన"ను ప్రవాహానికి అడ్డుపడనీయకుండా తన నుంచీ ప్రవహించి, తానుగా పరిణామం పొంది తాను కానిదానిని దేనినో తిలకిస్తున్న వీక్షణా దృశ్యాన్ని కావ్యంగా మలచడం అనితర సాధ్యమేమో.

అవి సాధించిన రచయిత వడ్డెర చండీదాస్ ఈ అద్భుతాన్ని నాటకీయత, శుద్ధ కథాకథనం, చేతనా స్రవంతి - ఈ మూడింటిని సంలీనం చెయ్యాలన్న అస్పష్టభావం ఏదో రచయితలో ఉన్నది. ఈ భావనతో పాటు - "రచన నిర్దుష్ట స్థిరత్వాన్ని గురించి అతి స్పష్ట వివరణగాక, గమనాన్ని యానాన్ని ప్రవాహాన్ని అక్షరాలలో చిత్రించాలనీ అంతర్ బహిర్ వర్తనాల మధ్య ఉండే గొలుసు పొరలు చిరగకుండా ఒక్కక్కటే విప్పి, ఏ శూన్య రహస్యాన్ని తెలుసుకోవాలన్న కోర్కెతో "ఇలా వేదన పొందే ఈ రచయితా సృష్టించిన అన్ని పాత్రలూ అద్భుతమైనవే 'హిమజ్వాల'లో కృష్ణ చైతన్య, విజయసారధి, శశాంక ఒకరేమిటి అన్ని పాత్రలూ సజీవతతో తొణికిసలాడుతూనే ఉంటాయి.

"గీతాదేవిని సృష్టించడానికి రచయిత తన శక్తినంతా ధారపోసాడు. జీవితాన్ని రసమయం చేసుకోవాలని కలలు కన్న ఈమె రసదాహాన్ని రసాన్వేషను గొప్ప కవితావేశంతో చిత్రీకరించారు రచయిత. గీతాదేవి ఇతరులతో అన్నవీ, ఇతరులు ఆమెతో అన్నవీ అభిప్రాయాలూ, భావాలూ అన్నీ ఏ సంకేతాలూ లేకుండా ఏ వివరణా, వ్యాఖ్యానమూ లేకుడా వరసగా ప్రవాహంలా రచయిత చిత్రించాడు. హిమజ్వాల పాఠకులకు కవితా వాహినిలా అనిపిస్తుంది. "హిమజ్వాల" "మనో వైజ్ఞానిక నవల" మాదిరిగానే కేవలం కాలక్షేపానికి ఉపయోగించే నవల కాదు. ఊకదంపుడు దశనుంచి కొంచెం ఆలోచనా నేత్రాన్ని తెరచి ఈ నవలను చదివినప్పుడు పురాణం సుబ్రహ్మణ్యశర్మగారు పీఠికలో చెప్పినట్లు ఇది "ఉత్తేజకరమైన పానీయం" - అంటారు. 'ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి" రచయిత వై రామకృష్ణారావు గారు సౌందర్యం కేవలం భౌతికమైనదైతే అది అందమైన శిల్పంలా స్పందనకు అతీతంగా ఉంటుంది కానీ గీతాదేవి సౌందర్యం వ్యక్తిత్వంతో ప్రజ్వరిల్లుతూ, వాంఛతో అరుణిమను పొంది, స్పష్టతతో వ్యక్తమౌతుంది ఆమెలోని రసదాహం కట్టుబాట్ల శృంఖలాలకు, మనిషి భయంతో, అనిశ్చలతతో వేసుకున్న పరిధులకు లొంగిపడుండదు. రసధుని ఆమె.

గీతాదేవి మహోన్నతుడైన తండ్రి చేతుల్లో రూపు దిద్దుకున్న వ్యక్తి.

"నువ్వు నా సర్వస్వానివమ్మా అన్నారు డాడీ. కానీ డాడీ ఎక్కడ.. ఒక తన్మయత్వం కోసం, వొక రసరూపు కోసం, శాంతి కోసం జీవితాన్ని లెక్క చెయ్యకుండా డబ్బునీ హోదానీ, అధికారాన్ని దిక్కరించి చివరికి ఏం పొందారు డాడీ!! నా జీవితానికి నువ్వొక మహత్తర ఇన్ట్రిన్సిక్ యాస్థటిక్ యెంబాడిమెంట్ అవ్వాలనే నా కోర్కె అన్నారు డాడీ ఏమైపోయారు? అజ్ఞాత సంధ్యలా అంతరించిపోయారు. అమ్మా గీతా! యిన్ట్రిన్సిక్ విలువలు ఉన్నాయనే విషయాన్ని మర్చిపోకు. నీ తండ్రి నీకు ముఖ్యంగా చెప్పే విషయం " ఇలా పలవరిస్తోంది గీత తండ్రికోసం.

ఒక జమిందారీ బిడ్డ అయిన స్త్రీమూర్తి కేవలం ప్రేమతో వ్యక్తిత్వాన్ని అర్జించి ఆమె గీత తండ్రిని వరిస్తుంది. గీతను కానుకగా ఇచ్చి చచ్చిపోతుంది. తల్లి రాజసం, లాలన, ఏకాగ్రత, సౌందర్యంతో పాటు తండ్రిలో స్పందన రసహృదయం నిజాయితీ పుణికిపుచ్చుకుంటుంది గీతాదేవి. తండ్రి యాక్సిడెంటులో చనిపోతే వంటరిదైపోతుంది. కొన్నాళ్ళు పద్మ అనే స్నేహితురాలింట్లో, కొన్నాళ్ళు హాస్టల్లో ఉంటూ రోడ్డు మీద ఏక్సిడెంటులాంటి ఇన్సిడెంటుతో కృష్ణ చైతన్య ఇంటికి అతిధి వస్తుంది. భావకుడు, రసజ్ఞుడు అయిన కృష్ణ ఆమె సాన్నిధ్యానికి దూరం కాలేకపోతాడు. ఆ రసవల్లరి అతణ్ణి సమ్మోహన పరుస్తుంది. కానీ పసితనంలో అతని పిన్ని ప్రవర్తన అతనిలో భయముద్ర పాపముద్ర వేసింది. సుప్తచేతనలో దాగిన ఆ పాపభీతి, భయం పెద్దయింతర్వాత కూడా అతన్ని కల్లో భయపెట్టేది. అందుకే అతను గీతాదేవిలో సమస్తమూ కోరుకున్నా దానికి వాంఛారూప విశ్లేషణ ఇవ్వలేక పోతాడు. ఊహల్లో అనేకసార్లు ఆమెకు దగ్గరై, ఆమెలో లయించిపోగలిగిన అతనికి నిజజీవితంలో, తత్వశాస్త్రంలో ప్రొఫెసర్‌షిప్ పొందిన ఆ తత్వవేత్తకు ఆమె 'ఎరోటిక్ మెటాఫిజిక్స్'లా కనిపిస్తుంది. "ఈమె ఫిజిక్స్‌కి నాందీవాక్యం పలకడానికి ఏ రసిక అరిస్టోటిల్ కావాలో? తానే ఎందుకు కాకూడదు?.." అనుకుని

సాహసించిపోతాడు కాని,

"ఇ ది కాదు సత్యం , నిత్యం ఇది మరో మరపుల తృషా మృషా మృగ మరు మరీచి" అనిపిస్తుంది అతడికి.

కానీ అతని చేరువలో సాన్నిధ్యంలో సేదతీర్చుకుంటున్న గీతకు అతను కావాలి. అది కేవలం భౌతిక స్థితిలో మాత్రమే కాదు కానీ దురదృష్ట వశాత్తు, అంతః చేతన స్థితిలో అతనికి దగ్గరైనా ఆమె మామూలుస్థితిలో దగ్గరయ్యేదేమో కానీ, గీత తొందరపడుతుంది. ఆమె దుఃఖం మానసికం. అది గొంతును పూడ్చివేస్తుంది. "అనాది రసజీవుల మూగకంఠాలన్నీ ఒక్కటై వేసిన కేకే అది సహారా నయాగరాలా దూకిన ధ్వని. అది హిమాలయ లావాలా ప్రజ్వరిల్లిన మహోజ్వల ఘడియ. అది అనుభూతి. ఆ ఘడియ కాలం, తన పురోమరుపుల భారంగాదాచుకున్న నీలపు నిప్పురవ్వ, తన రక్తంతో తను వేసుకున్న నల్లని మంట ఎర్రగా మండి , తెల్లగా వెలిగిపోతున్నట్లు మంచుతో కప్పుకుపోయిన ఎడారిలాంటి అంచులు కనిపించని మైదానంలో చిన్ని గులాబీ పువ్వు చీలిక గిల గిల లాడి, రేకులు విడిజేర్చినట్లు.." అతని తలుపులు ఆమె వాంఛామిళిత స్త్రీత్వపు మిన్నాగు పడగపై దెబ్బ తీస్తాయి. అతడు కరగని నిప్పు రవ్వ అంతే.

"ప్రొఫెసర్ గారూ! మనిషికి ఆకలివేసేది ఒక్క కడుపులోనే కాదు" అన్న వాక్యం రాసి అతని జీవితం నుంచీ అప్పటికప్పుడు బయటకు వెళ్ళిపోతుంది.

గీతంత తొందరపడక పోయుంటే అనిపిస్తుంది. అప్పుడు హిమజ్వాలలో మరొక మలుపు తిరిగేదేమో..

ఆమెలో ప్రత్యేకమైన వ్యక్తిత్వమూ ఉంటుంది. దాని ప్రోదిచేసి తండ్రి చెపితే ఆమెచాలా నాజూగ్గా పరమాద్భుతంగా దానికి పందిరి వేస్తుంది. కానీ సహారాలో ద్రాక్షపందిరి ఎంత వింతో ఈ ప్రపంచంలో "మెటీయ్‌రిలిస్టిక్ నాన్సెన్స్'కు ప్రాముఖ్యత ఉన్న కక్కుర్తి మనుష్యులకు, నీతి అవినీతుల పరిధుల్లో పులి జూదం ఆడే వ్యాపారస్తులకు, ఆట, వస్తు సంచయనం తప నాజుకు భావన స్పందన తెలియని మృగాల మధ్య ఆమె బ్రతకడం ఎంతకష్టమో?! కష్టమని తెలిసినాఆమె తనపద్ధతిలోనే బ్రతకాలని ప్రయత్నించడంలోనే ఈ కథలోని పట్టు ఉంటుంది.

ఆమె కాన్వెంటులో చదువుకుంటుంది. పోస్ట్‌గ్రాడ్యుయేట్. మంచి జర్నలిస్టిక్ విధానాలు తెలిసిన వ్యక్తి. చక్కటి సమీక్షకురాలు. కాన్వెంటు చదువు వంటబట్టింది కానీ జాడ్యం వంట పట్టదు. ఆమె అలవాట్లు చాలా విచిత్రంగా ఉంటాయి. కేవలం టీ బిస్కెట్స్‌తో కొన్ని రోజులు ఉండగలదు. మామూలు ఆహారపు అలవాట్లు ఆరోగ్యపు టానిక్కుల పొరపాట్లు ఆమె డిక్షనరీలో ఉండవు. ఆమె సౌందర్యంలోని నీలిమ, ఆమె రక్తంలో రాగారుణిమ. ఆమె పెదవుల్లో కనులలో శరీరం చుట్టూ ఒక కాంతివలయాన్ని సృష్టిస్తాయి. రసహృదయాలు ఆ స్పర్శను అనుభవిస్తాయి. ఆమె కళ్ళల్లో అగాధాల లోతుల్లోంచి పకపకమని నవ్విన నవ్వు పైకి ఉబికి చిగురుటాకు స్పర్శలా అనుభూతి కలిగిస్తుంది. మహత్తర భక్తిగీతంలోని రసభావన ఆమె చుట్టూ, ఉన్నవారిని కమ్మివేస్తుంది.

ఆమె మాటల్లో తాత్వికత జ్ఞానం, ఎదుటిమనిషిని కొలతలు వేయడం చూసి ఆశ్చర్య పోతాడు జర్నలిస్టు శశాంక.

"మీరు మాట్లాడుతోంటే, ఇక్కడ మీదగ్గర ఈ సోఫాలమీద కూర్చుని మాట్లాడుతున్నట్లనిపించటం లేదు. ఎక్కడో, యే అజ్ఞాత సుందర ద్వీపం మీంచో మాట్లాడితే ఇక్కడ ప్రతిధ్వనిస్తున్నట్లుగా అనిపిస్తోంది. అది మంచు బిందువు దృఢత్వాన్ని పుంజుకున్నట్లనిపింపజేసి మీ కంఠస్వరంలోని విశిష్టతో, లేక భావపు సాంద్రతో తెలియకుండా ఉంది.." అంటాడు.

ఆమె వచ్చి పసుపు రాసి స్నానం చేస్తుంది కుంకుమ బొట్టు పెట్టుకుంటుంది. తిలకం ఆమెకు ఏదో ఆర్టిఫిషియల్ జిగురులా కనిపిస్తుంది. ఆమె శరీరంలో ప్రతిభాగాన్ని ఆమె ప్రేమిస్తుంది కానీ, ప్రదర్శన ఆమెకు అసహ్యం.. అందుకే, తనను చూడగానే తను మేధోజీవిననీ, బుద్ధి బలంతో బ్రతికే రకాన్ననీ గ్రహించక "మోడల్"గా పనిచెయ్యండి అని అడిగిన అడ్వర్టయిజింగ్ ఏజన్సీవారిని,

"క్షమించండి, శరీర ప్రదర్శనతో వచ్చే డబ్బు నాకొద్దు. నేను మేధస్సుతో పని చెయ్యాలనుకుంటున్నాను. .." అని స్పష్టంగా చెపుతుంది.

ఆమెలోని రాగరంజితమైన వాంఛ, దాని స్థితి తెలియక ఒంటరి ఆడదని అవకాశం తీసుకోదలచుకున్న జంతువులు ఆమెకు

చాలామంది తటస్థిస్తారు. కానీ, ఆమె కేవలం శారీరక వాంఛలతో తపించిపోయే స్థితిలో లేదు. ఆమెను సారించి, స్పందింపచేసి, వీణగా మీటి, వలపుఝురులు పలికించే బలమయిన హృదయము, మేధస్సు ఉన్న వ్యక్తి కోసరం ఆమె అన్వేషిస్తూ ఉంటుంది. ఆమె కృష్ణచైతన్యకు దూరమైనా మరచిపోలేదు. కానీ, ఆమె 'ఫుల్‌స్టాప్' కాదు. జీవితాంతం 'కామాల' తరువాత పదవిన్యాసాలు వెతుక్కునే సౌందర్యవాహిని...

అందుకే ఆమెకు దూరమైన కృష్ణచైతన్య ఆమె అన్వేషణలో, నిముషం కూడా ఆమెకు ఊహలో దూరం కాలేక తపించిపోతాడు.

"అదొక యాక్సిడెంట్.. కానీ జీవితం పొడవునా విరామం లేని యాక్సిడెంట్లయితే అది యాక్సిడెంటెలా అనిపించుకుంటుంది.? కళ్ళలో ఆ వెలుగు, ఏదో పూర్వస్మృతిలాంటిదాన్ని, అనురాగపు పొరలాంటి, అనుబంధపు ముడిలాంటి... అనిర్వచనీయ విశిష్టత ఆమెది.." అది అతనికి దూరంకాదు. గీతలో మంచి స్నేహితురాలుంటుంది. ఆమె పద్మకు తదితర స్నేహితురాళ్ళకు చాలా దగ్గరౌతుంది. కానీ, ఆమెలో వ్యక్తిత్వం వారి ఆడతనానినికి అర్థంకాక అసూయపడతారు. తద్వారా, ఆమెకు దూరం అవుతారు. అవమానపరచి తృప్తి పడతారు. తద్వారా, కానీ, ఆమె అంత పట్టించుకోదు. మళ్ళీ అవసరమైనప్పుదు పద్మకు సేవ చేస్తుంది. స్నేహితులను ఆదుకోవాలనే ప్రయత్నిస్తుంది.

గీతలో బాల్యం ఉంటుంది. పసిబిడ్డలకు చాలా చేరువౌతుంది. శివరాం చెల్లెలు, అనురాధ, పద్మ పిల్లలు ఆమెకు స్నేహితులౌతారు. ఆమె వారిని అర్థం చేసుకుంటుంది.

ఆమెలో చాలా అభిమానం ఉంటుంది. తను స్నేహం చేసిన వాళ్ళను, సహాయం చేసిన వాళ్ళను మరచిపోలేదు, కృతజ్ఞత ఆమె ఊపిరి ఇల్లు విడిచి వెళ్ళిపోవాలనుకున్నప్పుడు కూడా అత్తగారి ఆత్మీయతకు నమస్కరించే ఉన్నతురాలామె. తనది కానిది ఏదీ ఆమె అట్టే పెట్టుకోదు. తనకు కానిది కోరదు. శివరాం నుంచీ విడిపోతూ సర్వం అతనికి వదిలేస్తుంది. శశాంక ఎంత బతిమాలినా, చేతిలో రూపాయి లేకపోయినా పైసా అప్పు తీసుకోదు. తనకు అడ్వాన్సు ఇచ్చిన వ్యక్తి ప్రవర్తనను అసహ్యించుకుని అతని డబ్బు అతని ముఖాన కొడుతుంది. నేను చాలా మామూలు వ్యక్తిగా, సినిమాలకు, షికార్లకూ ఆశపడే వ్యక్తిగా లెక్క వేసిన శశాంక స్నేహితుడితో నిక్కచ్చిగా సినిమా డబ్బులు కానీ, ఆటో డబ్బులు కానీ ఇవ్వనీయదు. తనకోసం సర్వం త్యాగం చెయ్యడానికి సిద్ధపడిన విజయసారథి, కృష్ణచైతన్యలనుంచే పైసా తీసుకోదు ఆమె.

ఆమెలో నిర్లిప్తత పొగమంచులా నిక్షిప్తమైఉంటుంది. ఆమె దుఃఖం ఆమె గుండె పొరల్లో ఘనీభవించి ఉంటుంది. ఆమెలో ఓర్పు చాలా గొప్పది. పద్మ భర్త ఆమెను మృగంలా కోరుకున్నప్పుడు పారిపోయి, ఆ విషయం పద్మ సంసారం చెడిపోతుందని దాచాలని ప్రయత్నిస్తుంది కానీ, ఆమె తననే తప్పుగా అర్థం చేసుకుంటుందని తెలిసి నమస్కారం పెట్టి ఆ గడప దాటుతుంది.

తిండీ బట్టకి పెళ్ళి పరిష్కారం కాదు. ఆస్థిపాస్థులు లేక సాంఘిక వ్యవస్థకి చెందకున్నా, తను పురుషుడికి ఎంత వాంఛనీయమైన వ్యక్తో తెలిసిన చతురురాలు ఆమె.

"మీరు మాట్లాడుతుంటే, మీ ప్రక్కన ఉన్న ఎవరితోనో మాట్లాడుతున్నట్లుండదు. కారణం మీరు మాటాడరు. మీది ఒక రసానుభూతి జగత్తు. అందులోంచి ఏదో ప్రతిధ్వనిలా వినిపిస్తుంది. అందుకే అన్నారు – " ఆ ప్రతిధ్వని సాన్నిధ్యం ఐనప్పుడు అది విశిష్టంగా ఉంటుందని" అంటాడు శశాంక.

ఈలపాటలా తేలిపోతున్నట్లుండే అతనిలో ప్రత్యేకత ఆమె క్షణాల మీద గ్రహించగలదు.

"నేను గొప్ప వ్యక్తుల కోవకి చెందినదాన్నికాదు. ట్విస్ట్ డాన్స్‌రాదు. పోనీ కథాకళి భరతనాట్యం.. అబ్బే అసలేరావు. విల్లీస్ హోటల్లో తప్పతాగి ప్రక్క వాళ్ళ చేతుల్లో వొరిగి – టాక్సీలో ప్రయాణం చేసి – ఉదయం పొద్దు నడినెత్తికొస్తుండగా లేచి.. అక్రమ రవాణా ఐన అమెరికా సబ్బు బిళ్ళతో రాత్రిని కడిగేసుకోలేను. పోనీ... అంట్లు తోమి ఆరింటికల్లా ఇంటిల్లి పాదికీ పలహారం, కాఫీలు అందించలేను –

" అంటూ తానేమిటో ఈ రెండు విపరీతాల మధ్య ఊగే అద్భుత స్థితి తనదని స్పష్టీకరిస్తుంది.

గీతలో చిలిపితనం ఉన్నది. గొప్ప తత్వవేత్త ఉన్నది. ఆమె సంగీతంలో అమరత్వం ఉన్నది. ఆమె "సోజా రాజకుమారి" శృతిమించుకున్నా జయదేవ అష్టపది పాడినా, అందులో అర్థం, స్పందన సంగీతమౌతాయి. ఆ సంగీతం హృదయలయబద్ధమై, శ్రోతనాడుల్లో విద్యుత్‌రాగ తుఫానులు రేపుతుంది. అందుకే కృష్ణ ఆమె పాదాలమీద మోకరిల్లి.

"గీతా! ఈ ఒక్కపాట విన్నందుకు నా జీవితాన్ని అర్పించుకోగలను. అమరగానం అంటే తొలిసారిగా తెలిసింది. సంగీతానికి రాళ్ళు కరుగుతాయంటేనూ, దీపాలు వెలుగుతాయంటేనూ నమ్మకం కలుగుతోంది... ఏం మాట్లాడను. నాలో ఏదో సిద్ధి అనేది సంభవించినట్లనిపిస్తోంది.. నేను చెప్పలేను ఏమీ. చిదానందంలాంటిదేమో.." అంటాడు.

"నోవా నవ్వితే ఇలాగే ఉంటుంది కాబోలు.." "ఎంత తీక్షణమైన కాంతి... "ఆమెలో శృంగార రసాధిదేవత అతనికి తటిల్లతలా దర్శనమిస్తుంది.

ఆమె తర్కశాస్త్రాన్ని ఎముకలలో జీర్ణించుకుంటుంది.

"యదార్థానికి నిరూపణ కావాలి. భ్రమకి నిరూపించుకోవాల్సిన అగత్యం ఉండదు.ఎందుకంటే, అది భ్రమ కాబట్టి.." అనెయ్యగలదు.

ఆమె ఫ్రెంచ్‌లో దిట్ట. "ఆంగ్లంలోలాగా ఫ్రెంచిలో అక్షరాలు చిత్తం వచ్చినట్లు మూగనోము పట్టేసి ఊరుకోవు. పంచాంగాననుసరించి తిథి నక్షత్రాలరీత్యా నడుచుకుంటాయి... ఆల్‌బర్ట్ కామూన్ జీవించడం మాని జీవితాన్ని యాగీ పెట్టాడనుకుంటాను.. మరో ఉదాహరణ కాఫ్కా.." అనే సాహితీ చతురురాలు. ప్రపంచం అంతా ఒప్పుకున్నది కాబట్టి తాను ఒప్పుకునే భావదాస్యంలేని విజ్ఞాని ఆమె. ఆమె తరచి, శోధించి మనస్సులోని రసాస్వాదనతో తడిపి, మేధస్సుతో మెరుపు పెట్టినదాన్నే సత్యంగా నమ్ముతుంది. ఆమె ఒంటరి తనాన్ని తోడుగా బ్రతకగలదు. గందరగోళం మనుష్యలకు దూరంగా, టెన్నిసన్ తోడుగా జీవించగలదు. పగడాలు దారం నుంచీ జారినప్పటి శబ్దం ఆమె నవ్వులో ప్రతిఫలిస్తుండగా

"అసలు ప్రేమించకపోతే మాత్రం ఏం? ప్రేమించలేక పోవటంలా ప్రేమించాలనుకోవడం వొక జాడ్యమేమో అనుకుంటాను.." అనెయ్యగల వ్యక్తి ఆమె.

ఆమె రకరకాల ఉద్యోగాలు చేస్తూ, తనకు నచ్చిన విధంగా జీవితం గడుపుతూ, శశాంకలాంటి మంచి ఆత్మీయులను నిలుపుకుంటూ ఎప్పటికప్పుడు ప్రకృతిలో లయించాలని ప్రయత్నిస్తూ బ్రతికే నీహారిక.

ఆమెకు తన జీవితంలో విషాదానికి మలుపు చూడాలనిపిస్తుంది. కాంట్రాక్ట్ పెళ్ళికి, ఒప్పుకుంటుం,ది. అతను శివరాం.. మంచి అత్తగారు, బోలెడు సంపద, ప్రశాంత జీవితం.. కానీ, అది ఎంత అపశృతో ఆమె జీవితాన్ని ఎలా కంబళిస్తుందో అర్థమౌతుంది ఆమెకు "జాలిపడవలసింది తిండి, బట్టలులేనివాళ్ళకి, అవి నేను సంపాదించుకోగలను. నాకు కావలసినది ప్రేమ. అదీ అనురక్తితో కూడినదై ఉండాలి. అనురక్తి రాగరంజితం కావాలి.." అని తనకేం కావాలో స్పష్టంగా చెపుతుంది. ఆ పెళ్ళిని విజయవంతం చేసుకోవాలని చాలా మామూలు మనిషి ఆ రాగ రంజిత స్వర్గసాలభంజికలో కాముకుని మాత్రమే చూసి తన అసమర్థతను సరిపెట్టుకుంటాడు.

ఈ బంగళాలమీద ఈ పాలవెన్నెల వ్యర్థంంగా శుష్కంగా అజ్ఞానంగా కురిసిపోతోంది. పిచ్చివెన్నెల అని జాలిపడుతుంది గీత "ఈ ఐశ్వర్యం, ఈ బంగళా తనను బంధించగలవా? వీటన్నింటికీ కృతజ్ఞతతో, అభిమానంతో గౌరవంతో ప్రణామం చెయ్యగలను. కానీ వాటికోసం ఈ జీవితం శుష్కంగా, నీచంగా, యంత్రంలా, ఎద్దులా నిలిచిపోవాలా? వెన్నెల బాటలో మంచు బిందువుల్ని ఏరుకుంటూ వెళ్ళిపోతుంది. ఆరుద్ర పురుగు పాలరాతి గూటిలో ఉండదని, ఆ మండే వేడిలో తన రేకు కవచాన్ని కరిగించి, సెలవు తీసుకుంటుంది" అన్న నిర్ణయానికి వస్తుంది. ఆమె నిర్ణయానికి అరకులోయ అచ్చాదన కలిగిస్తుంది.

"నీకు కవిత్వం వొచ్చునని తెలుసు నాకు. వాన ఎక్కువైతే నీ కవిత్వం గొడుగు పట్టదు మనకి" అనే నీరసజీవి శివరాం.

ఆమె హృదిలోని తపసులాంటి తపనను అక్షరాలు భగ్నం చేస్తే కవిత్వం అయి ధ్వనిస్తుంది కాబోలు.

అతను ఆమెనూ, ఆమెలోని రసనాలాలనను చాలా సగటు మనిషే కాబట్టి గ్రహించలేకపోగా చూసి భయపడతాడు అది తెలియక నాకు అసహ్యమంటాడు. పచ్చి మొగ మృగంలా "నేను నిన్ను చంపితే దిక్కు ఎవరు నీకు?" అంటాడు.

"నాకా!నాకు దిక్కా! నా స్పర్శకు ఈ చెట్లు, ఈ పూవులు, ఈ ఆకులు, ఈ వెన్నెల ఈ గాలి ఈ చినుకులు సమస్తం మేల్కొని నా హృది సవ్వడిని ప్రతిధ్వనిస్తాయి" అంటుంది ఆమె అతనికి అర్థం కాదు.

"పైసకో రెండు పైసలకో కొని ఉంటావు ఆ పసుపు దారం దాచుకో.. ఉరిపోసుకోవడానికి పనికి వస్తుంది".. అని వెళ్ళిపోతాడు ఆమెను చీదరించుకుని అతను.

"బంధం పడబోతున్నట్లుగా అనిపిస్తూ వినిపిస్తూ అంతలోనే జారిపోయింది. బంధం కాదిది. దారాల అల్లిక చిక్కు అంతే.." అనుకుంటుంది గీత.

అరకులోయలో, వర్షంలో ఒంటరితనం చిత్రంగా ఆమెని భయపట్టదు. భర్తని వదిలేసి పోయిన భార్య తాలూకు "ఇన్‌సెక్యూరిటీ" ఆమెను అంటదు "గాలి కౌగిలింతకే ఆమెలో కోటి విద్యుల్లతలు వెలుగబోయే స్థితి ఆమెది." ఆ ఒంటరి విరహిణిని చూసి,

"ఎవరమ్మా నువ్వు? వర్షపు ధారలతో తలంటు పోసుకుని వెన్నెల్లో తలారబెట్టుకుంటూ రోడ్డు పక్కగా నడుస్తున్నావ్?" అన్న పిలుపు ఆమె జీవితంలో తీయటి మలుపుగామారుతుంది.

"వయోభారానికి, లాలిత్యం చిదికి స్రవించి, చెంపలమీంచి జారి కోసుగా గడ్డ కట్టినట్లున్న గడ్డం కొసతోసామ్రాజ్యాలతో పాటు సామ్రాజ్ఞిలను కూడా కైవసం చేసుకుంటున్నట్లుగా ఎర్రజీరలోంచి నల్లగా మెరిసే ఆ కళ్ళలో "ముట్టడి" వయోగమనంలోంచి అనుభవానికి హృదయం పండిపోయినట్లు "ముట్టడి" (ఈ పదాన్ని ఎన్ని విన్యాసాలు చేయించారో వడ్డెర చెండీదాస్ గారు. ఒక చిన్న పద ప్రయోగంలో ఎంత సౌందర్యము, తీవ్రత, అర్థం. అంతఃచేతనను స్పర్శించగల తేజస్సు ఉంటాయో మనకు అర్థమయ్యేట్లు చెపుతారు. ఈ ఒక్క పదమేమిటి?!" ఈ "హిమజ్వాల" భవిష్యత్ సాహితీ లోకానిక్ క్లుప్త వ్యక్తతకీ, పొందికకీ, వివిధ శాస్త్ర విషయాలను వివరించేందుకనుగుణంగా మన భాష మార్పులకు కారణమవుతుందని, భావించి ఆశించవచ్చు మనం). ముట్టడికి కట్టుబడి అవాక్కైపోతుంది గీతాదేవి అందుకే అతని ప్రశ్నకు,

"నేనెవరినో ఎలా తెలుస్తుంది? అనుభవం తెలుసుకోలేని విషయాన్ని నేను మాత్రం తెలుసుకోగలనా?" అని నవ్వుతుంది. "ఈ అరకులోయ దహించి వేస్తే కరిగి, ఎలిఫెంటా గుహల్లో శాశ్వతంగా ఘనీభవించాలనుకుంటున్న నేను ఎవరినో ఎక్కడకు వెళ్ళాలో .." ఇలా సమాధానం చెపుతూ అతనికి మరింత దగ్గరౌతుంది, జీపులో అతనితో ప్రయాణం సాగిస్తుంది. గాజుపలకలోంచి "శూన్యపుటూదర" మధ్య అతని నవ్వులో వేగం, స్పష్టత, అతని పేరు "విజయసారథి". అతనిలో సాటిమనిషి కష్టంలో, అసహ్యపు లోతు వివరాలు అడగకుండా ఆదుకుని, ఆప్యాయత చూపించి, ఆ వ్యక్తి ఆత్మాభిమానాన్ని కాపాడగలిగే మనస్థత్వం ఆమెను చటుక్కున ఆకట్టుకుంటుంది... అతని ఎదుట, మనిషి మనిషిగా ఏమాత్రం నటన, హిపోక్రసీ లేకుండా హాయిగా బ్రతికే అవకాశం ఇచ్చే వ్యక్తి అతని శ్రమ గమనించి తను జీప్ డ్రైవ్ చేస్తానంటుంది గీతాదేవి. ఏ మాత్రం ఆమె తెలివితేటల మీద, శక్తిమీద పరాయి మనిషే అన్న ఆలోచన లేకుండా స్టీరింగ్ అప్పచెపుతాడు విజయసారథి... ఆమె సడన్‌గా బ్రేక్ వేసి ఆపి యాక్సిడెంట్ అయిందని అల్లరి పెట్టినా ఏ మాత్రం తొణకడు అతను. "ఎవరో ధోవతి రోడ్డుమీద ఆరేసుకున్నారేమిటా అనుకుంటూ పోబోతే, ఏరు తెల్లతాచులా బుసకొట్టి లేచింది పైకి. సడెన్ బ్రేకు వేసాను." అని నిజం చెబుతుంది...

అతని కనుల ముట్టడిలో ఆమె హృదయం చిక్కుపడింది. ఆమె కనుల నీలి జ్యోతులలో అతను లీనమైపోయాడు. ఆవేదనతో, వేడితో, కసితో, నిరంతరాన్వేషణతో జ్వలిస్తున్న "ఆమె మేధస్సు, తొణకకుండా, వేగంగా, నిండుగాప్రశాంతంగా ప్రవర్తిస్తున్న హృదయం కింద

అణగారిపోయింది. ఆమె జ్వలిత జ్వాలలాంటి మేధస్సు, ఆలోచన హృదయపు ప్రశాంతిలో మూగపోయింది. ఆ తరువాత అతను తన ప్రవర్తనకు తను ప్రేమించి ఆరాధించిన భార్య ఛాయలు ఆమె కనుల నీలిజ్యోతులో తారట్లాడటం గురించి సంజాయిషీ ఇస్తాడు.

కానీ. గీత?! ఆమె నిరంతరం అన్వేషిస్తూ మానససరోవరం ఆమెకు ప్రాప్తించింది. ఆమె దాహానికి మామూలు నీరు పనికిరాదు.. ఆమె చలనానికి, వేగానికి, ఆకాశాన్నీ, భూమినీ ఆక్రమించుకోగల హృదయ ప్రశాంతికి రెక్కలార్చుకోగల ఒడ్డు దొరికింది - అందుకే

"ఈ గడిచిన రాత్రి మాత్రమే ప్రేమ నెరిగి జీవించాను. ప్రేమనెరగని జీవికి ఆనందం దొరకవచ్చు. తెలివి అబ్బవచ్చు. మహత్తర అనుభూతిని సృష్టించుకోవచ్చు. కానీ, ప్రశాంతి సాధ్యంకాదు.." అంటుంది.

మరికొన్ని గంటలకాలంలో అతనిలోనిఅధికారం, ఐశ్వర్యం, మేధస్సు, హృదయం, ప్రశాంతత తాను అనుభవిస్తు ఎదుటివారికి పంచగల నేర్పు, ఏ వ్యక్తికి తగినట్లు ఆ వ్యక్తి భావనగా మారగలగడం, జ్వలిస్తున్నవాంఛ ఆరాధన , ప్రేమ గౌరవం - ఒకటేమిటి ఆమె కోరుకున్నవన్నీ ఆ 'వయోవృద్ధ' యువకుడిలో కనిపితాయి. ఆమెను వొదులుకోలేక తన ఇంటికి తీసుకు వస్తాడతను.

నిర్ఘాంతపోతుంది గీత.. అది నఫేజ్ మంజిల్. ఒకప్పుడు కృష్ణచైతన్య తనకు ఆశ్రయమిచ్చి, ఆరాధనతో అర్చించి, ఆర్తితో దగ్గర కాలేనందుకు విసుగుతో, కోపంతో తను దాటిన "గడప", విజయసారథి అతని తండ్రి, శశాంక, కృష్ణచైతన్యవారందరూ ఆరాధనతో, పూజ్యభావంతో గౌరవించే వ్యక్తి.

ఆమె మౌనంగా ఆ ఇంటిలోకి అడుగుపెట్టి అక్కడ ప్రశాంత వాంఛాదీపాలు వెలిగిస్తుంది.. తనను వెతుక్కుంటూ "కృష్ణ" దూరంగా తిరుగుతున్నాడని తెలిసి బాధపడుతుంది.

ఆమెను, ఆమె స్థితిని డాడీగా విని అర్ధంచేసుకున్న వ్యక్తి ఒక్క శశాంక మాత్రమేనేమో, ఆమెను ఆరాధించి, స్నేహంతో గౌరవించిన శశాంక ఆమె కోరుకున్నదేమిటో, ఆమె జీవన వాంఛకు ఏది శాంతినిస్తుందో అర్ధం చేసుకుంటాడు.

"ప్రశాంతి కోసం రెండేళ్ళు తపస్సు చేస్తే చివరికి ప్రశాంతి కాదు పొందగలిగింది. ఆ ప్రశాంతికి చుట్టూ ఉన్న నీడ - ఆ నీడలలో మనసుకు తాకిన సుడులు, ముళ్ళు, మలుపులు, రంపపుటంచులులాంటివి అర్ధమై కృష్ణచైతన్య శారీరకంగా, మానసికంగా అలసిపోయి తిరుగు ప్రయాణం పడతాడు. ఏ స్త్రీమూర్తి ఒడి అతనిని "గీత" నుంచీ దూరం చెయ్యలేకపోతుంది.. కానీ, అతను తండ్రి మరణాన్ని దర్శించటానికి వస్తాడు. ముప్ఫైయేళ్ళలో అరవైయేళ్ళ చదువు చదివేసెయ్యడం కంటే, ముప్ఫై ఏళ్ళలో అరవై ఏళ్ళ జీవితం జీవించడంలో సార్ధకత ఉంది" అని నమ్మిన తన తండ్రి అతని కోసరం దుఃఖిస్తున్న గీత.. కృష్ణ "స్థితి"ని అర్ధంచేసుకోగలిగిన ఎదిగిన వ్యక్తి.. అతనిని మామూలు నీచత్వాలు, సంకుచిత్వాలు అంటవు.. లోకం దృష్ట్యా బంధువుల దృష్ట్యా ఆమెకు ఏపేరైనా ఉండవచ్చు. కానీ ఆమె "గీత" ఆమె ఏమిటో, ఎవరో, ఏమిటో ఆమె ఎంత జీవితాన్ని ఇవ్వగలదో ఆమెకు దూరంగా బ్రతికి నేర్చుకున్న వ్యక్తి అతను. అందుకే ఆమెను ఉండిపొమ్మని అర్ధిస్తాడు... దుఃఖపడతాడు. "కన్నీరు వింత వొంపుల రూపమై ఘనీభవించినట్లుగా, కిటికీ గోడ అంచుకి ఆనుకుని నిలుచుని ఉన్న ఆమె శతాబ్దాలుగా వానలో తడిసినా ముద్ద అయిపోలేక దేవాలయం ముందు దీనంగా చూస్తూ నిల్చున్న శిల్పంలా" అనిపించింది అతనికి.

అతని బంధువులనే రాబందుల అవమర్యాదలు, అతని మేనత్త సీతమ్మగారి శాపనార్ధాలు అన్నీ అర్ధంచేసుకుని ఓర్పుగా భరిస్తుంది గీత.. అబద్ధాలతో, నిజాలతో మాటల గారడీతో అందర్నీ తప్పిస్తాడు కృష్ణ. ఇంకా ఆమె జీవితం ప్రశాంతపు ఒడ్డువైపుకి కాలు వెయ్యకముందే మళ్ళీ పిచ్చివాడై ఆమెకోసం తపించిన శివరాం కనిపిస్తాడు. ఆమె ఏ పరిస్థితినైనా పరిష్కరించగలదన్న ధైర్యంతో వారిద్దరికి దూరంగా ఉన్న కృష్ణకు "గీత" లాంటి అద్భుతాలు, ఇంద్రధనస్సులు కారుణ్యానికీ, దయకు, గౌరవానికీ, మేధస్సుకు జ్వలించి దర్శనమిస్తాయి. కానీ, పశుత్వానికీ, ఐహికానికీ, క్షుద్రవాంఛకు, అహంకారానికీ ఎదురు నిలవలేవని, అంతరించి పోతాయనీ అర్ధం చేసుకోలేకపోతాడు. అప్పుడే 'విజయసారథి' బ్రతికుంటే ఏమై ఉండేదో?! కానీ,

శివరాం గీతను హత్యచేస్తాడు. అవును.. లాలిత్యం, సౌకుమార్యానికి శౌర్యం పర్రాక్రమం దూరమైనప్పుడు డాంబికత్వం, నైత్యం వాటిని హత్య చెయ్యగలవు.. ఒకరకంగా అదే సరైన ముగింపేమో... విజయసారథి, కృష్ణచైతన్య, శశాంకలాంటి చాలా తక్కువమంది వ్యక్తులున్న ప్రపంచంలో మృగాలు అమానుషులు, స్వార్థపరులు, నీచులు, సున్నితత్వాన్ని హత్య చేసేవారు. మల్లెపూవులను ఉరేసేవాళ్ళు ఎక్కువైనప్పుడు గీత బతకదు... బతకలేదు.

"మేధో జీవిత రసానుబంధం మేధకి లొంగని ఏదో బలీయ బంధం కట్టివేస్తే కలిగే నిరంతరాన్వేషణ. యాదృచ్ఛికంగా సంభవించినట్లనిపించే సంఘటనలు జీవితాన్ని ఎలా మలుపు తిప్పేదీ. అందమైన పశువుకీ రసజీవికీ మధ్య వుత్పన్నించే విషాద రగడ.

వైరుధ్యాల మధ్య ప్రేమ వెల్లివిరిస్తే ఎదురయ్యే సమస్యలూ –

పాఠకులలో ప్రత్యనుభూతిని కలిగించగలిగిన రచన నిరర్ధకం కాదు. పాఠకులలో ప్రతిస్పందించని రచన వ్యర్థం..." అంటారు రచయిత.

"నా పాత్రలు తమ గురించి చెప్పుకోవాల్సినదంతా తామే చెప్పుకుని చివరికి నాకేమీ మిగల్చలేదు" అనే ఈ రచయిత తాను కోరుకున్న "వ్యక్తిగత విముక్తి" పొందారనే చెప్పుకోవాలి.

చలం, బుచ్చిబాబుల తరువాత వడ్డెర చండీదాస్‌ను భాషాపరంగా, భావనాపరంగా పాత్ర చిత్రీకరణ పరంగా నిలబెట్టిన "హిమజ్వాల"లో గీతాదేవి సజీవమైన పాత్ర చాలా మామూలు పాఠకుల స్థాయి నుంచీ మనిషిని పెంచి, ఆలోచింప చేసే పాత్ర, మరింత ఎదిగితే ప్రతి స్త్రీమూర్తిని అంటే భావదాస్య విముక్తి పొందాలన్న ఆలోచన ఉన్న ఏ స్త్రీ మూర్తిలోనైనా సరే గీతాదేవి దర్శనమివ్వగలదు మనకు. ప్రతిస్పందన హృదయమున్న ప్రతి మొగవాడూ "గీత" కావాలని కోరుకుంటాడేమో కానీ అంబరాన్ని అంబుధిని గుప్పెట్లో ఉంచుకుని, గుండెల్లో దాచుకోవాలనే వాంఛాతమస్సు కాదు. తపస్సుకావాలి. తద్వారా ప్రశాంత ఉషస్సు తేజస్వినిగా భాసిల్లుతుంది. దాన్ని చూసి తరించి, మమైకం పొందగల ఈశ్వరత్వం మనిషిని ఆవహించినప్పుడే ఆ తటిల్లతా దర్శనం ప్రాప్తిస్తుంది. లేనప్పుడు అంతా శవత్వమూ, జడత్వమూ, వాంఛ, ఢాంబికతల దుర్భరారణ్యాల చీకటిదారులే గతి. శక్తిత్వాన్ని నమ్మే "చండీ" దాసు స్త్రీ అన్వస్వరూపావిష్కరణకు తన "తెలుగు భాష గర్వించదగిన సుందరమైన శైలితో, అనుభూతి వైవిధ్యాల వాక్య విన్యాసాలతో, సుప్త చైతన్యగతులను మూర్తిమంతమొనరించి ప్రదర్శించే విన్నూత్న వాక్యఝురులతో సౌందర్య స్ఫూతో మృదుపద గంభీరతతో అర్చన అలంకారం చేశారు "హిమజ్వాల"లో...

మబ్బుపట్టిన ఆకాశం మసక వెన్నెల వెలుతురులో, నైట్‌క్వీన్ సువాసనా సాంద్రతగల మధ్య మ్రోగింపబడని సితార ఊహానాదాల మధ్య, సముద్ర గంభీర నిర్ఝరుల మధ్య, నైరాశ్యాల పొగమంచుల మధ్య మీకేది కావాలో ప్రపంచానికి అర్థం అవటం లేదన్న బాధగా ఉన్నదా?! ఆ బరువునూ, అనుభుతిని, మీతో పంచుకుని నీలినిప్పురవ్వలను సద్యోఃజాత పారిజాతాల్ని అరుణారిమ జపాకుసుమాల్ని, ఇంద్రధనస్సులనీ, చైతన్య నయాగరాలను మీముందు పరచగలదు. ఒక్కసారి 'హిమజ్వాల' చదవండి. మీలో "లేమి" ఉండదు...

మనఃవాక్కాయ కర్మల చేత మీలోని "హిమజ్వాల"ను దర్శించగలరు. ఇది రచయిత, పాఠకులకు అకర్మణ్యలోపలాయనతలోకి దిగజారకుండా ఎంతవరకూ రాజీపడటం సాధ్యమౌతుంది, తనలో తాను – ఇతరులతోనూ.. అనాత్మలోనుంచీ శరీరం ఆత్మ ఐపోవాలన్న ప్రగాఢ పరితపనకు భాష్యం చెపుతూ కానుకగా ఇచ్చిన మహాకావ్యం...

****

# గోపీచంద్‌గారి 'మెరుపుల మరకలు' - లో ఉషారాణి

*"ఇది మనం అనుభవించే జీవితం. ఈనాటి రచయితలు వాస్తవిక జీవితాన్ని కప్పివేస్తున్నారు. వారివల్ల సాహిత్యం వాస్తవిక జీవితాన్ని కప్పివేసే ముసుగుగా ఉపయోగపడుతూ ఉంది. అది తప్పు. దీనివల్ల మానవునికి కృత్రిమ దృష్టి ఏర్పడటం, జీవితం పట్ల అనేక దురభిప్రాయాలు కలగడం జరుగుతుంది. ఈ కృత్రిమ దృష్టికి, దురభిప్రాయాలకూ అనుకూలంగా జీవితానికి అర్థం చెప్పుకుంటూ ఉంటాం. అందువల్ల సత్యం మనకు ఎప్పుడూ దూరంగానే వుంటుంది. ఎప్పుడైతే మనం ఒక సిద్ధాంతాన్ని అల్లడానికి ప్రయత్నిస్తామో అప్పుడు జీవితాన్నుంచీ వైదొలుగుతున్నాం అన్నమాట. ఈ జీవితంలో 'అస్తిత్వం' తప్ప ఏదీ నిజం కాదు. ఆ అస్తిత్వం మన అనుభవంలోకి తెచ్చేవి మాత్రమే నిజం. వాటిని ఏదో ఒక నెపంతో తోసిపుచ్చటం జీవితాన్నించీ పారిపోవడమే అవుతుంది - మనం జీవితాన్ని ముఖాముఖిని చూడాలి. చూసినదాన్ని చదవరులకు చెప్పాలి. ఇదే సాహిత్యం..." - "జీన్‌పాల్‌సార్త్రే"*

తెలుగు సాహిత్యంలో గోపీచంద్‌గారి స్థానం చాలా ఎన్నతగినది. తన భావాలను ప్రోది చేసి, తరువాత వాటిని చెల్లాచెదురు చేసి, ఎదుటివారిని ఉక్కిరి బిక్కిరి చేసి థ్రిల్ కలిగించాలనే ఆలోచనలు ఉన్న రచయితలు కొంత మంది అయితే, తన ఆలోచనాంతరంగాలను సిరాలోకి ట్రాన్స్‌మిట్ చేసి, అక్షర విహంగాలుగా మార్చి, ప్రాణ ప్రతిష్ఠ చేసి, జీవితం పైగా ప్రయాణం చేస్తూ ప్రపంచాన్ని కదిపి ఆలోచింప చెయ్యాలని, విస్తృతం చెయ్యాలనీ, మనిషిని పరిణామక్రమంలో మృగదశనుంచీ మానవదశకూ, తరువాత అభిమానవ దశకూ చేర్చాలన్న ఆశయంతో, ఆలోచిస్తూ, ఆలోచింపచేస్తూ, పడుతూ లేస్తూ సాహిత్య పయనానికి నడుంకట్టిన రచయిత. ఆయన తన ప్రతి అనుభవాన్నీ తన పాఠకులతో పంచుకుని, నిర్మొహమాటంగా చర్చించాలని కోరుకున్న రచయిత.

అందుకే ఆయన పాత్రలు ఆలోచనా విధానం అనే బాటలో ప్రయాణం చేస్తూ తమ చుట్టుకొలతలను, పరిధిని, స్వాభావికతను మించి ఎదిగి మరొక కొత్త రూపంలో, జీవితం సంతరించుకుంటాయి. "మెరుపులు మరకలు"లో ఉషారాణి పాత్ర అటువంటిదే. ఆమె మనసు ఆలోచింప చేస్తుంది. ఒక్కోసారి ఇదంతా నిజమేనా అని ఆశ్చర్యపరుస్తుంది. నిజం కాల్పనికత కన్నా వింతగా అనిపిస్తుంది. ఇంతకుముందు మన మేధస్సులో ఎక్కడో నిద్రిస్తూ, మధ్య మధ్య మేల్కొంటూ, పైకి పాకి స్థిరపడడానికి కావలసిన ఆలంబనం దొరకక అలజడిచెందే భావాలకు ఉషారాణి ఊతకర్ర అవుతుంది. మనం ఆలోచించడానికీ, అభిమానపడి, బైటపడడానికీ సంకోచపడే విషయాలను చర్చించి, నిజమనిపించి గౌరవనీయత చేకూరుస్తుంది.

వ్యవస్థ ఆమోదముద్ర వేస్తున్న నైతిక చట్టాల దృష్ట్యా ఇందులో "ఉషారాణి" చాలా విశృంఖలతకు అలవాటైన వ్యక్తి. చాలా మంది స్త్రీలు ఆమెలాగా ఆలోచిస్తారేమోకానీ, ఆమె తన ఆలోచనలు, ఉద్రేకాలకు తన ప్రవర్తనతో ఆచరణలో పెడుతూ, ఫలితాన్ని వితర్కించుకుంటూ ఏమాత్రం సెంటిమెంటు లేనట్లుగా కనిపిస్తుంది.

కానీ, ఈ సమస్యను మరొక కోణం నుంచీ చూసి ఆలోచించమంటారు రచయిత. ఈ నవలలో అన్ని స్థాయిలకు చెందిన వ్యక్తుల్ని ఒకే సమస్యను వాళ్ళు ఎన్ని రకాలుగా చూడగలరో మనకు ధ్వనింపచేస్తారు రచయిత. అప్పుడప్పుడు మన స్థాయి ఏమిటా? అన్న ఆత్మ విమర్శ కూడా ఏర్పడేట్లు చేస్తారు. అందుకే గొప్ప రచయిత సాహిత్యలోకానికి ఎప్పుడూ వైతాళికుడే నిద్ర నటిస్తున్నవారిని, నిద్రలేపి ఆలోచించమనీ, "ప్రగతి" ఇదనీ చెప్పాలనే ప్రయత్నిస్తారు.

ఉషారాణి పాత్రద్వారా శ్రీ గోపీచంద్ చాలా సున్నితమైన స్త్రీ లైంగికవాంఛ, అతి సూక్ష్మాతి సూక్ష్మమైన ఊహాదర్శనము, భావ దర్శనము... ఇవన్నీ అర్థమయ్యేటట్లు చర్చిస్తారు. అందుకే నవల పరిధుల్ని దాటి ఎదిగిపోయింది "ఉషారాణి".

ఈమె సౌందర్యము, ఆకర్షణ రెండూ జతపడిన స్త్రీమూర్తి. దీనితోపాటు విపరీతంగా చర్చించగల స్వభావము, చదివే అలవాటు ఉన్న వ్యక్తి. ఇవి కూడా ఆమెకు ఆకర్షణలుగానే మారతాయి. తనలోని భౌతికమైన ఆకర్షణ ఎంత ఇబ్బంది పెడుతోందో ఎదుటివారిని అని అర్థంచేసుకున్న తెలివిగలది. ఆమె నడకలో ఒకరకమైన ఊపు ఉంటుంది. తన సౌందర్యము, స్త్రీత్వమే ఆయుధాలుగా, తన ఆలోచనా పరిజ్ఞానమే సమ్మోహనాస్త్రంగా జీవన సంగ్రామానికి నాంది పలికిన ఈ యవ్వనవతి వ్యవస్థ ఆమోద ముద్ర వేసిన నైతిక చట్రాలకు ఇమడదు.

స్త్రీత్వానికి ప్రకృతి ప్రసాదించిన సమ్మోహనాస్త్రాలు మొత్తం ఆమె చేతిలో ఉంటాయి. ఆమె పెంపకంలో మామూలుగానే ఉంటుంది. రామానుజంగారి లాంటి మంచివాడు, అమాయకుడు పెళ్ళి చేసుకోవడానికి నమ్మకంగా తల వంచుతుంది. కానీ వివాహం అయిన తరువాత ఆమెకు అసంతృప్తి, తనకు కావలసింది ఇంకేదో ఉంది అన్న తపన ప్రారంభమౌతాయి. రామానుజంగారికి ఆమె ఒక ముగ్ధ, ఖరీదైన తనదైన బొమ్మ. కానీ ఉషారాణి చైతన్య స్వరూపిణి. నిశ్చలమైన సారవిహీనమైన కొన్ని వైవాహిక కట్టుబాట్లు, బలవంతపు మనసుకు అంటని నీతి ఆమెకు విసుగు కలిగిస్తాయి. ఆమె రక్తం రాగరంజితమైంది. సాంఘిక బాధ్యతలో సంసార బాధ్యతలో, సంతానమో ఆమెకు అడ్డుపడవు. అవి లేవు కాబట్టి అమాయకుడైన భర్త, చేతినిండా డబ్బు, ఎలా గడపాలో తెలియని కాలం - ఈ మూడింటికీ తోడు ఒక్క క్షణం కూడా విశ్రాంతి చెందని మనస్సు.. ఇంకనేం ఉషారాణి అనేక దారిల్లోకి అడుగులు వేస్తుంది.

"ఆమె ఎప్పుడూ మానసికంగా జీవిత ముఖద్వారం దగ్గరే ఉంటుంది -" అంటారు గోపీచంద్. మామూలు స్త్రీ తన జీవితానికి అనవసరమైనవి (బయలాజికల్ అన్‌నెసరిస్) సమాజానికి అవసరమైన (సోషల్ నెసరిసీస్) ఈ రెండు వలయాలతో తనను తాను చుట్టుకుని ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అసలు ఇవి నిర్ణయించింది ఎవరు? అంటూ వీటిని బేధించడానికి ప్రయత్నిస్తుంది ఉషారాణి. సెక్స్‌లో రేకులు తొడిగే ప్రేమ ఆమెకు అనుభవౌతుందా? అన్న అన్వేషణలో దిగుతుంది.

ఆమె గాలానికి మొదటి ఎర చక్రవర్తి. ఉషారాణితో సంబంధం ఏర్పరచుకోకముందు సామాన్యుడు. ఒక పత్రికలో సబ్ ఎడిటర్. ఆలంబనలేని ఆలోచనాపరుడు అయిన వ్యక్తి మాత్రమే అతను. కానీ ఉషారాణి పరిచయం అతన్ని సుడిగాలిలా ముంచెత్తుతుంది. ఉషారాణి చక్రవర్తిని ఒక పార్టీలో గమనిస్తుంది. అతడు అతని భార్యను అతి సున్నితంగా చూసే విధానం ఆమెను ఆకర్షిస్తుంది. పరిచయం పెంచుకుంటుంది ఆమె. రామానుజంగారే ఈ పరిచయానికి కారణమౌతారు. అందరి ప్రేమికుల్లాగానే ఆమెలో అన్నీ అత్యంత సుగుణాలనే ఊహించుకుంటాడు అతడు. ఉషారాణి పైకి నిండుకుండలా కనిపించినా, చాలా ఆవేశం కలిగిన ప్రవృత్తి ఆమెది. భర్త రక్షణ, నిస్సారమైన ప్రేమ ఆమెను అదుపులో పెట్టలేకపోతాయి. అందుకే చక్రవర్తిలోని సున్నితత్వానికి, గాంభీర్యానికి ముచ్చటపడుతుంది. కానీ ఆమె నిరంతరాన్వేషణ అతను ఆపలేకపోతాడు. మామూలు మొగవాడిలానే ఆమెను సొంతం చేసుకోవాలని, ఆ తరువాత హక్కును

ఏర్పరచుకోవాలని, ఆ తరువాత తనది అయిన ఖరీదైన అపురూపమైన వస్తువుగా మిగుల్చుకోవాలని ప్రయత్నిస్తాడు. అందుకే ఆమెకు విసుగుకలిగిస్తాడు. అతని ప్రేమ కమిట్‌మెంట్ అయిపోతుంది. ఎంత గొప్ప స్నేహం కూడా ఇబ్బంది, విసుగు కలిగించగానే సారవిహీనంగా మారుతుందని తెలుసుకుంటుంది.

అటువంటి స్థితిలో ఉషారాణి శ్రీకాంత్‌ను చూస్తుంది. అమాయకంగా కనిపిస్తూ, డబ్బున్నవారి గారాలపట్టి అయిన అతను ఆమెకు కుతూహలం కలిగిస్తాడు.

ఉషారాణిలో చాలా విచిత్రమైన మనస్థత్వము, కొంత అనిశ్చలత ఉంటాయి. ఆమె ఇలా ఉండాలని ఉండదు. ఏదో తెలియని అన్వేషణలో ఉన్న ఆమెతో కలిసి నాలుగు అడుగులు వేసినవారు, వారి స్థాయినిబట్టి ఆమె మనస్థత్వాన్ని చిత్రీకరిస్తారే కానీ అసలు ఆమెకేం కావాలి? అని ఎవరూ ఆలోచించరు. ఆ విషయం తెలిసిన మొదటి వ్యక్తి ఆమే. అందుకనే అమోఘమైన నటన అలవాటు చేసుకుంటుంది.

ఈనాడు సాంఘిక ఆచారాల మత్తుకు అలవాటుపడ్డ మొగవాడు స్త్రీనుంచీ ఏం కోరుకుంటాడో ఆమె చాల బాగా అర్థం చేసుకుంటుంది. సున్నితత్వం, ఆమాయకత్వం, లజ్జ, తెలివితక్కువతనం నటిస్తూ, బేలచూపుల్తో 'నువ్వు కాబట్టి నన్ను అర్థం చేసుకున్నావు. కానీ, వీళ్ళంతా నాకెవరసలు??' అని ఆ స్నేహితుడు తప్ప మిగతా ప్రపంచాన్ని అస్తిత్వలేనట్లు మాట్లాడ్డం - ఇవన్నీ మొగవాణ్ణి తన ఉచ్చుల్లోకి లాక్కోడానికి కనబడని దివ్యాయుధాలని గ్రహిస్తుంది.

అందుకే 'నాకు దేముడు కలలో కనబడి ఇలా అన్నాడు. అలా చెప్పాడు' అని ఆమె అంటుంటే, ఈ అమాయకురాలు తన భార్య కాకపోతే ఎలా బతుకుతుందా పాపం అనుకుంటారు రామానుజంగారు. ఆమె ఎప్పుడైనా ప్రాపంచిక విషయాలు మాట్లాడితే, 'నువ్వు కూడా మనుష్యుల్లోకి దిగివస్తున్నావే ఉషారాణీ' అని సంతోషిస్తారు పాపం. అందుకే, ఉషారాణి తనంతట తానుగా తన ప్రవర్తన ఆయనతో చెప్పి క్షమార్పణ కోరితేకానీ, ఆయనకు ఆమె ఏమిటో అర్థంకాలేదు.

అలాగే చక్రవర్తి కూడా ... మానవుణ్ణి ఎప్పుడో ఒకప్పుడు పెద్ద ఆవేశం పట్టుకుని ఊపివేస్తుందనీ, అప్పుడు అంతకు ముందు నమ్మినవన్నీ స్వల్పవిషయాలుగా కన్పిస్తాయనీ, ఉషారాణి పట్ల తన ప్రేమ అటువంటిదని ఊహించుకుని తృప్తిపడతాడు అందుకే.

"నీ పనులు నాకోసం మానుకోకు. నీవు లేకపోయినా నేను ఎప్పుడూ నిన్ను గురించే ఆలోచిస్తూవుంటాను. నువ్వు ఎక్కడ ఉన్నా నేను నీ పక్కనే ఉంటాను..." అని నమ్మి పలికినప్పుడు "ఆమె స్వభావం అద్భుతమైంది. తనను ఎంత ప్రేమించినా ఆ ప్రేమ సంఘంలో తను నిర్వర్తించవలసిన బాధ్యతలకు అడ్డురానీయదు" అనుకుని ఆనందపడతాడు. ఆమె తలపుల్లో మిగతా తన జీవితమంతా అనాగరికమైనది అనుకుంటాడు. తన బిడ్డ ముద్దుగుడుములప్పుడు, పేరంటాళ్ళ హడావిడి, మామూలు భాష, భార్య గందరగోళం చూసి విసుక్కుని,

"సృష్టిలో వీళ్ళంతా స్త్రీలకిందే లెఖ్ఖా? కానీ, ఉషారాణికీ, వీళ్ళకూ ఎంత తేడా ఉంది?" అనుకుంటాడు. అలా అనిపించగలగడమే ఆమె ప్రత్యేకత. ఆమె మెరుపు ముందు... మిగతా ప్రపంచం అంతా అలికినట్లుంటుంది. దానికి కారణం అన్వేషణకు ముందు, ఆమె కూడా భౌతిక సౌందర్యం, చాపల్యం కారణమనుకుంటుంది. కానీ ఆమె, అన్వేషణలో సత్యానికి దగ్గరౌతున్న కొద్దీ గానీ మనిషిలో పెరిగే వెలుగు అది అని ఆమెకూ అర్థంకాదు.

ఒకేసారి కలుసుకున్న చక్రవర్తి, శ్రీకాంత్‌ల నిద్దర్నీ ఏం చెయ్యాలో అర్థంకాదు ఆమెకు. అంతగా అవసరమైతే "మీ ఇద్దరన్నా నాకిష్టమే" అని చెబుదామనుకుంటుంది తను శాశించి ఆశించే స్త్రీని మరొక వ్యక్తి కూడా తనను ఉద్దీపింప చేసిన దృష్టితో ఆరాధించి, ప్రేమించవచ్చు కదా అన్న సామాన్య సత్యం మొగవాడికి ఎందుకు అర్థంకాదో ఉషారాణికి బోధపడదు.

అందుకే చిలిపిగా, సరదాగా ఈ విషయం వాళ్ళిద్దరికీ తెలియజెబుదామని ప్రయత్నిస్తుంది. వైవాహిక సాంఘిక సమస్యలను తమతో చర్చిస్తున్న ఆ స్త్రీమూర్తిని చూసి నిర్ఘాంతపోయి, "నీ ఇష్టం ఉషారాణీ నువ్వు ఎలా చెప్పినాసరే!" అనేస్తాడు శ్రీకాంత్ ఏం అర్థమవకపోయినా... కానీ, సున్నితత్వం, తన ప్రత్యేకత మీద విపరీతమైన అభిమానం ఉన్న చక్రవర్తి అసలు సిసలైన మొగవాడిగా బయటపడిపోతాడు. తన కోపం తిప్పుకుని తాను తిరిగివస్తానని ఆమె ఊహించి తనకిష్టమైన చీర, జాకెట్టు ధరించి ఉండటం చూసి, కచ్చతో నానా దుర్భాషలాడుతాడు. కానీ ఆమె భయపడదు. అతణ్ణి లొంగదీసుకుంటుంది. అంతమాత్రంచేత అతణ్ణి "చెప్పు శ్రీకాంత్‌కు, నీకూ తేడా ఏమిటి?" అన్న ప్రశ్న లేపుతూనే వుంటుంది. అతణ్ణి ఆలోచించమంటుంది. ఆమె ఒకరికోసం ఒకర్ని వదులుకోవడానికి సిద్ధపడదు. ఏకోపానికీ భయపడదు. ఏ భావమైనా బహిర్గతం కాకుండా లోపల ఉన్నంత సేపే మనిషిని దహింపచేస్తుంది. ఏదో ఒక రూపంలో బహిర్గతం అయితే దాని శక్తి నశిస్తుంది.. ఇది ఆమె ఉద్దేశ్యం. మొగవాళ్ళంతా పసిపిల్లలకన్నా అన్యాయం ఆమె దృష్టిలో.

అందుకే, ఇలా విశృంఖలతను, స్వేచ్ఛను వివేకంతోనే సమర్థిస్తున్న ఉషారాణిని చక్రవర్తిలాంటి ఆలోచనాపరుడు మేధావి ముందు "మొగవాడు"గా దూషించినా, అతనిలో తెలియని ఆలోచనా కోణాలని ఆమె ఉద్దీపింపచేస్తుంది. అతను ఆలోచించడం ప్రారంభిస్తాడు. ఏమీ తెలియనట్లు అమాయకత్వం నటిస్తూ, ఆమె అడిగే ఫ్రెంచ్ లిటరేచర్ గురించిన ప్రశ్నలూ మరికొన్ని అర్థవంతమైన అమాయకంగా కనిపించే చర్చలకన్నింటికీ కారణం ఆమె "తెలియని తనం" కాదనీ, మరిన్ని కొత్తకోణాల నుంచీ చూడగలగాలన్న ప్రయత్నం అనీ అర్థం చేసుకుంటాడు.

ఆమె అతను ఊహించుకున్న చట్రాలకు అందదని, ఆమె అర్థం కావాలంటే తనే ఎదగాలనీ మౌనంగా అతని మనస్సు ఒప్పుకుంటుంది. అందుకే ఆమెకు దూరంగా ఉండాలని ప్రయత్నిస్తాడు. కానీ, ఆ ప్రయత్నంలో ఓటితనం, దానికి కారణమైన అతని అపరిపక్వత అర్థమైన మనిషి ఆమె. అందుకే భర్త చేత ఫోను చేయిస్తుంది. ఏక్సిడెంట్ అయితే శ్రీకాంత్‌ను వెంటబెట్టుకుని చూసివస్తుంది. తనలోని కవ్వింపు, దాని గెలుపు తెలిసిన వ్యక్తి ఆమె. దానికి ప్రతీకగా ఉషారాణి చక్రవర్తి పనిచేస్తున్న ఆఫీసులో అడుగుబెట్టే దృశ్యం చిత్రీకరిస్తారు రచయిత. ఇది ఈ నవలలో మరుపురానిది. ఒక్కసారిగ స్త్రీత్వపు పతాకావిష్కరణ, దాని ఆకర్షణ, ఆ అక్షరాల పూలజల్లులో అర్థమవుతుంది మనకు.

అసలు ఏ సిద్ధాంతమూ సమగ్రంగా, యదార్థంగా, నిర్వచించలేదని ఆమె గాఢవిశ్వాసం. సిద్ధాంతానికి అందేది కాదు జీవితం - అని ఆమెకు ఎప్పుడో తెలుసు. అందుకే ఎడిటర్‌గారు తన స్త్రీత్వాన్ని గుర్తిస్తూ, తనను పొగుడుతూ చేసిన ఆదర్శాలు, ఆశయాల లెక్చర్లు మౌనంగా వింటుంది.

'ఎందుకని తను ఏ పురుషుడితో మాట్లాడినా తృటిలో హద్దులు మీరడానికి ప్రయత్నిస్తారు. అది తన ఆకారంలో ఉందా? ప్రవర్తనలో ఉందా?' అని ప్రశ్నించుకుంటుంది. ఒక స్త్రీ మీద ఏ పురుషుడికయినా ఎక్కువ మక్కువ కలిగినప్పుడు, ఆమె వివాహిత అయితే ఆమె భర్తను పొగుడుతూ భర్త సరసన తన పేరు కలుపుకుంటూ ఆమె సుముఖంగా వుందా? విముఖంగా ఉందా? అని కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడడం మొగవాడి గొప్ప టెక్నిక్ అని తెలిసిన ఉషారాణి, ఆ ఎడిటరు తనను అమాయకురాలనుకుని అదే పంథాలో మాట్లాడుతూంటే నవ్వుకుంటుంది. ఆమె అసలు వచ్చింది చక్రవర్తి కోసం. కానీ ఎవరితో పని వుందో వారితో ఎకాఎకిన మాట్లాడదు. వారితో పని ఉండి వచ్చినట్లుగా, ఇతరులకు తెలియకుండా ముందు ఇతరులతో మాటలు పెట్టుకుంటుంది "జీవితం ఆమెకు నేర్పిన పాఠాల్లో ఇది ఒకటి.." అంటారు రచయిత. ఆమె రాసిన "ప్రేమలేఖలు" చదివి, అది తనని గురించే రాసిందని అనుకుంటాడు చక్రవర్తి.

"ఎక్కడ ఉందో మనిషిలో మహత్తు. విశ్వాన్నంతా అంకంలో పొదుగుకుని జోలపాడగలడు, లాలించగలడు, గుజ్జనగూళ్ళు తినిపించగలడు. ఆ క్షణంలో ప్రపంచంలో ఉన్న నిమ్నోన్నతాలు అతనికి కనిపించవు. రాగద్వేషాలు ఉండవు. స్పృశించిన ప్రతిదానికీ తీయదనాన్ని కలిగిస్తుంది. వెలుగు ప్రసాదిస్తుంది. పులకలను లేపుతుంది. సృష్టి యావత్తూ అమృతసాగరంలో ఓలలాడుతూ ఉన్నట్టు

ఉంటుంది. ఆ స్థితిలో ఉషారాణి ఒక దివ్యమంగళ విగ్రహం అనిపిస్తుంది" అతనికి. తాను ఆమె ప్రేమకు అర్హుడు కాకపోవడమే ఈ ఛిద్రానికి అంతటికీ కారణం అనుకుంటాడు. ఆమె అతనికొక నూతన అనుభూతి. ఆ ఆనందవాహినిలో తేలిపోతున్న అతనికి భగవంతుని దరికి జేరినట్లనిపిస్తుంది.. "శరీరం నిర్మించిన అవధులు చెరిగిపోయాయి. కోర్కెలు మరిగిపోయాయి. ఉషారాణి తనలోనే ఉంది ఇన్నాళ్ళూ. అందుకే వాడిపోయింది. ఈనాటి ఆమె దీనావస్థకు తనే కారణం -."

ఇలా అనుకున్నవాడు సామాన్యుడు కాడు. చక్రవర్తి మేధావి, పత్రికా ఎడిటరు, చాలా ఆలోచించగలవాడు, కొంచెం "నేను" అన్న అహంకారం ఉన్నవాడు - ఇటువంటివాడు, ఉషారాణి తనను తాను వెతుక్కునే అన్వేషణకు ముందే అతనిలోని మధనవలన "ఆమె" ను గుర్తుపట్టి, స్వాంతనపొంది,"ఇది" అని తెలియని శాంతికి లోనయాడు. - అందుకే 'శాంతిలో సౌఖ్యం లేదా ఉషా?' అని ప్రశ్నిస్తాడు.

కానీ ఉషారాణి అంతరంగిక మధనం ఇంకా భౌతికంగా ఒక రూపం దాల్చలేదు. ఇతడు తన చేతుల్లోంచి తప్పించుకుంటున్నాడు పొగమంచులాగా! అనుకుంటుంది. అతనికి కనిపించిన తనలోని "ఆమె"ను గుర్తుపట్టే బాహ్యామైన, ఆంతరంగికమైన పొరలు ఇంకా విడిపోలేదు ఆమెలో.

అందుకే ఆ లేఖలు, శ్రీకాంత్, రామానుజంగారు కూడా తమకోసం రాసినవే అనుకుంటున్నారన్న విషయం చక్రవర్తికి తెలియపరుస్తుంది కానీ, ఆలోచించగలిగిన చక్రవర్తి ఆమె లేఖల ప్రభావం వ్యక్తిపరం కాకుండా, సంఘపరమైనందుకు ఒక రకంగా సంతోషిస్తాడు. ఎందుకంటే స్వేచ్చాసాహిత్యానికి పూనుకున్నవాళ్ళకు చుట్టుపక్కలవారి అనుభూతి, బంధువుల సానుభూతి ఉండదు. "ముద్దు పళని" ఎంత గొప్ప రచయిత్రి అయినా, ఆవిడను రచ్చకీడ్చాలన్న ప్రయత్నం చేసిన సమకాలికులే ఎక్కువ. అందువల్ల ఉషారాణిని జనం ఆ రకంగా బాధపెట్టకూడదని కోరుకుంటాడు చక్రవర్తి. అతని ప్రేమ సామాన్యమైన ఐహికమైన మెట్లుదాటి, ఆమె ప్రేరణతో శాంతి లోకాలకు దగ్గరౌతుంది. దానికి ప్రతీకగా అతని కల రాస్తారు గోపీచంద్.

కానీ ఉషారాణికి మాత్రం ఆ "శాంతి" నీహారికాదృశమౌతుంది. తన వెతుకులాటకు ఆలంబనం దొరకదు. అప్పుడే చంద్రవదనుల వంటి అనవసరంగా పేరు వచ్చిన కవి, తన భావుకత వెనకాల, కళాకారుడినన్న ఆర్భాటం వెనకాల చాలా అసహ్యకరమైన ఆలోచనలకు శృంగారపు వెల్లవేసి దర్శన మివ్వగానే, అసలే అన్వేషణలతో, అనుభవాలతో చురకత్తిలా ఆలోచనా మేఘాలను చీల్చుకుంటూ అంబరయానం చేస్తున్న ఆమెకు ఆయన వ్యక్తిత్వంలోని ఓటితనం అర్థమై విసుగొస్తుంది.

"నువ్వే నా ఉపాసనాదేవతవు..." అని యవ్వనం నటిస్తున్న ఆ ప్రేమ బికారిని చూడగానే నవ్వొస్తుంది. "చివరికి నేనే నీ ఆరాధ్యదేవతను? ఏడ్చినట్లుంది నీ అన్వేషణ!" అనాలనిపిస్తుంది.

"ఆయన ఆవేశం చూసి అనృతాలు వచ్చినా ఆవేశం వస్తుంది కాబోలు.. ఏదైనా అలవాటే.." అనుకుంటుంది. ఆయన్ని తరిమి తలుపులు వేసుకుంటూనే ఆమె చాలా చాపల్యాలకు కిటికీలు వెయ్యడం ప్రారంభిస్తుంది.

అప్పుడే శ్రీకాంత్ చెల్లెలు పద్మ భర్త కమలాకరంతో ఢిల్లీలో పరిచయం అవుతుంది ఆమెకు. పద్మకు జ్వరం రావడంతో... శ్రీకాంత్ కమలాకరం మీద అసూయతో రానంటున్నాడన్న విషయం అర్థం చేసుకోకుండా ఒంటరిగా అతనితో ఊరు చూడటానికి వెళుతుంది ఆమె.

కమలాకరంతో ఒంటరితనంలో మౌనంగా ఉండే అతనిలోని సద్భావం, వ్యక్తిత్వం, స్త్రీ పట్ల జాలి లేకుండా, ఆమె పట్ల ఉండవలసిన మోతాదులో ఉన్న గౌరవం ఆమె దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తాయి. అతనిలో గొప్ప మనిషికి, భావుకతకు మించిన ఆలోచనాజ్ఞానం ఉన్న తర్కవాదినీ, కళల పట్ల నిజమైన ఆసక్తి ఉన్న వ్యక్తిని చూస్తుంది. ముస్లిమ్‌ల శిల్పాల ఔన్నత్యం, కురుక్షేత్రం, మధుర - ఇటువంటి అద్భుతమైన ప్రదేశాలు అతని మాటల్లో దర్శనమిస్తుంటే మైత్రి, స్నేహం - వీటికి అసలు అర్థం తెలుస్తుంది ఉషారాణికి. "చరిత్ర చదువుతున్నప్పుడు మనస్సుకు ఇంత సన్నిహితత్వం రాలేదు. ఎప్పుడో భారతీయ సాంస్కృతీ చరిత్రలో వేదాలతో పాటు,

మహానదులతోపాటు పెను పర్వతాలతో పాటు తానూ ఒక అధ్యాయాన్నే కనీసం ఒక సమాసాన్ని అనిపించింది "ఈ యమునా నది నాతోబుట్టువని ఇంతకుముందు గ్రహించలేకపోయినందుకు విచారిస్తున్నాను కమలాకరం -" అంటుంది. ఆమెలోని లావాలా ప్రవహిస్తున్న అన్వేషణ ఆధ్యాత్మికతవైపు ఒక చూపుగా మెల్లిగా ఒక రూపుగా మారడం అప్పుడే ప్రారంభమైంది. కానీ దీనిని స్థలపురాణానికి ఆపాదించడంకంటే, తనలోని విశృంఖల స్త్రీమూర్తి అడిగే ప్రశ్నలకు, ప్రపంచం అంటగట్టే అవినీతికీ మధ్య నలుగుతున్న ఉషారాణికి తన భావాలకూ, తన ఆలోచనలకూ అర్థం చెప్పి తనలోని వ్యక్తికి గౌరవం ఇచ్చే కమలాకరం కారణం అనిపిస్తుంది. స్త్రీ విపరీతంగా ఆరాధించేది ఈ శక్తినే.

హావిలక్ ఎల్లిస్ మాటల్లో...

"నేటి స్త్రీ మారుతూ ఉంది కానీ, పురుషుడు మారడంలేదు. ఈ వైరుధ్యం భార్యాభర్తల మధ్య తీవ్రరూపం దాలుస్తోంది. మనిషి ప్రియుడూ కాదు. ప్రియుడు భర్తకాడు. పురుషుడు. ఈ మూడు అవతారాల్లో మూడు విధాలుగా ప్రవర్తిస్తాడు. సంఘం మారుతూ ఉంది కానీ, మన కుటుంబ వ్యవస్థ మారడంలేదు. అందుకే సాంఘిక విశాల బుద్ధిని ప్రకటించిన వ్యక్తే కుటుంబంలో సనాతనుడు, నిరంకుశుడు అవుతున్నాడు..." అని చెప్పిన కమలాకరం అతనిలో ఉన్న కొద్ది రోజుల్లో ఆమెకు జనిటిక్స్ గురించి, స్త్రీ పురుషుల అవయవాల గురించి - ఇలా ఎన్నో చెప్పాడు. తనలాగా ఆలోచిస్తున్న వ్యక్తి తను ఇన్నాళ్ళు పోరాడుతున్న భావాలు సత్యదూరాలు కావని చెప్పే వ్యక్తి ఉషారాణిలోని అన్ని పరదాలు తీసేస్తాడు. ఎంతో అమాయకత్వం నటిస్తూ ఎన్నో మాట్లాడిస్తుంది ఆమె అతని చేత. కానీ, తన చిన్న కుదుపు, చిరునవ్వు కూడా అతను వెంటనే గ్రహించగలడని తెలిసి ఆశ్చర్యపోతుంది.

"పురుషునికి వర్తించని పవిత్రత స్త్రీకి ఎందుకు వర్తించాలో నాకు అర్థం కాకుండా ఉంది. ఒక్కోసారి ఈ పవిత్రత నెపంతో పురుషుడు స్త్రీని ఒక కొరముట్టుగా ఉపయోగిస్తున్నాడేమోననిపిస్తుంది. ఈ విధంగా ఉండటానికి అంగీకరించిన స్త్రీలకంటే అంగీకరించని స్త్రీలే మంచివారేమోననిపిస్తుంది - "అంటాడు కమలాకరం.

"వివాహమే పూర్తిగా రద్దవుతుందో, మార్పులే వస్తాయో చెప్పలేం భవిష్యత్తులో. వివాహ వ్యవస్థలో మార్పులు వచ్చి చివరికి వివాహం అవసరంలేని స్థితికి సంఘం రావచ్చు" అంటాడు "వివాహనియమాలను అధిగమించిన వ్యక్తి రాక్షసుడు అవుతాడో, దేవత అవుతాడో ఎవరం ముందుగా నిర్ణయించలేం -" ఇలా తను నమ్మిన సిద్ధాంతాలను సత్యనిర్ణయాలుగా చెప్పి, తనలోని సంఘర్షణను రూపు మాపి తనను, సాధారణ తనదైన విలాస వస్తువుగా చూడకుండా, గౌరవించి, సౌందర్యాన్ని చెలింపచేసి, రాగోద్దీపనం కలుగచేసిన మేధావి అయిన ఆ స్నేహితుడికి దూరం అవ్వాల్సి వచ్చేటప్పుడు మొదటిసారిగా నటించడం మర్చిపోయి కన్నీళ్ళు పెట్టుకుంటుంది ఉషారాణి. బహుశా, ఆమె భౌతికక్షాళన అలాగే ప్రారంభమౌతుందేమో...

ఆమెలో తెలియని అలజడి నిద్ర లేస్తుంది. ఎవరికీ చెప్పకుండా హిమాలయాలకు వెళుతుంది. కరుణానందస్వాముల వారిని దర్శిస్తుంది.

"మౌనంగా వారేదో బోధిస్తున్నట్లే ఉంటుంది. తానేదో వింటున్నట్లే అనిపించింది. శరీరంలోకి విద్యుత్ప్రసారం జరిగినట్లయింది. బాహ్యప్రపంచంలోని శీతోష్ణస్థితిని తట్టుకునే శక్తులు శరీరంలోనే ఉన్నాయనిపించింది. అవసరాన్నిబట్టి వాటిని ఉద్దీపింపచేసుకునే శక్తి ఉండాలి. ఉండాలంటే అది కూడా మానవ శరీరంలో ఉంది. ఆమె మనోనేత్ర ముందు స్వామివారి తేజస్సు అనంతంగా ప్రవహిస్తూ, గాలిలో కలిసి సుళ్ళు తిరిగి భావాల రూపం ధరిస్తుంది. అంటే గాలి ఒరిపిడికి ఆ లేత స్రవంతి కెరటాలుగా చీలిపోయి అందరినీ స్పృశిస్తుంది. గాలిలో కలిసే ఈ కెరటాలు గాలికి తేజస్సు కలిగిస్తాయి. అందుకే ఈ దేశం మహర్షులతో పునీతం అయింది. వారి తేజస్సు కూడా ఈ గాలిలో ఉందా? ఉపాధి దూరం అవుతున్న కొద్దీ ఈ శక్తి ఉనికి ఉపాధియొక్క స్వచ్ఛత మీద ఆధారపడి ఉండవచ్చు -"

ఎంతో గొప్ప ఆధ్యాత్మికభావాలను రాసిన వ్యక్తులు కూడా ధ్యానం, ఆధ్యాత్మికత యొక్క మేగ్నటిజం గురించి గోపీచంద్ చెప్పినంత వివరంగా, సులభంగా చెప్పగలరా అనిపిస్తుంది పైవాక్యాలు చదివితే...

అలా కరుణానందస్వాముల వారివల్ల. తనలోని తనను వెతుక్కుని ఉషారాణి మహాయోగినిగా మారిపోతుంది. ఆమెలో మార్పు వర్ణిస్తూ, "లోనుంచీ మృధుమధుర శరీరమే సువాసనలు వెదజల్లింది. కాంతి నిలయమైంది -" అంటారు. ధ్యానం, యోగం గురించి తెలిసిన గోపీచంద్ "ఆస్ట్రల్‌బాడీ" ఎలా దృగ్గోచరమౌతుందో చెప్తారు.

"వర్షాడంబరం లేని మేఘంవలే, అలలులేని మడుగువలే, కదలక వెలిగే దీపంవలే వెలుగుతూ ఉన్నదా మహాయోగిని. ఆమె నుంచీ వెలవడుతున్న తేజస్సు శరీరం అంచులను చేరి విద్యుల్లతవలె మెరుస్తూ ఉన్నది. మానవ శరీరాన్ని అంటిపెట్టుకుని ఉండే పోలికలు నురిగిన అవస్థ అది. "

ఆమె దర్శనానికి చక్రవర్తి భార్య, చక్రవర్తి చంద్రవదనులు ప్లస్ ఆయన కవిత్వానికి ఉపాధి అయిన వంటావిడ, కమలాకరం, పద్మ వెళతారు. లక్షలాది జనం కీర్తిస్తున్న ఆమె ఎవరెవరి సంస్కారాన్నిబట్టీ వారికి దర్శనమిస్తుంది. పరమనీచంగా ఆలోచించే చంద్రవదనుల వదరబోతుతనానికి పళ్ళురాలగొట్టి మౌనంగా వెళ్ళిపోతాడు కమలాకరం. అటు సంపూర్ణ స్త్రీమూర్తి, ఇటు ప్రేమికురాలు - ఈ రెండు స్థితులలోనూ కూడా దాటిన మహాయోగిని అయిన ఉషారాణి ఏమిటో ఆఖరున పాఠకులకు అర్థమయ్యేట్లు చేస్తారు గోపీచంద్.

హేతువాదులే కాదు, సంప్రదాయబద్ధులైన ఆధ్యాత్మికవాదులు కూడాకొన్ని ప్రసిద్ధ సిద్ధాంతాలనూ, నైతికసూత్రాలను తప్ప అంతరంగిక అనుభూతుల సత్యాన్ని, విశిష్టతను అంగీకరించరు. ఇక్కడే సత్యవాదికి, సిద్ధాంతవాదికి పేచీ వస్తుంది కానీ, సహానుభూతి, భావనాశక్తి ద్వారా తత్వదర్శి లేక సాహితీకారుడూ దీనికి పరిష్కారం చూపించగలరు. ఒక మనిషి మీద జీవితంలో ఒకేసారి ప్రేమ కలుగుతుంది అన్నది అసత్యం అంటుంది ఉషారాణి. వ్యక్తిగతమైన అనుభూతినిబట్టీ, అంతరంగికమైన సత్యాన్ని బట్టీ విలువలు నిర్ణయించాలి అన్నదే అస్తిత్వవాదం. సాహిత్యంలో ప్రతిపాదిస్తున్న కొత్తదృష్టి. సంప్రదాయం రెండు విధాలుగా విభజిస్తే ఒకటి సాంఘికమైన వ్యవస్థాధర్మం (వివాహం వగైరాలు) రెండవది వ్యక్తిగతమైన యోగసాధన. ప్రస్తుతం, వ్యక్తి వికాసానికి సాంఘికమైన వ్యవస్థాధర్మం కాలికి సంకెళ్ళు వేస్తోంది... ఉషారాణి ఒక విశిష్టవ్యక్తిత్వం వికసించడానికి వ్యవస్థాధర్మాన్ని అధిగమించింది. వ్యక్తి వికాసం అనే ధ్యేయం లక్ష్యశుద్ధితో, నిర్భయత్వంతో, కొంత నిస్సంగత్యంతో సాధించవచ్చు. అది సాధించిన తరువాత ఎదురయ్యే దైన్యం, శూన్యం, ఏకాంతం ఎలా తీరుతుంది? ఈ స్థితికి చేరిన వ్యక్తికి వ్యక్తిగత యోగసాధన ఒక్కటే మార్గం... "ఇందులో వింతా విడ్డూరం ఏమీలేదు. కొంత నింపాదిగా ఆలోచిస్తే, వ్యవస్థ ఒక స్థాయి మనుష్యులకు ఆలంబనగా, పట్టుకొమ్ముగా పనికి వస్తుంది. మరొక స్థాయివారికి అది ప్రతిబంధకంగా గోచరిస్తుంది. అంతకంటే పైస్థాయివారికి అది ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. ఆ స్థాయి ఎవరి అంతరంగం వారికి తెలియచెపుతుంది. సాహిత్యంలో అది ప్రతిబింబించిన తరుణంలో ఆ వ్యక్తిస్థాయిని, విశిష్టతనూ గ్రహించి లోకాన్ని కొత్త దృష్టితో దర్శించే అనుభూతి పాఠకులది. ఆ దృష్టి ప్రసాదించినందువల్లే "మెరుపుల మరకలు" ఒక కావ్యం అవుతుంది" అని అంటారు ఆర్. ఎస్. సుదర్శనం.

పరచూరి రాజారామ్‌గారు అన్నట్లు 'ఎంత విశ్లేషించినా మరికొంత మిగిలిపోయే పాత్ర ఉషారాణి"

వ్యక్తి వికాసము, వ్యక్తిగతమైన ధర్మసాధన రెండూ వేరు వేరు కావు... ఈ విషయం రుజువు చేసిన ఉషారాణి ఒక భ్రాంతి కాక సజీవ స్త్రీ స్వరూపంగా మనకు దర్శనమిస్తుంది.

***

# పోలాప్రగడ సత్యనారాయణ మూర్తిగారి 'కౌసల్య'లో కౌసల్య

సాహిత్యం సమాజ దర్పణమనే భావానికి కొన్ని నవలలు ప్రతీకలౌతాయి. మంచీ, చెడు ప్రసక్తి కన్నా సాంఘికాచారాన్ని అనుసరించి, అది ఇచ్చే జీవన విలువల గురించి, స్వాభిమానంతో తనను తాను గౌరవించుకునే పాత్రలు కొన్ని పరిస్థితుల్ని విప్పి చెపుతాయి. ఔన్నత్యమైన ఆదర్శం - కర్తవ్యనిష్ఠ, వ్యక్తిగత సంసార సుఖం, దేశపరమైన భక్తి వీటి మధ్యలో కనబడని స్వాభిమాన ప్రశ్నవల్ల ఎంత జీవితకాలం పరీక్షకు లోనౌతుందో తెలియజెపుతుంది మనకు "కౌసల్య" పాత్ర.

పోలాప్రగడవారు మంచి శిల్పమున్న రచయిత. వీరు సృష్టించిన కౌసల్య బహుధా పాఠకాభిమానం, ప్రేక్షకాభిమానం పొందింది. నేషనల్ బుక్ ట్రస్ట్‌వారిచే పధ్నాలుగు భాషల్లోకి ఈ నవల తర్జుమా చెయ్యబడింది. జాతీయ నాటకంగా ఏకకాలంలో దేశంలో అన్ని రేడియో స్టేషన్ల నుంచీ వివిధ భాషల్లో ప్రసారం చెయ్యబడింది. నాగార్జునా యూనివర్శిటీలో ఎమ్‌ఫిల్ సిద్ధాంత గ్రంధానికి ఆకరం అయ్యింది. 1992 లో 'అప్నా అప్నా అస్మాన్' అనే పేరున జాతీయ ప్రసారాలలో దూరదర్శన్ ద్వారా కనువిందు కలిగించింది. "తల్లిదండ్రులు" - అనే తెలుగు సినిమాగా రూపొంది నందీ అవార్డు గ్రహించుకున్నది.

ఇన్ని ప్రశంసలు పొందడం ఒక నవలకు ఎలా సాధ్యం? ఈ నవలలో ఏదో ఒక స్పష్టమైన లయ, పాఠక ప్రేక్షక హృదయంతో కలిసి స్పందించి ఉండాలి. లేకపోతే "కౌసల్య"కు ఈ మన్ననా మర్యాదా జరగదు.

ఇందులో కథానాయకుడు వెంకట్రామయ్య. జీవిత సౌఖ్యాలను ఆదర్శాలకు లోబరచగలిగిన ధీశాలి. అతను అనుభూతులను, ఆనందాలను, నమ్మిన విశ్వాసం కోసం ప్రేమించిన తన వాళ్ళకోసం త్యాగం చెయ్యగల సమర్థుడు. మరి కౌసల్య?!

ఆప్యాయతా, పౌరుషం సమపాళ్ళుగా గల సౌందర్యమూర్తి సంపన్నుడింటి ఆడబడుచు, తన సౌందర్యం మీద, ఆధిక్యత మీద, ప్రత్యేకత మీద విపరీతమైన నమ్మకమున్న స్త్రీ మూర్తి. వీరిద్దరి మధ్య జరిగిన జీవన యుద్ధం కౌసల్య నవలలో ముఖ్య ప్రకరణం. సమాజంలో తనకైన ప్రత్యేక వ్యక్తిత్వం ఏర్పరచుకున్న స్త్రీమూర్తి ఏ పరిస్థితులలోనూ స్వాభిమానం త్యాగం చెయ్యడానికి సిద్ధపడనప్పుడు జరిగే అంతర్యుద్ధంలో నలిగి రాలిపడిపోయే అనుభూతులు ఎన్నో.. అని ఆలోచించాలనిపిస్తుంది "కౌసల్య" చదవగానే.

కౌసల్య మనని జాలిపడమనదు. ఆలోచించమంటుంది. తను జీవితాన్ని పోగొట్టుకున్న అన్ని సంవత్సరాలూ కూడా ఆమె నిస్సారమైన జీవితం గడపదు. వలపు వాకిళ్ళ తలుపులు మూసిందేమో కానీ మిగతా జీవితం గొప్ప వ్యక్తిత్వంతో ప్రకాశించేటట్లు బ్రతుకుతుంది ఆమె.

1938లో హరిపురంలో సుబాష్ చంద్రబోస్ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రభావితుడైన రైతు బిడ్డ వెంకట్రామయ్యకు రామచంద్రపురంలో పెద్ద లాయరు, తాలూకా బోర్డ్ ఛైర్మన్, జస్టిస్ పార్టీ సభ్యుడు అయిన రావుసాహెబ్ పెరుమాళ్ళయ్యగారి ఏకైక కుమార్తె కౌసల్యతో వివాహం జరుగుతుంది.

ఆమె సౌందర్యమూర్తి, కళాకారిణి. అద్భుతంగా వీణ వాయిస్తుంది. పి.ఆర్. కాలేజీలో ఇంటర్‌మీడియట్ చదువుతూ ఉండగా వివాహమవుతుంది.

పల్లెటూరు పద్ధతులు, ఎదిగీ ఎదగని కన్య భర్తతో పునఃస్సంధానం కాకముందు, పండుగలు, పబ్బాలు పేర కలుసుకున్నప్పటి వారి మధ్య ఏర్పడే శృంగార రసఝురి, సుళ్ళు తిరుగుతూ అది జీవన పరిధుల్ని ముంచెత్తే పద్ధతి చాలా అద్భుతంగా వర్ణించారు రచయిత.

వారిద్దరూ కలుసుకున్న నాలుగైదు సందర్భాలలోనూ, కౌసల్యా, తనూ ఒకే ఇంట్లో మసులుతున్నాం అన్న తలంపే అతని మనసుకు ఎంతో హాయిని ఇచ్చేది. కలిసి ఉన్న కొద్దికాలం నోటితో పలకరించుకోపోయినా, అతని సపర్యలన్నీ ఆమే చేసేది. ఆమె సేవలోని హాయి, వారి ఇరువురి హృదయాల మధ్య జరిగే మౌన సంభాషణ వారిద్దరి మనసులకి తర్జుమా అయ్యేది. అతని ఆ తరువాతి జీవితం నిండా ఎక్కడ చూసినా ఆమె జ్ఞాపకాలే... కౌసల్యతో ఏర్పడిన ఆ అనుబంధం, ఆమె చూపించే మమత, తనకూ, ఆమెకూ మధ్య కొన్ని రహస్యాలు ఏర్పరిచాయి. అది తనకు తెలుసు. శలవులు అయిపోగానే తను ఆమెను వదిలి పోవలసినప్పుడు గుడ్ల నిండా నీరు కుక్కుకుంటూ అది కప్పిపుచ్చడానికి ఆమె నటించే గాంభీర్యం ఇవన్నీ ప్రతి క్షణం అతడిని ఆలోచింపజేస్తాయి. ఆమెకు దూరంగా వెళ్ళి పోయినా, ఆమె జ్ఞాపకాల పరిమళం అతణ్ణి నిరంతరం ఆవహించే ఉంటుంది.

వారిద్దరి జీవితాలూ ఒకటయ్యే రోజున, అటువంటి స్త్రీ సన్నిధానం, మొగవాడికి ఎంతటి అనుభూతిని కలిగిస్తుందో హృద్యమంగా వర్ణించారు రచయిత.

"తన ఆలోచనలూ, ఊహలూ, చిత్ర విచిత్ర మార్గాల్లో మునుపెన్నడూ తను పొందని ఒకానొక విన్నూత్న్మ మనోజ్ఞ భావనలో సమ్మిళతాలైన దేహానికీ గగుర్పాటు, మనస్సులో తత్తరపాటు, బుద్ధికో పరధ్యానం, హృదయానికో దివ్యానుభూతి ఇచ్చాయి. తనలో కనిపిస్తున్న ఆ చైతన్యాన్ని ఎవరైనా కనిపెడతారేమోనని భయంతో ఒక మూల గదిలో ఒంటరిగా కూర్చున్నాడు వెంకట్రామయ్య."

తెలివిగల రచయిత తను సృష్టించిన పాత్ర ఎదటి వ్యక్తిని ఎంత ప్రభావితం చేస్తుందో చెప్పడానికి ఎంత చక్కటి భావనను, పరిస్థితిని ఎన్నుకున్నాడో గమనించగలం మనం ఆదర్శాల గోలలో ఊగిపోతున్న వెంకట్రామయ్యకు ఆ స్త్రీ మూర్తి కౌసల్య కాక మరొక మామూలు వ్యక్తి అయ్యుంటే ఈ అనుభూతి పరిమళాలు కదిలించేవి కావేమో...

ఆ అనుభూతిని రచయిత, తెలుగుతనంలోని జాజిపూల పరిమళాన్ని తెలుగువారి ఆచారాలు, కట్టుబాట్లు ఇచ్చే ఒద్దికతో కూడిన శృంగారపరమైన స్పందనను చాలా గొప్పగా అర్థమయ్యేట్లు చెప్తారు. అంతేకాదు.. ఎంతో కట్టుబాట్లతోనూ, గౌరవ మర్యాదల మధ్య పెరిగిన కౌసల్య, ఎంత చిలిపిదో, ఆమెకు ఏం కావాలో చెప్పడానికి, ఒక హృద్యమమైన దృశ్యం ఎన్నుకున్నారు రచయిత.

అసలే ఆమె ఆలోచనల పలవరింతతో బాధ పడుతున్న వెంకట్రామయ్య ఉన్న గదిలోకి ఒంటరిగా ఏదో పుస్తకాలు సర్దుతున్న నెపంతో వస్తుంది చిలిపి కౌసల్య. అతను ఏం చెయ్యాలో తెప్పరిల్లి నిర్ణయించుకునే లోపల పారిపోతుంది. అంతటి సౌందర్య కాంతి స్వరూపం ఒక్కసారిగా తన మీద ప్రదర్శించిన 'గారడీ' అతనికి అర్థం కాదు.

ఆ రాత్రి.

"మధ్యాహ్నం అలా పారిపోయావేం? తలుపులు దగ్గరగా వేస్తే ఏమి చేసి ఉందువు?!" అంటాడు కుతూహలంగా, చిలిపిగా

ఇదుగో, ఇక్కడ సంపూర్ణ స్త్రీ స్వరూపంగా విస్తరించిన కౌసల్య తనేమిటో అసలు స్త్రీ ఏమిటో చెపుతుంది.

"అబ్బో.., ఆ మాత్రం ధైర్యం కూడానా తమకు?" అంటుంది.

ఆ మాటలలోని చురుకు అతనికి ఆ క్షణానే గగుర్పాటు కలిగించింది. అతను సాహసించి ఆమెను దగ్గరకు తీసుకోకపోవడంవల్ల ఆ క్షణాన అతనెంత పోగొట్టుకున్నాడో, ఆమెనెంత నిరాశ పరిచాడో చెప్పింది. ఆమెలోని సౌందర్య శృంగార అనుభూతుల మీద ఆమెకు ఎంత తమకం ఉన్నదో, వాటిని సాధికారంగా తనవాడైన మనిషి నుంచీ ఎలా పొందాలని కోరుకుంటుందో స్పష్టంగా ఆ మాట విరుపుతోనే చెబుతుంది.

అందుకే వెంకట్రామయ్య ఉలిక్కిపడతాడు... ఆమె తనకేం కావాలో స్పష్టంగా తెలిసిన వ్యక్తి అన్న భయం, గౌరవం ఆ తరువార వాళ్ళ జీవితాలలో జరిగే సంఘర్షణలలో దాని ప్రభావం చూపిస్తుంది.

ఆమె గడుసు మాటలు, సౌందర్య పల్లవత్వం, అమృతపు జల్లుగా, ఆనందవల్లిగా మధుర స్వప్నంలాగా అతనికి ఆ రాత్రి ఆమె తనను తానుగా కానుకగా సమర్పించుకుంటుంది.

మరునాడు అతడు ఆ రాత్రి కోరిన ముచ్చట తిర్చడానికా అన్నట్లు వీణ వాయిస్తుంది.

కానీ ఆ సుందరమైన దృశ్యంలోకి అపశృతిలా వెంకట్రామయ్యను తీసుకుపోవడానికి పార్టీమనుష్యులు కార్లతో వస్తారు.

ఇక్కడ మనకు కౌసల్యలోని మధన, బేలతనం, తన సౌందర్యం మీద, స్త్రీత్వం మీద తనే సవాలు విసురుకోవడం కనిపిస్తుంది. బేలగా కన్నీళ్ళతో అతణ్ణి ఆపాలని ప్రయత్నం చేస్తుంది.

కానీ.. "నువ్వు అంత బేలవైతే ఎలా? పోనీ ఆగిపోనా?" అని భర్త అనగానే, వెంటనే కన్నీరు తుడుచుకోగలదు. ఆమె అభిమానం అలాంటిది.

అతనికి తను అర్పించిన స్వరమాధుర్యాలను గడ్డిపోచగా తృణీకరించి, అతను తన ఉద్యమం వైపు వెళ్ళిపోవడం ఆమె అభిజాత్యాన్ని సవాలు చేస్తుంది.

పైగా, అతనిని వెళ్ళకుండా బంధించగల సామర్ధ్యం తనకు లేదని, తన అసమర్థతే కారణం అని అందరూ ఆమెను అవమర్యాదకు, అపహాస్యానికి గురిచేస్తూంటే, రగులుతున్న హోమాగ్నిలా తయారైంది ఆమె.

భర్త జైలు నుంచీ వచ్చేరోజు పట్టుదలగా వెడుతుంది అతడి కోసం.

అతడికి జరిగిన గౌరవం ఆమెలోని భార్యను ఆనందింపజేస్తుంది.. "అదిగో ఈ ఒంటరి ఆనందం కోసమే మనవాళ్ళందరినీ ముందు పంపించి వేశాను." అని గోదావరి దాటుతూ వెంకట్రామయ్య అన్న మాటలు చేసిన శృంగార చేష్టలకూ ప్రతి క్షణం మురిసిపోతూ..

"ఈ ఆనందాన్ని ఇలా శాశ్వతం చెయ్యి భగవంతుడా!" అని పదహారణాల తెలుగు ఆడబడుచులా మనస్సులోనే బేలగా చేసుకుంటుంది.

"ఇంకెప్పుడూ నన్ను వదిలి వెళ్ళకండేం?!" అని అతని దగ్గర మాట తీసుకుంటుంది.

పుల్లేటు కుర్రులో గడిపిన ఆరునెలలూ ప్రతిరోజూ రంగుల కల ఆమెకు. ప్రతిక్షణం తనచుట్టూ తిరుగుతూ, తన ఊపిరిగా బ్రతుకుతూ ఉండే భర్తతో కబుర్లు, చిరుకోపాలూ, ఆనందాలూ - వీటివల్ల ఆమె అతణ్ణి కట్టేసుకోగలిగానని గర్వపడింది.

తండ్రి కాబోతున్నాడన్న విషయం తెలిసి అతను ప్రకటించిన ఆనందంతో ఆమె హృదయం ఉప్పొంగిపోయింది. ఇక తన జీవితం పూలనావగా ప్రేమసాగరంలో తేలుతుందనుకుంటున్న ఆమె జీవితంలోకి.

ఆగస్టు క్విట్ ఇండియా తీర్మానం తుఫానులా ప్రవేశించింది.

"నువ్వు ఇలా నా దారికి అడ్డురాకు." అని విసుక్కుంటూ తన అనురాగాన్ని తనతో గడిపిన మధుర దాంపత్యాన్ని త్రోసిరాజని వెళ్ళిపోతున్న అతన్ని వెళ్ళడానికి వీల్లేదని అడ్డం పడింది కౌసల్య

"మీకు భార్య కన్న, సంసారం కన్నా రాజకీయాలే ఎక్కువా?" అని స్పష్టంగా నిలదీసింది.

"మీది స్వార్థం, ఈ త్యాగాల దేశసేవ వల్ల వచ్చే కీర్తి కావాలి మీకు.." అన్నది అతని ఆత్మాభిమానం మీద దెబ్బ తీసింది.

"మీకు అవసరం లేని దాన్ని నేను. నేనేను, నా రూపం, నా కన్నీళ్ళూ నా ప్రేమా ఇవేవీ మిమ్మల్ని కరిగించి నావాడిగా చేసుకోలేనప్పుడు ఇంక ఇవి నాకు ఉండి మాత్రం లాభం ఏమిటి?" అని సగటు ఆడదానిలా పుల్ల విరుపు మాటలు మాట్లాడింది.

"నన్ను అంటుకోకండి. మీకు నేను అక్కర్లేనప్పుడు నాకూ అంతే. ఇప్పుడు నన్ను కాదని వెళ్ళిపోతే ఇదే మన ఆఖరి సమావేశం?" అని తనకు సర్ది చెప్పాలని ప్రయత్నిస్తున్న భర్తను విదిలించి కొట్టి అతని పురుషాధిక్యత మీద సవాలు వదిలింది.

ఆమె జ్వలితజ్వాల.. తిరగబడిన దేవత. ఆదిశక్తి.. ఆత్మాభిమానానికి, అనురాగాన్ని "భర్త" అనే అపురూపమైన స్థానాన్ని బలిపెట్టిన పూజారిణి.

కోపం, బాధ.. అవమానంతో ఆడది. అదే చచ్చినట్టు తిరిగి వస్తుంది అనుకుంటున్నాడు భర్త అన్న కచ్చతో "చూద్దాం, అదీ చూద్దాం" అనుకుంటూ పుట్టింటికి ఆ గర్భవతి వచ్చేసింది. ఎవరు చెప్పినా వినలేదు... తనకు మొగబిడ్డ పుట్టాడని తెలిసి బావగారు చూడటానికి వస్తే కచ్చతో అతడిని బిడ్డను ఎత్తుకోనివ్వదు.

ఆమె అభిమానంతో రగిలిపోతున్న అగ్నిరేఖ. కానీ, ఆ కణకణలాడేనిప్పులు, ఆమె స్త్రీత్వం అనే హరిచందనపు కట్టెలకు, సౌందర్యము, సౌకుమార్యము, ఆప్యాయత అనే హారతి కర్పూరపు మెరుపులతో ఏర్పడినవి. ఆమె రోషం వాటికి ఆజ్యం అందుకే, తన భర్తకు ఇష్టమైన 'తిలక్' అన్న పేరు తమ బిడ్డకు పెట్టుకున్నది.

తనలో స్త్రీత్వాన్ని, శృంగార ఝరిని "పాతాళగంగ"గా మార్చుకున్నది.

కేవలం మాతృమూర్తిగా పట్టుదలగల మంచి క్రమశిక్షణగల తల్లిగా బ్రతకాలన్న నిర్ణయానికి వస్తుంది. ఎంతో దుఃఖాన్ని రోషాన్ని గుండెల్లో దాచుకుని బిడ్డను పెంచుకుంటుంది. బిడ్డకు తండ్రి, అతని తరుపువాళ్ళు తెలియకూడదని, కనీసం వెంకట్రామయ్య ఫోటో కానీ, అతడి తరపువాళ్ళ గుర్తులు కానీ ఇంట్లో ఉంచుకోదు.

వర్షాశుభ్రతస్నాత పారిజాతపుష్పంలాగా తెల్లవారుతుండగానే, తలారా స్నానం చేసి, తెల్లని పట్టుచీర కట్టుకుని, దేముడి మందిరం ముందు కూర్చునేది. ఆమె ఏళ్ళ తరబడి తన గుండెల్ని దహించి వేస్తున్న మంటలాగా, ఎఱ్ఱని కుంకమరేఖ నుదుట మెరిసేది. ఏకాగ్రతా, నిశ్చలత్వము ఆమె ముఖానికి ఒక వింత కాంతిని ఇచ్చేవి.

ఆమెకు దూరంగా ఇరవై ఏళ్ళు బ్రతికినా, ఏ సౌందర్య రూపాన్ని చూసినా, ఏ చిలిపి చూపులు గమనించినా, వెంకట్రామయ్యకు ఆమె జ్ఞాపకాల పలవరింతలు తప్పేవి కావు. తను నమ్మిన కాంగ్రెస్ సిద్ధాంతాలకోసం, తన నిర్ణయమే అనుసరణీయం, ఆదర్శం అనుకున్న అతణ్ణి తోసిరాజని వెళ్ళిపోయిన కౌసల్య అతని మనస్సులో నీడగా నిలబడిపోయింది. దానికి కారణం గౌరవ పూర్వకమైన ఆమె సౌందర్యం.

పనిమనిషి మొగుడు 'మొగమహరాజుని, నా ఇష్టం వచ్చినట్టుంటాను' అని బ్రతిమాలిన కొద్దీ చూపే పట్టుదల, ఆమె ఆడిటింగ్ చూస్తున్నప్పుడు అర్థంలేని కమీషనర్‌గారి పట్టుదల, ఆ పల్లెటూరులో తన బిడ్డ తిలక్ టేబుల్ మీల్స్ కావాలన్న పట్టుదల, భర్త సహాయం లేకపోయినా, తమ బిడ్డను ఉత్తముడైన వ్యక్తిగా తీర్చిదిద్దాలన్న పట్టుదలే ముఖ్యమైన కారణం అనిపిస్తుంది ఆమెకు.

కానీ, భర్త దేశభక్తి మాత్రం పట్టుదలగా కాక, మూర్ఖపు అభిమానంలాగా కనిపిస్తుంది.

ఎంతో గొప్పగా ఆలోచించగల కౌసల్య తన విషయానికి వచ్చేటప్పటికి మాత్రం తప్పు ఒప్పుకోదు. అలా ఒప్పుకుంటే ఆమె కౌసల్యేకాదు.

కానీ, వెంకట్రామయ్య ఆమె ఆత్మగౌరవాన్ని ఆడదాని దురభిమానంగానే భావించి ఆమె ఏమిటో కనీసం తెలుసుకోవాలన్న ప్రయత్నం కూడా చెయ్యడు.

అతని శిక్షణలో పెరిగిన మేనకోడలు జానకి చేత, తను ఓడిపోయి అయినా పురుషుడిని గెలిపిస్తుంది స్త్రీ. అతని విజయంలోనే ఆనందం చూడగల ఔదార్యం ఆమెకు ఉంటుంది. ఆ ఔదార్యం ఆమె బలహీనత కాదు...అనిపిస్తారు రచయిత.

వెంకట్రామయ్యకు అల్లాంటి భావన ఉండే స్త్రీ అంటే గౌరవం అని ధ్వనింపజేస్తారు రచయిత.

ఒక కుహనా రాజకీయవాది కూతురు జ్యోతిని తన అన్న కొడుకుకు సంబంధం చూడటానికి వెళ్ళినప్పుడు, ఆ పిల్ల సంపద, తెలివి, అందం, చురుకు అతనికి కౌసల్యను గుర్తుకు తెస్తాయి. ఒక్కసారిగా, ఫలించవలసిన తన జీవితం, ఇలా ఎండి మోడువారడానికి ఒక స్త్రీ మూర్తి పట్టుదల కారణం అని గుర్తుకు వస్తుంది. వెంటనే ఆ పిల్లలో కౌసల్య రూపురేఖలు సహించలేక, ఆ సంబంధం "ఒద్దు" అని, పేదింటిపిల్ల అన్నపూర్ణను వెనకా ముందు ఆలోచన లేకుండా ఖాయం చేస్తాడు. దీనికి కారణం కౌసల్య ఆత్మ గౌరవం పట్ల కచ్చా? లేక, ఆ పంథాలో ఉన్న ఆడపిల్ల ఎవరైనా ఆత్మాభిమానాలకోసం నూరేళ్ళ పంట లాంటి జీవితాన్ని నాశనం చేసుకుంటుంది అన్న భయమా?!

రెండవ కారణం నిజమనిపిస్తుంది. కారణం, నిజంగానే జోత్స్న తనకు ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలియక చాలా చాలా పోగొట్టుకుంటుంది.

మరి వెంకట్రామయ్య నిర్ణయమే కరెక్టా? ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది.

సాధారణంగా స్త్రీ పాత్ర చుట్టూ అల్లిన కథల్లో స్త్రీలోని ఔన్నత్యం, గొప్ప గుణాలు, ఆమె త్యాగం -

ఇవన్నీ చిత్రీకరించబడతాయి. నవల రాయడానికి అది అతి సులభతరమైన పద్ధతి. కానీ రచయిత మరొక భావన మనలో ఎందుకు తలెత్తనిచ్చారు?! ఆమె మొండితనం, మూర్ఖపు నిర్ణయం, కనీసం తన బిడ్డ తండ్రి ఎవరో కూడా తెలియకుండా పెంచాలన్న ప్రయత్నం ఇవన్నీ చందమామలో మచ్చలాగా కౌసల్య పాత్రను ఆవహిస్తాయి.

కానీ, ఆలోచిస్తే ఇక్కడ ఈ పాత్ర ఉన్మీలనం జరిగేటప్పుడు కలిగినది రసహీనత కాదు. సజీవ పాత్రల్ని సృష్టించేటప్పుడు, ప్రతిపాత్రా అన్ని మంచి గుణాలు సంతరించుకున్న కావ్య నాయిక కానక్కర్లేదు. ఆమె మామూలు మనిషి. జీవితంలో రసాన్ని ఇంకింపచేసి, ఆదర్శాలూ, వేదాంతాలు బొత్తిగా భరించలేని, మనిషి, రోషం, పౌరుషం అనే గుణాలను గౌరవించే వ్యక్తి అని కొంచెం పాళ్ళు మించిపోవడంవల్ల ఆమె ఎన్ని అందమైన అనుభూతులను పాతర వెయ్యవలసి వస్తుందో, ఎంత అందమైన జీవితాన్ని బలిపెట్టవలసి వస్తుందో మనకు అర్థమౌతుంది.

ఆమె తనలో శృంగార రూపిణిని ముడుపు కట్టి, మిగతా అన్ని విషయాలలోనూ సంపూర్ణమైన వ్యక్తిగా రూపొందుతుంది. ఆస్థిగల మొగబిడ్డగా తన బిడ్డ ఎక్కడ త్రోవ తప్పుతాడో అని ప్రతిక్షణం అతని పట్ల మెలుకువగా ఉంటుంది. అతని అబద్ధాలు పట్టెయ్యగలదు. అతని స్నేహితులలో లోపాలూ, వారి వ్యవహారం చాలా సులభంగా గ్రహించుకోగలదు.

అందుకే వాళ్ళు...

"సర్లే మీ ఇంటి గుక్కెడు కాఫీ నీళ్ళకని కక్కుర్తి పడి వచ్చామా, చచ్చామన్న మాటే... చెంచాడు కాఫీ నీళ్ళు పోసి, చెక్కపూటుగా తిడుతుంది మీ అమ్మ.." అంటారు.

"నీ జన్మంతా మైనరుగానే గడపాలి.." అని వెక్కిరిస్తారు తిలక్‌ను.

ఆ మాటలకు కాస్త చివుక్కుమనిపించినా, తన తల్లి అంటే అపారగౌరవం, భక్తి అతనికి. తనను చూస్తూ ఆనందిస్తూనే, అంతలోనే ఏదో శూన్యంగా హృదయంలో మెరిసే సరికి కళ్ళ నీళ్ళు పెట్టుకుని, పెదవి నొక్కి గాంభీర్యత నటించే తల్లి పెద్ద మనసు తెలుసు తిలక్‌కు.

వెంకట్రామయ్య తన వాళ్ళందరూ, తనను చాలా స్వార్థపరుడిగా పరిగణించి, అవమర్యాద పరచగానే చివుక్కుమన్న మనస్సుతో పట్నం వచ్చి, ఎటు పోవాలో తెలియక మోటారు సైకిల్ కింద పడబోయి, ఆ కుజ్జాడి ఆదరణలో సేద తీర్చుకుంటాడు.

మొదట్లో రామచంద్రాపురం వెళ్ళి కౌసల్య దగ్గరకు వెళదామనుకుని కూడా "ఇన్నాళ్ళకు మేము కనిపించామా? అయితే అన్నగారి పిల్లలతో చెడింది అన్నమాట.." అని ఆమె ఈసడిస్తుంది అనుకుంటాడు.

భార్య అయితే మాత్రం? మానుషం, మానుషమే... చూడగా, చూడగా చుట్టాలకంటే ఏ సంబంధం లేని ఇల్లాంటి అపరిచితులే నయం, పాపం ఈ అబ్బాయి అభిమానం ఎంత గొప్పది? అనుకుంటాడు వెంకట్రమయ్య.

కానీ విధి వైచిత్రం.... ఆ మంచి అబ్బాయి కౌసల్య వంటి తల్లి చేతుల్లో శిక్షణ పొందిన వ్యక్తి అని, తన బిడ్డ అని అతనికి తెలియదు.

వేరే, ఊరులో చదువుకుంటున్న బిడ్డకోసం సర్వం త్యాగం చేసి ఉన్నతుడిని చేద్దామనే తల్లి ఉన్నది ఆమెలో అలాగే హితైషిణి ఉన్నది.

కానీ, రచయిత ఆమె ఆత్మాభిమానం దురభిమానంగా మారినప్పుడు దెబ్బతినక తప్పదన్నట్లు ఒక మంచి మలుపు తెచ్చారు కథకు.

దాయాదుల అసూయ కారణంగా పోలీసు దొమ్మికేసులో ఇరికిస్తారు తిలక్‌ను. సరిగ్గా సమయానికి ఆర్తత్రాణపరాయణుడిలా వచ్చి కాచిన వ్యక్తికి హృదయపూర్వకంగా, వినమ్రపూర్వకంగా కృతజ్ఞతలు చెప్పాలని వస్తుంది కౌసల్య.

"వీరే నన్ను రక్షించినవారు. ఈమేనండీ మా అమ్మ కౌసల్య" అని వారిద్దరినీ తిలక్ పరిచయం చేసినప్పుడు,

"కర్మానుబన్దీని మనుష్యలోకే..." అన్న భగవద్గీత వాక్యాలు ఆయన గొంతులోనే ఉండిపోయాయి వెంకట్రామయ్యకు.

ఇంక కౌసల్య పరిస్తితి... తన ఆస్థి, తన హోదా, తన పలుకుబడి, తన తెలివితేటలు... ఏవీ ఉపయోగించని సమయంలో పరిస్థితి రసాభావం కాకుండా, తన జీవనజ్యోతిని ఆరిపోనీయకుండా రక్షించింది, తను అవమర్యాదపరచి, త్యజించిన భర్త - అని తెలిసినప్పుడు, తన బిడ్డ ఆయనను ఒక మహాపురుషుడుగా వర్ణించి, గౌరవిస్తున్నప్పుడు, కౌసల్యలో పశ్చాత్తాపం, ఆనందం రేకులు విప్పుకున్నాయి.

ఒకరి నొకరు చూస్తూ నిలబడిపోయారు. ఇద్దరిలోనూ, చైతన్యం లేదు. ఇద్దరి మనోబుద్ధి అహంకారము కొన్ని క్షణాలు జడత్వం వహించాయి. ఎవరినోటా మాటలేదు. ఎవరి చూపుకీ అర్థం లేదు.

వెంకట్రామయ్యకున్న పట్టుదల అదృశ్యం అయిపోయింది. అప్పటిదాకా లేని ఒక వినూత్న కాంక్షకు ఆమె ఇప్పుడు వశ్య అయింది.

వారిద్దరి మధ్యా ఇప్పుడు కార్పణ్యపు హద్దులు చెరిగి కారుణ్యపు వెన్నెల విరిసింది. అహంకారాల ప్రాకారాలన్నీ దాటి, మమకారం మకుటం ధరించింది. 'ఆమె తన కౌసల్య... ఆయన తన దైవం.'

ఇలా వర్ణిస్తారు రచయిత ఆ దృశ్యాన్ని. కౌసల్య అహంకారం తామర పువ్వుల మీది నీటి బొట్టులా ఒక విదిలింపుతో తొలిగిపోయింది. నేను అన్న అభిమానం సూర్యరశ్మి సోకగానే మంచుబిందువులా కరిగిపోయింది.

ఇంట్లో ఉన్న ఆడబడుచు బావగారి పిల్లలు కాబోయే కోడలు జానకి - వీరందరికీ తన చేత్తో వంటచేసి పెడతానంటుంది కౌసల్య.

"రావు సాహెబ్‌గారి కూతురికి వంటవచ్చా..." అంటాడు సన్నగా వెంకట్రామయ్య.

"నిక్షేపంగా... రావుసాహెబ్‌గారి కూతురే కాదు రాజకీయ బాధితుడి భార్యకూడా. ఆ సంగతి మర్చిపోకండి..." అంటుంది కౌసల్య నవ్వుతూ.

దేశం కోసం భర్తను యుద్ధంలోకి పంపిన పాలేరు కూతురు సుందరమ్మను చూసి తనకంటే వెయ్యిరెట్లు ఉన్నతమైనది అనుకునే మనః పరిపక్వత వచ్చింది కౌసల్యలో.

ఆ తరువాత, చాతుర్యంగల రచయిత చాలా అందమైన రెండు వాక్యాలతో సంపూర్ణమైన, అర్ధవంతమైన, గౌరవప్రదమైన శృంగార భావాన్ని పన్నీరు పూవులుగా పాఠకుల మీదకు విసిరేస్తారు.

"వీధి వసారాలో పడుకున్న వెంకట్రామయ్య నుదిటి మీద ఓ రాత్రివేళ చల్లని హస్తం తగిలింది. అది ఇరవై ఏళ్ళ క్రిందటి మధురానుభూతులను మరల తవ్వి తీసుకువచ్చింది." - అంటారు.

ఆ సౌందర్యమూర్తి సంపూర్ణ స్త్రీ మూర్తి లోలోని మౌన విన్రమ శృంగార భావన లొంగుబాటుతో కూడిన ఏదో గొప్ప అహంకార పరాజయం కాకుండా, జాజిపువ్వుల సవ్వడిలా, ఒక మహారాణి స్వయంకృతార్పణలా చిత్రీకరిస్తారు రచయిత.

***

## సి.ఆనందారామంగారి 'మనస్విని'లో 'సుమిత్ర'

**నిర్హేతుక చౌయమానమైన ఆనందాన్ని ఎదటివాళ్ళకు** పంచి పెట్టడానికి గొప్ప అదృష్టవంతులు, ధనవంతులూ కానక్కర్లేదు... దానికి మానవత్వపు విలువలు, దుఃఖానికి అర్థం తెలియడం కర్తవ్య దీక్ష ఉంటే చాలు... వేదాంత పరంగా ఆలోచించే వాళ్ళు ఈ గుణాలు మనుష్యులు సద్భావన పేరుతో తమలో పెంచుకోవాలంటారు. కానీ, కొంతమంది మనుష్యులు సహజ ప్రకృతే అదిగా పుడతారు. వాళ్ళు, వాళ్ళ పద్ధతి, త్యాగం ప్రపంచానికి అర్థంకాదు. కారణం ప్రపంచం విలువల్ని తల్ల క్రిందులుగా తిప్పి చూసి రూపాయి అణా పైసలతో కొలతలు వేస్తుంది.. కానీ ప్రపంచపు లెఖ్ఖలకు అర్థంకాని అందని అపురూపమైన మనుష్యులు ఉంటారు. వారిలో చేర్చదగ్గ పాత్ర 'సుమిత్ర'

శ్రీమతి సి.ఆనందారామంగారు భావుకత, జీవితం పట్ల సదవగాహన, తనకంటూ కొన్ని విలువలు, నమ్మకాలు పెంచుకున్న వ్యక్తి. ఆమె చాలా నవలలు రాశారు. చాలా విశిష్టమైన పాత్రలు సృష్టించారు. కానీ 'సుమిత్ర' పాత్రను సృష్టించడం ఎంత చెయ్యి తిరిగిన రచయిత్రికి అయినా ఛాలెంజ్ కిందే లెఖ్ఖ.

ఎందుకంటే సుమిత్ర మామూలు కథానాయిక మూసలో ఇమడలేదు. అల్లాంటి మనిషి మనకు జీవితంలో తారసపడినప్పుడు భరించగలమా? అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేము. ఎందుకంటే హిపోక్రటికల్ వలలో చిక్కి గిలగిలలాడి అలంకారాల రంగుల పక్షులకు సహజత్వం మర్చిపోయి కేటర్ పిల్లర్లుగా మారే సీతాకోకచిలుకకు సహజత్వం ఎలా ఉంటుందో తెలియదు.

సుమిత్రది ఒక విలక్షణమైనది అలంకరణ. అది ఎలా ఉన్నా కానీ సలక్షణమైనది మాత్రం కాదు.

నలభై పైగానే వయస్సు. బాబ్డ్‌హెయిర్, నైలాన్ చీర, అస్తవ్యస్తంగా కట్టుకుని లుంగ చుట్టినట్లు కుచ్చిళ్ళు పెట్టుకుంటుంది. ఎత్తుమడమల చెప్పు ఒక కాలికి మాత్రమే వేసుకుని, మరో కాలికి ఏమీ లేకుండా వంకర టింకరగా నిలబడి ఒక చెప్పు చేత్తో పట్టుకుని

పార్టీలో ప్రవేశిస్తుంది. "పాత చెప్పినా చీరకు మాచ్ అవుతుందని వేసుకు వచ్చాను" అంటుంది. "చీర తిరగేసుకుని కట్టుకున్నారు మార్చుకోరాదా?" అంటే,

"ఆ(పోనిద్దురూ! ఇప్పుడు మార్చుకోవడం దేనికి అందరూ చూసేశారుగా? మనం ఎంత గొప్ప వాళ్ళమో నలుగురికి ప్రదర్శించుకోవడానికి కానీ".. అనేస్తుంది.

"ఇది వరకు, అంటే చాలా రోజుల క్రితం ఎలా ఉన్నదాన్ని అలాగే, ఎక్కడికంటే అక్కడికి వెళ్ళేదాన్ని. అందరూ తిట్టారని సాధ్యమైనంత వరకూ చక్కగా అలంకరించుకుంటున్నాను. అంటుంది ఆ 'చక్కని' అన్న పదప్రయోగానికి అందరూ నవ్వినా ఆమె తన మాటలకు ఎదటివాళ్ళు తీసుకునే అర్ధాలు పట్టించుకోదు.

సుమిత్ర బాస్ రామారావుగారు. ఆయనకు ఆమె అంటే జాలి.. వారానికి ఒకసారన్నా రిజైన్ చేస్తున్నానంటూ లెటర్ ఇచ్చేసి, మళ్ళీ వెంటనే ఉద్యోగంలో చేరే ఈ "ప్రౌఢ కన్య" అంటే ఆయనకు మనిషిగా అంతరాంతరాళాల్లో ఎక్కడనో గౌరవమో, అభిమానమో ఉన్నది. ఆమె "ఎఫిషియంట్ వర్కర్" అని గుర్తించి క్షమిస్తూ ఉంటారు.

కానీ భర్త గౌరవం మీద హోదా పెంచుకుంటున్న ఆయన భార్య లలితకు మాత్రం ఆమె అర్థంకాదు. ఆమె మాటలు ఆమె లక్షణాలూ అన్నీ కోపం తెప్పిస్తాయి; దానికి తోడు, అంత వెకిలిగా కనబడే సుమిత్ర చాలా గొప్పగా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంటున్న "ప్రేమలేఖలు" రచయిత్రి అని తను అభిమానించే తమ్ముడు రామకృష్ణ గౌరవించడం, ఆమె వేషాన్ని మరచి వ్యక్తిత్వాన్ని పొగడడం ఆమెకు కచ్చ కలిగిస్తుంది. ఆమెతో ఎవరు చనువుగా ఉన్నా, ఆమెకు (ఆ వ్యక్తి భర్త, తమ్ముడు, అమృత ఇలా తేడా లేకుండా) సుమిత్ర అంటేనే కోపం వస్తుంది.

కానీ సుమిత్ర కథ ఆమె రెండవ చెల్లెలు అమృత చెప్పినప్పుడు కొంచెం కదలిక ఏర్పడుతుంది లలితలో.

సుమిత్రకు సవతి తల్లి, ఆ పదానికి పూర్తి న్యాయం చేకూర్చి, సుమిత్రను అష్టకష్టాలు పెట్టింది ఆమె. సుమిత్ర తను ప్రేమించి ఆరాధించిన వ్యక్తితో ఈ కష్టాల సముద్రం దాటి ఆవలి ఒడ్డుకు వెళ్ళిపోదామనుకుంటూ ఉండగా తండ్రి చనిపోతాడు. రెక్కలు రాని ఇద్దరు సవితి చెల్లెళ్ళను దిక్కులేని వాళ్ళను చెయ్య మనసురాక, తనకోసం ఎదురు చూస్తున్న ప్రియుడికి కన్నీళ్ళతో "నేనిప్పుడు రాలేను ఎప్పుడైనా వస్తాను. నీకు ఉత్తరాలు రాస్తాను. అడ్రస్ ఇవ్వు" అంటూండగానే రైలు కదిలిపోతుంది. విసుక్కున్న ఆమె ప్రియుడు, కాలగమనంలో ఆమెను మర్చిపోతాడు.

కానీ ఆమె అతడి జ్ఞాపకాల పరిమళాలతో బ్రతుకుతుంది. అడ్రస్ తెలియని ఆమె ప్రియుడికి ఆమె రాసుకునే లేఖలే ప్రేమలేఖలుగా ప్రచురించబడతాయి, ప్రపంచపు అధికార, అసహ్యకరమైన నటనతో సంబంధం లేని ప్రేమ పరిపక్వ స్థితి ఆమెది కాబట్టి, ఆ అక్షరాల వెనకాల ఉండే ఒక గొప్ప ప్రేమికురాలి మహోన్నత వ్యక్తిత్వాన్ని రామకృష్ణలాంటి వాళ్ళు గుర్తిస్తారు. కానీ వీరెవ్వరికీ ఆమె గుండెల్లో వాడిన రోజా పువ్వులాంటి ఆమె ప్రేమగాథ తెలియదు.

సుమిత్ర కరుణా మూర్తి , ప్రపంచదృష్ట్యా ఆమె కరుణ కామన్‌సెన్స్ పరిధుల్లో ఇమడదు. తనకు తెలిసింది సహాయం చెయ్యడం. అది పొందే వ్యక్తి మంచా చెడా అన్నది ఆమెకు అనవసరం.

పెద్ద మరిది శంకరం ఆమె మంచితనాన్ని పరమ నీచంగా ఉపయోగించుకుని డబ్బు గుంజుతాడు. ఆ విషయం చెల్లెలు జానకికి చెప్పాలని ప్రయత్నిస్తుంది, పాపం కానీ తన చెల్లెలికి డబ్బు అవసరం, అందుకే ఆమె భర్తకు ఇవ్వాలి అనుకుంటుంది ఆ పిచ్చి తల్లి.

"అక్కయ్యా నిన్ను వెక్కిరించి గేలి చేసి హింస పెట్టాను. అందుకే అనుభవిస్తున్నాను నాకోసం ఇంత త్యాగం చేస్తున్నావు" అని ఏడుస్తుంది జానకి.

"నాకు కోపం వచ్చింది. అయినా చీరా సారె పెట్టడానికి ఇది బేరం ఆడతానా? చిన్న పిల్లలు కూడా ఇలా అనరు. ఛీ!ఛీ!" అనగలదు సుమిత్ర.

"డబ్బు అప్పుగా తెస్తే ఏం? నీ కేమైనా అయితే రోగంతో. ఆ బాధ ఎక్కువా? ఈ బాధ ఎక్కువా?" అంటుంది సుమిత్ర

తన చిన్న చెల్లెలు అమృత ప్రేమించిన రామకృష్ణ పల్లెటూరులో పూర్ణ అనే అమ్మాయిని చేసుకుంటున్నాడని తెలిసి పోట్లాడే మూడ్‌లో వెళుతుంది సుమిత్ర. కానీ అక్కడ పూర్ణ ఇంట్లో ఆమె పిచ్చి తల్లి ఆ దరిద్రం, పూర్ణ అంటే ఎవరికీ సానుభూతి లేకపోవడం చూసి,

"నీ పేరేమిటి? పూర్ణకదూ! పూర్ణ చంద్రుడిలా ఉన్నావు. చల్లగా చక్కగా... అయితేనేం వెధవ రోజులు డబ్బుకు తప్ప దేనికి విలువలేదు... ఎంత అందంగా ఉన్నా కట్నం లేకుండా ఎలా? నేను నీకు అయిదువేలు కట్నంగా ఇస్తాను. పెళ్ళిచేసుకో నా దగ్గర 1500 ఉన్నాయి అంతే మిగిలింది అప్పుచేస్తాను" అంటుంది సుమిత్ర.

కానీ తన మాటలతో ఆ పిల్లను ఎంత హింస పెడుతుందో అర్థంకాగానే,

"సారీ! మా చెల్లెలి బాధ చూడలేక దాన్ని ఆదుకోవాలి అనుకున్నానే కానీ నువ్వూ నా చెల్లెలిలాంటి దానివే అనుకోలేకపోయాను" అంటుంది.

గద్దరి రాక్షసిలా పోట్లాడే పూర్ణకు ఎంత తీయగా ఉన్నాయి ఆ మాటలు? ఆ మాటలంటున్నది తనకు శత్రుస్థానంలో నుంచున్న వ్యక్తి, కానీ ఆ మాటలలో ఏ విధమైన కపటమూ లేదు. మిథ్యాభినయం అసలే లేదు. గుండె లోతులలోనించి నిజాయితీతో వచ్చిన మాటలు అవి.

పూర్ణను ఊరంతా వెలివేస్తే ఆమె తల్లిని తీసుకుని పారిపోయి రావడానికి ఆమెకు గుర్తుకు వచ్చింది సుమిత్ర. కానీ, అప్పటికే సుమిత్రకు లలిత పుణ్యమా అని ఉద్యోగం పోయింది. అయినా నవ్వుతూ ఆమె బాధ్యత స్వీకరిస్తుంది. టీచర్ ఉద్యోగం చేస్తూ ట్యూషన్లు చెపుతుంది. రాత్రి తను తాగే పాలు కూడా ఆదా చేసి పూర్ణకు ఆమె తల్లికి ఉపయోగిస్తుంది. కానీ తమాషా ఇది త్యాగమనో, మరొకటనో అస్సలు అనుకోలేదు సుమిత్ర. ఇది "నాధర్మం" అనుకుంటుంది. ఆమె త్యాగానికి తన వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బ తినడం చూసి, ఆమెను ఒదిలి పిచ్చి తల్లితో వెళ్ళిపోతుంది. వాళ్ళు వెళ్ళినందుకు బాధపడే సుమిత్ర, రిలీఫ్ ఫీలవదు; బాధ్యతలు తప్పించుకోవడం అస్సలు చేతకాదు ఆమెకు.

సుమిత్రలోని లోపాలు మిగతా వాళ్ళకు తెలుస్తూ ఉంటాయి కానీ, ఆమె లోపం ఒకటి ఆమెకు బాగా తెలుసు.

"నాకు కోపంలో ఒళ్ళు తెలియదు. నేనేం మాట్లాడుతున్నానో నాకే తెలియదు" అంటుంది.

దీనివల్లే తన చెల్లెలు అమృతను రామకృష్ణ ఉండే పల్లెటూరు పంపించారని పోట్లాడి లలితకు కోపం తెప్పించి దాని పరిణామంగానే ఉద్యోగం పోగొట్టుకుంటుంది. ఆమె ఉద్రేకంలో సందర్భోచితమా కాదా అని ఆలోచించకుండా మాట్లాడుతుంది. పల్లెటూరు రాగానే "అమృతా! నువ్వు ప్రేమించిన అబ్బాయి పేరేమిటి? ఏదోలే.." అంటూ ఆమె గుట్టు రట్టు చేస్తుంది. ఆమె తొందరగా మాట అనగలదు మర్చిపోగలదు. ఆ తరువాత తనకు కోపం తెప్పించిన అవతలి వ్యక్తికే మేలు చెయ్యగలదు.

"రామకృష్ణ ఏడీ? అతనితో పోట్లాడాలి?" అని యుద్ధ ప్రకటన చేసే ఈ మనిషిని ఏమనాలో తెలియదు అతని మేనత్త తాయారమ్మకు.

తనను గురించి ప్రపంచం మరొక రకంగా అనుకుంటారన్నది అర్థంకాదు వెఱ్ఱిబాగుల మనిషి సుమిత్రకు. తన చెల్లెలు తనకు దూరంగా వెళ్ళాలని తను రాగానే ఊరు ప్రయాణం కల్పించుకుని వెళితే, "పాపం ఏమిటో! దానికి నాతో గడపడానికి వీలు లేనంత పని" అని జాలిపడుతుంది.

తన ప్రియుడు తన కోసం ఇంకా వేచి ఉంటాడనే ఊహలతో అడ్రస్ తెలియక పోయినా అతడికి ప్రేమలేఖలు రాస్తుంది. ప్రేమ మాధుర్యం తెలిసిన ఆమె ప్రేమికులకు ఎంతో సహాయం చెయ్యాలని ప్రయత్నిస్తుంది.

ఆమె అభిప్రాయాలు ఆమె సూటిగా నిష్కర్షగా చెప్పేస్తుంది. ఇబ్బందుల పాలౌతుంది.

కృతజ్ఞత ఆమె ఊపిరి. తనకు ఆ పల్లెటూరిలో జ్వరం వచ్చినప్పుడు సేవ చేసిందని, పూర్ణను, తల్లిని ఇంట్లో పెట్టుకున్నప్పుడు.

"ఆ కాస్త దానికి.." అని ఆశ్చర్యపోతుంది పూర్ణ.

"పూర్ణా! నాకు లెక్కలు రావమ్మా పరిమాణాలు కొలుచుకుంటూ దేనికెంతో చూసుకోలేము అన్నింటికి అంతరంగమే ప్రమాణం నాకు" అన్నప్పుడు పూర్ణ మనసులో ఉద్వేగం చెప్పనలవి కాదు.

"ఈ వ్యక్తి దగ్గర కృతజ్ఞతలు ప్రకటించుకోనక్కర్లేదు, ప్రతిఫలాన్ని ఆశించి ఈవిడ తనకు ఏమీ చెయ్యడంలేదు. ముందు ముందు తను కృతజ్ఞత చూపలేకపోయినా ఏమీ అనుకోదేమో" అనుకుంటుంది.

నిజంగానే ప్రతి మనిషికి ఆ హాయి, కమిట్‌మెంటు లేని ప్రేమ కావాలనిపిస్తుంది. అతి ఉదారంగా తనకంటూ ఏమీ మిగుల్చుకోకుండా అదంతా ఇచ్చెయ్యగలదు సుమిత్ర.

"అందమంటే ఏమిటి? కనుముక్కు తీరా? కేవలం అదే చూడగలిగిన నీలాంటి వాళ్ళే ఎక్కువ ఈ లోకంలో. అంతకంటే కొంచెం పరిశీలనగా చూడగలిగితే..." అని రామారావుగారు భార్యను మందలిస్తూ ఉండగానే, వారి మధ్యకు వచ్చి

"మీరు మా జానకి కూతుర్ని తీసుకు రావాలి" అంటుంది. తను ఏదైనా చెప్పాలనుకున్నప్పుడు ఎదటివాళ్ళ మాటలు వినిపించుకోవడం సుమిత్రకు అసలు అలవాటు ఉండదు.

"నేనే వెళ్ళాలనుకుంటున్నాను. నా దగ్గర డబ్బు లేదు ప్రస్తుతం... డబ్బు రాగానే..." అంటూనే దగ్గుతో మెలికలు తిరుగుతున్న ఆమెను, ఆ ప్రేమ మూర్తిని కష్టాల్లో కూడా ఒదలలేని పనిమనిషి వీరమ్మ,

"చూడండమ్మా! యంత్రంలా పని చేసి ఈ స్థితికి వచ్చింది. వాళ్ళూ, వీళ్ళూ అని లేదు అందరూ తనవాళ్ళే... ఎవరి కోసమో ట్యూషన్లు కూడా చెప్పి ఈ మాయదారి దగ్గు ఎక్కువ చేసుకున్నది. ఇప్పుడా చెల్లెలు కూతురు దిక్కు లేని దాన్ని పెంచుతానంటుంది" అని ఏడుస్తుంది.

ఈ దృశ్యానికి అంతటికీ ఒక ప్రేక్షకుడు ఉన్నాడు. అతను జయదేవ్. మంచి పోస్ట్‌లో, గర్ల్‌ఫ్రెండ్స్‌తో సరదాగా పెద్ద సెంటిమెంట్లు పెట్టుకోకుండా బ్రతికేసే వ్యక్తి. లలిత చెప్పిందని, సుమిత్రకు ఉద్యోగం లేకుండా చేసిన వ్యక్తి కూడా అతనే.

"ఈమె స్థితికి కారణం నేనే..." అని లలిత దుఃఖపడుతూంటే విసుక్కుంటూ,

'ఆడవాళ్ళతో ఇదొకగోల.. ఎంత రాక్షసంగానయినా ఉండగలరు. పసిపిల్లలా బావురమనగలరు. రాయి విసరగలరు తగిలిన దెబ్బచూసి మూర్ఛపోగలరు' అనుకుంటాడు. లలితను తీసుకుని పల్లెటూరు వెళ్ళి చచ్చిపోయిన జానకి కూతుర్ని తీసుకురావడానికి ఒప్పుకుంటాడు జయదేవ్.

రామకృష్ణ, అమృత, పూర్ణ, జానకి పాప శాంత అందరూ వచ్చేటప్పటికి సుమిత్ర పరిస్థితి ఘోరంగా పరిణమిస్తుంది.

"ఇదుగో పాప.." అని లలిత అనగానే, ఆ పాపను ఆప్యాయంగా కౌగలించుకుని,

"ఇంకదాన్ని పెంచాలి. నాకు కాస్త నయమవగానే మంచి ఉద్యోగం చూసుకుని ....." అనగానే అందరికీ కళ్ళ నీళ్ళు తిరుగుతాయి.

పూర్ణ "ఆ బిడ్డ బాధ్యత నేనువహిస్తాను" అన్నప్పుడు

"హమ్మయ్య" అంటుంది. అంతకన్న ప్రశ్నించదు... ఎదుటి వాళ్ళ విషయాల్లో ఎప్పుడూ కల్పించుకోదు సుమిత్ర.

"అమృతా! నా లెటర్ పాడ్ తెచ్చిపెట్టవూ?" అంటుంది.

"నేను రాసే విల్లేమున్నది? నేను ప్రేమలేఖ రాసుకోవాలి" అంటుంది.

ఆ అక్షరాలను, ఆ వాక్యాలను చూడగానే "సుమిత్రా!" అని అరుస్తాడు.

ఒక్క క్షణం అతడి కళ్ళల్లోకి చూసి గుర్తుపడుతుంది సుమిత్ర. ఆమె చేతుల్లోంచి జారి ప్రేమలేఖ అతని కాళ్ళ దగ్గర పడుతుంది.

"నేను వెంటనే బయలు దేరి నీ దగ్గరకు.." అనే మాటలు అతని కన్నీటి మసకలో బోలెడన్ని కథలు చెపుతాయి.

కన్నుమూసిన ఆమెను పట్టి కుదుపుతాడతను. కానీ అన్ని ప్రేమలకు, బంధాలకు, అనుబంధాలకు, బాధ్యతలకు దూరంగా విశ్రాంతిగా వెళ్ళిపోయింది సుమిత్ర.

ముప్ఫై ఏళ్ళనాడు విడిపోయిన ఆమెను తను గుర్తించక పోగా నిందించి, ఎక్కిరించి, ఆమె ఉద్యోగం పోగొట్టి పరోక్షంగా ఆమె చావుకు కారణమయ్యాడు.

కానీ ఆ ప్రేమమూర్తి తనను మర్చిపోలేక తన హృదయావేదనను అక్షర మాలికలుగా రచించి శాశ్వతమైపోయింది. మహా ప్రాపంచికపు మనిషిగా బ్రతికే జయదేవ్ ఒక్కసారిగా తన మనస్విని, ప్రపంచంలోకి కళ్ళు తెరుస్తాడు.

ఆమె నుంచి అన్నీ పొంది, ఆమెకు ఏమి ఇవ్వలేక దుఃఖంతో నిలబడి పోతారు ఆమె ఆత్మీయులంతా.

సుమిత్ర పాత్ర చిత్రీకరణలో రచయిత్రి చాలా సజీవంగా మలచడానికి ఎంత కష్టపడి, మనస్థత్వ అధ్యయనం చేసి, అటువంటి వారి హావభావ సంభాషణా పద్ధతులను గమనించి ఉంటారా అనిపిస్తుంది.

మన సంఘంలో సుమిత్రలు చాలా మంది ఉన్నారు.. కానీ ఆనందారామంగారి 'మనస్విని'ని గుర్తు తెచ్చుకుంటే మనం మనకు అర్ధం కాని వారిని కూడా గౌరవించడం నేర్చుకోవచ్చేమో ననిపిస్తుంది.

***

## కొడవటిగంటి కుటుంబరావు 'అనుభవం' నవలలో 'పార్వతి'

" చాలా మంది చాలా రంగాలలో చాలా సంఘర్షణలు కొనసాగిస్తే కానీ, జీవితంలో సుఖ పరిణామాలకు దారి ఏర్పడదు. జీవితం నిండా పురోగమనానికి అడ్డు తగిలే శిథిలాలున్నాయి. వాటిని నిర్మూలించిన మీదట గానీ కొత్త నిర్మాణానికి అవకాశాలేర్పడవు-" ఈ మాటలు కొడవటిగంటి వారివే.

జీవితంలో ప్రణయాన్ని, మానసిక విప్లవాలను, దుఃఖాలను, కష్టాలను, అనుభూతుల్ని అందమైన అక్షరాల్లో మలిచిన మహా రచయతలు మనకు బోలెడు మంది ఉన్నారు. అటువంటి వారి రచనలు చదివి, స్పందించి, కన్నీటితో పులకించిపోయే అదృష్టం మనకు ఉన్నదని గర్వంగా చెప్పుకుందాం. అంతే కాదు.... ఇతర భాషల్లోని సాహితీ పుత్రులను విప్లవకారులను కూడా అనువదించుకుని, ఆదరించుకుని గౌరవించుకుని సంభాషించుకోగలిగిన గొప్ప గుణం మనకు ఉన్నది. ఈ గొప్పతనంలో బహుశ ఆంధ్రులదే అగ్రస్థానం అనిపిస్తుంది.

కానీ, ఈ ప్రణయాల అనుభూతుల అనుభవాల విప్లవాత్మక ఆలోచనా పరిణితికి కారణం వెతుకుతూ అదిభౌతిక సంచారం చేస్తూ, అక్షరాలతో ఆ పరిస్థితిని 'స్కెచ్'లా మనకు స్పష్టీకరింప చెయ్యదగిన "విమర్శక రచయితలు" కూడా మనకు ఉన్నారు. వీరు సహజంగా తక్కువమందే ఉంటారేమో..... కారణం "మేధాశక్తి"తో కూడిన "సృజనాత్మకత" ఎంతో మధన మీద, పరిశీలనా జ్ఞానం మీద గానీ ఏర్పడవు. వీరిలో కొడవటిగంటి వారిని అగ్రగణ్యులలో ఒకరిగా చెప్పుకోవాలి. ఇటువంటివారు ఏ ప్రభావానికీ తొందరగా లొంగరు. ఒకవేళ లొంగినా, విస్తృత పరిధిలో ఆ ప్రభావానికి మూల కారణాలను పరిశీలించి, అందులో లోపాలను ఎత్తిచూపి, పరిగ్రహించి మౌలిక సూత్రాలను మాత్రమే గ్రహించగల శక్తిమంతులు.

అందుకే వారు, "సామ్యవాదము, సోషలిజం, కమ్యూనిజం, డయలెక్టికల్ మెటిరియలిజం, మార్క్సిజం అనే మాటలు నన్ను చుట్టుముట్టినప్పుడు కూడా, నేను వాటిని గురించి సరైన అభిప్రాయాలు సంపాదించడానికి ప్రయత్నించలేదు. జీవితం నాకు అయోమయంగా కనిపించినప్పుడు, అది జీవితంలో స్వతస్సిద్ధంగా ఉందనే విశ్వాసంతో, వాటిని కథలలో పెట్టాను" అంటారు. ఇంత నిజాయితీగా తానేం చేస్తున్నారో తెలిసిన రచయతలు బహు కొద్ది మంది.

రచయితలు ఎప్పటికప్పుడు ఆత్మ విమర్శచేసుకోవాలనే ఈయన తన రచనల్లో ప్రతిపాదించిన అంశాలను సైతం, ఆలోచించమన్న ధోరణిలో చెప్పేవారు కానీ, "ఉపదేశం మన వ్యక్తిత్వాన్ని నిద్రలేపుతుంది" - అని ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో, తెలిసిన చాలా కొద్దిమంది రచయతల్లో వీరు ఒకరు. ఇటువంటి రచయిత చిత్రీకరించిన పాత్రలు ఒక జీవిత కాలానికి విస్తృత భావ సంకల్పాలకు దిక్సూచులుగా ఉంటాయి.

వీరు మంచి కథకులు... జీవితాన్ని విస్తృతంగా సమీక్ష చెయ్యవలసి వచ్చినప్పుడే "నవలలు" రాశారేమో. "అనుభవం" నవలలో "పార్వతి" ఒక సజీవమైన పాత్ర. నిర్ద్వంద్వంగా చెప్పదలుచుకున్న విషయాన్ని ఏ మెలికలూ లేకుండా, పార్వతి ద్వారా చెప్పించారు కొడవటిగంటి వారు.

పార్వతి మీనమ్మ కూతురు. తండ్రి ఒకటో రకం వాజ. తల్లి చాలా క్రూరమైన తల్లి. కానీ కాఠిన్యం సామర్ధ్యం కింద చలామణీ కావటం సాధారణంగా జరిగే విషయమే. అందుకే పార్వతికి ఆమె తోడబుట్టిన వారికి తల్లి అంటే `గురి` ఉండేది.

ఎదుగుతున్న సమయంలో, తల్లి గురించి "కుంతీదేవి" అని ఎవరో అంటే. ఆలోచించడం నేర్చుకోగానే "అర్థం" స్ఫురించింది ఆమెకు. కానీ, షాక్ కాలేదు. నిర్వికారమై పోయింది. ఆమె పినతల్లుల జీవితాలలో "నైతిక విలువలు" లేవన్న విషయం ఆమెకు చూచాయగా తెలిసినా, వారి జీవితాల్లో "స్వేచ్ఛ" ఆమెకు హాయిగా ఉందనిపించేది. ఆ అక్కచెల్లెళ్ళ నలుగురిలో, పెద్దచిన్నమ్మ మాత్రమే మంచి ఇల్లాలు అని పేరు పొందింది. కానీ ఆవిడ జీవితంలో మొనాటనీ, ఆవిడ నవ్వగా చూడకపోవడం వీటితో పార్వతికి ఆవిడ జీవితం పట్ల పెద్ద ఆకర్షణ లేదు.

కానీ, పెద్ద చిన్నమ్మ కుదిర్చిన సంబంధంతో ఆ ఊరి కోడలే అయింది పార్వతి. పెళ్ళిలో పార్వతి సానిమేళంలో ఆటసానుల స్వేచ్ఛకు ఆశ్చర్యపోయింది.

"వాళ్ళకే ఒక మొగుడుంటే ఇన్ని ఆటలు ఆడగలుగుదురా?!" అని ప్రశ్నించుకున్నది.

అత్తగారి వైభవం, భర్త అందం - ఇవేవీ పార్వతిలో తను పెద్ద చిన్నమ్మలా స్వేచ్ఛ లేని బ్రతుకు బ్రతకాల్సి వస్తుందన్న భయం తీసెయ్యలేక పోయాయి.

"దానికి వేరే కారణం ఏమీ లేదు. జీవితంలో అట్టే విశ్వాసం లేకపోవడమే.. ఆశలు ఎప్పుడూ అడియాసలే అవుతాయి, అన్న భావన. ఆమె మీద ఆనాటి భూస్వామ్య వ్యవస్థ ప్రభావం పురోగమనాన్ని శాశించే ఆర్థిక సామాజిక దోపిడి విధానమే మనిషి ఎదుగుదలను ఆపేస్తుంది. జీవితం పట్ల అనిశ్చిత పరిస్థితి, తనమీద తనకు నమ్మకం లేని స్థితికి తీసుకువస్తుంది.

ఆమె అత్తవారి వంశంలో స్త్రీలోలత్వం ఏదో వ్రతంగా స్వీకరించినట్లు, ఆ ఇంటి కోడళ్ళకు శాపంగా విధింపబడినట్లు భావించే పార్వతి అత్తగారు శ్యామలాంబ కావాలనే రూపిణి అయిన కోడలును తెచ్చుకొన్నది. ముమ్మూర్తులా తన భర్తను పోలిన కొడుకు కాంతయ్యను సంస్కరించుకోవాలనుకోవడం బదులు, కోడలు అన్ని వ్యసనాలకూ బానిస అయిన కొడుకును కట్టిపడేయ్యాలన్న గొంతెమ్మ కోర్కె,ఆమె మూర్ఖపు మనస్థత్వంలో తొంగి చూస్తుంది.

సంపన్నుల ఇంటి కోడలైన శ్యామలాంబ ఆ ఇంట్లో సంస్కారం లేదని అర్థం చేసుకుని, తను కోరుకున్న శుభ్రత, నాజూకుతనం కొడుకుకు నేర్పాలన్న ప్రయత్నంలో బాహ్య శుభ్రత నేర్పగలిగింది కానీ అంతఃశుద్ధి కోసం తపన పడలేదు. "చదువెందుకు? చదువుకున్న జీతగాళ్ళు దొరకరా?" అన్న సంస్కారం నేర్చిన కాంతయ్యలో విద్యాగంధం లేకపోగా పనికొచ్చే సువాసనా సంస్కారం బొత్తిగా మృగ్యమైపోయింది. పెళ్ళికి ముందే అతను సుఖవ్యాధులు సంపాదించాడు.

తన భర్త గంజాయీ, సారాయీ తాగుతాడనీ, స్త్రీ లోలుడనీ, పేకాట ఆడతాడని పార్వతికి తెలిసి పోయింది. కానీ తల్లి మీనమ్మ రాయిలా ఉంది కాబట్టి, ఆమె బాధపడే విషయమనుకోలేదు. కారణం, వివాహ వ్యవస్థ అనుభూతులు సౌందర్యాన్ని, ఆస్వాదననూ పెంచే బదులు, కక్కుర్తి, ఆస్థి జాగ్రత్త, బాధ్యతలు, హక్కుల పేరుతో డబ్బు గుంజడం నేర్పిస్తుంది మరి.

ఆమెకు భర్త ప్రవర్తన ఆశ్చర్యంగా లేదు. జీవితాన్ని పరిశీలిస్తున్న పార్వతికి అనుభూతులకు లోటేంలేదు. ఇతరుల అవినీతిని గురించి విడ్డూరం చెప్పుకునే వాళ్ళు, తాముగా నీతిపరులు కాకపోవడం ఆమెకు మొదట్లో ఆశ్చర్యంగా ఉండేది. జీవితాన్ని పూర్తిగా అర్థం

చేసుకున్నట్లు మాట్లాడే వాళ్ళు నిజంగా ఏమీ అర్థం చేసుకోలేరు. ఇతర్ల లోపాలు వెతికేవాళ్ళు, తమలోపాలు లేనట్లు నటించి, "నీ మాటేమిటి?" అని అడిగేవాళ్ళు లేకపోవడం వల్ల చెల్లుబడి అయిపోతున్నారు.

ఇవీ ఆమె పరిశీలనా జ్ఞానానికి అందిన సత్యాలు. పార్వతిని అర్థం చేసుకున్న అన్నదమ్ముల్లో వెంకటేశ్వర్లు ఒక్కడే అతనికి పార్వతి భర్త పట్ల ప్రదర్శించే నిర్లిప్తత మీద అంతగా నమ్మకం లేదు కానీ, చేసేది ఏమీ లేక ఊరుకున్నాడు.

మామగారు ఏ సానివాడలోనో బలవన్మరణం పొందితే, పలకరింపులకు తల్లితో వెళ్ళింది పార్వతి. తన అత్తగారు గుండు గీయించు కోనందుకు నిజంగా హర్షించింది. కొన్ని అర్థం తెలియని ఆచారాలంటే చాలా కోపం పార్వతికి. ఆమె అత్తవారి తరపు బంధువుల్లో చక్కటి దాంపత్యంతో జీవించే ఒక జంట ఆమెకు చాలా ఆదర్శవంతంగా కనబడతారు. భార్యను పేరు పెట్టి పిలిచి, సరసంగా మురిపెంగా గడిపే ఆ  సంసారం ఆమెకు జీవితం పట్ల కొంచెం ఆశ కలిగిస్తుంది.

రజస్వల అయిన దగ్గరనుంచీ పార్వతి ముందు జంకు లేకుండా ఆడవాళ్ళు గర్భాదానం గురించి మాట్లాడుకునేవారు. వారి మాటల్లో "యావ" ఆమెకు జుగుప్స కలిగించినా, కొంత కుతూహలం కలిగిస్తుంది. మామగారు చనిపోయిన కారణంగా కాంతయ్య గర్భాదాన ముహూర్తం ఏడాది దాటాలన్నారు. ఆ
ఆచారంలో లోకవంచన పార్వతికి స్పష్టంగా అర్థమైపోయింది.

ఈ ఏడాది తన మొగుడు బ్రహ్మ చర్యం అవలంబించబోతున్నాడా? వట్టి మాట. మనిషి శరీరం మీద స్వభావ సిద్ధమైన పొరా, దానిపైన ఒక మాయ పొరా ఉన్నాయి. ఈ మాయ పొర లేకుండా ప్రపంచం నడవదు కాబోలు....

"మొగుణ్ణి లోబరుచుకో" అన్న కుట్ర లాంటి సలహా కూడా ఈ మాయ పొర తాలూకు లక్షణమే అని ఆమెకు అర్థమైంది.

తీరా గర్భాదానం రోజున అందులో "చీదర" ఆమెకు అర్థమైంది. ఆ క్రతువులు, ఆ దానాలూ - ఇవన్నీ యజ్ఞంలానూ ఉన్నాయి. వేటలాగానూ ఉన్నాయి. రెండిట్లో ఏది మంచి చావు? అనే సమస్య ఏముంది?! కాంతయ్యలో మొరటుతనం కన్న, అతని అసహ్యకరమైన ప్రవర్తన ఆమెను నొప్పించింది. ఆమెను అతను పేరు పెట్టి పిలవాలన్న ముచ్చట ఆ మూర్ఖుడితో తీరదని ఆమెకు అర్థమైంది.

కాసేపు తనను కఠినంగా, కాసేపు ప్రేమగా చూసే అత్తగారికి, నిజంగా తన పట్ల ఎట్లా ప్రవర్తించాలో అవగాహన లేదు అని అర్థమైపోయింది ఆమెకు.

"చాలా సార్లు పార్వతిలో, ఏ సహజ ప్రేమ చేతనో భర్త మీద ప్రేమ ఉబికి వచ్చేది. దానికి, కాంతయ్య విలువ ఇచ్చేవాడు కాదు. దీన్ని బట్టి అతనికి కామం తప్ప ప్రేమ అవసరం అని అర్థమైంది పార్వతికి ఆమెలోని ప్రేమ దీర్ఘ రోగంతో బాధపడిన మనిషిలా ఏళ్ళ తరబడి తీసుకుని, తీసుకుని మరీ చచ్చింది. ప్రేమ ఖాళీ చేసిన జాగాలో ద్వేషం వచ్చి కూర్చుంటుంది -" పై మాటల్లోనే కుటుంబరావుగారు వివాహ వ్యవస్థలోని అస్తవ్యస్థమైన ఏర్పాటు మనకు అర్థమయ్యేలా చెపుతారు. "నన్ను వేధించకండి - నేను మీకు కావలసిన ఆడదాన్ని కాదు" అని ఒళ్ళు మండి తృణీకరించే నాటికే ఆమె గర్భవతి.

పురిటికి బస్తీ చేరిన పార్వతి - పేదరికం, బస్తీ జీవనంలో స్పష్టంగా కనబడటం గ్రహిస్తుంది. ఇవి ఎంత నిజం. పల్లెలలో నిత్యావసర జీవితం ఒక్క పైసా చేతిలో లేకపోయినా వెళ్ళిపోతుంది. కానీ బస్తీలో ప్రతి క్షణానికీ ఖరీదు ఉన్నది. తనను తన అంతస్థు వల్ల వదినలు గౌరవిస్తున్నా, వాళ్ళు సంసారిక జీవితంలో తన కన్నా వెయ్యి రెట్లు హాయిగా ఉన్నట్లు గ్రహించుకుంటుంది పార్వతి.

మాతృమూర్తి అయిన పార్వతి తన బిడ్డను చూసి చాలా ఆనందపడింది. కానీ, దాన్ని ఎవరి తోనూ పంచుకునే స్థితిలో లేదు. అత్తగారి చేతులలో తన బిడ్డను ఊహించుకోలేక విలవిలలాడింది పార్వతి. తన భర్తకు ఉన్న దుర్గుణాలు తల్లి మప్పినవైనా అయ్యుండాలి - ప్రోత్సాహించినవైనా అయ్యుండాలి. ఇవి పార్వతి అభిప్రాయాలు. అందుకే తను సాగనించినట్టైయితే, ఆవిడ తన బిడ్డను కూడా అలాగే తయారుచేస్తుందన్నది పార్వతి గట్టి నమ్మకం.

బిడ్డ పుట్టిన తరువాత కాంతయ్య దిగజారుడులో వడి ఎక్కువయింది. ఎడాపెడా ఖర్చు చేసి, అప్పులు చేస్తున్న అతనిని ఖండించని అత్తగారంటే అసహ్యంతో, ఆస్తి  కాపాడుకునే మార్గాలు వెతికింది పార్వతి. భర్త మీద వాదన చేయాలన్న కోరిక ఉన్నా, ఆమెకు ధైర్యం

లేకపోయింది. కానీ, ఆ పని అన్న వెంకటేశ్వర్లు, అతని మామగారూ చేశారు. వ్యవహారకర్త అయిన ఆడదాన్ని ఎదిగీ ఎదగని సంఘం క్షమించదుకాక క్షమించదు. తనను చాలా క్రూరాత్మురాలిగా చూస్తున్న వాళ్ళకు నచ్చచెప్పాలని ప్రయత్నించి విసిగిపోయింది పార్వతి.

కాంతయ్య హఠాత్తుగా దిగి ఆమెను రమ్మంటాడు. కొడుకు ఆస్థి రాసివ్వనిదే రానంటుంది. అతని సమ్మోహనాస్త్రాలకు ఆమెలోని స్త్రీ కరుగుతుంది. కానీ తల్లి రాయిగానే మిగులుతుంది.

కోర్టు వ్యవహారాలు పూర్తిగా అర్థం కాని పార్వతి తనకు భర్తను బికారిని చేసిన ఆడదానిగా పేరు వస్తుందని ఒణికిపోతుంది. రాజీకి వచ్చిన భర్త ప్లీడర్‌ని చూసి,

"ఆయనను బుక్కా ఫకీరు చేసిన నేను పొందే ఆనందం ఏముంటుంది?! రాజీ పడు అన్నయ్యా! ఆయన ఏనాడు కావాలన్నా వచ్చి నా దగ్గర, బిడ్డ దగ్గర ఉండవచ్చు" అంటుంది.

ఆమెను అందరూ తెలివి తక్కువ దానిలా కసురుకుంటారు. భయపడిన పార్వతి,

"జీవితం ఎంత క్రూరమైనదీ? అది తప్పు చేయని వారి పట్లా, ఘోరాలు చేసిన వారి పట్లా సమంగా క్రూరంగా ఉండగలదు" అనుకుంటుంది. ప్రపంచాన్ని ఒప్పించాలన్న ప్రయత్నమంత మూర్ఖత్వం మరొకటి లేదని నిర్ణయానికి వచ్చి, తన తెలివితేటలు తనే గౌరవించుకునే స్థితికి వస్తుంది పార్వతి.

ఆస్తి రాగానే అన్నల దగ్గర ఉండలేక, వేరు వెళుతుంది పార్వతి. ఇక్కడ స్త్రీ స్వేచ్ఛ అన్న సమస్య గురించి ఉన్నంత పరిధిలో గొప్పగా చర్చించారు, ఆలోచింపజేశారు రచయిత.

ఆర్థిక వనరు స్వేచ్ఛకు మూలంగా గ్రహించిన స్త్రీ, అది ఏర్పడగానే తను చాలా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో హాయిగా, తన ఇష్టం వచ్చిన రీతిలో బ్రతకాలని కోరుకుంటుంది. కానీ, స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు మనిషి ఎదగడానికి, మరింత ఔన్నత్యపు పట్టుకొమ్మలకు ప్రాకడానికి ఏర్పడిన సోపానాలని గ్రహించక, అంతటితో ఆగిపోయి, ఎదగడం, ఆలోచించడం, నేర్చుకోవడాన్ని గౌరవించడం మర్చిపోయి తన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే, తన ఆయుధాలు, అలంకారాలు అనుకుని "నియంత"గా మారిపోయే స్త్రీల వలననే స్వతంత్ర్యం అనేది రెండు వైపులా పదునున్న కత్తిగా అది పసిబిడ్డలకు, స్త్రీలకు, పిచ్చివారికి అందుబాటులో ఉంచరాదన్న పద్ధతి, అసహ్యకరమైన ఆనవాయితీ వచ్చిందని ధ్వనింప చేస్తారు రచయిత.

స్వాతంత్ర్యం రాగానే తిండిపోతు తనం అలవాటై లావైపోతుంది పార్వతి. దానికి ఏవేవో కారణాలు వెతుక్కుంటుంది. రోజులు సుఖంగా వెళ్ళిపోవడం ముఖ్యం అనుకుంటుంది. తన అనుభవాలను భవిష్యత్తుకు ఎలా ఉపయోగించుకోవాలో ఆమెకు స్పష్టంగా తెలియదు.

తల్లి ఎవరి గురించైనా తక్కువ చేసి మాట్లాడ్డం, అందులో అంతవరకూ ప్రేమగా చూసిన మామయ్యలను, వాళ్ళ అబ్బాయిని గురించి మాట్లాడ్డం భరించలేడు వెంకటనారాయణ. అన్నం గిన్నెలో చెయ్యి పెడితే ఏ ఎలుకో తగిలినట్లుగా వాడు ఉలిక్కి పడేవాడు తల్లి మాటలకు. కానీ పార్వతి ఆలోచనలు వేరు. అందరిలా తన బిడ్డ పెరగ కూడదు. తన కొడుకు మనసులో పడే ప్రతి ఆలోచనా వాడికి పనికి రావాలి. అది అడివల్లే ఉండకూడదు. అందులో ప్రతి అంగుళం తన చెప్పు చేతల్లో ఉండాలి. ఇది పార్వతి దృక్పథం. అందుకే నారాయణ వాడి కొత్త స్నేహితుల గురించి సరదాగా తల్లితో చెప్పబోతే,

"నువ్వు ఏ అలగా వెధవలతో సావాసం చేస్తావోనని నాకు భయంగా ఉన్నది" అనే తల్లిని చూసి నిర్ఘాంతపోతాడు నారాయణ.

ఇతరులు మనస్సులో గుబులు పుట్టిస్తే తల్లితో చెప్పుకుని ఉపశమనం పొందవలసిన వాడు, తల్లే గుబులు పుట్టిస్తే, ఏం చేస్తాడు?! "నా స్నేహితుల్ని రావద్దని నువ్వే చెప్పు" అన్న వాడి మాటల పదునుతో వాడు తల్లిని బహిష్కరించడం ప్రారంభించాడు. తను యధాలాపంగా అనే ప్రతి మాటా కొన్నాళ్ళు తమ బిడ్డలకు శిలాక్షరంగా ఉంటుందని, వాటిని తల్లే గౌరవించడం లేదని తెలిసిన మరుక్షణం పిల్లలు గౌరవించవలసిన వాటిని కూడా గౌరవించరనీ పార్వతమ్మకు తెలియదు. తన మాట వినక చెరువులో దిగి ఈత నేర్చుకుంటున్నాడు కొడుకు అని తెలియగానే, తన మామగారు, భర్త లాగా కొడుకు పాడైపోతున్నట్లు ఊహించుకుని, వాడికి కటువుగా ఆంక్షలు విధిస్తుంది పార్వతి. కానీ తెలివి గల నారాయణ రావుకు తల్లి దౌర్బల్యమే ప్రస్తుత బలం. క్రమేణా నారాయణకు సంగీతం, నృత్యం మీద తెలియని

అభిరుచి ఏర్పడింది. వాడికి తెలియని విషయం ఒకతుంది. పార్వతిది రాతి గుండె కాదు - వాడు ముద్దుగా కావాలనుకున్న దేన్నీ ఆమె - కాదు కూడదు అని అనాలన్న ప్రయత్నమే కానీ, అనలేదు.

పార్వతి అటూ ఇటూ బంధువుల అందర్నీ తిరగేసినా, తన వెంకటేశ్వర్లు అన్నయ్య తప్ప పనికి వచ్చే సజ్జు, ఆస్తి, వ్యవహార జ్ఞానం ఉన్న మనుష్యులు అందులో ఆడవారు అసలు కనబడలేదు. తనకు మనోబలము, ధైర్యము ఇచ్చే నమ్మకాలు సరైనవనీ, భయపెట్టేవి తప్పుడు నమ్మకాలని పార్వతి గట్టిగా నమ్మింది'మన చేతిలో ఏమీ లేదు. అంతా ఈశ్వరానుగ్రహం' అన్న వేదాంతం వింటే ఆమెకు కంపరం. అలా అనేవాళ్ళకు వాళ్ళ మాటల మీద వాళ్ళకే నమ్మకం లేదని తేల్చుకున్నది. ఇంక చేతల్లో ఏముంటుంది?!

ఇలా ఆలోచిస్తున్న పార్వతికి పినతల్లులు, పినతండ్రులు టపీమని పోవడంతో, దేముడు అంటూ ఒకడున్నాడేమో నన్న భయంతో పాటు, "నేను కాస్త అణిగి మణిగి ఉండాలి" అన్న ఆలోచన వచ్చింది.

ఏ పాప భీతి, దైవచింతన అనే లక్షణాలంటే అసహ్యించుకున్నదో, పాపం పార్వతి వాటికి "చావు" అన్న భయం వలన లొంగింది. తన వల్ల కలిగిన మహాపరాధం ఏమిటో తెలియకుండానే పశ్చాత్తాపంతో దహించుకు పోయింది. వీలైనంత ధన సహాయం ఆ పోయిన వాళ్ళ కుటుంబాలకు చేసి, "దేవుడా! గుర్తుంచుకో ఆదుకున్నాను" అనుకునేది.

భర్త లేని లోటు, మనసులో మాట చెప్పుకుందామంటే తోడు లేని లోటు పార్వతికి అర్థమౌతోంది. కొడుకుతో ఇవీ, అవీ అని లేకుండా మాట్లాడుతుంటే, నారాయణ నిర్ఘాంతపోయి వినేవాడు. నారాయణ స్కూల్లో పికెటింగ్ అంటేనే చాలు, వాడి వంశంలో లాగా వాడికి చదువు అంటదేమోనని భయపడిపోయింది ఆమె.

పార్వతి భర్త కాంతయ్య గాంధీగారి ఉద్యమంలో చేరడం, చిన్నన్న ద్వారా ఉద్యమం గురించి కొంత విని, భర్త మారతాడేమో ఈ దెబ్బకు అని ఆశ పడుతుంది. ఆమె తన భర్త లాంటివాడు కాని, ఒక మహా పురుషుణ్ణి మనసులో ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉన్నది.

భర్త కాంతయ్య తమ ఊళ్ళో మీటింగులో మాట్లాడ్డం, అందరూ తనను వెళ్ళమనడం, ముఖ్యంగా నారాయణ "నాన్న" గురించి అంతగా మాట్లాడ్డం - ఇదంతా లోకమంతా ఏకమై, తన భర్తకు జరిగే గౌరవం తను చూసి తరించాలని కుట్ర పన్నుతున్నట్లు ఆమెకు తోచింది.

తన భర్త మూలకంగా ఆమెకు అతను ప్రవేశించిన ఉద్యమం మీద కూడా అసహ్యం కలిగింది అని చెపుతూ, మనుష్యుల అనుభూతుల ప్రభావం ఉద్యమాల మీద ఎలా ఉంటుందో గొప్ప విశ్లేషణ ఇచ్చారు రచయిత.

"ఉద్యమం యొక్క స్వరూపాన్ని చాలామంది అర్థం చేసుకోరు. ఆ ఉద్యమంలో చేరిన తమకు తెలిసిన వారి స్వభావాన్ని ఆ ఉద్యమానికి న్యాయంగా దక్కవలసిన కీర్తికి కూడా కొంతకాలం అడ్డు పడగలుగుతారు" అంటారు.

బిడ్డ ఆరోగ్యం, చదువు, డబ్బు జాగ్రత్త ఇవి తప్ప ప్రపంచం ఎట్లా పోయినా, తన గురించి ఏమిటి అనుకున్నా, తనకనవసరం అనుకున్నది పార్వతి. ఆస్తి ఉన్న వితంతు అత్తగార్లు, ఎందుకు జులుం మరింత సాగిస్తారో అర్థం కాదు పార్వతికి. తనూ అలాగే తయారౌతానని భయపడుతుంది.

భర్త సర్వదాస్థి హరించాలని, తన సహాయం కోరాలని, మనస్సులో ఆరాటపడేది పార్వతి. కానీ విధి చావు దెబ్బ తీసి కాంతయ్య ఆ స్థితికి రాకుండానే పోయాడు. శ్రద్ధగా తద్దినాలు, దానాలు చేసి, తన తాలూకు తప్పు చేశానన్న భావన నుంచి తాత్కాలిక విమోచన పొందింది పార్వతి.

నారాయణకి కాలేజీ చదువులో కూడా తల్లి పెట్టే ఆంక్షలు, ప్రపంచం అంతా కుళ్ళు మనుషులు కుళ్ళు తిళ్ళు తింటారు, అందరూ దొంగలు అప్పు తీసుకుని డబ్బులు ఎగేస్తారు. అందరూ వంచకులు. తల్లి ఎందుకిలా ఆలోచిస్తుందో తెలియక "అమ్మ" అనే భావంలో ఇమిడి ఉండవలసిన మాధుర్యంలో అంతో ఇంతో వగరు కలిసింది "ఆడపెత్తనం" అంటే అసహ్యం పెంచుకున్నాడు. తల్లి అడిగే జీతం వివరాలు చూసి విసుక్కున్నాడు.

తద్దినాలు లేవనే కొడుకును చూసి, తన శిక్షణ వృధా ఏమో అని దిగులు పడుతుంది పార్వతి. కానీ 'తన శిక్షణ సక్రమమైనది కాకపోవచ్చు'అని తట్టదు ఆమెకు.

తల్లి తనతో గుంటూరులో కాపురం పెట్టడం భరించలేడు నారాయణ. హాస్టల్‌లో ఉంటానంటాడు. 'నేను వీడికి బరువు ఎలా అయ్యాను' అని వాపోతుంది పార్వతి. ఆమె జీవితం వాడి చుట్టే అల్లుకున్నది మరి.

తన తిండి తప్ప మరొక తిండికి అలవాటు పడలేదు. - అని ఎదుగుతున్న ప్రతి కొడుకు గురించీ అనుకుని సీదా సాదా తల్లి మోసపోతూనే ఉంటుంది. పార్వతి కూడా అంతే. నారాయణ కిళ్ళీలకు అలవాటు పడ్డం, తన నుంచి దూరంగా ఉండాలనుకోవడం - వీటి గురించి ఆలోచిస్తే అర్థమయ్యేవేమో కానీ పార్వతి ఆలోచించి, భరించలేదు.

రచయితగా మారిన నారాయణ, తల్లి ఒక బాల వితంతువుకు బుర్ర గొరిగించి ముసుగు వేశారని కచ్చగా సంతోషిస్తే, ఆమెలో ఈ విధమైన క్రూరత్వాన్ని నారాయణ సహించలేక పోతాడు. పెళ్ళిచూపుల్లో తనకు నచ్చిన సావిత్రిని, తల్లి చేత ఔననిపించుకుని పెళ్ళి చేసుకుంటాడు నారాయణ. అత్తగారింటి వారి సౌమ్యత, సంస్కారం నారాయణను బాగా ఆకట్టుకుంటాయి. వారి ముందు పార్వతి దివిటీ ముందు దీపం అయింది.

కొత్త సంసారంలో సావిత్రి తెచ్చుకున్న సారె, ఆమె భర్తతో చనువుగా, హాయిగా ఉండటం ఇవన్నీ పార్వతికి ఏవగింపుగా ఉన్నా, ఎలా చెప్పాలో తెలియదు.

సంఘంలో 'వర్గాల' మధ్య ఉండే గోడలను పోలినవి తరాల మధ్య కూడా ఉంటాయి అంటారు రచయిత. ఎంత నిజం ఇది.

నారాయణ మద్రాసులో ఉద్యోగానికి వెళతానంటే, "నీకేం ఖర్మ?" అంటుంది తల్లి. కానీ తల్లి మాట విని ఆగే దశ అతను దాటిపోయాడు. వేరు కాపురం పెట్టిన కొడుకు దగ్గరకు స్వంత ఊరు నుంచి రానంటుంది పార్వతి. మనవడి మోజులో కొన్నాళ్ళ తరువాత వచ్చినా, ఆ వాతావరణంలో తను పరాయిదాన్నన్న భావన ఆమెకు తను రైటన్న భావన హాయిని కలిగించదు. పైగా యవ్వనవంతులైన కొడుకుతో కోడలు, పడకటింటి సుఖాన్ని ఏదో అద్భుతంగా భావించడం భరించ లేకపోతుంది పార్వతి.

ఆమెకు చౌకబారు రంకుతనాలంటే తగని అసహ్యం. అందుకని కోరికకు లొంగి పట్టుబడటం ఆత్మన్యూనత కాబట్టి ఆమె నీతిగా బ్రతికి సరిపెట్టుకున్నది.

ఇక్కడ మహా గొప్ప మనస్తత్వ శాస్త్రవేత్తలా రచయిత చాలా సాహసంతో నడి వయసు దాటిన గౌరవం ఆపాదించబడిన స్త్రీమూర్తి భావాలు నిర్భయంగా వర్ణించారు.

"పార్వతికి నిద్ర ఉండేది కాదు. అహోరాత్రులు మైథున సుఖం అనుభవిస్తున్నట్లు కలలు కనేది. ఆమెకు అనేకసార్లు వేశ్య అయి పుడితే బాగుండేదనే కోరిక కలిగేది. సేవా ధర్మంలో సతీ సమస్య లేదు. శరీర సుఖం బోలెడు. ఎంత గొప్ప కాంబినేషన్. వేశ్యలకు సుఖవ్యాధులుంటాయని ఆక్షేపించే వాళ్ళ మాటల్లో అర్థం లేదు. తనకూ తన భర్త ఒక జబ్బు తగిలించాడు. వేశ్య కన్న, తన వంటి జన్మ ఏవిధంగా ఉత్తమమైనది? బుజువేమిటి?!" ఈ వాక్యంతో ఆలోచనను రేపి, సంఘాన్ని ఒక ఊపు ఊపగలగడం విప్లవాత్మక, ప్రయోజనాత్మక రచయితకే సాధ్యం. భర్త పోగానే అనవసరపు పవిత్రత ఆపాదించి, ఆడవాళ్ళను శాడిస్టులుగా తయారు చేసి, యవ్వనవంతుల జీవితంలో నిప్పులు కురిసే రాక్షసులుగా మార్చడం కన్నా వారికి తోడు వెతుక్కునే వ్యవస్థ ఎంతో ఉత్తమమైనది అని ధ్వనింప చేస్తారు రచయిత.

ఏదో కారణం పెట్టుకుని తన స్వగృహానికి వెళ్ళి పోతుంది పార్వతి. ఆమె గుండెల్లో కొడుకు ఏర్పరచిన"లోటు" ఎవరూ తీర్చలేనిది. వేదాంతం ఒంటబట్టదు, దీన్ని ఇచ్చే సెక్యూరిటీకి దూరం కాలేదు. ఆమె అవసాన దశలో, దగ్గరకు వచ్చిన కొడుకుతో "నాయనా! నాకు ఒక్కటే విచారం. నిన్ను ఎట్లా పెంచాలో చేతకాక దూరం చేసుకున్నా..." అంటుంది.

ఆవిడ జీవితాశయం వడగట్టితే చివరకు నిగ్గు లేలినది ఈ రెండు ముక్కలే....

తెలుగులో సృజనాత్మక వచన సాహిత్యంలో దాంపత్యేతర కుటుంబ సంబంధాలను ప్రధాన వస్తువుగా తీసుకుని అద్భుతంగా సాహిత్యాన్ని స్పృశించిన వారిలో కొడవటిగంటి వారు ఒకరు.

"సాహిత్య కారుడుగా నాకు జీవితం ప్రమాణం. సిద్ధాంతం కోసం జీవితాన్ని వక్రంగా చిత్రీకరిస్తే, ఆ రచన ఉత్తమ రచన ఎట్లా అనిపించుకుంటుందో నాకు అర్థం కాదు" - అన్న ఈ నిజాయితీ గల రచయిత సృష్టించిన పార్వతి మనకు సంఘంలో ఎంత మంది తల్లులనో చాలా సులభంగా అర్థం చేసుకుని విశ్లేషించుకునే అవకాశం ఇస్తుంది.

***

## "చివరికి మిగిలేది? లో అమృతం



"మనలోని ప్రతి ఒక్కరికి రెండు జీవితాలుంటాయి. మన చర్యలకు సంబంధించిన జీవితం ఒకటి. మనసుకు, మస్తిష్కానికీ సంబంధించిన జీవితం మరొకటి. ఏ వ్యక్తులు ఏమేం చేశారో, వాళ్ళ బాహ్య స్వరూప స్వభావాలేమిటో చరిత్ర వెల్లడి చేస్తుంది కానీ వాళ్ళ అంతరంగాలను మాత్రం కాదు. ఆ అంతరంగమనేది వాళ్ళకే పరిమితమైన రహస్యం. ఆ 'జీవిత' రహస్యం మాత్రం - లోతుగా విశ్లేషించడానికి, ఊహించడానికి సాధ్యం కానిది" అన్నారు బుల్వర్.

పై మాటలు చాలా వరకు సాహిత్యానికి వర్తిస్తాయి. ఏది మంచి సాహిత్యం? ఏవి మామూలు నవల? అని ఎదుగుతున్న ప్రతి పాఠకుడు, పాఠకురాలు ఆలోచించేటప్పుడు - బహుశ పై మాటలు కొంత వరకూ ఉపయోగపడతాయేమో. మనిషిలో ఉండే అంతఃచేతన ఉన్మీలనమవ్వాలంటే, అతని ఆలోచన ఎదిగి, స్వార్థాన్ని దాటి, 'నా' అనే పరిధిని ఛేదించుకుని మానవత్వాన్ని తాత్వికత్వాన్ని ప్రతిష్టింప చెయ్యాలి దీనికి కారణమైన ఏ కొన్ని అక్షరాలైనా సాహిత్యమే అనిపిస్తాయి. మనిషిలో వెలుగు మధనను 'చరిత్ర' మర్చిపోయి కేవలం క్రియలు మాత్రం తేదీలతో సహా సమీకరిస్తుంది. దాని వలన మనిషి ఆత్మలేని భూతకాలం మాత్రం అర్థమౌతుంది. కచ్చ, కోపం, ద్వేషం రగిల్చే ఏ అక్షరమైనా అటు రచయితనూ, ఇటు పాఠకుడినీ కూడా ఉన్మాదస్థితికి తీసుకువెళుతుంది. ఎందుకంటే అక్షరానికి హిప్నాటిక్ శక్తి ఉన్నది. కానీ మంచి ఆలోచన, దానికి కారణమైన అంతర్మధన రేకెత్తించే రచన అటు రచయితనూ ఉన్నతుణ్ణి చేస్తుంది. ఇటు పాఠకుడి ఆలోచన ధోరణిలో కూడా మార్పు తీసుకువస్తుంది.

బుచ్చిబాబు గారి "చివరకు మిగిలేది" తెలుగు సాహిత్యంలో ఒక మణిపూసగా వెలుగొందుతోంది. కొంత ఇంగ్లీషు రచయితల ప్రభావానికి గురి అయినా "థింకింగ్ అలౌడ్" (మాటలతో బిగ్గరగా ఆలోచించడం) అనే ప్రక్రియతో చాలా సున్నితమైన భావావేశంతో, చాలా గొప్ప జీవిత సత్యాలతో నడిచే ఈ నవల మనని ఆలోచింపచేస్తుంది. మనసును కొన్ని వాక్యాల మీద నిలబెట్టి "ఇది నీ భావన కూడా కదూ" అని ప్రశ్నింపచేస్తుంది. తెలియకుండానే మనసు ప్రభావితం చేస్తుంది.

ఈ నవలలో అన్ని పాత్రలూ విలక్షణమైనవే. కోమలి, సుశీల, నాగమణి, కాత్యాయని, అమృతం... ఇలా అతి ముఖ్యమైన స్త్రీ పాత్రల ద్వారా స్త్రీత్వాన్ని వివిధ కోణాల్లో దర్శించి మనకు అక్షరదర్శిని ద్వారా దృశ్యకావ్యంగా చూపించారు శ్రీ బుచ్చిబాబు.

ఇందులో ఫక్తు తెలుగింటి ఆడబడుచు అమృతం..!

ఆమెది పరిపూర్ణ స్త్రీత్వం నిండిన అక్షర చిత్రం... స్త్రీలో సౌకుమార్యం, వలపు, ముగ్ధమనోహరత్వం ఎంత అవసరమో- తల్లితనం, జాలి, ప్రేమ కూడా అంతే అవసరం... అసలు స్త్రీత్వం సగం - మాతృత్వం సగం నిండిన స్త్రీమూర్తి పరిపూర్ణురాలు. ఇందులో ఏ ఒకటి హెచ్చు తగ్గినా ఆమె ఏ ధర్మానికీ న్యాయం చేకూర్చలేక పోయి, తన దుఃఖానికి, బాధలకు అందర్నీ నిందిస్తూ బ్రతికి - కన్నీరుతో, కచ్చతో ప్రపంచాన్ని మరింత అలికిన దృష్టితో చూస్తుంది కానీ, అమృతం అలాకాదు అద్భుతమైన యువతి ఆమె.

ఈమె మనకు నవల రెండో అధ్యాయంలో దర్శనమిస్తుంది. అప్పటికే దయానిధి అనే ఈ నవలలోని హీరో అతని అస్థిరత్వం, తల్లి నైతిక విలువల గురించి ఎవరైనా మాట్లాడితే కుంచుకుపోయే మనస్థత్వం, అతని సున్నితమైన
ఆలోచనలు, ప్రపంచానికి అతను అర్థంకాని పరిస్థితిలో చిక్కుకోగలిగిన వ్యక్తి మనకు పరిచయం చేయబడతాడు.

అతనికి దూరపు చుట్టం అమృతం... కొంగుతో కన్నీరు తుడుచుకుంటూ అత్తయ్య మరణం గురించి పరామర్శించింది.

"అమ్ములు కన్నీరు సహజంగా ఉంది... ఇతరుల దుఃఖాన్ని పంచుకోవడం తనకు నైజమల్లే.." అంటారు రచయిత.

అమ్ములు అందగత్తె కాదు. అలంకారం కూడా పల్లెటూరు పద్ధతిలో ఉంటుంది కానీ "లోయలో సూర్యాస్తమయం చూసినట్లు అందంగా, అద్భుతంగా ఉంటుంది" ఆమెలోని స్త్రీ మూర్తి.

ఆమె చదువుకున్నది కాదు. సుశీల లాంటి చదువుకున్నామన్న గర్వం ఉన్నవాళ్ళ మధ్య ఆప్యాయత ప్రకటిస్తుంది. కానీ, వాళ్ళలా అసూయతో సన్నివేశాన్ని అసహ్యంగా మార్చదు. ఆమె జీవితమేమీ అంత సుఖకరమైనది కాదు. ఆ మాటకొస్తే ఏ మనిషిదీ కాదు... ఆమె కన్నుల వెనకాల నైరాశ్యం మనుష్యుల్ని చదవగల దయానిధికి అర్థమవుతుంది.

"అమృతం దిగులుగా ఏదో మనోవ్యాధితో ఉన్నదాని మల్లె ఉంటుంది. మొహంలో విషాదం ఉంది. నవ్వుతూంటే రాజ్యనాశనం జరిగిన తర్వాత, శిథిలాలను చూసి ఒకప్పుడు మహావైభవం అనుభవించిన రాణి నవ్వడంలా నిండుగా, బరువుగా, ఠీవిగా ఉంటుంది." ఈ మాటల్లో మనకి అమృతం రూపం స్ఫురిస్తుంది.

"అందరికీ అన్ని బహుమతులూ తెచ్చిన దయానిధిని 'నాకేం తెచ్చావు బావా?' అని అడిగి వెల్తిపడదు అమృతం. "నువ్వుపట్నం వెళ్ళేటప్పుడు మా ఊళ్ళో దిగావంటే నీకు సొజ్జప్పాలు, పూతరేకులు పాకేజీగా ఇస్తాను" అంటుంది. ఆమె మరొకర్ని ఇబ్బంది పెట్టదు. అసహ్యకరమైన సన్నివేశానికి సారథ్యం వహించి, అదొక అద్భుతంగా మార్చగల శక్తి ఉంది ఆమెకు.

స్త్రీకి కావల్సింది ప్రేమకాదు... పదిమంది ఇతర స్త్రీలలో తాము వాంఛింపబడటం అని మరొక రకం స్త్రీ గురించి చెపుతారు రచయిత.

"ఆమె ఒక సామ్యవాదపు సౌందర్య సంస్థ" అని కోమలిని కూడా అనగలిగిన రచయిత, అమృతాన్ని మాత్రం "చిత్రకారుడు రచించిన బొమ్మతో ప్రసంగం.." అనిపిస్తారు నిధి చేత.

"మావారు నన్ను అట్లాగే పిలుస్తారు అప్పుడప్పుడు... నిజంగా మొద్దునే అంటావా బావా?" అని సముద్రంలో కొట్టుకుపోతున్న గడ్డిపోచను చూసి ఓడమీదనున్న ఆవు దూడలా జాలిగా అడిగింది అమృతం - అని ఆమె స్థితి చక్కగా చెప్తారు రచయిత.

"పరిపూర్ణజ్ఞానంతో విముఖత పొందిన అమాయకత్వం నీది" అని నిధి అంటే "అందుకే అమాయకుడివన్నాను.... మొద్దుల్ని చూసి ఏదో పెద్ద పేరెట్టి సంతోషిస్తావు నువ్వు..." అనగల ఆరింద ఆమె. అమృతానికి నిధిలో ఉండే రసపిపాస, దొరకని దాన్ని కోరుకుని ఆ బాధలో ఆనందం పొందే తత్వం, సుకుమార సౌందర్యానికి కళ్ళల్లోని నీలి భావనతోనే అభినందన చెప్పగల భావుకత అర్థమవనిది కాదు. కానీ బయటపడి అతని భావనను, తన స్త్రీత్వాన్ని తేలిక చేసుకోదు. కానీ తన భావావేశాన్ని దాచుకుని, నటిస్తూ, 'నటిస్తున్నాను. నన్ను గుర్తించరా' అనే హిపోక్రైట్ కాదు ఆమె.

"నీలాంటి ఔదార్యం, సానుభూతి అందరికీ ఉంటే ఈ సంఘం, స్వర్గంగా మారును అమృతం... నీలాంటి పెండ్లాన్ని సంపాదించినందుకు మీ ఆయన తపస్సు చేసి ఉండాలి..." అని నిధి అంటే

"అడవి పువ్వుల మధ్య అడవిలోనా?" అని నీరసంగా నవ్వి మాట మార్చే ఇల్లాలు అమృతం.

సుశీలను చూసి, "అల్లాంటి దాంతో నువ్వేం సుఖపడతావు, బావా!..... నీ వల్ల అది మారుతుందో లేదోగానీ దాని సంపర్కంవల్ల నువ్వేమౌతావో ఆలోచించలేదు..... అవునా?" అనగలిగే ఆలోచనాపరురాలు ఆమె.

'మనసులో జరిగే మార్పులు శరీరంలో బహిర్గతం కాకుండా చేసుకోలేరు స్త్రీలు. కొందరు స్త్రీలకది అలంకారం. మరి కొందరికి ఆయుధం. బాధపడటం వాళ్ళకి సంతృప్తినివ్వదు. ఆ దృశ్యం ఇతరులను చూసి సానుభూతి ప్రకటిస్తేనే ఆ బాధ తీరుతుంది. ఆ ఇతరులు మళ్ళీ స్త్రీలు కాకూడదు. కొంత బాధ, అట్లా ఓదార్చే దగ్గర మొగవాళ్ళు లేకపోవడం వల్ల కల్గుతుంది. బహిర్గతమైన ఉద్రేకం యొక్క అంతర్యం కొందర్లో అవగాహన కాదు ఇతరులకు. అది కోపమో, దుఃఖమో, విరహమో వారే నిర్ణయించుకోలేరు. అదే దౌర్బల్యం, అబలత్వం అనబడుతుంది -" అంటారు రచయిత. కోపంతో మూడంకె వేసుకుని తలకింద దిండులేకుండా తెగిన పూదండలాంటి అమృతాన్ని వర్ణిస్తూ.

చిన్న బార్డరు మందారం రంగు చీర, వెడల్పంచు రవిక వేసుకుని బర్మాముడిలో చిన్న మందారాన్ని దోపుకున్న ఆమెను "రంగు చీరల సెలక్షన్‌లో నువ్వు చిత్రకారిణివి -" అంటాడు నిధి. అలంకారం ఆడదానికి అవసరాన్ని బట్టి సౌమ్యత, పెద్దరికం, తల్లితనం, అమాయకత్వం, శృంగార శిల్పంగా తనేమిటో, తన భావన ఏమిటో చెప్పగలిగిన వరం ఉన్నది స్త్రీకి. ఆ విషయం ఏ ప్రభంధాలు, మనస్తత్వశాస్త్రాలు చదవకుండానే ప్రకృతి నేర్పించింది అమృతానికి.

"వివాహం నటీనటుల స్వర్గం... మనలని మనం మోసగించుకునే శక్తి మీద ఆధారపడుతుంది. నాలో ఆ శక్తి లేదు"

"ఒక పెద్ద కెరటంలా లోతులని దొల్చుకుంటూ ఒచ్చే మహత్తర సముద్రపు నీటి ప్రవాహంలాంటిది కల్యాణం. ఎవ్వరూ ఆపలేని పెద్దగోల, ఆపలేని నవ్వూ ఏడ్పులాంటిది" ఇలాంటి ఆలోచనలు నిధి లాంటి మేధాజీవులకు వచ్చినా, వివాహితగా హాయిగా జీవిస్తూ ఏమాత్రం నటనా హిపోక్రసీ లేని యువతి అమృతం.

అందుకే అమృతాన్ని మామూలు ఆడవాళ్ళ లిస్ట్‌లో చేర్చి, "మంచివాళ్ళలోనే చెడిపోవడం జరిగేది" అని సుశీల అసూయతో అన్నప్పుడు -

"అమృతానికి ఎవరన్నా ఆపేక్ష. ఎంతో ప్రాణం.... మనుష్యులను ప్రేమించగలగడం చెడ్డతనం ఎలా అవుతుంది?" అని వాదిస్తాడు నిధి.

పెళ్ళిని చప్పుడు చెయ్యని సంకెళ్ళు బిగించే విధి విన్యాసంగా తీసుకునే నిధి - కార్యం అనుకున్న రోజునే హాస్పటల్ పాలవుతాడు. అందరూ ఒంటరిగా అతణ్ణి వదిలేస్తారు. అలాంటప్పుడు ఉన్నట్లుండి వస్తుంది అమృతం ఏ ఆకాశదేవతల ఆశీస్సులాగానో - ఆమెలో పరిపూర్ణత, అందంగా వాడిపోయిన అరవిందంలా అనిపిస్తుందతనికి.

"అతనికి గాయాలన్నీ మానినట్లుంది. రక్తం వేగంగా ప్రవహిస్తోంది. కానీ అందులో వేడి లేనట్లనిపిస్తోంది. శీతలంగా ఉంది. ఎందుకో భరతమాతను చూసినట్లనిపించి నిధికి నవ్వొస్తుంది" పరిపూర్ణమైన స్త్రీత్వపు సన్నిధి ఎటువంటి స్వాంతన కలిగిస్తుందో అర్థమౌతుంది - అతనికి లీలగా.

"బావా నీకో తాయిలం తీసుకొచ్చాను. ఏమిటో చెప్పుకో అని వయ్యారంగా నవ్వుతున్న మబ్బురంగు ముఖంలో పళ్ళవరస ఒంటి నక్షత్రంలా మెరుస్తోంది. విశాలమైన చెక్కిళ్ళు, సృష్టంతా ఒక చూపులో ఆవరించుకునే కళ్ళు - వీటిల్లో దేనికేసి చూడటం? ఏమాటని వినడం? ప్రతీమాటనీ హృదయంలో తడిపి గుజ్జులా చేసి పడేస్తోంది. ఆ మృదుత్వం భావంలో ఉందా? మనిషి ఆకర్షణలో ఉందా?" నిధి నిర్ణయించుకోలేకపోతాడు.

"స్థలం కాలం వీటి ఆసరా చూసుకుని బ్రతుకుతుంది ఆకర్షణ.... అదేం ఖర్మమో..." అనుకుంటాడు తనకు అమృతం పట్ల పెరిగిన ఆకర్షణకు అర్థం చెప్పుకోలేక.

"మన సంఘంలో స్త్రీ మాట చెప్పాలా? నువ్వు అనుభవిస్తున్నావుగా?" అంటాడు నిధి. "నాకేం బావా?" అని డబాయిస్తుంది ఆమె.

"మన నిజస్వరూపం మనం చూసుకోం. ఇతరులు చెపితే

సహించలేం. మనలను మనం మోసగించుకుంటూ ఆత్మవంచనకు లోబడే నటులం. నీ అత్తగారి రంపపుకోతలు, భర్త మౌఢ్యం, ఒకర్నొకరు విసిగించుకోవడం, కమ్మారమ్మాయితో స్నేహం సహనం..." ఇలా ఆమె జీవితాన్ని సమీక్షిస్తున్న నిధితో.

"ఇల్లాంటివన్ని కుటుంబాల్లోనూ ఉంటాయి. సంసారాన్ని గుట్టుగా చేసుకోవాలి" అంటూ "ఇవన్నీ ఊహించుకుంటేనే బాధ పడటం జరుగుతుంది. అందరూ అలా అనుకుంటే ఒక్కరోజన్నా బ్రతకగలరా -" అని తేలిగ్గా అనేసి - జీవించడమా? జీవితాన్ని గురించి ఆలోచించడమా? ఏది మంచి పద్ధతి? అని అతణ్ణి ఆలోచనలో పడేస్తుంది అమృతం.

"నువ్వు దిగులుగా ఉంటే ఎట్లాగో ఉంటుంది బావా?" అని తెచ్చి పెట్టుకున్న నవ్వులో ధ్వనించే ఆప్యాయత. "ఇతరుల సహవాసం గిట్టక, ఎప్పుడూ ఒంటిగా ఉండాలనే వాళ్ళలో ఏదో లోపం ఉందనుకుంటా" అని సైకాలజిస్టు లాంటి తీర్పు.

'భర్త నిజస్వరూపాలను దాచుకుని ఎంతో అభినయం చేస్తేనే సంసారం నిలబడి సంఘజీవనం సాధ్యమౌతుంది...' అంటున్న నిధిని "అందులో చెడూలేదు, కష్టమూలేదు. మరి నీకెందుకు అలా ఉండటం గిట్టదు?" అనే ప్రశ్నలో లౌక్యం - వీటిల్లో అమృతంలో అమాయకత్వం వెనుక స్థిరపడిన మనస్తత్వాన్నించి జనించిన వ్యక్తిత్వాన్ని, ఆ మనస్తత్వం తర్కబద్ధమైన అలవాట్లతో అమర్చబడ్డ వ్యక్తిత్వం మీద ఆధారపడినదనీ అర్థమౌతుంది నిధికి"

"నేను కోరే ప్రతిఫలం నువ్వు సంతోషంగా ఉండటమే బావా?" అనే అమృతం "తమకు సంతోషంలేనివాళ్ళు ఇతరులను సంతోష పెట్టేనా తృప్తి పడకూడదు?" అనే అమృతం - "కోమలంటే ఎందుకు నీకంత ఇది? " అంటూనే ఎప్పటినుంచో అల్లుకున్న నిశ్చలత్వం ఒక్కసారి విడిపోయినట్లుగా "సమాధానం నాకు తెలుసు బావా?" అనేసే అమృతం - "స్త్రీ అమృతం ధోరణిలో మాట్లాడినప్పుడు తెరవెనుక జరుగుతున్న నాటకంలో పాత్రగా మారుతుంది. మనం చూడొచ్చు, వినొచ్చు, తెలుసుకోవచ్చు కానీ అర్థం చేసుకోలేం." అంటారు రచయిత.

విధివిన్యాసాలకు తలవంచి బ్రతకలేకా, తన ఆలోచనా ప్రవాహానికి ఎదురీదలేక, తనలోని వ్యక్తితో తాను సమన్వయం పొందలేక ఇబ్బంది పడి ఎన్నో అనుమానాలకు, అవమానాలకూ గురై, ప్రతి అనుభూతీ ప్రేమని భయపడి, నిజమైన ఆప్యాయతకు కరువై స్నేహితులచేతా, బంధువులచేతా మోసగించబడి ఒంటరితనంతో జీవిస్తున్నాడు నిధి. అతని ప్రేమరాహిత్య జీవితంలోకి ఒక మునిమాపు వేళ రసవాహినిలా మళ్ళీ ప్రవేశిస్తుంది అమృతం.

ఒక్కసారిగా అతని ఇంటికి, పరిసరాలకీ, జీవితానికీ వెలుగునిచ్చింది అమృతం. ఆ ప్రయత్నంలో ఆప్యాయతల గుబాళింపు సౌందర్యము, జాలి, తల్లితనం, ఆపలేని స్త్రీత్వం ప్రదర్శించడంలో ఆమె ఏమాత్రం సంకోచపడదు. సంపూర్ణత్వం పొందిన ఒక స్త్రీ మూర్తి ఆత్మార్పణం ఎలా ఉంటుందో హృద్యమంగా వర్ణిస్తారు రచయిత.

"నిప్పులో కాలిన మల్లెల పరిమళం, అమృతం శ్వాసలో చుట్టేసింది. మెత్తటి బలంతో తడిసి ముద్దయి ఆనందంతో ఎర్రగా అలిసిపోయి సూర్యుడిలోని వేడిమికి కరిగిన మంచుకణమై అమృతం, ఈ శరీరం అది. ఎవరూ ఇది నాది అనలేరు. సృష్టి అనాదినుంచి ఉండిపోయి నిద్రనించి లేచి మరిచిపోయిన శరీరం అది -"

ఆ క్షణంలో "కడసారి పవిత్రంలో పవ్వళించిన అమృతం" అంటారు రచయిత. నిధి తన మెడకు చుట్టుకున్న అమృతం తల వెంట్రుకను కవర్లో పెట్టి దాచుకుని, తన బేలతనంతో మర్నాటి సూర్యోదయానికి ఇల్లంతా మైల చేస్తానన్న భావనతో జీవిత గమ్యం వెతుక్కుంటూ పారిపోతాడు. ఏనాడూ స్వాంతన, పొందు, స్నేహం పంచలేని భార్య ఇందిర చనిపోయినప్పుడు దిగ్భ్రమ పొందుతాడు నిధి. తిరుగు ప్రయాణంలో మానసికంగా అలసిపోయిన అతను ఓదార్పు కోసం అమృతం కూతుర్ని చూడాలన్న నెపంతో ఆమె ఊరువెళతాడు. అక్కడ ఆమె తనను పలకరించే విధానాన్ని రకరకాల కోణాల్లో ఊహిస్తాడు.

కానీ తల్లి, ఇల్లాలు పెద్దింటి కోడలు అయిన అమృతం అతననుకున్న ఏ విధానంలోనూ ప్రవర్తించదు. మరొకసారి పరిపూర్ణ స్వరూపాన్ని మరొక కోణంలోనించి చూస్తాడు అతను. "బావ పోలికలు ఉన్నాయి పాపలో " అని నిర్భీతిగా అనే ఆమె అతణ్ణి భయపెడుతుంది. మాతృమూర్తి అయిన తరువాత ఆమెలో కనబడే విలాసం అతణ్ణి మరింత నిశ్చేష్టుణ్ణి చేస్తుంది. అక్కడ ఉండలేక వెళ్ళలేక మళ్ళీ తన పయనం సాగిస్తాడు నిధి.

ఆ తరువాత నిధి జీవితపు గడ్డు రోజుల్లో అమృతం స్వాంతనగా చల్లని తెలివెన్నెలగా, శృంగార మూర్తిగా తోడురాదు. ఓదార్పులేని అతను జీవిత ప్రవాహంలో కోమలి ప్రణయాంబుధిలో కొట్టుకుపోతాడు.

ఇంత గొప్ప పాత్రను సృష్టించారు బుచ్చిబాబుగారు. నవలను చదివిన అనుభూతి, అందులో అమృతం పాత్ర మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.

ఈ సమీక్షకు కారణం నేను చెప్పగలనన్న ధైర్యం కన్న అమృతం పాత్ర నన్ను ఆలోచింపచేసిన విధానం, రచయిత పట్ల నాకున్న గౌరవం. మంచి నవలలు వెదికే పాఠకులు ఏ కొద్దిమందైనా "చివరికి మిగిలేది" చదవాలనీ ఆ అనుభూతి పంచుకోవాలనీ నా ఆశ.

'చివరకు మిగిలేది' మూడుసార్లు చదివాను "చిన్నప్పుడే చదివాను కానీ కథ జ్ఞాపకం లేదు. అవును అక్కడక్కడ చదివాను పేజీలు తిరగేశాను. నాకు అర్థంకాలేదు" ఇలా అనే రక రకాల పాఠకుల మాటలు చాలా విన్నాను నేను. మంచి పుస్తకం చదవడంలో కష్టం ఏమిటంటే మనసు ఆలోచించమంటుంది. అది చాలామంది పాఠకులకు ఇష్టం ఉండదు. అటువంటి వాళ్ళు దీని జోలికి పోవద్దు. మంచి సాహిత్యంలో ప్రతిమాటతో మనం అంగీకరించలేకపోవచ్చును. కానీ, మన ఆలోచనా శక్తిని ఉద్దీపింపచేసే శక్తి దానికి ఉన్నప్పుడు, మనం ఎదగదలచుకున్నప్పుడు తప్పకుండా చదవాలి.

"నా భావం చెప్పి తలంటిపోసుకున్నాను. ఇంక చస్తే మళ్ళీ నేను రాసింది నేను చదవలేను" అనే రచయితలూ ఉన్నారు. వారి దృష్టిలో వాళ్ళ రచన శరీరానికి మనసునీ బాధపెట్టే ఎక్స్రీటా బయట పడటంలాంటిది. కానీ, బుచ్చిబాబుగారు తను రాసుకున్న ప్రతి వాక్యాన్ని ప్రేమించారు. తను చెప్పిన దాన్ని వారు నమ్మారు. వారి శ్రీమతిగారి తొలిపలుకుల్లో ఇది అర్థమౌతుంది మనకు.

"గతించిపోయిన యవ్వనం, జాడ్యం, బీదతనం, మృత్యువు - ఇవి జీవితంలో చెడుగు. ఈ చెడుగులో మానవుడు గుండె బాదుకోవాల్సిన విషాదం ఏమీలేదు. జీవితంలో నిజమైన విషాదం ద్వేషించడం కూడా కాదు; నిజమైన విషాదం ప్రేమించలేకపోవడం, ద్వేషించడంలో కొంత పట్టుదల, కార్యసాధన కూడా ఉండవచ్చు. కానీ ప్రేమించలేకపోవటానికి ఏదో సంబంధం ఉండి ఉండాలని నా నమ్మకం. అదేమిటో, ఎట్లా ఉంటుందో కనుక్కుందామని ఈ నవలా రచన సాగిందనిపిస్తుంది".

"కొందరు రచయితలవలె గ్రంథంలో ఉపయోగించే నిమిత్తమై అనుభవాన్ని నేను అన్వేషించను. సంస్కృతిని సంస్కృతికోసమే ఆరాధించేవాడ్ని కాను. ప్రవర్తనపైన, శీలంపైన ఉన్న ప్రభావంలోనే సంస్కృతి, కళల ప్రయోజనం ఉందనుకుంటాను" అంటారు బుచ్చిబాబు.

"పుస్తకాలపై కాస్తో కూస్తో గౌరవం అభిమానం ఉంది. పౌరసత్వాన్ని నమ్మి, దానికొక స్థానం ఇవ్వడానికి అలవాటు పడ్డవారు ఎందరు చదివి అనుభవం పొందితే అంతటి సంతృప్తి. ఎందుకంటే జీవితంపై ఒక దృక్పథాన్ని కలగజెయ్యాలన్న ఉద్దేశ్యంతోనే ఈ రచనసాగింది. ఆర్థిక, సాంఘిక, చారిత్రక వ్యత్యాసాల కతీతమై మనిషినీ, మనిషినీ స్నేహపాశంతో బంధించివేసే మానవత్వం యొక్క శక్తుల్ని తరచి చూసినప్పుడు, ఆ అనుభవాన్నిమాటలతో చెప్పలేం ఈ జీవిత రహస్యం దాన్ని తెలుసుకోవడానికి మానవుడు చేసే యత్నం - ఏ గొప్ప గ్రంథానికైనా ఇది పునాది - ఈ నవలకీ అదే పునాది "సమర్పణ" అంటూ పై మాటలు రాసిన శ్రీ బుచ్చిబాబుగారు 1946 లో ఈ నవల రాసి సాహిత్యంలోనే అప్పటికీ ఇప్పటికీ ఒక ప్రత్యేకత సంతరించుకున్నారు. "చివరకు మిగిలేది" బుచ్చిబాబుగారి అన్వేషణలో ఆయనకు చాలా మిగిల్చింది.

***

## గురజాడ వారి 'కన్యాశుల్కం'లో మధురవాణి.

**నూరు వసంతాల పండుగ చేసుకున్న** 'కన్యాశుల్కం' ఆంధ్రసాహిత్య చరిత్రలో ఒక అలంకారమనిపించుకుంటుంది.

ఇది ఒక నాటకమనో, సాహిత్య ప్రక్రియ అనో, రచయత పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపచేసే ఒక అద్భుత ఊహాజనిత విశ్లేషణతో కూడిన సాహిత్య వ్యాపారమో అని మాత్రం అనలేము. ఒక ఆదర్శాన్ని అద్భుతంగా మలచిన ప్రయత్నంలో ఏర్పడిన చైతన్యఝరి. ఇందులో సౌందర్యలహరి - 'మధురవాణి'

"మధురవాణి అంటూ ఒక వేశ్యాశిఖామణి ఈ కళింగ రాజ్యంలో ఉండకపోతే భగవంతుడి సృష్టికి ఎంత లోపం వచ్చి ఉండును?!" అంటాడు కరటక శాస్త్రుల్లు ఒక చోట. అది నిజం!

మొదటి కన్యాశుల్కాన్ని 1892లో ప్రదర్శించారు. ఆ తరువాత 5 సంవత్సరాలకు 1897లో అచ్చు వేశారు. వెంటనే అమ్ముడుపోయినా, రెండవ ముద్రణకు పన్నెండేళ్ళు పట్టింది.

ఇప్పటికి రచయితలో చాలా మార్పు, పరిశీలన పెరిగింది. దీక్షగా నాటకం తిరగ వ్రాశారు వారు. మొదటి కన్యాశుల్కంలో ఏ ప్రాముఖ్యతా లేని మధురవాణికి రెండవ కన్యాశుల్కంలో నగిషీలు, మెరుగులు దిద్దబడింది. మొట్టమొదట మధురవాణి ఎక్కడో గురజాడవారి ఊహావీధుల్లో గోడ మీద నీడ బొమ్మలా, మసక వెన్నెల్లో మామిడిపూతలా, చీకటి గోడల మధ్యన మెరిసిన ఒంటరి పారిజాతంలా కనపడుతుంది. ఏదో ఉంది ఈమెలో అనిపిస్తుంది కానీ అది స్పష్ట రూపంతో భాసించదు. అప్పారావుగారి లేఖల్లో ఒకచోట - 'గడిచిన ఆరేడు సంవత్సరాలలో నాకు పర్యాలోకన శక్తీ, జీవన పరిజ్ఞానం అధికమయ్యాయి. నా ఇష్టాలు, అయిష్టాలు, విరోధాలు, విద్వేషాలు అదుపులో పెట్టుకోవడం నేర్చుకున్నాను. అందరినీ సానుభూతితో చూడటానికి ప్రయత్నించాను. సాహితీపరునిగా జీవించదలచిన వాడికి సానుభూతే పునాది" అన్నారు.

ఈ మాటలతోనే మనకు వ్యక్తిగా గురజాడవారు అర్థమౌతారు. మరి రచయితగా ఆయన రచనలు వంద సంవత్సరాల పండుగలు ఎందుకు చేసుకోవు?!

సాహిత్య ప్రక్రియలో ఒక గొప్ప గమ్మత్తు మత్తు అదే. చదువరి సంస్కారాన్ని బట్టి మంచి రచయత అక్షరోన్మీలన మనకు సార్థకంగా లభిస్తుంది. ఈ అదృష్టం, అద్భుతం సాహిత్యంలో చాలా కొద్ది పాత్రలకు మాత్రమే దక్కుతుంది.

రచయిత భావన, కాలానుగుణ్యత, నిశ్శబ్దపు వ్యక్తిత్వపు ఛాయ, స్వయం ప్రకాశత్వమైన ఆదర్శం, విషయ నిర్మాణం, దాని పరిణతి, సర్వజ్ఞత, సత్యధర్మ అనుసరణ - ఇవన్నీ సాహిత్యానికి సద్యోజాతత్వాన్ని పరిమళింపజేస్తాయి. అప్పుడే అక్షరం దీప్తివంతమౌతుంది. చీకటిలో దీపం పెట్టాలని ప్రారంభించిన రచయిత ప్రయత్నం, అద్భుతమైన స్వార్థరహిత అనుభూతితో కలిసి, తమాషాగా అక్షరానికి వెలుగునిచ్చి చీకటినే వెలుతురుగా మారుస్తుంది.

ఈ ప్రక్రియను సునిశితంగా పరిశీలించగలిగిన అదృష్టం చదువరికి పట్టినప్పుడు నిశ్చేష్టతతో, సుదీర్ఘమైన ఆలోచనతో - తప్పించుకుపోతున్న అక్షర మాణిక్యాల మధ్య వెలుతురు ఛాయను పట్టుకోబోతాడు. అప్పుడు ఆ కాంతి మరింత ప్రస్ఫుటిస్తుంది.

అందుకే ఇటువంటి అలౌలికా భావనానందం ఏదో ఉంది కాబట్టి ఇన్ని కోట్ల పుస్తకాలను లైబ్రరీలో జాగ్రత్త పరచుకొని జాతి జీవాన్ని ప్రస్ఫుటపరచి నిక్షేపించుకోవాలన్న ఆరాటం కనబడుతూ ఉంటుంది మనకు.

లౌక్యుడికి పుస్తకం అంత ఖరీదు ఎందుకో ఏ అవసరమో తెలియదు. అక్షరం, పుస్తకం అద్భుతమైన అలౌకితత ఇస్తుంది కాబట్టే తెలివికలవాడు దాన్ని నిక్షిప్తం చేసుకుంటాడు. వందేళ్ళనాటి గురజాడ వారి "కన్యాశుల్కం" అదుగో అటువంటి నిక్షిప్తం. అందులో ప్రతి అక్షరం, ప్రతి పాత్రా ఆనాటి పరిస్థితులకు, ఆ తరువాత కాలాతీత సమస్యలకు నిరంతర ఛాయాచిత్రాలు.

ఈ నిత్యనూతన శాశ్వతత్వానికి ప్రతిబింబం మధురవాణి.

మొదట గురజాడవారు బహుశ నాటకాన్ని విధవా వివాహం, కన్యాశుల్క నివారణ, బ్రాహ్మణుల నీచలౌక్యం, ప్లీడర్లు లా పేరుతో సాగించే పడుపు వృత్తి. నీచత్వం, కాపీనం మూర్తీభవించిన అగ్నిహోత్రావధానులు, లుబ్ధావధానులు; గిరీశాలు, కరటక శాస్త్రుల్లు,

గౌరయ్యలు, బైరాగి, ధర్మారావు, నాయుడులాంటి లాయర్లు, అసిరిగాడి లాంటి అట్టడుగు వ్యక్తి - వీరందరూ సులభంగా రూపాయలకు నీతిని, మనిషిని, జ్ఞానాన్ని, నిజాన్ని వేలం పాడి అమ్మేస్తారని హెచ్చరించడానికి రాశారనిపిస్తుంది.

కానీ, అది ఆయన ఆనాటి సమస్య అని ఆవేశ పడ్డారేమో కానీ, అది సర్వజన సర్వకాల సమస్య. అందుకే కన్యాశుల్కానికి శాశ్వత్వం వచ్చింది.

మన కన్యాశుల్కం ప్రపంచ సాహిత్యంలో ప్రత్యేక స్థానంలో ఉందని ఏ మాత్రం సందేహించఖ్ఖర్లేదని, సర్వజనులు దీన్ని చదివి ఆనందించాలన్న ప్రయత్నంలో శ్రీ ఆరుద్రగారు, సెట్టి ఈశ్వరరావుగారు, శ్రీ బ. గో. రె. గారు మరికొంత మంది సాహిత్యవేత్తలు చేసిన ప్రయత్నాలు ఎంతో ఉన్నతమైనవి.

ఆ ఎత్తుకు ఎదగలేని సామాన్య పాఠకులు కూడా "గురజాడ హృదయం" కన్యాశుల్కంలో ప్రతిఫలించడాన్ని గమనించి గౌరవించుకునే అవకాశం ఉన్నది. అదొక మహానుభూతి కాబట్టి, ఆ ప్రక్రియ అందరికీ అర్థమవ్వాలన్న ప్రయత్నం, విషయంవల్ల మరింత ఔన్నత్యాన్ని ఆపాదించుకుంటుంది.

కన్యాశుల్కం నాటకం గురజాడ వారిలో ఆదర్శవాద రచయితను చూపిస్తే, మధురవాణి మనకు ఆయనలో మహోన్నతుడైన మనిషిని, అర్థంచేసుకునే సంస్కారిని, నెగిటివ్ ఎలిమెంట్స్‌లో కూడా గొప్పతనాన్ని తెలుసుకోతగ్గ వాటిని ఎత్తి చూపించగల దార్శికుణ్ణి చూపిస్తుంది.

మధురవాణి సానిః భోగపత్ని అనే పదం నుంచి 'బోగంది', సాపత్ని అనే పదం నుంచి 'సాని' పదాలు వచ్చాయంటారు. అంటే భావనలో ఔన్నత్యం - ఉపయోగార్థంలో నీచత్వంగా పరిగణింపబడిందన్న మాట. న్యాయానికి మధురవాణిని ఒక 'వ్యాంపు' పాత్రగా మార్చి గురజాడవారు చాలా నాటకీయత జరిపించి ఉండవచ్చు. వృత్తిరీత్యా పరమ స్వార్థపరురాలిగా, లౌక్యురాలిగా, అవకాశవాదిగా ఎదటి వారి బలహీనతను, అవసరాలను గ్రహించుకుని ఎరవేసి వలలోకి లాగి బికారిని చేసే వృత్తిలో ఉన్న వ్యక్తి మధురవాణి. నిజానికి ఇవన్నీ ఆమె వృత్తి ధర్మాలే, అందరి దృష్టిలో.

కానీ, కన్యాశుల్కం నాటకంలో యాంటీనాచ్ ఉద్యమం, కన్యాశుల్క నివారణ ఉద్యమం, విధవా వివాహోద్యమం - ఈ మూడు గ్రంథుల మధ్య నుంచీ చైతన్యాన్ని ఉన్మీలనం చేస్తూ, ఆరాధనాశక్తిగా ఆమెను వ్యక్తీకరించగలగటం ఎలా సాధ్యం?!

అటువంటి నీచప్రవృత్తి ఆపాదించగలిగిన మధురవాణిని ఆఖరికి సౌజన్యరావులాంటి ఉత్తములు భగవద్గీతను ఆమెకు ఇచ్చి, "ఇది చదివినవారికి శ్రీకృష్ణుడని, గొప్ప స్నేహితుడు దొరుకుతాడు... సత్పురుషుడనే నామము సార్థకముగా గల ఈ సత్పురుషుణ్ణి నీకు ఇచ్చాను. ఆయన స్నేహం బలమైన కొద్దీ మాబోట్లను తలచవు..." అంటారు. ఆయన మేధస్సును, శీలాన్ని, గౌరవాన్ని ఆమె ఔన్నత్యం ముందు తగ్గించుకుని ఈ మాటలు అన్నారంటే ఏమిటి కారణం?!

ఇప్పుడు మధురవాణిని తెలుసుకోవాలనిపించడంలేదూ?! స్త్రీతత్వంలోని ఔన్నత్యానికి ప్రతీక ఆమె - అద్భుతమైన వ్యక్తిత్వం ఎక్కడ ఉంటే, అక్కడ అవనితమయ్యే ఆరాధనాభావానికి ఆమె జయపతాకం.

ఆమె కులం నీచమైనదేమో కానీ, ఆమె సౌందర్యం, ఆట, పాట - ఇవన్నీ చాలా ప్రత్యేకమైనవి. ప్రతి లౌక్యుడికీ ఆమె పొందే జీవనాధారం అనిపించే శక్తి ఆమె కనుసౌంజ్ఞలకే ఉన్నది.

విచిత్రం - చాలా ప్రలోభం ప్రదర్శించే వృత్తిలో ఉన్న ఆమె తనచుట్టూ జనంలోని నీచత్వం, తగవు, లౌక్యం, కక్కుర్తి, కార్పణ్యం చూసి ఆశ్చర్యపోయి ఒకింత ఎదిగి వాళ్ళను పరిశీలించడం ప్రారంభిస్తుంది. 'దంచినమ్మకు దక్కిందే కూడు' అన్నట్లు అప్పటికప్పుడు కనబడే క్షణిక లాభాలకు ఎంత నీచత్వానికైనా దిగజారగలిగేవారిని చూసి అసలు సానితనం ఎక్కడుందో ఆమెలో మానవతామూర్తికి అర్థమౌతుంది. అందుకే, మీనాక్షిని, రామప్పపంతుల్ని చేసుకోమంటుంది. సుబ్బిని కన్యాశుల్కం చెరనించి విడిపించటానికి

సహాయపడుతుంది. కంటె అరువిచ్చి ఆపద కాస్తుంది. ఆ కక్కుర్తి తప్ప మరేమంత దుర్మార్గంలేని వృద్ధులైన లుబ్ధావధానుల్ని కాపాడటానికి ప్రయత్నం చేస్తుంది. సౌజన్యారావులోని ఔన్నత్యానికి తలవంచుతుంది.

ఈ పాత్ర ఇంత గొప్పగా రూపొందటానికి కారణం గురజాడవారి హృదయం.

"వేశ్యలో మానుషత్వాన్ని మరిచిపోకండి. ఆమె సుఖదుఃఖాలు మీవి గాని, నావి గాని ఐన సుఖ దుఃఖాలకు, ప్రాముఖ్యతను తీసిపోవు, సంఘంలో లెఖ్ఖలేని వ్యభిచారులైన భార్యలు, భర్తలు ఉన్నారు. స్పష్టంగా తన వృత్తిని తెలియపరచే వేశ్య వారందరి కన్న అధమురాలెట్లా అవుతుంది? పైగా, వేశ్య ఏ వివాహ ప్రమాణాన్నీ భగ్నం చేయడం లేదు వీరి వలె" అని 1909లో ఒంగోలు మునిసుబ్రహ్మణ్యం గారికి అప్పారావుగారు రాశారు.

అందుకే "కన్యాశుల్కం" రాయగలిగారు అప్పారావుగారు. గిబ్బన్‌తో పోల్చారు గురజాడని: కానీ కన్యాశుల్కంతో పోల్చగల నాటకం ఏదీ మరి?! మొదటి కన్యాశుల్కంలో కేవలం రేఖా మాత్రంగా కనిపించే మధురవాణి, దాదాపు దశాబ్దం దాటిన తరువాత రెండవ కన్యాశుల్కంలో ఒక అద్భుత సజీవ శిల్పంగా రూపొందింది.

అసలు గురజాడవారు మధురవాణిని విజయనగరంలో ఏ పంచదీపాల నీడల్లో వెతికారో, మద్రాసులోని ఏ వీణ ధనమ్మాళ్ రాగఝరిలో స్పందించారో, ఏ రాజావారి శృంగార అనురాగ దేవతల పాదమంజీర ధ్వనులకు ప్రతిధ్వనించారో, మనకు అంతుపట్టాలన్న రూలు ఏం లేదుకానీ, ఆయన సృష్టించిన మధురవాణి మనకు శారీరక సౌందర్యం, వృత్తి లౌక్యంతో కనపడుతుంది. పాత్ర ఉన్మీలనమైన కొద్దీ, ఆమెలోని అంతః సౌందర్య రూపం ప్రస్ఫుటమై శాశ్వతమనిపిస్తుంది.

మధురవాణి పాత్ర ప్రారంభంలోనే "మొగవాడికైనా ఆడదానికైనా నీతి ఉండాలి..." అంటుంది. సానిదానికి నీతేమిటి అనుకుందామన్నా, మధురవాణి తల్లి నేర్పించిన సాంప్రదాయమే వేరు. "ఫలానా పంతులుగారు ఫలానా సాన్నుంచుకుని బాగుపడ్డారంటే నాకు ప్రతిష్ఠ. అంతేగాని లోకంలోని సాన్ల మచ్చు అని ఊహించకండి..." అంటుంది. ఆమెకు డబ్బు విలువ బాగా తెలుసు. "కొద్ది కాలం ఉండే యవ్వనాన్ని ఆధారంగా చేసుకొని బతికే మాకులానికి వలపు ఒక్కచోటే అది బంగారం మీదే. శృంగారం వన్నె చెడిన దగ్గర్నుంచి బంగారం కదా వన్నె తేవాలి" అంటుంది కరటక శాస్త్రితో.

కానీ, మధురవాణికి డబ్బు విలువ తెలుసు. అంతకు మించిన మానవత్వం విలువ, ధర్మం విలువ కూడా తెలుసు.

తన మేనగోడలు అయిన సుబ్బికి వృద్ధుడైన లుబ్ధావధానులతో పెళ్ళి తప్పించే ప్రయత్నంలో సహాయం కరకట శాస్త్రి అర్థించినప్పుడు "వృత్తి చేత వేశ్యను కనుక చెయ్యవలసిన చోట ద్రవ్యాకర్షణ చేస్తాను కానీ,ఈ తోడబుట్టువుకి ప్రమాదం వచ్చినప్పుడు నేను డబ్బును ఆశిస్తానా?! ఎటుండి, ఎటొచ్చినా కాపాడతాను" - అని ప్రతిజ్ఞ పట్టి నెరవేరుస్తుంది కూడా.

ఆమెలో చిలిపితనం అపారం. రామప్పంతుల్ని, గిరీశాన్ని ఒకే మంచం కింద దాచి పూటకూళ్ళమ్మ చేత చీపురు దెబ్బలు తినిపించే అల్లరి పిల్ల. తనను పోషిస్తున్న రామప్పంతులు ఇతర కార్యాల్లో ఉన్నప్పుడు ఊరు పెద్దల్ని పేకాటలో పెట్టి, వారి నైజాల్ని బేరీజు వేసి అవసరం వస్తే వాళ్ళను హెడ్‌కానిస్టేబులును ఉపయోగించుకున్నట్లు ఉపయోగించుకోగలిగిన లౌక్యురాలు. విధవ అయిన మీనాక్షిని వాడుకుని, వివాహం చేసుకుంటానని అబద్ధం చెప్పి పారిపోయి వచ్చిన రామప్పంతుల్ని ఆమెకు పట్టి ఇచ్చి వేడుక చూస్తుంది. రామప్పంతుల్లో అనుమానం, అసూయ రేగడం చూసి నవ్వుకుంటుంది. కరటక శాస్త్రి శిష్యుడిని దగ్గరకు చేర్చి, ఆడవేషం వేసి, కంటె పెట్టి, పెళ్ళి కూతురుగా నాటకం నడుపుతుంది. ఎక్కడికక్కడ ఆమె ఈ జనాన్ని చూసి నవ్వుకుంటూ ఉంటుంది.

ఆమెకుండే జ్ఞానం, తర్కం, నిశితపరిశీలన విచిత్రంగా పాఠకుడి దృష్టిని పెంచి, ఆమె పరిధిలో నిలబడి ప్రపంచాన్ని చూసి, అసహ్యించుకుని, నవ్వుకుని, జాలిపడి, నీచుల వలలో ఇరుక్కున్న అమాయక జనాన్ని రక్షించాలని ఆమెలా వేదన పడాలనిపిస్తుంది.

ఆమె మహాసౌందర్య రసవాహిని. శృంగార రసాధిదేవత. చూపు, మాట, సంపూర్ణ స్త్రీత్వం సంతరించుకుని ఉంటాయి. ఆమెతో స్నేహం చేసిన ఏ పురుషుడూ నిజానికి ఆమెకు దీటు కాడు. జన్మనైత్యం, వృత్తినైత్యం ఉన్నా, ఔన్నత్యం ఈ పాత్రకు ఆపాదించడానికి గురజాడ వారి కారణాలు వారికి ఉన్నాయి.

"ఏ గ్రంథకర్తా జీవితంలోంచే పాత్రలను ఏరుకోడు. ఆ ప్రయత్నంగా తనకు తెలియకుండానే ప్రాచీన కథల ఊహా కల్పనల నుంచి ఎరువు తెచ్చుకోవచ్చు" అని ఒకచోట రాసుకున్నారు వారు. "జీవితం నుంచి మధురవాణి పాత్రను ఏరుకొన్నా, మెరుగులు పెట్టడానికి వసంత సేనను వాడుకున్నారని మాత్రం మనం గుర్తించాలి" - అంటారు శ్రీ ఆరుద్ర.

ఈ ఔచిత్యం వల్లనే మధురవాణిలో ఒక నిశ్శబ్దపు ఆలోచనా సాగరం అంతర్ముఖంగా ఉన్నది. దాని ఉనికి ఎప్పుడో కాని బయల్పడదు. ఆమెలో అభ్యుదయకరమైన తాత్విక జిజ్ఞాస ఉన్నది.

"బతుకనేది ఉంటే వలుపు వన్నె తెస్తుంది. అంగడివాడికి మిఠాయి మీద ఆశా, సానిదానికి వలపూ - మనస్సులోనే మణగాలి..." అని తన దుఃఖం తనలోనే ఇముడ్చుకుంటుంది. అటువంటి ఉన్నతురాలు ప్రేమించదగిన వ్యక్తిని సృష్టించడానికే మరొక మహోన్నతమైన సౌజన్యారావు అనే పాత్ర రూపుదాల్చింది.

మధురవాణి నిదానంగా ఆలోచించి ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లో కూడా హితం చెప్పగలదు. ఆచరణ యోగ్యమైన సలహా ఇవ్వగలదు. సముఖంలోనే నేర్పుగా రాయబారం చెయ్యగలదు. ఆమె పాత్ర మంచి మనిషిగా ఉదాత్తురాలుగా పేరు తెచ్చుకోవటానికి కృతకమైన ఔన్నత్యాలు అభినయించదు.

సరసాలు, విరసాలు, నర్మోక్తులు, దగుల్బాజీలను గుర్తించగానే ఒదిలించుకునే నేర్పు, మా అమ్మకు పంపించాలి అంటూ విటుల దగ్గర బంగారం, డబ్బు వసూలు చెయ్యగలగటం, నిరంతరం సౌందర్యంగా, శృంగారంగా, బంగారపు బొమ్మలా అనారోగ్యంగా ఉండగలగటం, ఇవన్నీ ఆమె వృత్తిధర్మాలు, స్వధర్మం వదలదు ఆమె.

"నాజూకు అయిన మనస్సుగల స్త్రీని మల్లెపూవులా వాడుకోవాలండీ" అంటాడు కరటక శాస్త్రి.

"ఈ మధురవాణి - విన్నారా మావా! వేశ్య అయినా చాలా తెలిసిన మనిషి. వేశ్య అయినా... మన సంసార్లకుదానికి ఉన్న బుద్ధి ఉంటే బ్రతికిపోదుం" అంటాడు లుబ్ధావధానులు.

కానీ, ఈ మంచి మాటలన్నీ ఈ పాత్ర ఏవో భయంకర త్యాగాలు చేసి, మంచిపేరు తెచ్చుకోవాలని బాధపడితే వచ్చినవి కావు. అవి సహజంగా ఆమె గుణాలు: రామప్పంతులు ఆధీనంలో ఉంటూ, హెడ్డు సౌంజ్ఞలు గ్రహించగలదు. ప్రతి ఒక్కరినీ కవ్వించగలదు. కానీ వీటి మధ్య నుంచి అంతర్గత స్పందన మనకు ఒకటి వినిపిస్తుంది. అది ఆమె మానవత్వంతో కూడిన ఆలోచనా పరిజ్ఞానం.

వేశ్యగా తను బ్రతక నేర్పింది. కానీ భ్రష్టు పట్టిన విధవరాలు మీనాక్షిని రామప్పంతుల్ని పెళ్ళి చేసుకోమని నిర్బంధిస్తుంది. మాటలు రువ్వి ఏడిపించినా, అంతర్గతంగా ఆమెలో దీనులు, వ్యవస్థకు, ఆచారాలకు బలైపోయిన ఆడపిల్లలంటే విపరీతమైన సానుభూతి కనిపిస్తుంది. అందుకేనేమో, సుబ్బిని రక్షించాలనుకుంటుంది. బుచ్చెమ్మను కాపాడాలనుకుంటుంది, మీనాక్షికి దారి చూపాలనుకుంటుంది. తన జీవితం తనకిచ్చిన స్వాతంత్ర్యాన్ని ఆమె విశృంఖలతగా మొండిగా, నియంతలా ఉపయోగించదు. అవసరమైతే తనంటే పడి చచ్చిపోయే వారిని అడ్డం పెట్టుకుని అశోపహతులని, రామప్పంతులు, అగ్నిహోత్రావధానులు, గిరీశం వంటి లౌక్యుల అన్యాయానికి బలైన వాళ్ళను రక్షించాలనుకుంటుంది.

ఆమె వృత్తిరీత్యా ప్రపంచంలో కనబడ్డ ప్రతి మొగవాడిని పుస్తకంలా చదవగల ఆమెకు సౌజన్యారావు కొరుకుడు పడడు. ఏ లాభం లేకుండా అంత హోదాగల ప్లీడరు, ఎందుకు మిగతా వారి మోసానికి బలైపోయిన లుబ్ధావధాన్లను రక్షిస్తున్నాడో ఆమెకు అర్థం కాదు.

"చేపలు ఈదడానికి, పిట్టలు ఎగరడానికి ఏది కారణమో, సౌజన్యారావుగారికి పరోపకారం అంత సహజగుణం" - అనగానే ఆశ్చర్యపోతుంది. "మరి అది మీలాంటి వారుకూడా నేర్చుకోవచ్చుగా -" అని చురకేస్తుంది. ఆయన ఎవరికీ లొంగరని, "ఏంటినాచ్చ`ని

ఆదర్శమూర్తిని గ్రహించి ఆరాధిస్తుంది. పాదాక్రాంతమవ్వాలని, ఆయనను ఒప్పించి వివాహం చేసుకోవాలని అతి సామాన్యపు ఆడపిల్లలా ఊహల్లో తేలుతుంది. అతడి ప్రేమ లభిస్తే సర్వం ఒదులుకోవటానికి సిద్ధపడుతుంది.

మారువేషంలో వారి సమ్ముఖానికి వెళుతుంది. ఆయన ఆర్తత్రాణపరాయణతను గుర్తించి కేసు గెలవడానికి దారి చెపుతానంటుంది - అతణ్ణి పరీక్ష పెట్టటానికి ప్రతిఫలంగా వెయ్యి రూపాయల ధనం కూడా ఒద్దని తోసి రాజంటుంది. "నన్ను వివాహం చేసుకోండి, పోనీ మీ ఆధీనంలో ఉండనివ్వండి... కనీసం ఒక్క ముద్దుకు కరువో?!" అని దిగజారి బేరానికి వస్తుంది. ఆమెను మాటల్లో పెట్టి ఆమె ఎవరో కనుక్కుని నిర్ఘాంతపోతాడు సౌజన్యారావు. ఆమె మేలుజాతి స్త్రీ రత్నమనిపిస్తుంది, ఆమె సౌందర్యం, మంచితనానికి అతడు కించిత్ స్పందిస్తాడు.

ఇక్కడ మధురవాణి మహోన్నతంగా ప్రవర్తిస్తుంది. సౌజన్యరావు ముద్దు పెట్టుకోవడానికి సిద్ధపడగానే ఆమె గెలిచాననుకోదు. తను ఆరాధిస్తున్న ఆ మహానుభావుని పతనం ఆమె భరించలేదు. అందుకే, 'వేశ్య శరీరం తగిలితే కోసేసుకుంటాను. సానిది ఏదో ఎత్తు ఎత్తందీ ఆమెకు మంచితో పని ఉండదు' - అనుకునే సౌజన్యరావు, తనను గుర్తించి, దాసోహమనే ముందే, ఆమె అతణ్ణి, అతని ఔన్నత్యాన్ని రక్షించుకోవాలనుకుంటుంది.

"చెడనివారిని చెడగొట్టవద్దని మా తల్లి చెప్పింది" అని ఆపుతుంది.

ఒక్కసారి తేరుకుని "కృతజ్ఞుడను" అంటాడు సౌజన్యారావు.

శృంగారము, త్యాగము, వృత్తి ధర్మము, మానవత్వము, సౌందర్యము, లౌక్యము, ముగ్ధత్వము, చిలిపితనము - ఇవన్నీ కలబోసి గురజాడవారు తీర్చిదిద్దిన మధురవాణి నాటకంలో ఆఖరి అంశంలో మహోన్నతురాలుగా మారిపోతుంది.

అందుకే సౌజన్యరావు ఆమెకు భగవద్గీతను ఇచ్చి, 'ఇందులో మహోన్నతుడైన మిత్రుడు నీకు దొరుకుతాడు' అని ఆశీర్వదిస్తాడు. మహాక్షుద్రమైన వృత్తిలో ఉండి, నీతికి కాణాచీ వంటి వ్యక్తి చేత గుర్తింపబడి, గౌరవింప బడ్డ మధురవాణి అప్పటికీ ఎప్పటికీ కూడా ఒక మధుమాసం, మధుర శబ్దం.

ఆమెను సృష్టించిన గురజాడ వారి కవిహృదయం, ఔన్నత్యం, స్త్రీ మీద వారికుండే అభిప్రాయం, సానుల జీవితాన్ని గజపతి రాజావారి దర్బారులో ఉండటంవల్ల నిశిత పరిశీలన చెయ్యగల స్థోమతు ఉండీ వారిని సానుభూతితో చూడగలగడం - రామస్వామి అని రాజావారి భోగపత్ని తన రక్షణలో పర్యవేక్షణలో గమనించగలలగటం - ఇవన్నీ మనకొక మధురవాణిని ప్రసాదించాయి.

సాహిత్య సౌరభం శాశ్వతమవ్వాలంటే, మహోన్నతుడైన గురజాడ వంటి రచయితలు, వారి జీవితంలో ఎదురైన అనుభవ పరంపరలు చాలా అవసరం.

***

## డి కామేశ్వరి గారి "కొత్త మలుపు"లో "రూప"

"ఈ కేసు వలన ఏమి సాధించానా? ఈ ప్రశ్న ఇంకా అడుగుతున్నారా? నేను, నా జీవితం ఏమైపోయినా, కనీసం కొన్నాళ్ళు, ఈ సంఘటన గుర్తున్నంత వరకైనా ఏ యువకుడూ ఓ స్త్రీని మోసం చేసే ముందు భయపడతాడు. ఆడదాన్ని వాడుకుని, మోసం చేసి వదిలేసే పురుషులకు ఈ కేసు గుణపాఠం... నాలాగా మరో ఆడపిల్ల ఆలోచించి ధైర్యంగా ముందుకు అడుగు వేసేందుకు తోవ

చూపాను.. ప్రతి ఊరులో ఒక్క ఆడపిల్ల అయినా ఆలోచించి, ధైర్యంగా ఈ అన్యాయాన్ని ఎదుర్కొంటే, కొన్నాళ్ళకి అది ఉద్యమం అయి ఈ పురుషుల ఆట కట్టదా! దీనికి పునాది నేను వేశాను..."

అనే ఈ అగ్నిపుష్పం డి.కామేశ్వరిగారు సృష్టించిన "రూప"... మైనారిటీ కూడా తీరని ముగ్ధ, తనను మానసికంగా, శారీరకంగా వంచించిన వ్యక్తిని, అతని వెనకాల పడగనీడ పట్టే సంఘాన్ని అతని తండ్రి పలుకుబడినీ, డబ్బును ఎదుర్కొన్న విప్లవ జ్వాల. సమస్యను అసలు మరొక కోణం నుంచి చూడగలగాలన్న గొప్ప ఆదుర్దా సాధారణంగా పేరు కోసం ప్రయత్నించే రచనల్లో కనిపించదు. ఎందుకంటే, భాష, రచనా విన్యాసం, శిల్పం, చెపుతున్న విషయం కొత్తదనం - వీటిలో పాఠకుల్ని మాయ చెయ్యడం సులభం... కానీ, "నీ సమస్య ఇది... దీని పరిష్కారం కూడా ఇదేనేమో చూడు..."
పాఠకులకు ఆలోచించడం నేర్పించాలని ఆదుర్దా పడే రచయితలు చాలా చాలా తక్కువమంది.

"ఏ సాహిత్య ప్రక్రియకైనా, మన బుద్ధిలో పేరుకున్న జడత్వాన్ని కడిగి వేసి, అలోచించగల బుద్ధికి అనిర్వచనీయమైన ఆనందం ఇవ్వగలగడం ఆదర్శమనుకుంటే," కొన్ని పాత్రలు సాహిత్యంలో విప్లవాత్మకంగా ప్రశ్నార్థకంగా ఎందుకు గుర్తుంటాయో అర్థమౌతుంది. అటువంటి తపన ఉన్న రచయిత్రి డి.కామేశ్వరి

ఒక అమ్మాయి, అబ్బాయిని ప్రేమించాలనుకుని మోసపోవడం సాధారణ సమస్య. దీనికి అనేక పలాయన పరిష్కార మార్గాలున్నాయి. యవ్వనం, అమాయకత్వం, కొంత అహంకారం ఉండే ఆడపిల్లకు జరిగే విపత్తు అనే పులిజూదంలో సాధారణంగా ఆడపిల్ల మేకపిల్ల కానీ, కామేశ్వరిగారు ఆమెను ఒక శక్తివంతమైన ఆయుధంలా మార్చి, ఆమె శక్తి, ఏ మాత్రం ఆత్మాభిమానం చంపుకోకుండా బ్రతకడానికి ఆమెకు ఉండే అవకాశాలు చెప్పి పులి మీద పుట్రను చేశారు.

"కొత్త మలుపు" కొన్ని వందల మంది పాఠకుల్ని, ఈ సమస్య చర్చించిన వారిని ఆలోచింప చేసి ఉంటుంది. మొగవాడు మోసం చేస్తే, సాధించో, ప్రేమించో, బెదిరించో, హడలగొట్టో, కాళ్ళ బేరానికి వచ్చో, కట్నం పెట్టి కొనుక్కునో అతని భార్యగా ముద్ర వేయించుకుని చరితార్థమవ్వాలనుకున్న కథలు కోకొల్లలు... ఇది తప్ప ఇంతకన్నా పరిష్కారం ఈ సమస్యకు లేదనుకుని సాంఘిక న్యాయమూర్తులు ఈ సామాజిక విషయాన్ని బలవంతంగా ఆడదాని నెత్తిన రుద్దినప్పుడు, కామేశ్వరిగారి కొత్తమలుపు ఒక తోక చుక్కలాంటి ప్రశ్నను సంఘం పైకి విసిరింది.

"నన్ను పాడు చేసిన మనిషితో జీవితాంతం నన్ను బ్రతకమని, ఆ నీచమైన వ్యక్తితో కాంప్రమైజ్ అయి ఉండమని శాశించే చట్టం, అదిచ్చే సెక్యూరిటీ నాకు వొద్దు -" అని ఆత్మాభిమానం రూపు దాల్చి, ఛాలెంజ్ చేసిన ఆడపిల్ల ఇంత గొప్పగా, అక్షరాల సౌందర్యం పోగుపోసుకుని, ఊపిరి పీల్చి, రూపగా రూపు దాల్చింది.

సీతలు, సావిత్రులు, అహల్యలు అనుభవించిన అర్థవంతమైన దైన్యాన్ని కూడా ఒప్పుకోనన్న "రూప" ఒక గొప్ప స్పష్టమైన సంచలనాత్మక శాంతి స్వరూపం.

రూప ఒక అప్పర్ మిడిల్ క్లాసు అమ్మాయి ... చాలా హాయిగా, మాములుగా, ఆ వయస్సు పిల్లలకుండే అలంకార భ్రాంతి, పొగడ్తల కోసం పడే తపనతో అందరు అమ్మాయిలలాగే పెరుగుతుంది. మనకు మొదటి పేజీల్లో ఆ పిల్ల ఒక పెంకె పిల్ల, గారాబంతో చెడిపోయిన అమాయకురాలుగా మాత్రమే కనబడుతుంది... కొన్ని సందర్భాల్లో "అబ్బ ఏమిటీ పిల్ల?" అని విసుక్కుంటాం.

అందరు సగటు తల్లితండ్రులలాగే, 'మా పిల్లలు అస్సలు తప్పు చెయ్యరు...' అని తమను తాము నమ్మించుకుంటూ, తమ పెంపకమూ, తమ తెలివితేటలు మీద అపారమైన నమ్మకంతో కేవలం కట్నం పోస్తే కూతుర్ని పెళ్ళి కూతురుగా చూసి, సుఖాల తొడుగుతో అలంకరించెయ్యొచ్చన్న భ్రాంతితో ఉండే మామూలు తల్లితండ్రులు - రూప తల్లితండ్రులు.

చాలా క్రమ శిక్షణతో మంచి ఆఫీసరు అన్న పేరు తెచ్చుకున్న రూప తండ్రి విశ్వనాథంగారికి తను జీవితంలో మిగతా అన్ని విషయాల్లోనూ అలాగే ఉండగలనన్న అహంకారం ఉంది. తన జీవితంలో, అన్ని కర్తవ్యాలు సరిగ్గా చేస్తున్నానన్న భావన ఉన్న అప్పర్ మిడిల్ క్లాస్ వ్యక్తి ఆయన. తన సూడో అనాలిసిస్‌తో ఆయన నిజాన్ని చూడ్డానికి వొప్పుకోడు.

తల్లి పద్మావతి పాత్ర కూడా చక్కగా మలిచారు రచయిత్రి. మంచి ఇల్లాలుగా సెటిల్ అయి, తనలో నిద్రాణమైన స్వాతంత్ర్య కాంక్షలను, తీరని కోరికలను, అహంకార వాంఛలను, పొగడ్తలను బిడ్డలు అనుభవిస్తూంటే చూసి సంతోషిస్తూ, వాళ్ళను ఎవరు విమర్శించినా, ఈనిన ఆడపులిలా విరుచుకు పడి, "మా అమ్మాయి అలా చెయ్యదు. ఇలా అసలు ప్రవర్తించదు.. అసలు మా అమ్మాయి అలా కనబడుతుంది కానీ, చాలా ప్రత్యేకమైన పిల్ల-" అని ఇలా చెప్పుకుని, తనలో అంతర్లీనమైన కోరికల్ని బిడ్డ కోరికలుగా బహిర్గతం చేస్తూ, నిజాన్ని ఎదుర్కోడానికి ఒప్పుకోలేని, అహంకారం తృప్తిపడక, తన చిన్నతనంలో జరిగిన అవమర్యాదల్ని, బాధలని మర్చిపోలేక, ఎవరి మీదో కచ్చ తీర్చుకోవాలనుకునే అసలు సిసలైన సగటు ఇల్లాలు పద్మావతి. ఈ పాత్ర మనకు ప్రతి మూడో ఇంట్లోనూ వుండవచ్చు. వీళ్ళు లోకాన్ని ఎంత కచ్చగా, నిర్లక్ష్యంగా చూస్తున్నామనుకుంటారో, మళ్ళీ లోకనిందకు అంత భయపడి ఒణికిపోయే హిస్టీరికల్ అయిపోతారు. తమ బిడ్డను అన్న వాళ్ళందరి మీద కక్ష కడతారు. తమ బిడ్డ తప్పు తెలిసిన నాడు హిస్టీరియాతో గొడ్డును బాదినట్లు బాధగలరు. ఎవరైనా వేలెత్తి చూపితే విపరీతంగా భయపడతారు. ఎంత తప్పు జరిగినా నిజం ఎదురు పడేదాకా, అన్నీ సహజంగా జరిగి పోతున్నాయి అని ఎప్పటికప్పుడు మభ్య పెట్టుకుని బ్రతుకుతారు. ఈ విధమైన ఎదిగీ ఎదగని మనస్తత్వం ఉన్న తల్లుల చేతుల్లో ఎంత మంది బిడ్డలు గమ్యం తెలియక బాధ పడుతున్నారో అని సంఘం ఉలిక్కి పడేట్టు చేస్తారు రచయిత్రి.

అందుకే టైప్ క్లాసుకు అని చెప్పి, సురేష్‌తో తిరుగుతోంది కూతురు అని తెలిసి నిర్ఘాంత పోతుంది పద్మావతి. తనిచ్చిన స్వేచ్ఛ, ఆమె అలంకారంలో మార్పు, ఇవి ఎదుటి వ్యక్తుల మీద ఎంత రియాక్ట్ అవుతాయో ఆలోచించలేదామె. ఆ తరువాత విపరీతమైన కట్టడి పెడదామని ప్రయత్నిస్తుంది.

తల్లి అజ్ఞానం, అహంకారం, బేలతనం, తండ్రిలో ఉండే సూడో అభిజాత్యం రెండూ పుణికి పుచ్చుకున్న రూప, తనను అఖ్ఖర్లేదనుకుంటున్న ప్రియుడితో, "మీ కోసం ఐదేళ్ళు కాదు, పదేళ్ళు ఆగుతాను. అంతే కాని మరొకర్ని ఎలా పెళ్ళిచేసుకోగలను?" అంటుంది ఆవేశంగా.

కానీ సురేష్, "థింక్ ప్రాక్టికల్లీ.... ప్రేమ - పెళ్ళి రెండూ వేరు.. వేరు. ప్రేమ అనేది ఒక థ్రిల్లింగ్ - ఎమోషనల్ ఎక్స్‌పీరియన్స్. పెళ్ళి పిల్లలు - ఫేమిలీ లైఫ్. వీటికి సోషల్ సెక్యూరిటీ - రెండింటికీ ముడి పెట్టకు..." అన్నప్పుడు అతని పదాల వెనకాల అర్థం తనకు తెలియకూడదనే ఆలోచిస్తూ చాలా కౌంటర్ ఆర్గ్యుమెంటు చేస్తుంది.

"సురేష్.. ఏమిటిలా మాట్లాడుతున్నావు. నాకు భయం వేస్తోంది. నిజంగా నన్ను పెళ్ళి చేసుకోవా?" అని బేలగా అంటుంది. బ్రతిమలాడుతుంది.

"రూపా! ఒక సంగతి చెప్పు. నిన్ను పెళ్ళి చేసుకుంటానని నేనెప్పుడన్నా ప్రామిస్ చేశానా? కూల్‌డౌన్ మైడియర్. పెళ్ళి చేసుకోవాలన్న షరతు నువ్వు పెట్టలేదు. ఆడది ఇష్టం లేకుండా, ఇండిఫరెంట్‌గా ఉంటే మొగాడు ముందుకు వెళ్ళగలడా?..." ఇలా చాలా తెలివిగా మాట్లాడుతున్నాననుకుని, ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి తప్పించుకోవాలని చూస్తాడు సురేష్.

ఆవేశం పెరిగి రూప తిడుతుంది. శాపాలు పెడుతుంది. "ఒక ఆడపిల్ల ఏడుస్తుంటే నవ్వడం సంస్కారం అనుకున్నావా?" అంటుంది. "ఇన్నాళ్ళూ మొగవాళ్ళు ఒకే గేము ఆడారు. ఎప్పుడూ గెలుపు మీదే అయింది... అలా కాదని నిరూపిస్తాను" అంటుంది. ఆ మాటల్లో తన పట్టు జారిపోతున్నప్పుడు వచ్చే బేలతనం కనబడ్డా, పట్టుదల, పౌరషంతో కన్నీటిని కలిపి నిస్సహాయతను కాంక్రీట్ పునాదిగా ఏర్పరచే "మార్పు" మనకు స్ఫురిస్తుంది.

"ఇచ్చిన స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగ పరిచావు" అని తల్లి నిందిస్తుంది. ఆడపిల్ల దిగజారుడుకు కారణం కేవలం తల్లే అని తిట్టి, బాధ్యత ఆవిడ మీద తోసెయ్యాలని చూస్తాడు తండ్రి. తనకు నెల తప్పిందని తెలిసి, సాహసించి సురేష్ తండ్రిని కలిసి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ న్యాయం చెప్పకపోడన్న ఆశతో ఆశ్రయిస్తే "లా చదువు వేరు. స్వార్థపరమైన న్యాయం వేరు" అన్న మామూలు మనిషి, మరింత దిగజారిపోయిన న్యాయవాది ఆయనలో దర్శనమిస్తాడు రూపకు.

రూప అబార్షన్ చేయించుకుని, అందరి ఆడపిల్లలా కట్నం దండగా వేసి మొగుణ్ణి కొనుక్కుని సెటిల్ అయిపోవచ్చు కానీ రూప తన గురించి మాత్రమే ఆలోచించుకోలేదు. తనలా అన్యాయమైన ఆడ పిల్లల గురించి ఆలోచిస్తుంది. తన జీవితం భగ్నమైపోయినా, పరువు బజారుపాలైనా, తనలాంటి ఆడకూతుళ్ళకు అన్యాయం జరగకూడదనుకుంటుంది.

ఇక్కడే కొంత ఆలోచించగలిగిన రచయిత్రి చేతులో పాత్ర పదును తేలుతుంది. ఫాషన్ ముసుగులో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే మారు వేషాల్లో జరిగే సెక్స్ దోపిడీని సరిగ్గా ప్రాణనాడి మీద దెబ్బ తీశారు రచయిత్రి.

రూప ఆలోచించుకుంటూ ఎదిగిపోతుంది. చాలా తక్కువ గంటల్లో, ఎక్కువ జీవితాన్ని అర్థం చేసుకుంటుంది. లాయర్ సుమతిని ఆశ్రయిస్తుంది. ఆమెలో మానవత్వం, మంచితనం, రూపలో రూపొందుతున్న సబలను మరింత గొప్ప వ్యక్తిగా మారుస్తాయి.

"వాడు నాకు భర్త కాకపోయినా, నా బిడ్డకు తండ్రినని లోకానికి చెప్పాలి ఆంటీ. చెరి సమానమైన బాధ్యత ఉన్న పురుషుడు మాత్రం తప్పించుకుని ఇష్టమైన రీతిలో బ్రతికే హక్కు ఎలా పొందగలడన్న విషయంలో న్యాయం కావాలి ఆంటీ నాకు. వివాహితులైనా, అవివాహితులైనా బిడ్డపై తల్లి మమకారం ఒకటే. నా బిడ్డను నేను పెంచుకునే హక్కు కోసం ఈ లోకంతో పోరాడతాను. నేను అనుకున్నది సాధించటానికి ఈ నా బిడ్డ బ్రతకాలి..." అని స్థిరమైన ఆవేశంతో పదునుగా మాటలు రువ్వుతున్న రూప మాటలు విని కదిలిపోతుంది సుమతి.

"ఒక్క ఆడపిల్ల అయినా నీలా నిబ్బరంగా పరిస్థితులు ఎదుర్కోడానికి నిలబడి ఉంటే ఇన్ని కన్నీటి కథలు ఉండవు..." అనగలిగిన ఆమె ఒకనాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామనాథం చేతిలో యవ్వనంలో మోసం చేయబడిన వ్యక్తి, పుట్టిన బిడ్డను అనాథగా చేరదీసి పెంచుతున్న పిరికి తల్లి.. అందుకే రూప బాధకు స్పందించ గలుగుతుంది.

కామేశ్వరిగారు సృష్టించిన మరొక మంచి పాత్ర లాయర్ సుమతి. జీవితంలో ఓడిపోయి, కెరియర్ ఉమెన్‌గా ఎదిగి, తన జీవితంతో ఆడుకున్న ప్రత్యర్థి లాయర్‌ను ప్రతిక్షణం ఎదిరించి, విజయం సాధిస్తూండే స్త్రీ మూర్తి. అందుకే సాంఘికంగా చావుదెబ్బ తిన్నానన్న బాధతో "రూప" అర్థమౌతుంది ఆమెకు.

రూప తల్లి తండ్రిని ఎదిరించి, నచ్చజెప్పి, బ్రతిమలాడి రూపకు తను ఆశ్రయమిచ్చి, కోర్టులో కేసు ఫైలు చేస్తుంది. ఆమె వాదన, స్త్రీలకు జరిగే అన్యాయం బోనులో లాయర్ ఛాంబర్స్‌లో ప్రతి ఫలిస్తుంది. ఏ సాంఘిక సమస్యత అయినా చట్టం భాషలో అనువదింపబడి శాసనమై, న్యాయంగా పునర్జీవనం పొందాలంటే ఎంత కష్టమైన విషయమో అందరికీ తెలుసు. కానీ, ఈ విషయంలో ఏ మాత్రం కాంప్రమైజ్ అవకుండా సాధించి చూపించారు రచయిత్రి. సురేష్‌కు శిక్ష పడుతుంది. ఆమె అక్షరాలుగా అనువదించిన శాసనం చెరువులో చందమామలా మిల మిలా మెరుపులతో అభ్యుదయం మీద ఆశను, ఆలోచనలను ప్రేరేపిస్తుంది.

శిల్పం కోసం చెప్పదలచుకున్న విషయంలో స్పష్టత లోపించనీయరు రచయిత్రి. అందుకే అప్పుడప్పుడు ఆమె వాదన చాలా పొడుగ్గా అనిపించినా, స్పష్టతను గౌరవించగలగాలి మనం.

చాలా సెంటిమెంటల్‌గా రాయగల ఈ రచయిత్రి ఎప్పుడూ కృతకమైన సెంటిమెంట్సును తన ఆర్గ్యుమెంటులో రానీయని నిజాయితీపరురాలు. తను విప్పి చెపుతున్న సమస్య ఎదుటివారికి అర్థమైతే ఎంత బావుణ్ణు? అని తను అనుకునే వారి కోసం పడే తపన ఉన్న రచయిత్రి.

అందుకే ఈ నవలలో అన్ని తరగతుల పాత్రలు కల్పించగలిగారు. ఆమె మనకు అందజేసిన మరొక మంచి పాత్ర అనుపమ. గుజరాతీ అమ్మాయి, ఐ.ఎ.ఎస్. పాసై, సురేష్‌ను ప్రేమించి పెళ్ళి చేసుకున్న ఈ యువతి చాలా గొప్ప మనిషి.

"నా బిడ్డకు తండ్రి సురేష్, కానీ నాకు భర్త కాడు..." అని స్కూలు యానివర్సరీలో కుండ బద్దలు కొట్టినట్లు చెప్పిన రూప టీచర్ ఆమె జీవితంలో మొట్టమొదటిసారి ఆలోచించమంటుంది, ఇటువంటి సమస్యల గురించి.

రూపను కలుసుకుని, నిజం తెలుసుకుంటుంది. ఆమె ధైర్యానికి అభినందిస్తుంది.

"అభినందిస్తున్నారా? ఇలా అక్రమంగా ఓ బిడ్డని కన్న దానిమీద మీకు సానుభూతి ఉందా?"

సందేహంగా అడిగిన రూపతో ధైర్యంగా -

"వై షుడ్ ఐ హేట్ యు? మీరన్నట్లు మీరు ఒక్కరే తప్పు చెయ్యలేదు. అసహ్యించుకుంటే, సురేష్ పిరికి తనాన్ని, కుసంస్కారాన్ని అసహ్యించుకోవాలి. నేను ఒక స్త్రీని. చదువుకున్నాను. మన స్త్రీలకి అనాదిగా జరుగుతున్న అన్యాయం నాకు మాత్రం తెలియదా?!" అంటుంది. రూపకు న్యాయం చెయ్యాలని పట్టు బడుతుంది.

"తండ్రి లేకుండా, తండ్రి నీడ పడకుండా నా కొడుకుని అన్నింటికన్నా అతన్ని మించిన వాడిని చేసి, అతని ముందు సగర్వంగా నిలబెట్టి, అతణ్ణి తలదించుకునేటట్లు చెయ్యాలనుకున్నాను. అంతే నాకింకేం అఖ్ఖర్లేదు" అంటుంది రూప.

"ఈ జీవితంలో అన్నీ నష్టపోయాను. ఇరవై ఏళ్ళకే జీవితంలో అన్ని అనుభవాలు, అనుభూతులు పూర్తి అయిపోయాయి..." అని, మాతృమూర్తిగా గర్వంగా మాట్లాడినా స్త్రీ మూర్తిగా బేలపడిపోతున్న రూపని చూసి కదిలిపోతుంది కరుణామూర్తి అనుపమ.

సురేష్‌ను నిలబెట్టి ప్రశ్నిస్తుంది...

"పెళ్ళికి ముందు పరిచయమున్న ఏ పురుషుడితోనో, ఏ కాలేజీ స్నేహితుడితోనో, ఏ అన్నయ్య స్నేహితుడో పలకరిస్తేనే మొహం మాడ్చుకుంటారే మీ మొగవాళ్ళు. కాస్త ఎవరితోనన్నా సరదాగా మాట్లాడితేనే అపోహపడి, అనుమానంతో కాల్చుకుతింటారే మీ మొగవాళ్ళు. భార్య తెలిసీ తెలియని వయసులో మనసిచ్చి, ప్రేమలేఖ రాస్తే, అది కంటబడితే ఆవిడ శీలాన్ని శంకించి అవమానించి, తరిమికొడతారే. అలాంటిది, పెళ్ళికి ముందు ఒక అమ్మాయితో తిరిగి, ఆమెకి ఒక బిడ్డని కన్నా, నా దగ్గర ఇది ఎందుకు దాచావు" అని అడిగే హక్కు నాకు లేదా?! నీ నీతి నియమాలతో, నీ శీలంతో నాకు పనిలేదనా నీ ఉద్దేశం? ఈ దంద్వనైతిక సూత్రాలు ఇంకా వల్లిస్తే సహించాలా?" అని ధర్మ దేవతలా గర్జిస్తుంది.

"నీతి నియమాలు, శీలం, పవిత్రత లేని భర్తతో ఎందుకు కాపురం చెయ్యాలి? - నేను ఏదన్నా భరిస్తాను కానీ మోసాన్ని భరించలేను? నాకు కొన్ని నియమాలున్నాయి. నీలాంటి సంస్కార హీనుణ్ణి, ఒకప్పుడు ప్రేమించి, ఆరాధించి, అనుభవించిన ఆడదాన్ని "బిచ్" అంటున్నా నిన్ను ఎందుకు గౌరవించి, భరించాలి?" అని సూటిగా అడుగుతుంది.

కానీ అనుపమ పాత్రను మరింత గౌరవంతో అలంకరించి, మానవత్వంతో ప్రాణప్రతిష్ఠ చేశారు రచయిత్రి.. తమకు పుట్టిన అవిటి బిడ్డ తన భర్త చేసిన పాపానికి రూపం అనుకుంటుంది ఆమె. తన మాటలకు బాధ - పశ్చాత్తాపం పొందుతున్న సురేష్‌తో.

"రూప దగ్గరకు వెళ్ళు. క్షమాపణ కోరుకో... ఆమె బిడ్డ సుమిత్ మన పెద్ద బిడ్డ.. ఆ బిడ్డకు ఆస్థి హక్కు ఇవ్వు. తండ్రి గల బిడ్డను చెయ్యి. నీ కనీస బాధ్యత అది. ఈ విధంగా చేస్తే ఆ దేముడు నిన్ను క్షమించవచ్చు. మనకు మళ్ళీ బిడ్డ పుట్టవచ్చు. ప్లీజ్.." అని గొప్ప స్త్రీ మూర్తిగా చేతులు జోడిస్తుంది. ఆమెలో మానవత్వంతో అతనిలో రాక్షసత్వం కరిగిస్తుంది. ఆవేశంతో రూప సాధించి, కొంత ఆలోచింపజేసిన సురేష్‌ను సంపూర్ణ మానవుడిగా మార్చగలుగుతుంది అనుపమ.

సురేష్ పశ్చాత్తాపంతో క్షమాపణ చెప్పినప్పుడు "మీ దయా ధర్మాలు వాడికి అవసరం లేదు. నా బిడ్డను నేను పెంచుకోగలను.." అని గాయపడ్డ రూప మాటలకు "అది దయ, ధర్మం కాదు. వాడి హక్కు. నీలాంటి తల్లి అండన వాడు సంస్కారవంతుడిగా పెరుగుతాడు. వాడు నీ పేరుతో పాటు, నా పేరూ నిలిపే అవకాశం ఇమ్మని అభ్యర్థిస్తున్నాను. నేను నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించే ధైర్యం నాకు లేదు కానీ, సుమిత్‌ను సంతోషంగా స్వీకరిస్తాను." అని "బిచ్" అని రూపను సంబోధించిన, సురేష్ చేత అనిపించగలిగారు రచయిత్రి.

కామేశ్వరి గారి నవలలో గొప్ప స్క్రీన్‌ప్లే ఉంటుంది. మంచి డ్రామాను, ఆలోచించడం నేర్పే సంబాషలను చాలా మామూలు మాటలతో సృష్టించగలరు రచయిత్రి. ఎప్పటికప్పుడు సమకాలీన సమస్యలను చాలా సులభంగా అర్థం చేసుకుంటూ, బాధపడుతూ, దీని పరిష్కారం ఏమిటా? అని ఆలోచిస్తూ, తపనలో రచించే రచయిత్రి ఈమె.

ఈ నవలలోనే రూప తల్లి పద్మావతి, లాయర్ సుమతి, రామనాథం గారి భార్య, సురేష్ భార్య అనుపమ - ఇలాంటి చక్కటి ప్రాణంతో స్ఫూర్తితో స్పందించే సజీవ శిల్పాలను మలిచారు రచయిత్రి.

ఇన్ని పాత్రల మధ్య, సగటు ఆడపిల్లల ప్రతి నిధిగా రూపను మనకు కానుకగా ఇచ్చారు.

కథ వేరు, నేపథ్యం వేరు. ఈ నవలలో నేపథ్యం సాంఘిక పరిస్థితులు, నీతి సూత్రాలు, నరాలలో యవ్వనపు అలజడి, కట్టుబాట్లలో మొనాటినీ వల్ల, తెలియని ఒక ఆవేశాన్ని స్వేచ్ఛ అనుకుని భ్రమింప చేస్తే, కథలో కొత్త మలుపు. ఒక పరిస్థితిలో అద్భుతంగా, నేపథ్యమనే ప్రేమే అతీతంగా దాటి ఎదిగి పోతుంది.

పైకి అలల ఒరిపిడి లాంటి ప్రశ్నలు వేస్తూ, ఎదురు తిరుగుతూ, "నాకేమైనా ఫరవాలేదు..." అని మొండిగా సమాజపు బండరాళ్ళకు గుండెల్ని కొట్టుకుని బలిదానం చేస్తూ చాలా విప్లవాత్మకంగా కనబడే "రూప" బడబానలాలు గుండెల్లో దాచుకున్న కడలి కన్నె. ఒక మంచి జ్ఞాపకంగా, ఒక కన్నీటి గాథలా గుండెల్ని కదిలించి ప్రశ్నించి, ఊపిరాడనీయకుండా చేసి, ఆలోచించు అని శాసిస్తుంది ఈమె.

కామేశ్వరిగారి 'కొత్త మలుపు' నవలలోని రూప తెలుగునాట ఒక సజీవ మూర్తి. ఆమె ఆలోచనాద్భుత ఇంద్రధనస్సులు ఎంత సజీవవంతమైన సంచలనాన్ని సృష్టించగలవో కాలమే తెలియ చెప్పాలి మరి.

***

## చలం 'అరుణ'లో అరుణ

మనిషిలో నిజాయితీతో కూడిన ఊహ, దాన్నిబట్టి జీవించడం - ఈ రెండు సౌందర్యానుభూతులక్రియా ప్రేరణే అరుణ.

"నీతో ఒక రహస్యం చెపుతాను. నేనింత వరకూ ఎవరినీ ప్రేమించలేదు. నీ హృదయంలో గొప్ప ప్రేమ ఉంది. ప్రేమించాలనే ఆశ అపారం..... అందువల్లే ఇవన్నీ... కానీ, నా ఆదర్శమే అతి ఉన్నతం.... నా పురుషుడు ఇక్కడే నాకలల్లో బ్రతుకుతున్నాడు. నిరంతరం నాకేసి చేతులు చాస్తూ... ఈ మనుషుల్ని చూస్తే వాళ్ళ లోపాలు, దేహలోపాలు, గుణ లోపాలూ అన్నీ కనపడతాయి. నేను మోహించి తన చేతుల్లో చిక్కాననుకున్న మొగవాడు ఆశ్చర్యపడతాడు నా నవ్వు చూసి, నాకు మనుషుల్లో ఒకరికీ ఒకరికీ భేదం నశించింది. అందరూ ఒకటే. ఏం చేస్తారు పాపం?! అంతకన్నా చేత కాదు. మనుషత్వం అతిక్రమించాలని ప్రయత్నిస్తాడు 'నీ బోటి వాళ్ళు: కానీ పాపం చేతకాదు. శరీరం ఒక్కటే ప్రేమ సాధనము..." సునో ముసాఫిర్ భాజిత్ ఢంకా.....

అంటూ అక్షర అక్షరంలో రక్తారుణ వాంఛావిస్పోటకాల్ని ఇమిడ్చి విసురు పుచ్చుకుని వాంఛా, భ్రాంతీ, సౌకుమార్యం, సౌందర్యం, నిశ్చలత, ఆరాధన, స్పందన వీటిని లౌక్యం కోసం బలి పెట్టే ప్రపంచంలోకి విసిరి కొడుతుంది.దాదాపు ఆరుగురు పురుషుల చేత ఒకేసారి వాంఛింపబడి ప్రేమించబడి ఆరాధించబడిన అరుణ.

ఈమె మహారచయిత చలంగారి సృష్టి. సంప్రదాయపు సాహిత్యపు రెల్లు ముడతల మధ్య విరిసిన అగ్నిపుష్పం....

స్త్రీ అంటే ఆరాధనా, వాంఛా, గౌరవం, సానుభూతి,

ఆమె శక్తి పట్ల అచ్చరువు, ఆమె ఇవ్వగలిగిన ఆధ్యాత్మిక తన్మయత్వం పట్ల నమ్మకం ఉన్న చలం అరుణను బహుశ ఏ ఒక్క స్త్రీ మూర్తిలోనూ దర్శించి ఉండరు. స్పందించి, ప్రేమించగలిగిన స్త్రీలో వాంఛ, జ్ఞానం, ప్రస్ఫుటమై స్వతంత్రత ఊపిరి పీల్చుకుని, కట్టుబాట్లను, భవబంధాలను త్రోసిరాజన్నప్పుడు అనేకానేక స్త్రీ మూర్తులతో అరుణ ఛాయ దర్శనమిచ్చి ఉంటుంది చలంగారికి. ఆమె వారి ఊహకు ఛాయారూపం కాదు. వారి వాంఛాభావనలకు అక్షర రూపం కాదు. ఆమె కడిమి కాదు. కమనీయ కావ్యం; చలం దర్శించిన స్త్రీత్వపు ప్రతీక.

చలంగారు సామాజిక విప్లవాలకు ప్రతిరూపమైన స్త్రీలను సృష్టించి, ఆమెలో స్థంభనకు, మూగదనానికి, క్రోధ లోహ మోహ మదమాత్సర్యాలకు పాతివ్రత్యపు చీరకడితే చాలు, భరించి, గౌరవించగల నీచ సంఘాన్ని నిలదీసి ప్రశ్నించారు. వీణను విరిచి సంగీతం వెతికే వికృత మానవుడా? స్పందిస్తే కానీ సంగీతం వినలేవోయి అని 'గీతాంజలి' చెప్పిన చలంను సంఘం గర్హించింది, అవమానించింది, బాధపెట్టింది.

ఎవరూ స్త్రీ యొక్క Self alienation problem గురించి ఆలోచించనప్పుడు, ఆమెను, దాన్ని విధించిన సంఘం మనస్థత్వంలో తెగిన నాడీ సముదాయ పీటముడిని వేలుపెట్టి గుర్తించిన చలంను భరిచలేదు సంఘం ఆనాడు. కొంతమంది ఈనాడు కూడా భరించలేకపోవచ్చు. కారణం, చలం ఇష్టం లేక కాదు. అర్థంకాక.

తనలో తను. ఇందులో మీ మమైక్యత ఉంది. తనకైతను.... తను వేరుగా అయి చూసే స్థితి. ఇతరుల కోసం తను.

ఈ మూడు పొరల అస్థిత్వంలో ఎవరు దేనికై బ్రతుకుతారు? ఎందుకు బ్రతుకుతారు? చలంగారు ఎప్పటికప్పుడు దాన్ని తేల్చి చెప్పినట్లు కాదు. ఆలోచిస్తూ చెప్పారు. అర్థం చేసుకోమని మనముందు అక్షరాల దివిటీలు వెలిగించారు. అరుణ.... అటువంటి వాంఛారుణ దీపం.

"సెక్స్ సంబంధాలలో సంఘపు నీచ బలవంతం కాకుండా స్వేచ్ఛ స్త్రీకి అవసరం అనే నినాదాన్ని తన రచనల్లో మొదటి నుంచీ చివరిదాకా ఉద్యమంగా ప్రచారం చేసిన చలం, కాల్పనిక వాదీ, సంస్కర్తా తప్ప అసత్యవాది కాదు. ఆయన సెక్స్‌ను సిద్ధాంతంగా చూశాడు కానీ, వ్యక్తి విశిష్టతలో భిన్నత్వాన్ని చూడలేదు -" అనే ఒకరక వాదం ఉన్నది చలంగారి గురించి... కానీ చలంగారి సాహిత్యంలో సెక్స్, స్వేచ్ఛ ఎంత ముఖ్యమన్నది ఉపరితలంపై కనబడే ఉరవడి కానీ, జీవన వాహినిలో ప్రతి సుడిగుండం అల, అశాశ్వతత్వం ఈ ఉపరితలపు ఉద్వేగాలకు కారణం.

తన రాగద్వేషాలు, అసూయలు, స్వార్థం, నీచత్వం స్త్రీని వస్తువుగా, వాంఛా ఉపకరణగా, సృష్టిసాధనగా, బానిసగా, తన ఉద్వేగ దుఃఖంలో ద్వేషాలను ఆర్థిక అసమానత్వాలను అంగీకరించి, ప్రతిబింబించే ఒక నిశ్శబ్ద దర్పణంగా మాత్రం సంఘం భావించినప్పుడు చలం అక్షర బాణాలు సంధించారు. ముందు స్త్రీని విజ్ఞానవంతురాల్ని చేసి, సంఘం విధించిన ఇనుపకట్టడాల్లో ఇమడలేని విభిన్నాకృతుల్లో స్త్రీత్వాన్ని ఆమెలో నెచ్చెలిని, తల్లిని, ఆప్యాయతా వల్లరిని, శృంగార యామినిని దర్శించారు.

"అదెన్ని తప్పులు చేసినా ఫరవాలేదు. చూశామా కళ్ళతో అని సర్దిపెట్టుకుని సంసార పక్షంగా అరుణను కాపరం అనే ఆవిరి గిన్నెలో పెట్టి మూత పెట్టుకుని బ్రతకాలనే అరుణ భర్త జయరావుకు, కొన్ని నెలల్లో చచ్చిపోతాడని తెలిసి అతణ్ణి బ్రతుకున్నంతకాలం సుఖంగా ఉంచాలని మానవత్వంతో ఆలోచించిన అరుణకు మధ్య నిలబడ్డ సాంప్రదాయాల సంఘం అమానుషతాలి సహిస్తుంది కాని ఆడదానిల మానవత్వాన్ని భరించలేదు. అరుణలోని ఔన్నత్యం ఆమె పురుసుడై ఉండే ఒక మహావ్యక్తిగా చిత్రీకరించబడే వాడేమో అరుణలోని ఔన్నత్యం ఆమె పురుషుడై ఉండే ఒక మహావ్యక్తిగా చిత్రీకరించబడే వాడేమో కానీ స్త్రీ అవడంతో ఆమె ఇల్లాలు, భార్య, మంచి కోడలు కానీ "స్నేహవల్లరి" అవడమేమిటని కోప్పడుతుంది సంఘం.

చలం అరుణను సృష్టించినప్పుడు అందర్నీ అరుణలా బ్రతకమనలేదు కానీ, అరుణలోని అంతర్మధనం నుంచి సమాన ఆలోచనా సంస్కారం చేద్దామని ప్రయత్నించారు.

ఇంత స్వతంత్ర్యం కలిగిన ఈ ఇరవైయ్యవ శతాబ్దిలో ఉమెన్స్ లిబ్ అలజడిలో ఇంకా చలం అవసరం ఉందంటారా? అని ప్రశ్నించినవచ్చు దానికి నిజమైన జవాబు ఇవ్వాలంటే "అసలు ఇప్పుడే ఉంది".చలాన్ని తిట్టడానికి కొన్ని రోజులు, చలాన్ని చూసి భయపడటానికి మరికొన్ని రోజులు, చలంలో ఏం లేదు అంతా ఉత్తుత్తది అని వీబూది పెట్టుకోడానికి కొన్ని రోజులూ - వీటన్నింటికీ స్త్రీ కేవలం ప్రేక్షకురాలే. ఈనాటి స్త్రీ కొన్ని ఏళ్ళకన్నా స్వతంత్రురాలు - నిజమే కానీ, ఎవరో ఇచ్చే "గ్రాంటు"తో స్వతంత్రంగా బ్రతికే స్త్రీకి,తనకుఏంకావాలో తెలియదు. జ్ఞానం, స్వతంత్ర్యం ఒకరు పెట్టే భిక్షకాదు. ఏ పురుషుడి ఆలోచనో, ఏ కట్టుబాటో స్త్రీత్వపు విశ్వరూపాన్ని ఆపే పరిధి లేనప్పుడు ఆమె ఆమెగా ఆలోచిస్తుంది, నడుచుకుంటుంది. అదుగో అరుణ దానికి ప్రతీక. అరుణలో వాంఛల

అల్లరిని కాక దాని వెనకాల దాక్కున్న అరుణావల్లరిని దర్శించండి - స్త్రీ అంటే అర్థమౌవుతుంది. ఆమె సంసారమనే ఒక భయంకర వలయంలోకి మళ్ళీ వెళ్ళలేక స్వతంత్ర్యంలోకి పారిపోతూ

"నా అధికార దేవతలు, నా అదృష్ట దేవతలు నా భవిష్యత్తు నిశ్చయించేశారు. నాకేముంది ఈ శరీరం కాక? ధనమా? గాదమా? దేనితో ఈ లోకాన్ని నాదిగా ఆకర్షించుకోగలను? నా సౌందర్యం ఒకటే నాకు దేవతలు ఇచ్చిన వరం. ఆ వరాన్ని ఉపయోగించినప్పుడల్లా లోకం నన్ను కరిచింది కానీ, ఈ అంధకారంలో ఆకాశం కొంచెం తెరుచుకుంది. కొత్త ఆనందానికి కొత్త ద్వారం కొంచెం తెరిచారు, ప్రయత్నిస్తాను. ఈ శరీరాన్ని, ఈ మొద్దును భారాన్ని అతిక్రమించి ఎగరడానికి చూస్తాను. నేనేం చెప్పలేను -" అని మరొక విస్తృత పరిధిలోకి ఎగిరిపోతుంది అరుణ.

అరుణ మనకు ఒక ఆదర్శం కాదు. ఒక ఆలోచనా సంవిధానం - అరుణలా బ్రతకమనా? అని చలంగారిని కోప్పడి మన చిన్నతనాన్ని బయట పెట్టుకోవడం కన్నా అరుణ ద్వారా ఆయన విసిరిన ఆలోచనా బీజాలకు వనరు కల్పిస్తే అసలు స్త్రీత్వపు జ్ఞానానికి అర్థం తెలుసుకోవచ్చు.

"దేముడు ఏ నిమిషానో పెద్ద నవ్వు నవ్వితే అదే ఈ ప్రపంచం అయిందేమోననిపిస్తుంది. నీ నవ్వూ, నీ కథలూ నీ స్త్రీ స్వతంత్ర్య సమరమూ ఏమిటీ అంటే ఇదంతా నా చిన్న నవ్వు అంటాను -" అనే చలం వేదన తప్పు అనబడే ఆయన ఔదార్యం ఒకటే. స్త్రీత్వం ప్రదర్శించిన ప్రతి స్త్రీమూర్తిని గౌరవించి ఉన్నతురాలిగా చూడగలగడం, ఒకవేళ వారిలో తప్పులు, నైత్యాలు ఉన్నా అవి పరిస్థితి ప్రభావాలే అని క్షమించి ఆదరించగలగడం - చలం శృంగారాన్ని గౌరవించారు. హృదయ స్పందనతో స్వరం చేసి అనాహత భావం వినమన్నారు. అర్థంకాని జనం సెక్స్‌తో చలాన్ని ఐడెంటిఫై చేశారు. ఆయన చెప్పిన మహోన్నతమైన మానవత్వాన్ని గురించి కొంతకాలం ఆలోచించలేకపోయారు. చలాన్ని నేర్చుకోవడానికి ఒక కొత్త పాఠశాల, అందులో మహోన్నతులైన మానవత్వపు పూజారులు అధ్యాపకులుగా కావాలి.

అరుణను చాలా విచిత్రంగా రూపకల్పన చేశారు చలం.

స్త్రీలో ఆధారపడకుండా అనే గుణం స్త్రీ మీద పురుషాగ్రహాన్ని గుమ్మరింపచేస్తుంది. ఎంతో సంస్కారమున్న మొగవాడు తప్ప స్త్రీలో ఆ గుణాల్ని గౌరవించి, కాపాడుకోవాలనుకోడు, అరుణ దానికి ప్రతీక.

అరుణ చలనంలో ఒక అపారమైన నిశ్చల నిశ్శబ్దత ఉన్నది. అది వినేశక్తి ఈ జనానికి లేదు. ఈ పశువు, ఈ పురుషుడు దేవతని, కిన్నెరని, కోయిను, తనకి వండి, తన కాళ్ళు కడిగి, తలంటి పోసి తన మీదకు మళ్ళితే మళ్ళీ తాను నవ్విందాక ఏడుస్తూ కాచుకుని కూచోమంటాడు. దాన్నే పాతివ్రత్యమూ ప్రేమా అంటాడు.

ఇక్కడ మనం అర్థం చేసుకోవలసింది అరుణనా? అంటే కాదేమో... చలం స్త్రీ భావన, ఔన్నత్యం వల్లనే అసాధారణమైన సౌందర్యాలను, ఔన్నత్యాలను, ప్రజ్ఞలను పోగొట్టుకుంటున్న మూర్ఖపు సంఘం - అని చెప్పారు.

"శాస్త్రాలు ఖండించే కావ్యాలు మనుష్యులు ఖండిస్తారు. కానీ స్వార్థపరత్వం, చిన్న మాటల వలన, పనుల వలన ఇతరుల్ని వంచించడం, సగం అబద్దాలు, కపటం - ఇటువంటివి లోపాలుగా గుర్తించగల నైతికాభివృద్ధి రాలేదు ప్రజలకు -" అని జాలి పడ్డ చలంను సంఘం అర్థం చేసుకోవాలంటే ఎంత సున్నితమైన సంస్కారం కావాలి?

"తాత్కాలికంగా సంబంధాలు కలిగితే సంఘం సహిస్తుంది, హర్షిస్తుంది. అదే గాఢమై, అసత్యాన్ని, మోహాన్ని కాల్చగలిగినంత నిర్మలమైందా, సంఘం శిక్షించి బలి తీసుకుంటుంది. అందుకేనేమో అరుణ చుట్టూ పలాయన వాదులు చేరి, ఆమెను 'భర్త' అన్న వ్యక్తి కనబడగానే లౌక్యంగా ఆలోచించడం ప్రారంభిస్తారు.

'స్త్రీలో జడత్వం బానిసత్వం తలుచుకుంటే స్త్రీ హృదయమే ఒదులుకుంటుందని భయం వేస్తోంది' అన్న చలం హృదయం గలిగిన స్త్రీ అరుణ చేత " ఛీ! ఏం మొనగాళ్ళు... అని విసుక్కుంటూ" సుందరమైన కర్తలలో ఏ తాళం ఏం రాగం అని ఎందుకు అడుగుతావు? అనుభవించడం చేతకాక. (ఈ అందమైన అనుభవాన్ని తప్పుచేస్తున్నానేమో అన్న భావనగా మార్చుకునే శక్తి మనకు ఉందేమో!) ఇది వరకు ఏమైపోయావు? ఇంక ఏమవుతావు! ఎందుకు నీకీ ప్రశ్నలన్నీ.... వెన్నెల్లో కూర్చుని చంద్రుడు అస్తమిస్తాడే మళ్ళీ ఉదయిస్తాడా అని ఏడ్చే

దౌర్భాగ్యుణ్ణి నిన్ను చూశాను కానీ చంద్రుడు ఎంత సేపు వెలుగుతాడు... వెలిగితే నిద్రపోతావు. అట్లాగే నిలిస్తే ఈ సౌందర్యం భరించగలవా నాయనా!" అని అరుణ గొప్ప వేదాంత సత్యం బోధపరుస్తుంది.

అరుణ సౌందర్యం చాలా అద్భుతం. అది కను ముక్కు తీరు ఉన్న ఒక శిల్ప దర్శనం కాదు. వ్యక్తిత్వ వాంఛా స్పర్శతో పులకించిన ఒక సజీవ సౌందర్యరూపిణి ఆమె.

చలంగారు ఒక చోట అన్నట్లు "అర్ధరాత్రి నీరసవు నరాల బాధకి ఉపశాంతి నిచ్చే మరకాదు. అలంకరించి షోకుగా చూసుకునే బొమ్మ కాదు. కమీటలకి ప్రవేశాన్నిచ్చే ద్వారం కాదు స్త్రీల సభల్లో, పురుషుల ఉపన్యాసాలు చదివి, కీర్తి తెచ్చుకుని, భర్తకి ఉపకరించే సాధనం కాదు. పురుషుడు ఎలాగైనా స్త్రీలోని ఆకర్షణల చంచలత్వంనుంచి ఆధారపడే సాధారణ గృహిణి కింద మార్చాలని చూస్తాడు. సుఖంకోసం సఫల మనోరథుడౌతాడు. ఆకర్షణ పోగొట్టుకున్నదని నిందించి త్యజిస్తాడు" - కానీ వాటిన్నింటికీ అతీతమైన వ్యక్తి అరుణ. ఆమె కళ్ళు ఎవరి వంకా చూడవు సాధారణంగా చూసిందా ఇంక ఆ కళ్ళ లోతేమిటో తెలుసుకున్న దాకా వదలకూడదని - ఇంక విముక్తి లేదు యువకులకు జలగండమే. ఆమె నవ్వులో ఒక ప్రత్యేకత, ప్రక్షాళన ఉంది. ప్రపంచం కోసం అతికించుకునే చిరునవ్వు కాదు. గంటల గంటల మోస్తరు నవ్వు. సహారాలో ఒంటెల మెళ్ళు గార్డెన్ ఆఫ్ అల్లా సినిమాలో విన్న గంటల చప్పుడు, ఒకసారి విన్న తరువాత ఇంక జీవితంలో శాంతి సంపూర్ణంగా నశించిందని స్పష్టంగా తెలియజేసే నవ్వు.ఏనాడూ తలరేగినట్లుగానీ, అలిసినట్లుగానీ కనిపించదు అరుణ. అంత దూరంనుంచి వచ్చినా పాదాల మీద జీరాడే పట్టంచునుంచి, తలపైన నిగనిగలాడే జుట్టు పాపిడి వరకు అప్పుడే అలంకరించుకున్నట్లుండే అందం అది.

జీవితమంతా ముళ్ళలోంచి, దుమ్ములోంచి, ద్వేషాల్లోనించి, నిందల్లోనించి, అపనిందల్లోనించి అంత నిర్మలంగా నడిచి శుభ్రంగా, పవిత్రంగా ఉండే వారు అరుదు. తామరాకు మీద నీటి బొట్టు, ఆకుల్లోనించి కిందకి జారే వెన్నెల రేఖ నడిచిన చోటల్లా హృదయాలమీద, అడుగులు పెడుతూ వెళుతోందంటే ఒక వింతా"

ప్రేమికుడు, కవి, సగటు మనిషి - ఈ ముగ్గురూ మూడు పేటల అల్లికగా రచయిత మనకు స్వగతాలతో దర్శనమిస్తారు. వీటన్నింటి మధ్యా సుందరమైన దృశ్యరేఖలాంటి అరుణ.

"ఎందుకు వచ్చిందీ నానించి ఏం కావాలి? మళ్ళీ జీవితం ఆమెకు గాయం చేసిందా? లేక ప్రణయమార్గంలో సోపానమా నేను ఈ రాత్రికిరాత్రికి?

"తీవ్రమైన వాంఛ నా కళ్ళకు పొరలు కప్పక పోవడం చేత ఆమె అందాన్ని చాలా స్పష్టంగా చూడగలుగుతున్నాను -"

"ఆ నవ్వు కోసం ఏం చెయ్యకుండా ఉండగలం? పూర్వపు మోహమంతా చల్లబడి గడ్డ కడితే మాత్రము -"

"ఎంతకాలం గడిచినా, ఒక్కసారి గొప్పగా ప్రేమించిన స్త్రీ ఇంకోసారి మోహధనంలో చూడగానే జెలసీ తలెత్తక మానదు...."

"ఆమె జీవితమే అంత. ఎప్పుడూ శాంతి, శాంతి అని శాంతి మీద కోర్కెకానీ, శాంతిని ఒక నిమిషం భరించలేదు. ఉత్తేజం కోసం శాపం పొంది పుట్టింది."

"ఇద్దరమూ అట్లా నుంచున్నాము. ఒకర్ని ఒకరం ఒదలలేక, ఏంకావాలో పూర్తిగా తెలియక, తెలిస్తే ఒకరికొకరం సంకెళ్ళ మౌతామన్న భయంతో కామంతో పరుపులమీద మండిపోవడం కన్నా ఎంత మధురాలు అట్లాంటి నిమిషాలు? (చలాన్ని అర్థం చేసుకోవాలంటే ఈ వాక్యం చాలేమో, మన మనస్సుకు దుర్భరమైన అసత్యమైన సాంఘిక పరదాలు లేకపోతే)

"మన 'ఇన్స్టింక్స్' చేసే హడావిడి బైటకి కనబడకుండా ప్రయత్నించడమేగా నాగరికతకు ప్రథమ లక్షణం."

"చాలా సంస్కారం ఉన్న మనుష్యులే ఎంతో వివక్షతతో జీవితాన్ని చూడగల మేధావంతులే, మానవ స్వభావాన్ని స్టడీ చేసిన పండితులే - స్త్రీ వ్యామోహంతో కాలుజారినప్పటికీ కళ్ళు కనబడక, గొలుసు విప్పే వాడి చెయ్యి కరిచే కుక్కల్లాగా ప్రవర్తిస్తారు."

"ఎవరో కొందరు తిండిలేక మాడుతున్నారనే అంతర్ధ్యాన ఉంటే కానీ వాళ్ళకి లేక మనకి ఉన్నాయికదా అని చూసుకుంటే గానీ ఆనందించలేముగావును.... ఏ కాస్తలోపం ఎప్పుడు కలుగుతుందోనని ఎంత ఎక్కువగా తయారు చేస్తారు... కూడబెట్టుకుంటారు? స్త్రీని అంతే ధనాన్ని అంతే, భోజనాన్ని అంతే..."

"అతన్ని, అతని పునుగు పరిమళాన్ని, ఠీవిని, భాషను గంభీరాన్ని అన్నింటినీ తాగుతున్నట్లున్నాయి ఆమె కన్నెత్తి చూడకపోతే విరాగం, చూస్తే రాగం చాలా వైరాగ్యాలు ఇంతే."

"విలువల్ని మనసే కల్పిస్తుంది. మనకి కావాలని కోరిక పుట్టిందాకా ఎంత విలువైన పదార్థమైతేనేం మనకేం గొప్ప?!

"స్త్రీల విషయంలో అనుభవం - కొన్ని హక్కుల్ని
ఆజన్మాంతపు హక్కుల్ని ఇస్తుంది పురుషుడికి."

"ఏం మాట్లాడవేం? ఏం లోపం చేశాను నీకు?" అరుణ భర్త జయరావు ప్రశ్న.

"ఆ మాటే ఈ కాలంలో ఎంతమంది స్త్రీలు అనాధలు, అమాయకుల్ని అడుగుతున్నారు? ఏం లోపమా! కులగురువే దేవతలే భూమే మారుతూ ఉంటే స్త్రీని మాత్రం జీవనం తీసి శిలని చేసి దాచాలని చూసే మూర్ఖపు లోకం. వాళ్ళ చిగురింపచేసే వసంతోత్సవం లోక కల్యాణంగా కరుగుతూ ఉంటే, తలుపులు బిగించి స్త్రీని నా మొహం చూడు అని కులుకుతూ ఎదురుగా నిలుచున్న లోపం.

కళ్ళు భ్రమింప చేసే సౌందర్యం కావాలి జయరావుకి కానీ, సౌందర్యం వెంటనడిచే బాధ్యతలు అఖ్ఖర్లేదు అంగీకరించే ఉదారతా లేదు.

పద్మం కావాలి. దుమ్ములో జారవిడుస్తాము, తొందరలో రేకుల్ని చీలుస్తాము. అయ్యో ఎంత గతిపట్టిందని కనికరించి ఎవరన్నా రేకుల్ని పోగుచేస్తే అపనిందలు సాగిస్తాము.

అరుణ అత్తగారు ఆమెను శిక్షించాలనే ఆశపడుతుంది. కానీ మొగవాడు - కొడుకు - అరుణ గ్లామరుకు దాసుడు. ఏం చేసినా, అరుణ తను ముందే వ్యభిచరించినా వియోగాన్ని భరించలేక అమర్యాద పడలేక, తాను చూడలేదని నమ్మడానికి సంసిద్ధుడైన మగవాడు.

"కులం నిర్ధారించిన నా కులాభిమతం, మతం లేదనే నా వింతాభిమానం స్త్రీ స్వేచ్ఛకోసం పోట్లాడే పురుష అహంకారం జెలసీ చచ్చాయనుకున్నా ఆ ముళ్ళ మొక్కలన్నీ మోళ్ళన్నీ చిగుర్చాయి. ఆ రాత్రి ప్రవహించిన కుళ్ళులో ఎంత సంస్కారపు పొరను కూడా బాధ్యత వహించాలన్న భయం చింపేసి లోపలి మనిషిని బయట పడేస్తుంది.

జయరావును జస్ట్ నాలుగు దెబ్బలుకొట్టినప్పుడు"ఆ సభలో దుశ్శాసనుణ్ణి చంపి ఉంటే ద్రౌపదికివొచ్చే సంతుష్టి కనబడింది ఆమె కళ్ళలో కొద్దిగా."

ఆమె "భర్త జయరావు" అనగానే, ఆ 'భర్త' అనే పవిత్ర పదం అన్ని దౌర్జన్యాలను, అపహాస్యాలనూ, క్రౌర్యాలనూ కడిగి, వేరే మంత్రాక్షరంలా, ఆ మాట ముందు ఇష్టాలు, ధర్మాలు, హృదయాలు, స్వేచ్ఛలూ, ప్రేమలు, పాపాలు - అన్నీ తలలు ఒంచి తప్పుకోవలసిందే

"అదే మొగవాళ్ళకి మొగాళ్ళకి ఉండే కన్వెక్షన్. అదే ఫెయిర్ ప్లే. ఆ ప్లేలో ఆడది చేరదు. అన్నీ మొగవాళ్ళ క్లబ్బులు."

ఈ మాటల్లో చలం తను చెప్పదలచుకున్నది చాలా చెప్పారు. అరుణ చుట్టూ అల్లుకున్న వాతావరణం గురించి, అరుణను అర్థం చేసుకోవల్సిన వాతావరణానికి మనని ఎదగనీయడానికి ఇవన్నీ అక్షరసోపాన పంక్తులు.

తనను ప్రేమించి ఆరాధించి సొంతం అనుకునే వ్యక్తినీ, అధికారం చెలాయించే వ్యక్తినీ ఒకేరకంగా చూడగలదు అరుణ. అన్నింటికన్నా తమాషా, ప్రతి వ్యక్తి ఆమె తనకే సొంతం అనుకునేటట్లు చెయ్యగలదు. అందుకే రచయిత ఇంట్లో, బీస్ట్, తురక ఫ్రండ్, ఆమె భర్త, ఆమె జీవం చేసే దద్దోజనంలాంటి వ్యక్తీ అందరిలా సమావేశం అవగలిగారు.

ప్రేమ, అనుభూతి గుండె గుడిలోకి ఏ అర్చన టిక్కెట్టూ అఖ్ఖర్లేకుండా, అందమైన వెన్నెల, సుందరమైన భావనలా ఎప్పుడు ప్రవేశిస్తాయో తెలియని అతిధులు - వాటిని నిశ్శబ్దంగా ఆహ్వానించుకుని గౌరవించుకోగలిగిన వాడికి జీవితంలో ఏదో అనుభూతి - అది చెప్పుకోగలది కావచ్చు, కాకపోవచ్చు మిగులుతుందికానీ వాటిని భయంతో, స్వార్థంతో కొలతలలో నొక్కి పడితే , అవి దొరకవు. చిక్కవు. మిగలవు. అనుభూతి శూన్యతలో బ్రతికేసి చచ్చిపోతాడు మనిషి.

మోహాకర్షణలకు, ప్రేమాభిమానులకు అరుణ ప్రతీక,

ఆమె ప్రేమ ముందు, నీతి, కట్టుబాటు అసలు ఉన్నట్లే లెఖ్ఖచెయ్యదు. కానీ లద్దెపురుగులులాంటి స్పందనలేని ఆడవారితో స్టీలు జీవితాలు గడిపే సగటు మొగవాడు అరుణను క్షమించలేడు నమ్మలేడు. ఈ పురుషుడు దేవతలను, కిన్నెరను, కోయిలను తనకు వండి, తన వేళ్ళు కడిగి, తలంటి పోసి, తన మనసు మళ్ళితే తను మళ్ళీ నవ్విందాకా ఏడుస్తూ కూర్చోమంటాడు. దాన్ని పాతివ్రత్యం అంటాడు.

అందుకే "సునో ముసాఫిర్ భాజిత ఢంకా" అంటూ "నా రైలు ముందరే" అని నిశ్శబ్దంగా నిష్క్రమిస్తుంది.

"అంతే - ఈ నాటికీ కనబడలేదు! ఏమైందో అదే సమస్య... చచ్చిపోయిందా?! కానీ, ఆత్మహత్య ఎప్పుడూ అపజయ చిహ్నమే... ఒప్పుకోము అరుణ జీవితానికీ, భర్తకూ భయపడ్డదని...

కానీ, అరుణ చచ్చిపోలేదు. నాకు తెలుసు, మబ్బుల్లో, చిన్నబిడ్డలు లేత మడమల మీద, కందిన ప్రియురాలి పెదవి మీద, రోజా పువ్వు రేకుల్లో, పద్యాల నడుమ, నశించలేదు.

'జీవితంలో ఈ దేహానికీ నా శృంగార భావాలకి ఎట్లా స్వర్గ ద్వారాలు తెరచిందో, అట్లానే నా ఆత్మకీ, నా ఆధ్యాత్మికత సందేహాలకీ ఎప్పుడో ఏ ఆశ్రమం నుంచో స్వర్గ ద్వారాలు తెరుస్తుందని నా నమ్మకం" అంటారు చలం అరుణ ముగింపులో. ఎంత ప్రేమించి , గౌరవించి అర్థం చేసుకున్నారు స్త్రీ హృదయాన్ని! నా దేశంలో పుట్టిన మిమ్మల్ని చదివి అర్థం చేసుకునే సంస్కారం, సున్నితత్వం, అవగాహన నా దేశ ప్రజల కిమ్మని మీరు తొంగి చూసిన ఆ "అతీత తత్వాన్ని" చేతులు జోడించి ప్రార్థించడం కన్నా ఏం చెయ్యగలం మేము?!

మీ అమరత్వానికి ఒకటే కారణమేమో, స్త్రీత్వపు గంభీరత, కనుకొసల వాడి, వెదలులోని కెంజాయి, హృదయంలో బరువూ, మేధస్సులో మౌనంగా చెలరేగే ఉప్పెన దశదిశల రాపిడికీ ఒరిపిడికీ తట్టుకోలేని సున్నితత్వం అలసి కార్చే కన్నీరు, ఆవేదనను జాలిగా మార్చి హింసించే చేతిక్కూడా గాయం కాకూడదని ప్రార్థించే ఔదార్యం, ప్రతి రక్తబిందువులతో వెలిగే అరుణారుణ వాంఛలు - ఇవన్నీ శాశ్వతమైనంత కాలం చలం శాశ్వతం... అరుణ సజీవ మూర్తి.

***

## కె.రామలక్ష్మి గారి

## 'కరుణ కథ' లో కరుణ

"**ఆడది పడి ఉంటే అణిచి వేస్తారు,** నోరుంటే నొక్కివేస్తారు. వ్యక్తిత్వం ఉంటే దాని వెన్ను విరిగేదాకా ఊరుకోరు. ఇంకేం చేస్తుంది ఆడది? కనీసం ఆడదానికి, ఆడదాని సానుభూతైనా ఉంటుందా అంటే అదీ మృగ్యం?! ఆడదానికి శత్రువు ఆడదే. సాటి ఆడదాన్ని ఆదరించలేదు. గౌరవించలేదు. చేయూతనివ్వలేదు. ఎవరైనా ఇస్తే సహించలేదు. ఇంకెలా బాగుపడుతుంది ఈ జాతి?!"

ఈ ప్రశ్నలు అక్షర తూణీరాలుగా సంఘం మీదికి విసిరి జవాబు చెప్పమని సవాలు చేశారు. పదునైన మేధస్సుతో, సమస్యలను వాటి పరిష్కారాలను కూడా ఆలోచించగల రచయిత్రి రామలక్ష్మిగారు.

ఈమె అక్షరాల మధ్య ప్రాక్టికాలిటీ మనసు నిలబెట్టి ప్రశ్నిస్తుంది. హిపోక్రసీతో కూడిన సెంటిమెంటల్ నాన్సెన్సును ఆమె భరించలేరు. "ఆడదానికి వ్యక్తిత్వం, మర్యాద ముష్టిగా వెయ్యవలసినవి కాదు. అవి ఆమెకు ఇచ్చి నీవు గౌరవించుకో!" అని మొగవాళ్ళనూ విలన్స్ కింద చిత్రీకరించరు. కానీ, వాళ్ళ మంచితనాల మౌన త్యాగాల మధ్య ఎంతమంది నలిగిపోతారో గుర్తించమని హెచ్చరిస్తారు.

మంచితనం ఉన్నా ధైర్యం లేని బలహీనులను సంఘం భరించకూడదన్న శాసనం చాలామంది ఫెమినిస్టు రచయిత్రులకన్న ముందే తెలియ చెప్పారు రామలక్ష్మిగారు. అంతేకాదు, సాధారణంగా చాలా మంది రచయిత్రులు సంఘటనలను, సన్నివేశాలను వరుసగా హృద్యమంగా పేర్చుకునిపోతూ, చదివించగల నేర్పుతో, సుఖాంతపు తీర్పులు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకుంటారు. కానీ, రామలక్ష్మిగారిలో ఈ ఫలాయన వాదం ఉండదు. సమస్యకు పరిహారం, కారణం కూడా గ్రహించగలరు ఆమె.

స్త్రీ వాదపు సాహిత్యాన్ని, స్త్రీ సమస్యలను చర్చించి, పరిసరాలను వెతికే సాహిత్యాన్ని ధైర్యంగా 'నా తీర్పు ఇది' అని స్పష్టంగా చెప్పగలిగిన సాహిత్యాన్ని గౌరవ పతాకం కింద నిలబెట్టిన చాలా కొద్దిమందిలో రామలక్ష్మి ఒకరు.

"కరుణ కథ" చదివిన వెంటనే కన్నీరు నేనున్నానంటుంది. ఎంత నేర్పుగా, ఓర్పుగా ఆ పాత్రను తీర్చిదిద్దారు రచయిత్రి?! అన్నపూర్ణ అనే ఒక వ్యక్తిత్వం గల అమ్మాయి, రంగారావనే ప్రియుడి చేత మోసగించబడి అబార్షన్ చేయించుకోమన్న చచ్చు సలహాను త్రోసిరాజని, తండ్రి చీకట్లోకి నెట్టివేస్తే, వెలుగులోకి ఎంతగా ప్రయాణం చెయ్యాలనుకున్నా ఆమెకు ఈ సంఘం ఓ పూట అన్నం పెట్టడం, ఓ సానుభూతి వాక్యం పలకడం - ఇదే దానకర్ణత్వం అనీ, మానవత్వమనీ చెప్పుకుని మురిసిపోతుందని అర్థం చేసుకుని ఆశ్చర్యపోతుంది. కానీ అనాథ శరణాలయం వార్డెన్ అన్నపూర్ణను ఆదరిస్తుంది. ఆమె వ్యక్తిత్వాన్ని, ధైర్యాన్ని చూసి ఆశ్చర్యపోయి ఆదరించి గౌరవిస్తుంది.

"నా బిడ్డను "కరుణ" అని పిలుస్తానమ్మా స్త్రీ జాతికి ముఖ్యంగా కావలసింది అదే సాటి ఆడదాని మీద దయా దాక్ష్యణ్యాలు లోపించిన ఈ లోకంలో నా బిడ్డ ఒక ఆదర్శ మహిళగా వెలగాలి..." అంటుంది అన్నపూర్ణ.

కానీ అలా తన బిడ్డను తీర్చిదిద్దకుండానే ఇంటర్వ్యూకు వెళుతూ, యాక్సిడెంటులో చనిపోతుంది అన్నపూర్ణ.

"ఆమెది ఆత్మహత్యకాదు ఇన్‌స్పెక్టర్! ఆమె అంత పిరికిది కాదు." అంటుంది వార్డెన్. ఆమె చల్లటి వడిలో, అనాథాశ్రమంలో వెలుతురే ఊపిరిగా పోసుకుంటూ పెరుగుతుంది కరుణ.

ఆశ్రమంలో జరిగే అక్రమాలు, అన్యాయాలు చాలా బాగా చెప్పారు రచయిత్రి. వాటికి కారణం కూడా చెప్పారు. ఏదో ఒక ఉద్యోగం అంటూ, ఇలాంటి అనాథాశ్రమాలకు, ఫ్రీడిస్పెన్సరీలలో ఏదో ఒక ఆదర్శమో వృత్తి మీద గౌరవమో లేకుండా వచ్చే ఉద్యోగస్తుల వల్ల, ఆ సంస్థల ఆదర్శపు దీపం ఆరిపోతుంది. అలాంటి అన్యాయాలను పరిశీలిస్తూ, వీలున్నప్పుడు ఎదుర్కొంటూ, వార్డెనమ్మ చలవతో పెద్దదౌతుంది కరుణ. పెరుగుతున్న వయస్సులో ఆమె మొగపిల్లవాడి లోపాల్ని, పాపాల్ని "వాడు మొగవాడు" అని క్షమిచడం, "ఆడపిల్లవు నీకేమొచ్చింది?" అని నేరం మోపి, చెయ్యని తప్పులకు దండించడం - ఈ పద్ధతిమీద దండెత్తుతుంది. కాలేజీ స్థాయిలో, ఆ వ్యక్తిత్వ ప్రకటన మరింత స్పష్టమౌతుంది. అందువల్ల ఆమెకు శత్రువులెక్కువ అవుతారు. వారిలో ఆడవారే ఎక్కువ.

"ఆడదాన్లో ఆడతనం తప్ప ఈ వెధవలకు మరేమీ కనిపించదా?!" అని ఎదిరించే కరుణ "ఆనంద్" అనే నీచుడిని పదిమంది మధ్య అవమర్యాద పరుస్తుంది. డిబార్ చేయిస్తుంది. కానీ అతడు పగబట్టి జీవితమంతా వేటాడతాడు అని అనుకోలేకపోతుంది ఆ అగ్నిశిఖ. కారణం, అప్పటికి మనుష్యుల్లోని అన్యాయాన్ని ఎదిరించటం నేర్చుకున్నదే కానీ, అసహ్యతను, నైత్యాన్ని, నేర ప్రవృత్తి గుర్తించి, ఎదిరించాలని తెలుసుకోలేకపోయింది.

అందరు మొగవాళ్ళలో ఈ నీచ ప్రవృత్తి తప్ప మరేమీ ఉండదని అనుకునే ఆమెకు "రామప్రభు" పరిచయం ఏదో దేవలోకపు ద్వారాలకు దారిలా అనిపిస్తుంది. మొగవాడిలో ఉత్తముడిని వెతుక్కుంటున్న ఆమెకు అతను సకల గుణాభిరాముడిలా కనిపిస్తాడు. మంచం మీదున్న వార్డెనమ్మ ఆశీర్వచనాలతో వాళ్ళ పెళ్ళి జరిగిపోతుంది.

కానీ రామప్రభు ఇంటి పరిస్థితి తెలియదు కరుణకు. హోదా అన్నా, డబ్బు అన్నా ప్రాణాలిచ్చే సుభద్రాదేవి కొడుకు అతను. పైగా, ఒక్కగానొక్క కొడుకు ఆమె ప్రపంచం అంతా అతనే. పెళ్ళి చేస్తే, కోడలు వచ్చి అతనికి దూరం చేస్తుందని భయంతో అతని పెళ్ళి వాయిదా వేస్తున్న సుభద్రాదేవికి, చాలా సింపుల్‌గా అనాథ పిల్లను పెళ్ళిచేసుకుని ఇంట్లోకి వచ్చి 'నువ్వు ఆదరిస్తే లోపలికి వస్తాం! లేకపోతే నా కరుణా, నేనూ బైటకు వెళ్ళిపోతాం!' అని కరుణ నడుం మీద చెయ్యి వేసి నిలబడ్డ బిడ్డని చూసి అవాక్కై పోతుంది సుభద్రాదేవి.

ఏం చెయ్యలేక వాళ్ళను లోపలికి ఆహ్వానించినా, చాలామంది మూర్ఖులైన ఆడవారిలా ఆమెకు తన బిడ్డ మీద కోపం రాదు. అతణ్ణి తనవాడిగా చేసుకున్న కరుణను నరనరానా ద్వేషిస్తుంది. వాళ్ళిద్దరి సాన్నిహిత్యాన్ని, ఆనందాన్ని ఆమె అసలు భరించలేకపోతుంది. దేముడిలాంటి భర్త కోసం తన పౌరుషాన్నంతా దాచుకుంటూ సహిస్తూ బ్రతుకుతుంది కరుణ. ఆ ఇంట్లో రామప్రభు అంటే మమకారం ఉన్న పనివాడు వెంకన్న మాత్రమే. సుభద్రాదేవిలో సాటి ఆడదాని మీద ఎంతటి అసూయ రాజుకుంటుందో గ్రహించగలుగుతాడు. ఆమెకన్న వెయ్యిరెట్లు ఉన్నతురాలు, సుగుణ సంపన్నురాలు, అయిన సాటి ఆడదాన్ని కేవలం "అనాధ" అన్న కారణంగా నీచంగా బాధ పెడుతున్న పెద్ద అమ్మగారు బాగా అర్థమౌతుంది వెంకన్నకు. కానీ, విచిత్రం, తల్లికి తనమీద ప్రేమ ఆమె బలహీనత అని మాత్రమే అర్థం చేసుకున్నాడు కానీ, అది ఘోరమైన పొసెసివ్‌నెస్‌గా మారుతుందని, అది కరుణను హత్య చేయించడానికి అయినా వెనుదీయదని అర్థం కాదు. కారణం "తల్లి ప్రేమ" అనే ముసుగు కింద ఆమె సాటివారిని చిన్నబుచ్చడం, పనివాళ్ళని హీనంగా చూసి, వాళ్ళను డబ్బు పెట్టి కొనుక్కుని హత్యలు చేయించుకోడానికి కూడా వినియోగించుకోవచ్చన్న భయంకరమైన ఆలోచన అతనికి అర్థంకావు.

అందుకే మంచితనముండి, బలహీనుడై, నిజాన్ని నిజంగా గ్రహించలేని మొగవాడు ఎన్ని అద్భుతమైన అనుభూతుల్ని పోగొట్టుకుంటాడో, ఎన్ని వినాశనాలకు కారణభూతుడౌతాడో తెలుసుకోండని హెచ్చరిస్తారు రచయిత్రి.

బిడ్డను కన్న కరుణ అత్తగారి ప్రేమను పొందలేకపోతుంది. కానీ, భర్తకు వచ్చిన విదేశాలు వెళ్ళే అవకాశం తిరస్కరించవద్దని బలవంతాన పంపిస్తుంది. "నువ్వు, బిడ్డ జాగ్రత్త కరుణా!" అన్న హెచ్చరిక వెనకాల అతని భయం, తల్లి ఏదన్నా చెయ్యగలదన్న సూచన అంత తొందరగా అర్థంకావు కరుణకు. కారణం, కరుణ సాటి ఆడదాన్ని నీచంగా చూడలేదు కాబట్టి.

కానీ సుభద్రాదేవి పగ సాధిస్తుంది. కొడుకు విదేశాలకు వెళ్ళగానే, బిడ్డకు ఆయాను పెట్టి ఆమెకు దూరం చేస్తుంది. నీచుడైన ఆనంద్ పగ తీర్చుకోడానికి ఆ ఇంట్లో ప్రవేశించగానే, అతణ్ణి ఆదరించి, కరుణ బిడ్డ ఆరోగ్యంగా లేనప్పుడు, అతనితో హాస్పటల్‌కని పంపించి అతనితో అక్రమ సంబంధం కట్టి, ఆనంద్‌ను కరుణ హత్య చేసే సందర్భం కల్పించి, ఆమెను హంతకురాలిగా ముద్ర వేసి, నర్సింగులనే పనివాడికి లారీ కొనిపెడతానని మభ్యపెట్టి కరుణను చంపెయ్యమని పంపుతుంది సుభద్రాదేవి. కానీ, కరుణ తప్పించుకుంటుంది. వెంకయ్య ఊరి నుంచి వచ్చి ఏదో జరిగిందని గ్రహించగలుగుతాడు. కానీ, అర్థం కాదు.

రామప్రభు అమెరికా నుంచి వచ్చి, దండ వేసిన కరుణ ఫోటోను చూసి నిర్ఘాంతపోతాడు. కానీ, ఏం జరిగిందో తెలుసుకోవాలన్న ప్రయత్నం చెయ్యడు. కారణం ఏం తెలుస్తుందోనన్న భయం... అతనికి తల్లి తన భార్యను అంగీకరించలేదన్న కఠోర సత్యం అర్థమైంది. కానీ, సెంటిమెంట్ వెనకాల దాక్కుని తల్లి ప్రేమను గౌరవిస్తున్నాననుకుని, నిర్లిప్తతలోకి జారిపోయి బిడ్డను దూరంగా ఉంచుతాడు.

కానీ, కష్టాల వలలో చిక్కుకున్న కరుణ అతనిలా అలా నిరాశలోకి జారిపోదు. ఒంటరి ఆడతనపు దౌర్భాగ్యాన్ని పళ్ళబిగువున ఎదుర్కొంటుంది. మొగవాళ్ళలో నీచత్వాన్ని ధైర్యంగా పోరాడుతుంది. రంగారావు అనే మధ్య వయస్కుని గౌరవాన్ని పొంది, కూలీల మధ్య స్థానం ఏర్పరచుకుని, వాళ్ళందరికీ చదువు చెపుతూ, సంస్కారం నేర్పిస్తూ దేవతగా కొలవబడుతుంది. కానీ, ఆ విధి వంచితురాలు అంత ప్రశాంతంగా బ్రతకడానికి జీవితం అవకాశమివ్వదు. తను చనిపోయాననుకున్న భర్త జీవితాన్ని, హంతకురాల్ని అనుకుంటున్న అత్తగారి ఇంటిని తను వెళ్ళి ఇబ్బంది పెట్టకూడదనుకున్న ఆ త్యాగమూర్తి ప్రతి పసిబిడ్డలో తన బిడ్డను చూసుకుంటూ కాలం గడుపుతుంది. ఆమె బిడ్డ శ్రీనివాసు పాతిక సంవత్సరాలవాడయ్యాడు.

ఉద్యోగం ఇస్తాము రమ్మని కూలీలలో విద్యావంతురాళ్ళైన ఆడపిల్లలను పిలిపించి, మోసం చేసి శీలం పోగొట్టి, వీలైతే విదేశాలకు అమ్మే గ్యాంగు ఉంటుంది.

"మా పిల్లలకు నువ్వు చదువు చెప్పడం వల్ల కదా ఈ దుర్దశ?" అంటారు ఆమె చుట్టూ జనం.

"మీకు ఇంత మేలు చేసిన ఈ దేవతను మీరు ఎలా నిందిస్తారు?" అని రంగారావు అడిగితే, ఆమె నిర్లిప్తంగా నవ్వుతుంది. ఆ పిల్లలను రక్షిస్తానని, ఆ దుండగుల సంగతి తేలుస్తానని ఆత్మవిశ్వాసంతో బయలుదేరుతుంది కరుణ. తను ఆడది, ఒంటరిది అన్న ఆలోచనే ఆమెకు రాదు. "అయితే ఏం?" అన్న భావనే ఆమె జీవితానికి పునాది.

ఆ నీచపు గ్యాంగును నడిపేవాడే ఆనంద్. తను ఒకప్పుడు అతన్ని హత్యచేశాననుకుని జీవితం నుంచి పారిపోయింది. కానీ అతను చావలేదు. ఆ దౌర్భాగ్యుడు ఆమెను తిరిగి బంధించి, సంఘంలో పరువు ప్రతిష్టలతో ఉత్తముడుగా బ్రతుకుతున్న రామప్రభుని దిగజార్చే ఉత్తరం రాసి ఆమెను సంతకం చెయ్యమని బలవంత పెడతాడు. తన భర్త పరువు, తన బిడ్డ జీవితం నాశనం చెయ్యలేక, నిస్సహాయస్థితిలో భద్రకాళిగా మారి పొడిచేస్తుంది ఆనంద్‌ని కరుణ.

లెఖ్ఖలేనన్ని పోట్లు పొడిచిన ఆ భయంకరమైన యువతికి మరణశిక్ష వెయ్యాలంటుంది ప్రాసిక్యూషన్ లా. కాని అప్పుడే జూనియర్ లాయరుగా ప్రాక్టీసు ప్రారంభించిన శ్రీనివాసు డిఫెన్సు లాయరుగా వస్తాడు. నానమ్మను ఫోనులో బ్లాక్‌మెయిల్ చేసే వ్యక్తిని, తాగి వాగే నర్సింగులను అనుమానిస్తాడు.

అతడు, అతడి స్నేహితురాలు రోజా ఇద్దరికీ మౌనమే సమాధానంగా చెపుతుంది కరుణ. ఆమెకు తెలుసు అతను తన బిడ్డ అని. ఒక్కసారిగా తనకు జరిగిన అన్యాయాలను వివరించి బోలెడంత సానుభూతి పొందవచ్చు కానీ చెయ్యదు కరుణ. తన అత్తగారిలోని నీచత్వాన్ని, తన భర్త తన బిడ్డ భరించలేకపోవచ్చు. కుటుంబపు పరువు వీధిన పడొచ్చు. తనకు పోయిన జీవితం తిరిగిరాదు. అందుకే అనామకురాలిగా ఉండిపోతుంది.

కానీ శ్రీనివాసు కేసు శోధించి సాధిస్తాడు. తండ్రిని, నానమ్మను కోర్టుకు తీసుకువస్తాడు. బోనులో ఆమెను చూసి నిర్ఘాంతపోయిన రామప్రభు ఆ షాకులో తనపై ఒరిగిపోతున్న తల్లి పట్టుకున్న చెయ్యి అప్పుడు కూడా విడిపించుకోలేకపోతాడు. అనాధ శరణాలయంలో కరుణ పుట్టుపూర్వోత్తరాలు కనుక్కోడానికి వెళ్ళిన రంగారావుకు కరుణ తన బిడ్డ అని అర్ధమౌతుంది.

కానీ, భర్త తనను భార్యగా, శీలవతిగా గుర్తించకుండానూ, తండ్రి తనను ఉత్తమ వంశకుల జాతగా ఒప్పుకోకుండానూ, అభిమాన ధనంతో ఈ ప్రపంచాన్ని వదిలి వెళ్ళిపోతుంది కరుణ.

"నీ పేరు నిలపడానికి నా తల్లి చనిపోయింది డాడీ" అంటాడు శ్రీనివాస్.

"లేదు శ్రీనివాసు! సాటి ఆడదాని మీద సానుభూతి కోసం ప్రాణం విడిచింది కరుణ. నా కరుణ. నాకరుణ నా తల్లి పరువు నిలబడటం కోసం బలి అయిపోయిందయ్యా" అంటాడు రామప్రభు.

కరుణ తల్లి ఆశ నెరవేర్చింది. మరొక ఆడదాని పరిస్థితిని అర్ధం చేసుకుని జాలిపడింది. కానీ ఆమెను ప్రపంచం వెంటాడింది. ఎదటి వారి నీచత్వం కరుణలో అంతర్గతమైన ఔన్నత్యాన్ని పెంచింది. కానీ, సజీవ స్త్రీ మూర్తిగా మిగిలిపోయిన ఆ పిచ్చి తల్లి ఏం పొందింది? ఇటువంటి ఉన్నతురాలు, ధైర్యవంతురాలు, గౌరవనీయురాలు, శీలవంతురాలు అయిన స్త్రీ కష్టాలకు కారణం ఏమిటి?! ఎందుకు సంఘం ఆమెను బ్రతకనీయని విపత్కర పరిస్థితిలో ఉంచింది!?

చాలా గొప్పగా అనలైజ్ చేశారు రచయిత్రి. స్త్రీకి శత్రువులు రెండు. మొదటిది ఆత్మవిశ్వాసంతో కూడిన ఆమె వ్యక్తిత్వం. రెండవది సాటి స్త్రీ. ప్రతి స్త్రీ కష్టాల వెనకాల ఈ రెండు కారణాల్లో ఏదో ఒకటి తప్పకుండా ఉంటుంది. ఎంత సులభంగా సమస్య ఎక్కడున్నదో, పరిష్కారం ఏమిటో చెప్పారు రచయిత్రి.

రచయిత్రి అక్షరాలతో మన కళ్ళముందు ఒక దృశ్యకావ్యాన్ని చిత్రీకరిస్తారు. కరుణ సజీవ స్త్రీ మూర్తి. ఆమె మనకు ఎదురైనప్పుడు గుర్తించి గౌరవించుకోగలిగితే మనం ఎదిగినట్లు లెఖ్ఖ అని హెచ్చరిస్తారు రచయిత్రి.

***

గొప్ప నవలల ఆవిష్కరణలో ఉండే ఆత్మతృప్తి చాలా తక్కువమందికి అర్థమవుతుంది. కృతకము, విపరీతము అయిన సంఘటనలను, పాత్రలను సృష్టించి, సంచలనంతో ముడిపెట్టి పాఠకుల్ని దిగ్భ్రాంతుల్ని చేసెయ్యడం ఒక రకమైన టెక్నిక్.

కానీ, నేను తెలుగు అమ్మాయిని, "నా తెలుగు నవల ఇది" అని ప్రేమగా కొంత సాహిత్యాన్ని తలుచుకుని, హాయిగా ఊపిరి పీల్చుకుని తృప్తిగా ఆనందించవచ్చు - అనిపించే నవలలు మనకు కొన్ని ఉన్నాయి.

అలాంటి వాటిల్లో "భారతి" ఒకటి అనిపిస్తుంది.

"భారతి" ఒక సజీవమూర్తి, భారతి పాత్ర సృష్టిస్తూ రచయిత బహుశః చాలా రకాల అనుభూతుల ఆస్వాదనను అక్షర రూపంలో సూక్ష్మరూపమైన మకరందపు జల్లుగా ఆమె వ్యక్తిత్వాన్ని నిక్షేపించడానికి చాలా గొప్ప మానసిక శాస్త్రాన్ని ఆధారంగా తీసుకున్నారు. డాక్టరుగా ఆయన అక్షరాలకు తన భావ గాంభీర్యంతో హృదయ ప్రతిష్ఠాపన చేశారు.

చందరాల లాంటి పల్లెటూరులో పుట్టి పెరిగింది భారతి. పుస్తకాలు, ఉన్నతుడైన తండ్రి, ప్రేమాప్యాయతలను మూగ చేష్టలతోనే వ్యక్తీకరించగలిగిన పిన్ని, స్నేహ మాధుర్యమంతా మూర్తీభవించిందా అన్నట్లుండే స్నేహితురాలు మల్లిక - వీరి మధ్య ఒక సున్నితమైన జాజిపూవులా పెరుగుతుంది భారతి.

తండ్రి మాటపై పై చదువులకు ఆశపడకుండా పల్లెటూరులోనే ఉండిపోతుంది.

కానీ, విధి ఆ సౌందర్యరాశిని చూసి వెక్కిరిస్తుంది. ఆమెకు లెప్రెసీ వ్యాధి సంప్రాప్తిస్తుంది: తండ్రికి, ఆమెకూ తప్ప తెలియని ఈ సత్యం ఆ బేల బాలికను కృంగదీసి, ప్రపంచానికి దూరంగా అభాగ్యురాలిగా బ్రతకాలి అన్న నిర్ణయానికి వస్తుంది.

అప్పటికే ఒక వ్యక్తి, అతను సారధి, రావుబహుద్దూర్ గంగాధరంగారి అబ్బాయి, నది ఒడ్డున మల్లికతో ఆమెను చూసి, ఆమే తన జీవన సర్వస్వం అన్న అనుభూతికి లోనౌతుడు. చండశాశనుడిలాంటి తండ్రిని ఒప్పించి పెళ్ళి నిశ్చయానికి పంపిస్తాడు. గోరు చూసి మనిషిని హెచ్చవేసే రావుబహద్దూర్ గారికి భారతిలో ఒక సౌజన్య సౌందర్యమూర్తి కనబడుతుంది. ఆయన వంటి కఠినుడిని కూడా ఆమె నమ్రత ఒప్పించగలుగుతుంది. ఉభయ ఖర్చులతో తనే వివాహం చేస్తానని ఒప్పుకుని వెళతాడు.

భారతి మనస్సు ఈ వివాహానికి ఒప్పుకోదు. కానీ, వృద్ధుడైన తండ్రి దుఃఖం, ఈ పరిస్థితిని ఎలాగో మరుగు చేసి, తరువాత రహస్యంగా కూతురుకి వైద్యం చేయించి తగ్గించవచ్చునన్న ఆయన ధీమా - ఆమె చేత బలవంతంగా "సరే" అనిపించగలుగుతాయి. ప్రాణ స్నేహితురాలు మల్లిక ఆమె అదృష్టానికి హృదయ పూర్వకంగా అభినందిస్తుంది.

భారతి తన ఆలోచనలతో సారధి వ్యక్తిత్వానికి ఊపిరి పోసుకుని కలలు కంటుంది. అమాయకురాలు, ముగ్ధ అయిన యువతి జీవితాన్ని తన కలల చషకంతో కొలుచుకుంటూ అడుగులేని పాత్ర ఓటితనం వల్ల ఏర్పడ్డ శూన్యాన్ని చూసి ఎలా బిత్తరపోతుందో ఎంతో హృద్యమంగా చిత్రీకరించారు.

ఇలాంటి పిల్లలో మరొక వైపు మనోవిశ్లేషణతో ఎదుగుతున్న వ్యక్తిత్వం ముందుకు వచ్చి ఆమె జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో చెపుతారు రచయిత.

ఎంతో క్లిష్ట పరిస్థితుల్లో కూడా బెంబేలు పడిపోకుండా, ఆమె తీరుగా, స్థిమితంగా ఆలోచించగలదు.

"మనుష్యులు ఎంత వికారంగా ఆలోచిస్తారు! ఒక్కొక్క మనిషి వివిధ దశల్లో గురి అయ్యే ఆలోచనలకు, ఒడిదుడుకుల ప్రవాహాన్ని ఏ మహానుభావుడైనా విశదీకరించగలిగితే, మనిషికీ మనిషికీ గల అవినాభావ సంబంధాలు నశించి, మానవ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలౌతుంది." అనుకుంటుంది.

అత్యంత వైభవంగా ఆమె వివాహం జరుగుతుంది. కానీ అంతటి వైభవంలోనూ తన తండ్రి లేమి, ఆయన అస్వంత్రత గుర్తించగలుగుతుంది ఆమె. మరొక పక్క అమాయకత్వపు కన్యాత్వం, మామగారి ఇంటి వైభవం, తన అత్తగారి ఔన్నత్యం, అనురాగం, తన భర్త సౌందర్యం, కళాత్మక జీవితం - వీటితో ప్రలోభాలకు లోనౌతుంది.

ఆమెలోని భారతికి తన వివాహం అనే మధురమైన సన్నివేశంలో ఎంత సహజత్వం, లాలిత్యం, మాధుర్యం మరుగున పడ్డాయో ఆమెకు అర్థమౌతుంది. "తన కోసం అంత కలవరించిన సారధి తనవైపు ఓర చూపులు చూడడేం? తనను పలకరించడేం? వట్టి జడుడా? ఎప్పుడో ఉద్రేకం వచ్చినప్పుడు ఉప్పెనలా బయటపడటం తప్ప, ఇతనికి భావాలూ, అనుభూతులూ లేవేమో..." అని ఆలోచిస్తుంది భారతి.

అతనితో ఏకాంతంలో, అతని బిడియం పోగొట్టడానికి, "నన్నే ఎందుకు గుర్తు పెట్టుకుని కావాలనుకుంటున్నారు?" అని ప్రశ్నిస్తుంది.

"నువ్వే కారణం" అంటాడు సారధి.

"గ్రహించాను కానీ, 'ఆ నువ్వే'ను సుదీర్ఘం చేసి, బలవత్తరంగా గొప్పదానిగానూ, లోకోత్తరమైనదానిగానూ సృష్టించకండి. మీ నాన్నగారు ఒక వేళ ఈ సంబంధానికి "వీల్లేదు" అంటే, ఇది జరిగేదా?!" అని సూటిగా ప్రశ్నిస్తుంది.

"నేను ఎదిరించలేకపోయేవాడిని... నాలో నేనే కుమిలి పోయేవాడిని" - అని నిజం చెపుతాడు సారధి.

అత్తగారి ఇంట్లో తన బంధు జనం వెళ్ళిపోగానే ఒంటరిగా మిగిలిపోయిన భారతికి "ఏమిటి తన జీవితం ఇక్కడ?" అని సమీక్షించుకునేలోగానే, అత్తగారు తోటకు కొత్త జంటను విడిగా పంపుతారు.

చీకట్లో, వర్షంలో పామును చూసి అతని ముఖంలో ప్రతిబింబించే భయాందోళలను, హావభావాలను భారతి చూడగలిగి ఉంటే, అతని మీద అనురాగ రక్షణ వర్షం కురిపించేదో, అసహ్యించుకుని దూరంగా ఉండేదో ఆమెకే తెలియదు.

"భారతీ! నేను పిరికివాణ్ణి. నీ అండదండలు లేకుండా బ్రతకలేను. ఎప్పుడూ నన్ను కనిపెట్టి ఉండవూ?" అంటాడు సారధి వణికే కంఠంతో.

స్త్రీత్వంలోని బేలతనం ఇక్కడ మనకు సంపూర్ణంగా అర్థమయ్యేట్లు చెపుతారు రచయిత.

ఈ బాధ్యత ఈ బంధుత్వాలు అన్నీ నావే అనుకుని ఏదో ఒక గొప్ప పెద్దరికాన్ని నెత్తిన వేసుకుని, సామాన్యమైన ఆడపిల్ల సంసారంలో ఎదురు ప్రశ్న వేయకుండా బ్రతుకును ఈడ్చుకురావడానికి కారణం ఇదిగో ఈ "వీళ్ళంతా నా మీదే ఆధారపడ్డారు" - అన్న భావనే కారణమేమో, దీనికి భారతి లాంటి వ్యక్తిత్వమున్న ఆడపిల్ల కూడా చాలా కాలం లొంగిపోయి, ఆ బలహీనుడి భ్రాంతిని, ప్రేమగా, ఆరాధనగా తానే రూపు కల్పించుకుని 'అతడిని నేను మర్చిపోలేకపోతున్నాను. విపరీతంగా ప్రేమిస్తున్నాను" అన్న ఒక స్వయంకల్పిత ఊహా వలయంలో తనకు తాను బందీగా మారుతుంది. అతని మీద తను ఎంత హాయిగా ఆధారపడగలదు? అన్న ఆనందం కన్న, అతనికి తను ఎంత అవసరమో తెలుసుకుని కొంచెం దిగ్భ్రమ చెందుతుంది.

కానీ, తోటనుంచి ఇంటికి తిరిగి వచ్చేటప్పటికే, ఆమె జీవితాన్ని విధి అతివక్రంగా శాశిస్తుంది.

"నువ్వు కుష్టు రోగివి కదూ! సొమ్ముకు ఆశపడి తండ్రీ కూతురు మమ్మల్ని వంచించారు కదూ! నీకు ఈ ఇంట్లో స్థానం లేదు" అన్న మామగారి చండశాశనం ఆమె వివాహ పత్రం మీద రక్తపు 'అక్షరాలతో "అశుభం" లిఖిస్తుంది.

తండ్రి ఆమెను నిలబెట్టి నిష్టూరాలు ఆడుతున్నా, అవమాన పరుస్తున్నా నిశ్శబ్దంగా ఊరుకున్న సారధి, భారతి పట్ల సంజాయిషీ చెప్పడానికి వచ్చిన తల్లిని, తండ్రి "ఇన్నాళ్టికి ఎదురు చెప్పేదానివి అయ్యావా?" అని గొడ్డును బాదినట్లు బాదినా మాట్లాడని వ్యక్తి - ఆమె భర్త సారధి.

"వాడిని చూస్తే నీకు అసహ్యంగా లేదూ?" అని అడుగుతారు అత్తగారు ఆశ్చర్యంగా.

"లేదు" అన్న భారతిలో నిజానికి నిజం ఒప్పుకున్నది, తనను విపరీతంగా ఆరాధించాడు భర్త అన్న ఊహాలో ఉన్న ఒక ముగ్ధ.

"నన్ను క్షమించండి అత్తయ్యా!" అని అభ్యర్థిస్తున్న కోడలిని తలనిమిరి, అడుగుతూ ఉంటారు. నిన్ను పరీక్షించే శక్తి నాకు ఉన్నదనుకున్నాను. కానీ, ఆ గిరి నుంచి నువ్వు దాటిపోయావు. కానీ, వెన్నెల లాంటి దానివి.... నీ జీవితం శుభప్రదమౌతుందని ఏ అజ్ఞాన శక్తో చెబుతోంది నాకు..." అని నిట్టూరుస్తారు ఆ జమిందారిణి.

భారతిలోని అంత శక్తిని సాటి ఉన్నతురాలు అయిన రంగాజమ్మగారు గుర్తించగలిగారు.

ఆమెను అత్తవారు పరిత్యజించారని తెలుసుకోగానే, మల్లిక ఆవేశంతో వచ్చి,

"అవును గానీ, ఇంత దారుణం జరుగుతూంటే మెదలకుండా ఊరుకున్నాడా మీ ఆయన? అంత గాజులు తొడిగించుకున్నాడా?" అంటుంది.

కానీ, భారతిలో సౌమ్యమూర్తి సమాధానం వేరు "అంత ఆవేశం పనికి రాదు మల్లికా... దెబ్బలాడి మనం ఏ కోరికైనా తీర్చుకోవచ్చు. వైవాహిక జీవితం తప్ప..." అంటుంది.

తండ్రి దిగులుతో చనిపోయాక మూగ బొమ్మలా, అనుభూతులు హృదయంలోనే అణుచుకుని బ్రతికే పిన్ని రాధమ్మ తోడుగా, భారతి ఒక రకమైన నిర్లిప్త జీవితానికి అలవాటు పడిపోతుంది.

"మీ ఆయనను నువ్వేమీ ప్రేమించి పెళ్ళి చేసుకోలేదు. అయినా, అతణ్ణి మర్చిపోలేనంటున్నావు... అతని పిరికి తనాన్ని క్షమిస్తావు,. మీ ఇద్దరి మధ్య పటిష్ట బంధం, అందమైన అనుభూతులూ లేవు... ఇంతకన్న పరిచయస్థులు ఎందరు లేరు? అయినా... అతడు నీకు ఎందుకు గుర్తున్నాడే?!"

అన్న మల్లిక ప్రశ్నకు,

"వారందరూ నా పెనిమిటి కాలేరుగా..." అన్న భారతి హైందవ సాంప్రదాయానికి, తను పెరిగిన వాతావరణానికి ఎంత లొంగి పోయిందో మనకు అర్థమౌతుంది. ఆమెలో ఉన్న మరొక భారతి సంస్కారవంతురాలు, తెలివిగలది. ఆ భారతి మల్లికతో ఏకీభవించినా, వివాహిత భారతి తనుగా ఆ విషయం ఒప్పుకోలేక పోవడం వల్లే సమస్యా తోరణాలు మరింత జటిలమై, ఆమెను నలుపక్కల నుంచి ఉక్కిరి బిక్కిరి చేస్తాయి.

సారథి, "నన్ను వదకు బారతీ!" అన్న అభ్యర్థనే ఆమె హృదయాన్ని తూట్లు పొడుస్తుంది.

అందుకనే మల్లికతో,

"పిరికి వాళ్ళంతా ఏవగించు కోవలసిన వ్యక్తులు కారు మల్లికా! అందులో కొందరు గుండెలు పిండేస్తారు..." అంటుంది.

"అందుకే అతణ్ణి ప్రేమించి, ఆరాధించి, అంకితమైపోయాను" - అంటుంది మల్లికతో.

భర్త పరిత్యాగ్తం, పైగా కుష్టు వ్యాధి... రాను రాను భారతి ఆత్మ విశ్వాసాన్ని కోల్పోతూ,

ఈ అసహ్యకరమైన వ్యాధితో నేను మగ్గిపోతున్నాను... నశించిపోతున్నాను... వయస్సు ఉండనీ, పోనీ... కానీ నా జీవితంలో చాలా అధ్యాయాలు గడిచి పోతున్నాయి..." అనే నిరాశల నివురులా మాట్లాడుతుంది.

మల్లిక ధైర్యం చెప్పి,

"మనిషి తన ఉనికిని తాను ప్రేమించుకోగలగాలి - ఎప్పటికప్పుడు తన స్థానాన్ని సుస్థిరం చేసుకోగలగాలి. ప్రతికూలంగా ఎన్ని పరిస్థితులు ఉండనీ గాక, మన మనుగడను మనమే నాశనం చేసుకోగూడదు..." అని ధైర్యం చెప్పి వైద్యం చేయించడానికి ప్రయత్నం చేస్తుంది.

ఆమెను మొదట పరీక్షించి, ఏ మాత్రం కరుణ లేకుండా "నువ్వు క్షయరోగివి, నీకు తగ్గదు" అని మరణ శాసనంలా మాట్లాడిన డాక్టర్ గోవిందరావు స్థానానికి, సౌమ్యుడు, సత్వగురు సంపన్నుడు అయిన డాక్టర్ విద్యాసాగర్ రావడం వల్ల భారతి జీవితంలో గొప్ప మార్పు వస్తుంది.

ఒక డాక్టరు పేషెంటు పట్ల ఎటువంటి అవగాహనతో ప్రవర్తించాలో ఉదాత్త మానవత్వం రోగిలో ఎంత మార్పు తేగలదో డాక్టర్ కాబట్టి మరింత అద్భుతంగా చెప్పగలిగారు రచయిత.

"ఆమె డాక్టర్ దగ్గరకు వెళ్ళి తన జీవితపు భాండంలో అమృత బిందువును నింపుకోగానే, విధి ఆమెకుమరొక పరీక్ష పెడుతుంది.

ఆమెను విడాకులియ్యమని, తన బిడ్డకు మరొక వివాహం చేస్తానని చెప్పడానికి వస్తాడు వ్యవహార కర్త అధికార ఉన్మత్తుడు అయిన రావుబహద్దూర్ గంగాధరం.

మౌనంగా ఒప్పుకుంటుంది భారతి.

ఆమె అన్నింటికి తెగించిన దానిలా తయారైపోతుంది. కోర్టులో ఆమె మీద ఎన్నో అబద్ధాల నిందలు, అక్రమ సంబంధాల్ని ఒకటేమిటి? న్యాయాన్ని కొనగలిగిన గంగాధరం ఉచ్చు అన్ని వైపులా తెలవిగా బిగించాడు భారతి చుట్టూ.

కానీ, విచిత్రం తెలివిగల భారతి కావాలంటే వాళ్ళను ముప్పుతిప్పలు పెట్టగలదు. కానీ భారతిలో "సారధి భార్య" పరమ సౌమ్యురాలు, బలహీనురాలు...

అక్కడ కూడా సుకుమారంగా, మౌనంగా ఉండి తను కోరుకున్న భార్య మానాన్ని, గౌరవాన్ని కోర్టులో వాళ్ళలాంటి మాటలతో బాధిస్తున్నా మౌనంగా ఉండి పోయిన సారధి మీద ఆమెకు జాలే కానీ, కోపం రాలేదు.

"వాళ్ళు చెప్పినట్లల్లా ఆడడం ఏమిటసలు?! అయినా, ఇప్పటికైనా నీ భర్త అంటే నీకు ఏహ్యత కలగడం లేదా?" అని విషయం తెలిసిన మల్లిక నిలదీస్తుంది భారతిని.

'అతడు నన్ను వదిలించుకుంటున్నాడు. అల్లాంటి వ్యక్తి మీద నాకు భ్రమ చావడం లేదు... అతణ్ణి ఇంకా ఎందుకు అభిమానిస్తున్నాను? ఎందుకు మర్చిపోలేకుండా ఉన్నాను?!' అని ప్రశ్నించుకుంటుంది భారతి.

భారతికి విడాకులు వచ్చిన రోజున, మూగ పిన్ని విపరీతంగా దుఃఖపడుతూంటే,

"ఎందుకు ఏడుస్తున్నావు పిన్నీ! నీ జీవితం రాలిపోయినప్పుడు మహాగ్ని గుండాన్ని భరించిన దానివి....." అంటుది భారతి.

ఈ పల్లెటూరులో, పెంకుటింట్లో.... అభాగ్యురాళ్ళయినా ఇద్దరు ఆడవాళ్ళు ఏ వ్యవస్థకూ, ఏ సామాజిక చింతనకూ సంబంధం లేకుండా జీవిస్తున్నారు.. రోజులు... నెలలూ...సంవత్సరాలూ గడిచి పోతున్నాయి... చిత్రం "నా కింకా పిచ్చి ఎక్కదే" అనుకుంటుంది భారతి.

నాగరాజు ఆమె చేత అసహ్యించుకోబడ్డా, ఆమెను గౌరవించే వ్యక్తి... ఆమె చెప్పిందని త్రాగుడు మానేసి, మనిషి ఉన్నతుడుగా మారతాడు.

"భారతీ, నీ జీవితాన్ని కొత్త రూపం దిద్దుకోవలసిన బాధ్యత నీకున్నది... ఒకప్పుడు నిన్ను చూస్తే అడవిలో ఛంగున గెంతులేసే లేడి పిల్ల గుర్తు వచ్చేది... నేను నీ అన్నను ఏ కోర్సు కావాలన్నా చదువు... నేను ఖర్చు భరిస్తాను" అంటాడు.

"కొత్త జీవితానికి ఈ కఠిన నియమం ఎందుకు? జీవితంలో ఒక అధ్యాయం ముగిసినంత మాత్రాన దాని ప్రభావం తరువాత అధ్యాయం మీద ఉండదా?... నేను మానసికంగా అతని భార్యనే... కానీ నేను మళ్ళీ చదువుకుంటాను" అంటుంది భారతి.

అలా ఆరోగ్యం గురించిన జాగ్రత్తలు, చదువు భారతి జీవితాన్ని మరింత ప్రభావితం చేస్తాయి. సహృదయుడైన డాక్టర్ విద్యాసాగర్ ఆమెకు మనుష్యుల మీద, జీవితం మీద విపరీతమైన నమ్మకం కలుగజేస్తాడు.

పూర్తిగా ఆరోగ్యవంతురాలైన భారతి, "డాక్టర్! ఇంక నేను... అందరితో కలసి తిరగచ్చు కదండీ..." అని అడిగినప్పుడు,

విద్యాసాగర్‌లోని మనిషి ఉలిక్కిపడతాడు. "మీతో కలిసి తిరగడానికి ఇతరులు ఆరాటపడాలి. ఆ దశనుంచి ఎప్పుడో దాటిపోయారు..." అంటాడు.

భారతి, నర్సింగు కోర్సులో చేరింది. పూర్తి చేసింది. నాగరాజు, మల్లిక, మల్లిక తండ్రి మున్సబుగారు, మూగ పిన్ని వీరందరి శుభాకాంక్షలు ఆమె జీవితానికి ఒక కొత్త మలుపు కల్పించాయి.

కదిరిలో కుష్టురోగుల హాస్పటల్‌లో కావాలనే పోస్టింగ్ వేయించుకున్నది భారతి... అక్కడ డాక్టరుగా పని చేస్తున్న గోవిందరావును చూసి ఆశ్చర్యపోతుంది. అతనే తనకు తీరని వ్యాధి కుష్టు అని మరణశాశనం లాంటి తీర్పు చెప్పిన వ్యక్తి అతడిలో నైత్యం మరింత అర్థమౌతుంది ఆమెకు. అతనే తన మామగారికి తన కుష్టు రోగం గురించి చెప్పి తన సంసారాన్ని పండంటి జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తి అని అర్థమౌతుంది. కదరిలో పేషెంట్ల పట్ల క్రూరత్వంతో ఫండ్సు దుర్వినియోగం చెయ్యడంలోనూ అతను మహా ఘనుడని అర్థమౌతుంది: ఏం చెయ్యలేని నిస్సహాయస్థితిలో భారతి తనకు తోచిన సేవ రోగులకు చేస్తూ ఉంటుంది.

ఒంటరిగా ఉన్న భారతిని బలవంత పెట్టబోయి, చీకట్లో జారిపడి, ఇనపమేకు గుచ్చుకుని, సంధి పుట్టి, నానాయాతనా పడి చచ్చిపోతాడు గోవిందరావు.

అక్కడికి మరొక డాక్టరు పోస్టింగ్ జరుగుతుంది. అతను విద్యాసాగర్...

ఒకేరకమైన ఆదర్శాలతో, ఔన్నత్యంతో, రోగుల పట్ల సానుభూతితో ఏకోన్ముఖంగా పయనించే భారతి, విద్యాసాగర్ ఆ కుష్టురోగుల పట్ల సానుభూతితో ఏకోన్ముఖంగా పయనించే భారతి, విద్యాసాగర్ ఆ కుష్టురోగుల ఆశ్రమానికి ఎనలేని సేవ చేస్తారు. బోలెడన్ని వసతులు ఏర్పరుస్తారు.

పాల్‌బ్రాండ్ అనే ఆయన జీవిత చరిత చెబుతూ కుష్టురోగుల సేవలో ఆయన చేసిన ఎనలేని కృషి గురించి చెబుతాడు విద్యాసాగర్. అతను తన గురువు, ఇన్స్‌ఫిరేషన్ అని చెపుతాడు.

ఒక మంచి స్నేహితుడిగా విద్యాసాగర్ భారతికి దగ్గరవుతున్నా, సన్నిహితుడిగా మారలేక పోవడానికి కారణం భారతిలో జీవితం పట్ల వైముఖ్యం.

ఏకాంతంలో కూర్చున్న విద్యాసాగర్‌ను భారతి హఠాత్తుగా కలుసుకోవడం, అతడు ఆమెపట్ల తనకున్న ఆరాధనా ప్రేమా వ్యక్తం చెయ్యడం హృద్యమంగా తెలియ చెప్పారు రచయిత.

కానీ భారతి ఏం సమాధానం చెపుతుంది?! విడాకులు తీసుకున్నా, తను వివాహితురాలినే, సారథి భార్యనే అన్న భావన మారదు ఆమెలో.

అప్పుడే ఆమె జీవితంలో విచిత్రమైన మలుపు వస్తుంది.

సారథి రెండవ భార్య శమంత, సారథి మనస్సులో భారతి జ్ఞాపకాలు కనిపెట్టి, తనుగా వచ్చి, భారతిని అభ్యర్ధించి, ఆమెను మొదటి భార్యగా ఆ ఇంటికి రమ్మని వేడుకుంటుంది. మామగారు అత్తగారు చనిపోయారు. ఆ ముగ్ధబాలిక అభ్యర్ధనను మన్నించి విద్యాసాగర్ దగ్గిర శలవు తీసుకుని వెళ్ళేటప్పుడు మల్లిక డాక్టరుగా ప్రాక్టీసు పెట్టిన చోట ఆగి, ఆమెకు విషయం చెపుతుంది. మల్లికకు భారతి ఎప్పుడూ ఒక పజిలే... తన స్నేహితురాలి వివాహం అయ్యేదాకా, తమ వివాహం చేసుకోకూడదని మానసికంగా ప్రమాణం తీసుకున్న గొప్ప స్నేహితురాలు మల్లిక.

కానీ భారతి సారథి ఇంటిలో అడుగు పెట్టిన ఇరవై నాలుగు గంటల లోపల ఇంత కాలం ఆమె హృదయంలో తెరమరుగున తనను జడిపించి, భయపెట్టి భ్రమ పెట్టిన ఒక అబద్ధం ఆమెకు సంపూర్ణంగా అర్ధమౌతుంది.

అది తను సారథిని ఏ మాత్రం ప్రేమించడం లేదని, భ్రమ లాంటి ఊహకు ప్రాణ ప్రతిష్ట చేసుకుని, దానికి సారథి అని పేరు పెట్టి బ్రతికిందని అర్థం చేసుకుంటుంది. ఈ విషయం ఎందరు ఎన్ని విధాల ఆమెకు చెబుదామనుకున్నా ఆమెకు అప్పట్లో అర్థం కాలేదు. విడాకులు వచ్చినా మంగళ సూత్రాలు జాకెట్టులో దాచుకున్న పిచ్చి పిల్ల ఆమె అప్పటిదాకా.

ఆమె కోరుకున్నది అతణ్ణి కాదు అన్న నగ్న సత్యం అతని సాన్నిధ్యం వల్ల మరింత ప్రస్ఫుటమై, ఆమె, శమంత పుట్టినింటి నుంచి రాగానే ఆమె భర్తకు ఆమెకు అప్ప చెప్పానని ఉత్తరం రాసి అక్కడి నుంచి నిష్క్రమిస్తుంది.

ఇక్కడ రచయిత, భారతి ఎంత ప్రలోభాలకు గురి అవని వ్యక్తో మనకు స్పష్టం చేస్తారు. పెద్ద ఇల్లు, బోలెడు ఆస్థి, జమిందారీ ఫాయిదా జీవితం, తన పేరు కలవరించే భర్త - కానీ ఇవన్నీ ఎంత అసంపూర్తి కలిగించే విషయాలో ఆమెకు అర్థమౌతుంది.

జీవిత భ్రమలు వేరు... ఆదర్శాలు, వాటి అర్థాలు వేరు.

భర్తను వదిలి వస్తూ,

"మనిషి శారీరకంగా కానీ, మానసికంగా కానీ ఎల్లకాలం రోగిగా బ్రతకడం వాంఛనీయం కాదు; ఈ రెండు బాధలూ అనుభవించిన నాకు అందులోని నరకం తెలుసు. ఆ రెండింటి నుంచీ విముక్తురాలినయ్యానిప్పుడు. మిమ్మల్ని కూడా విముక్తి పొందమని కోరుతున్నాను" అని ఉద్బోధ చేసి వస్తుంది.

అక్కడి నుంచి వచ్చి మైలవరంలో మల్లిక దగ్గర కొన్నాళ్ళు ఉంటుంది భారతి. ఆమె ఆలోచనలో ఇప్పుడు తొందరలేదు. వేగం ఉన్నా నిర్ణయంలో ధ్రుఢత్వం వచ్చింది.

డాక్టర్ విద్యాసాగర్ ప్రతి క్షణం గుర్తుకు వస్తున్నాడామెకు.

"ఇలా ఎందుకు జరగకూడదూ" అని ప్రారంభించి మల్లికతో,

"మల్లికా! నువ్వు ఎప్పటికీ అలాగే ఉన్నావు. నేను అనేక రూపాలు ధరిస్తున్నాను... ఈ అన్వేషణ అంతా బహుశ ఈ చివరి మలుపు గురించేనేమో," అని ఆదర్శాలు ఒకటైన డాక్టరు విద్యాసాగర్‌తో జీవితాన్ని పంచుకోవాలనుందని ఒప్పుకుంటుంది.

కానీ భారతి జీవిత కథలో మరొక విచిత్రమైన మార్పు ఎదురు చూస్తోంది.

ఆమె లేని కదరిలో ఉండలేని విద్యాసాగర్ రిజైన్ చేస్తాడు. అతి కష్టం మీద అతని అడ్రస్ తెలుసుకుని వెళుతుంది భారతి.

చీకట్లో ఉన్న అతను వెలుతురులో తన్ను చూడ వద్దంటాడు. కారణం అతనికి కుష్టురోగం సోకి వేళ్ళు తినేశాయి.

దుఃఖపడదు భారతి. అతణ్ణి వద్దనుకోదు. మనిషి ప్రేమించేది వ్యక్తిత్వాన్ని కానీ, నామరూపాలనే భ్రాంతులను కాదని ఆమెకు అర్థమైంది అప్పటికే...

"నేనెవరికోసం బాగు పడాలి?" అన్న అతని ప్రశ్నకు

"నా కోసం" అన్న ఆమె ముఖంలో ఆత్మవిశ్వాసానికి, ఈ సమానమైన ప్రేమకు అదిరిపోతాడు విద్యాసాగర్.

అతను అడగని ప్రశ్నలకు ఆమె తానుగా సంజాయిషీ లాంటి సమాధానం చెపుతుంది.

"నేను ఒంటరిదాన్ని అయినా ఆనాడు ఏదో గర్వంతో మత్తులో, ప్రలోభంలో మిమ్మల్ని తిరస్కరించాను. ఆ తరువాత సంఘటనలు నా అజ్ఞాన్నానుంచి నన్ను రక్షించి నా కళ్ళు తెరిపించాయి. అప్పుడు తెలిసింది నేను ఎవరిదాన్నో..." అని దృఢంగా చెపుతుంది.

అతడిని దగ్గరకు తీసుకుని, డాక్టర్ పాల్ బ్రాండ్ దగ్గరకు తీసుకు వెళుతుంది భారతి. తప్పక నయమౌతుందని అభయమిస్తాడు మహాభానువుడైన ఆ విద్యశిఖామణి.

భారతి జీవితంలో నిజమైన ఉషోదయం అది. భారతిని మనం ఈ నవల చదివిన చాలా రోజులు దాకా మర్చిపోలేము.

స్త్రీల మీద, స్త్రీ వ్యక్తిత్వం మీద, ఆమె ఆత్మగౌరవం మీద, అభివృద్ధి మీద, ఆమె బలహీనతల మీద, ప్రలోభాలను ఎదిరించ గలిగిన విలువల మీద నమ్మకము, గౌరవము కలిగించే పాత్రలను సృష్టించిన రచయిత కొమ్మూరి వేణుగోపాలరావుగారు.

***

## శ్రీమతి ద్వివేదుల విశాలాక్షిగారి గోమతిలో

### గోమతి

**అతి సున్నితంగా నెమ్మదిగా,** నిలకడగా పరిశీలిస్తూ ఆలోచిస్తూ, బాధను చూచి స్పందిస్తూనే, బాధలకు కారణమైన పరిస్థితులను అర్థం చేసుకుంటూ, తను ఇవ్వబోయే తీర్పునుకానీ, పరిష్కారం కానీ, పాఠకుల మీద ఏ ముద్ర వేస్తుందో అని జాగ్రత్త పడుతూ రచనలో "సాంఘిక బాధ్యత"ను గుర్తించే రచయితలలో ద్వివేదుల విశాలాక్షిగారు ఒకరు.

వీరు సృష్టించిన "గోమతి" ఒక సజీవ మూర్తి. ఆమెలో విశిష్టతను, ఔన్నత్యాన్ని వెతుక్కునే ముందు, ఆమెలోని మానసిక వేదనను, దుఃఖాన్ని, సాంఘిక మర్యాదల రంపపు కోతకు బలైపోయిన ఆ పిల్ల దుఃఖాన్ని మనకు అర్థమయ్యేట్లు చెపుతారు విశాలాక్షిగారు.

బంగారు బొమ్మలాంటి గోమతి పసి బిడ్డగానే జనముద్దు బిడ్డ. తల్లితండ్రుల గారాబంతో ముద్దుగా పెరిగిన ఆమెలో తానొక ప్రత్యేకమైన, అందమైన అమ్మాయిని అన్న భావం నాటుకుపోతుంది. బలహీనంగా, ప్రతివిషయానికీ తనమీద ఆధారపడిపోయే ఎదురింటి రంగమ్మగారి అబ్బాయి గోవిందు ఆమెకు తెలియని అహం తృప్తినిస్తాడు. తను శాశించిందే వేదం అతడి దృష్టిలో. తల్లి తండ్రి చనిపోయిన మేనత్త కొడుకు గోపాలం ఆ ఇంట్లో ఆశ్రయానికి అడుగు పెట్టగానే, శైశవపు ఉత్సాహంతో అతడికి ప్రాముఖ్యత ఇస్తుంది గోమతి. అది భరించలేడు గోవిందు. తన కోసం దెబ్బలు తిన్న గోమతికి కందిన ఆమె అరచేతులు చూస్తూ మూడు పిప్పర్‌మెంట్లు ఇస్తాడు గోవిందు.

"దెబ్బల నెప్పి పిప్పర్‌మెంట్లతో పోదుగా" అనేటంత తెలివిగలది పదేళ్ళ గోమతి. కానీ అంతకన్న ఆమె బాధకు మరేరకమైన ఉపశమనం చెయ్యాలో తెలియదు గోవిందుకు, తెలుసుకోవాలని అనుకోడుకూడా. తెలిసిందల్లా ఒకటే గోమతికి ఎట్టిపరిస్థితుల్లోనైనా తను అండగా వుండాలి అంతే.

గోపాలం తెలివికలవాడు. అతడికి స్నేహం చెయ్యడమే కాదు, దాన్ని గౌరవించుకోవడం, ఆదరించడం కూడా వచ్చు. ధూళిలో పడ్డ కొమ్మ సంతృప్తిపరచడానికి కొమ్మ ఎక్కిపూవులు కోసి, కాలుకు దెబ్బ తగిలించుకున్నా, "ఇదుగో గోమతీ! ఇవి మట్టిలో ఏరినవి కావు" అంటాడు.

గోమతికి తనపై జాలి, గోపాలం మీద ఇష్టమూ పెరుగుతూండటం గమనిస్తాడు గోవిందు. అంతే కాదు అతడు మేనత్త కొడుకుగా ఆమెకు మరింత దగ్గరవాడు. హక్కులున్న ఆప్యాయత అతనిది. వారి దగ్గరతనాన్ని దూరం చెయ్యాలి అనుకునే గోవిందుకు యవ్వనం, అదిచ్చే కోరికల కామాటం ఎలానైనా తనుకోరుకున్నది పొందాలన్న తపన - వీటి నుంచీ పుట్టిన తెలివి తేటలతో గజిబిజి అవుతాడు.

గోమతి పుట్టినరోజునాడు, గోమతిని మేడమీద ఒంటరిగా కలుసుకున్న గోవిందు, మెట్ల మీద గోపాలం అడుగుల సవ్వడి విని, అతను చూస్తాడని తెలిసే, చటుక్కున ఆమెను దగ్గరకు తీసి ముద్దు పెట్టుకుని, హృదయానికి హత్తుకుంటాడు. బిత్తరపోతుంది గోమతి. దాన్ని గురించి పట్టించుకోదు. కానీ ఆమె జీవితంలోని శాశ్వతమైన దుఃఖానికి ఆనాడే నాంది పడింది.

తనను ఆప్యాయతతో ఆదరించే ఆ స్నేహవల్లరి తనకి మరేదీ కాదని, గోవిందుకు మాత్రం 'ప్రేమవల్లరి' అయివుండాలని ఊహించుకుని, కుమిలి పోతూనే గాంభీర్యం నటిస్తూ, మెల్లిగా ఆమెకు దూరంగా ఉండటం ప్రారంభిస్తాడు గోపాలం. కానీ గోమతి అతని మీద విపరీతమైన ఆప్యాయత, ప్రేమ పెంచుకున్నది. కానీ అది ప్రేమగా వ్యక్తం చెయ్యడం, నోరు తెరిచి చెప్పడం - దాని అవసరం ఆమెకు అర్థంకావు. గోమతిలో మేధస్సుకన్న ఆలోచనలు బలహీనతలు ఎక్కువ. తనవైపు ఆలోచించుకుని నిర్ణయాలు సరైనవే అనుకుంటుంది. కానీ పరిస్థితికి మరొకవైపు నుంచీ కానీ, తనలాగే భావావేశము, ఆశలు, ఆలోచనలు ఉండే మరొక మనిషి వైపు నుంచీ కానీ ఆలోచించదు.

ఇందువల్లే ఆమెకు గోపాలంలో ప్రేమికుడు వ్యక్తంకాడు. ఆమె గోవిందును కోరుకుంటుందన్న నమ్మకంతో ఆమెకు దూరమై, గోవిందుకు దగ్గర చేస్తున్నానన్న టీనేజ్ భావకుడి ప్రేమ భ్రాంతిలో అతను ప్రవర్తిస్తుంటే, అతని భావ పరంపరలు ఆమెకు కొంచెం కూడా అనువాదం కావు. పైగా గోపాలం ఉన్నప్పుడు గోవిందుకు దగ్గరైనట్లు తన చెయ్యి పట్టుకుని అసలు విడిచిపెట్టకుండా కనిపించడం - గోపాలం మీద వీటి పరిణామాలు ఆమెకు అస్సలు అర్థంకావు.

తనను పట్నంలో ఆదరించిన ఆఫీసరుగారి కూతుర్ని వివాహం చేసుకుంటున్నానని మేనత్త, మేనమామ ఆశల్లో నిప్పులు పోసి అతను దూరంగా వెళ్ళిపోవాలనుకున్నప్పుడు కోపం పట్టలేక, అతణ్ణి అంత కృతఘ్నుడుగా నీచుడుగా భరించలేక అతని తల మీద మజ్జిగ పోస్తుంది గోమతి తల్లి.

అతని స్నానానికి అన్నీ అమరుస్తున్న గోమతితో, "ఇంత జరిగాక కూడా ఇంకా నన్ను ఇంత ఆదరంగా ఎలా చూడగలుగుతున్నావు గోమతీ?" అన్న అతని కంఠంలో ప్రేమభిక్షకై అర్థింపు ఆ తెలివి తక్కువ మంచి పిల్లకు అర్థం కాదు.

"ఈబాంధవ్యాలకి, అనుబంధాలకు మించి మన మధ్య ఇంకొకటి ఉంది బావా! అది చిన్న నాటి చెలిమి. ఎన్ని అనుభవాలను ఆనందాలను కలిసి పంచుకున్నాం బావా?! ఈనాడు ఏదో మార్పు జరిగిందని వాటిని ఎలా మర్చిపోతాం?!" అంటుంది. కనీసం, అప్పుడైనా "నువ్వంటే నాకు ప్రాణం బావా! నిన్ను ప్రేమిస్తున్నాను" అని ఆమె తన మనస్సులోని మాట చెప్పి ఉంటే, గోపాలం, గోవిందు, గోమతి ముగ్గురి జీవితాలూ మరొక రకంగా పరిణమించి ఉండేవి.

గోవిందుకు, గోమతికి పెళ్ళి అవుతుంది. పెళ్ళి తర్వాత కానీ గోవిందు చదువుపట్ల అశ్రద్ధ, అతణ్ణి చిన్న ఉద్యోగిని తప్పు చెయ్యదని, అతని ఎమోషనల్ డిపెండన్సీ మొదట్లో సరదాగా, సరసంగా ఉన్నా కాలం తెచ్చే కష్టాలు ఎక్కువైనప్పుడు భరించడం అంత సులభం కాదని ఆమెకు అర్థమయ్యే సంఘటనలు ప్రాప్తిస్తాయి.

గోవిందు చేసే చిన్న ఉద్యోగం, ఆర్థికంగా ఎట్లాగో అత్తగారు, తను సరిపెట్టుకు రావడంతో కష్టాలు అగవు. గోవిందు పుట్టిన రోజునాడు అతడికి యాక్సిడెంటు అయి అవిటి వాడై నిరుద్యోగిగా మారతాడు. అతడి ఆస్థి గోమతి మీద పిచ్చి ప్రేమ అంతే. గోమతి చేసే చిన్న ఉద్యోగం కూడా పోతుంది. నిరుద్యోగంతో, అప్పుల బాధలతో ఆకలితో కనీసం ఆయాపనిక్కూడా సిద్ధపడ్డ గోమతికి స్నేహితులు ఎవరో మంచి ఉద్యోగం రికమెండ్ చేస్తారు. ఇంటర్వ్యూకు వెళ్ళిన గోమతి తిరిగి వచ్చేస్తుంది. అత్తగారికి, భర్తకు ఆమె అభిమానం అర్థం కాదు. ఆ ఆఫీసులో బాస్ గోపాలం. ఆమెకు కచ్చ, దుఃఖం వస్తాయి. కానీ, గోపాలం స్వయంగా ఇంటికి వచ్చి ఆమెకు మరొక మంచి ఉద్యోగం ఇప్పిస్తాడు.

"నాకింద నువ్వు పనిచెయ్యడం నేను భరించలేను గోమతీ!" అంటాడు ఆప్యాయంగా.

గోపాలం రాకపోకలు ఆమె ముభావాన్ని చెదరగొడతాయి. అతను, అతని హోదా, ఆమెను ఆలోచింప చేస్తుంది.

గోమతి మామూలు మధ్య తరగతి అమ్మాయి. మంచిగా ఉండాలన్న ప్రయత్నం వేరు. పట్టుదల వేరు. కేవలం ప్రయత్నం ఆశల జిలుగుల మధ్య పేలవమైపోతుంది. గొప్ప నగల షాపుల ముందు ఖరీదైన వస్తువుల ముందు ఆశగా చూసే తత్వం ఆమెది.

ఆమె ఏనాడూ చూడని వైభవం, ఐశ్వర్యం గోపాలం ఇంట్లో చూస్తుంది. బస్సు స్ట్రైక్ అయితే అతను పంపే కారు ఆమె హోదా పెంచుతుంది. ఆమెకు గోవిందు మీద ఆప్యాయత తగ్గదు కానీ, గోపాలం మీద ఆరాధన పెరుగుతుంది. గోపాలం తన పెయింటింగ్ వేస్తున్నాడని అతని స్నేహితుడి ద్వారా విని పులకించిపోతుంది. బాధపడుతుంది. మరి తనను ఎందుకు పెళ్ళి చేసుకోలేదో ఆమెకు అర్థంకాదు. ఒకనాడు గోపాలం ఆమెకు - గోవిందును ఆమె ప్రేమిస్తున్నదన్న భ్రమలో తను దూరం కావలసి వచ్చిందని, తన బాస్ కూతురు ఎవరూ లేరని, ఆమెను మర్చిపోవాలన్న భ్రమలో ఫారిన్ నుంచీ వచ్చిన తరువాత ఒక అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని, కానీ, ఆమె, అతను మరొక వ్యక్తిని మనస్సులో దేవతలా పూజిస్తూ, తనను ప్రపంచం కోసం భార్యగా గుర్తిస్తున్నాడన్న విషయం గ్రహించి, విడాకులిచ్చి, మరో వ్యక్తిని పెళ్ళి చేసుకున్నదని, ఆమెకో పాపని, తామిద్దరూ ఇప్పుడు మంచి స్నేహితులనీ చెపుతాడు.

తన జీవనపథంలో నడపడమేకానీ మలుపులు, వాటి కారణాలు, అర్థాలు తెలియని గోమతి నిర్ఘాంతపోతుంది. అతని మాటల్లో ధ్వనించే ప్రేమాభిమానాలకు, ఆరాధనకు ఒణికిపోతుంది. పులకించిపోతుంది. ఆలోచించడం ప్రారంభిస్తుంది.

ఏ సుఖము ఇవ్వలేని అవిటివాడు, తనమీద ఆధారపడ్డవాడు అయిన భర్త కొడుకు క్షేమం కోరే అత్తగారు, ఎదుగూ బొదుగూ లేని సంసారం ఒక పక్కన భోగభాగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రేమాభిమానాలతో తన జీవితాన్ని బంగారు పళ్ళెరంలో పెట్టి ఆమె పాదాల దగ్గర సమర్పించే గోపాలం మరొక పక్కన.

గోమతిలో ఆవేదన, ఆవేశం, దుఃఖం, తెగింపు ఎక్కువౌతాయి. గోపాలంతో ఎక్కువ కాలం గడపడం, ఇంటికి రాగానే భర్త, అత్తగారు నిలదీసే మౌన బాణాల్లాంటి చూపుల్ని తట్టుకోలేక గిలగిలలాడిపోవడం, వెంటనే గోపాలంతో గడిపే ఆ కొన్ని గంటల కాలం ఇచ్చే నవచైతన్యం గుర్తుకు రావడం, వీటి అన్నింటి మధ్య డోలాయమానంగా ఉంటుంది ఆమె స్థితి.

"ఇలా ఎంతోకాలం సాగలేము. నిన్ను చూస్తూ, నువ్వు నాకేమీ కావని ప్రతి క్షణం విధి హెచ్చరిస్తూంటే, స్నేహితుడిని అన్యాయం చేస్తున్నానేమో నన్న భయంతో బ్రతకడం కష్టం. అతణ్ణి ఈ రకంగా ఇబ్బందుల్లో పెట్టి బ్రతకడం కన్నా, హాయిగా డైవర్స్ ఇచ్చి, మనం వివాహం చేసుకుందాం. అతడికి కావలసిన ఆర్థిక సహాయం చేద్దాం. నువ్వు లేకుండా బ్రతకలేని నాకు మరొక మార్గం జీవితం నుంచీ

పారిపోవడమే" అంటాడు గోపాలం. కానీ, తన చుట్టూ పరుచుకున్న సాంఘిక జీవనపు వలలను అంత సులభంగా పట్టువదిలించలేమని తెలిసేట్టు గోమతిని నిలదీస్తుంది రంగమ్మ.

"చిన్ననాటి నుంచీ గోవిందును నీ నీడలో పెంచావు. నీ మాట మీద వాడిని నడిపించావు. ఈనాడు నీమాట వాడు వినడంలేదని, ఆరోగ్యం నిర్లక్ష్యం చేస్తున్నాడనీ అంటున్నావు. అదేనిజమైతే ఇలా ఎందుకు జరిగిందో ఒక్కసారైనా ఆలోచించావా? గోమతీ? పరిస్థితి మాములుగా అయ్యేందుకు ఏ మాత్రం అయినా ప్రయత్నించావా? నువ్వు అందుబాటులో లేని ఏవో ఆనందాలకోసం పరుగులు తీస్తుంటే, వాడు నీచేయి తప్పించుకుని దూరంగా తరలిపోతుంటే, అది మీ దాంపత్య జీవితానికి శుభపరిణామం కాదమ్మా నిజమే. బయట ప్రపంచంలో ఎన్నో అందమైన జీవితాలు. కానీ అవి నీవి కావు, అటువంటి బ్రతుకు నీకై ఆ పరాత్పరుడు నిర్ణయించలేదు. నీది కాని దానిపై వ్యామోహం పెంచుకుని, నీది అయిన జీవితానికి, నీవారు అనుకున్న మనుష్యులకు దూరం అవుతున్నావు. మగడు, సంసారం గల గృహిణివి, పరువు మర్యాదగల కుటుంబంలో పుట్టి పెరిగిన పిల్లవి. అవిటివాడైనా, అర్జన లేని వాడైనా వాడు నీ భర్త, ఆ మూడు ముళ్ళు పడిన నాడే వాడితో నీ జీవితం ముడిపడిపోయింది. ఆవేశంతో ఏదో అనుకున్నంత మాత్రాన తెగే బంధాలు కావు. వాటిని వదిలించుకుని నడిచినా, ఆ బాట గుర్తులు జీవితం పొడుగునా తారసపడుతూనే ఉంటాయి." అని హితబోధ చేస్తుంది. ఆ మాటల్లో వగరున్నా అవి హితవచనాలే. ఎలా కాదనగలదు గోమతి?!

మరి గోపాలానికి డైవోర్సు ఇచ్చి, వేరొకరితో కాపురం చేస్తూ, బిడ్డాపాపల్తో ముచ్చటగా జీవితం గడుపుతూ గోపాలం కనబడ్డప్పుడు హాయిగా స్నేహితులుగా ఉంటూ, అతని ఇంటికి ప్రతి ఫంక్షనుకూ కుటుంబంతో సహా వస్తూ ఉండే అరుణ హాయిగా లేదా?! ఆమెకు ఈ నీతులు, బంధాలు ఉండవా?! కారణం గోమతికి అందదు... అక్షరాల మడతల్లో అతి సున్నితంగా ఈ ప్రశ్న మడిచి అలోచించండి. అని పాఠకులకు వాయనమిచ్చారు విశాలాక్షిగారు.

మరి దీనికి కారణం ఏమిటి?! పాఠకులం తప్పకుండా ఆలోచిస్తాం!!! ఆర్థిక స్వతంత్ర్యం, సాంఘిక చైతన్యం, హృదయ వైశాల్యం కల భర్త గోపాలం, సాంసారిక జీవనపు బంధం, పీటముడిగామారి, బాధ పెడుతున్నప్పుడు వదిలించుకోగల వివేకం, ఆతరువాత స్థిరంగా, తనదైన జీవితాన్ని ఏర్పరచుకోగల శక్తి వ్యక్తిత్వం, ఆమెను కించపరచని సొసైటీ - ఇవన్నీ గోపాలం మాజీ భార్య హాయిగా ఉండటానికి కొన్ని కారణాలు మాత్రమే. కానీ గోమతి ప్రపంచం. ఆలోచనలు, సాంఘిక పరిధి చాలా చాలా చిన్నవి. ఆమె, ఆమెగా ఎదిగే అవకాశాలు తక్కువ. బాధ, దుఃఖం ఆమెను ఆ మాత్రమన్నా ఆలోచింపచేశాయికానీ, పరిష్కారం ఏమిటో అర్థంకాదు. అందుకే ఆమెలో ఒక దశలో కచ్చ బయటపడుతుంది. నిర్లక్ష్యం వ్యక్తమౌతుంది.

ప్రాపంచిక కోరికలపై తట్టుకోలేని ఆకర్షణలో పడిన దీపపు పురుగుతో ఆమెను భర్తపోల్చినప్పుడు, "చావు తప్పదని తెల్సినా, తెలియకపోయినా పాపం ఎన్ని రెక్కలు రాల్చుకున్నది? ఎన్నిసార్లు బల్బు తగిలి ఒళ్ళు కాల్చుకుంటున్నది? అయినా అది తప్పుకుపోలేదు. ఇన్ని బాధలకు లెఖ్ఖ చెయ్యకుండా అలా ప్రదక్షణలు చేస్తున్నదంటే, ఆ ఆకర్షణలో ఎంతో బలం ఉండి ఉండాలి. గోవిందూ! ఆ నాశనంలో కూడా అది ఏదో విధమైన తృప్తిని పొందుతున్నదేమో..." అంటుంది విచారంగా. ఈ మానసిక సంఘర్షణ, ఆమె చుట్టూ ఉండేవారి విమర్శల నుంచీ గోపాలం, గోవిందుకు డైవోర్సు ఇచ్చి పెళ్ళిచేసుకోవడమొక్కటే దారిగా చెప్పినప్పుడు, ఇంక ఆ ఆకర్షణను తట్టుకోలేక ఇంట్లో ఒత్తిడిని భరించలేక ఒప్పుకుంటుంది గోమతి.

రిజిస్ట్రారు ఆఫీసు సంతకాల దాకా ఆమె మనస్సు డోలాయమానంగానే ఉంటుంది.

కానీ దురదృష్టం ఆ పిచ్చి తల్లిని వదిలి పెట్టదు, "భార్యాభర్తలు ఒకరిపట్ల ఒకరు ద్వేషాసూయల్ని పెంచుకుంటూ, కొట్టుకుంటూ, జీవితపర్యంతం ఒక ఇంటిలో నివసించినంత మాత్రన వైవాహిక జీవితం సఫలమయిందని భావించడం లేదు. అటువంటి సంసార జీవితం

అసలు వివాహంలోని ముఖ్యోద్దేశానికే అపవాదం వంటిది" అని లాయర్ జానకిరాం విడాకుల అవసరాన్ని చెపుతూంటే, వింటూ ఆ రోజు తారీఖు గమనించి ఒణికిపోతుంది గోమతి.

జూన్ పదవతారీఖు.

గోవిందుతో ఆమె జీవితం పవిత్ర వేదమంత్రాలతో ముడిబడింది ఆరోజే.. మరి ఏమైంది?! చలించిపోతుంది ఆ పిచ్చిపిల్ల. ఆమె కళ్ళముందే ఆమె కొత్త పెళ్ళిపందిరి కూలిపోయినట్టైంది. రిజిష్ట్రారు దగ్గర సంతకం పెట్టాల్సిన పెన్నును అక్కడే విసిరేసి, గోపాలం ఎంత బ్రతిమిలాడుతున్నా నిలబడకుండా హిస్టీరికల్‌గా ఇంటికి పారిపోతుంది.

కానీ అక్కడ ఆమెకు ఎదురైంది ఏమిటి?! గోవిందు ఆమె జీవితం నుంచీ వేరే ఊరు వెళ్ళిపోతూ రాసిన ఉత్తరం. ఆమె గోపాలానికి దగ్గరైపోతుందేమోనని తను పడ్డ తపన, దూరం చెయ్యడానికి తన ప్రయత్నం, గోమతి మీద ఆధారపడ్డ తన జీవితం - ఇవన్నీ చెప్పుతూ, ఆమె మీద తన మక్కువ, ప్రేమ ఆమెకు స్వేచ్ఛనిప్పిస్తున్నాయి, అంటూ రాస్తాడు గోవిందు.

అతడు రైలు స్టేషన్‌కు వెళ్ళాడని విని పరుగులు తీస్తుంది గోమతి. తననుంచీ, అతణ్ణి శాశ్వతంగా లాక్కెళ్ళిపోతున్న రైలులోకి బలవంతంగా ఎక్కాలన్న ప్రయత్నం చేస్తుంది.

రైలు ఉన్నట్లుండి ఆగితే కారణం తెలుసుకుంటాడు గోవిందు.

ఎవరో ఆడమనిషి రైలు కింద పడి చచ్చిపోయింది. కదులుతున్న రైల్లో ఎక్కబోతూంటే కాలుజారింది... కాదు... కావాలనే ఆత్మహత్య చేసుకుంది... పాపం చిన్న వయస్సు అందంగా ఉన్నది. ఏ తీరని కోర్కెలు, భరింపరాని బాధలు ఆమెను ఈ పనికి పురికొల్పాయో?!

ఇలా రకరకాలుగా చెప్తారు తోటి ప్రయాణికులు. గోవిందు మనస్సు ఎందుకో తేలిక పడుతుంది. తను గోమతికి స్వేచ్ఛనిచ్చి చాలా మంచి పనిచేశాడు. ఆమెకు ఈగతి ఏనాడూ పట్టదు. హాయిగా జీవిస్తుంది... అనుకుంటూ గమ్యస్థానానికి పయనమౌతాడు. గోమతి సుఖాన్ని మనసారా కాంక్షిస్తాడు. కానీ రైలు కిందపడి, ముక్కలైపోయిన గోమతి శరీరం, మనస్సు, కోరికలు, చైతన్యాలు అటు గోవిందుతో వెళ్ళిపోయిందనుకున్న గోపాలానికి, ఇటు గోపాలంతో సుఖంగా ఉన్నదనుకున్న గోవిందుకు కేవలం భ్రమగా, భ్రాంతిగా మిగిలిపోతాయి.

ఎంత దయనీయమైన స్థితి గోమతిది?! ముగ్ధమనోహరమైన రూపం నిష్కల్మషస్వభావం, ప్రేమించిన వారికోసం శారీరక శ్రమను ఏమాత్రం లెఖ్ఖచెయ్యక సేవ చెయ్యగల సేవా తత్పరత, తనను బాధ పెట్టినా క్షమించగల మనస్థత్వం, సంపాదన, నిజాయితీగల వ్యక్తిత్వం - ఇన్ని ఉన్న ఈ మంచి పిల్ల గోమతి లాంటివారు, ఈ మానసికమైన వేదన, బాధలతో కుమిలిపోతూ, ఆవేశంతో కూడిన నిర్ణయాలు తీసుకుంటూ ఎన్ని బాధలు పడతారా అని తలుచుకున్నప్పుడు కన్నీరు ఆగదు.

గోమతి సజీవమూర్తి, మధ్యతరగతి జీవితాల్లో ఆమె అనేక రూపాల్లో దర్శనమిస్తుంది. కొత్త రకం జీవితాలు ఇచ్చే ఆకర్షణలో తనుగడిపే జీవితం సమానాంతర రేఖలుగా కనబడ్డప్పుడు వివేకంతో అడుగు వెయ్యకపోతే, ఆ రెండు గీతలు తలొక పక్కన ఆమె జీవితాన్ని నొక్కివేసి "గోమతి"గా మిగులుస్తాయి.

అంతర్లీనమైన సందేశంతో, ఎంతో సజీవవంతంగా సృష్టించారు గోమతిని, విశాలాక్షిగారు.

***

## కృష్ణగారి 'యాత్ర'లో మీరా

**మీరాకి కోపం** వస్తే వెన్నెల కురిసే చందమామకు దాపున పలచని మేఘం చేరినట్లూ - ఆమె ఆహ్లాదంగా వుంటే స్వచ్ఛమైన నీలాకాశంలో చంద్రుడు తెప్ప తేలిపోతున్నట్లూ అనిపిస్తుంది.

ఈ మీరా... ఈమె విలక్షణ వ్యక్తిత్వం... ఈ పాత్ర చిత్రీకరణను ఒక మానసిక 'యాత్ర'గా మలచారు రచయిత.

మీరాని సంఘటనలు అంటవు... అవి ఆమెను ప్రభావితం చెయ్యవు... ఆమె ఆమే.. ఆమె జీవితంలో అన్ని మలుపులుకూ ఆమే కారణం.. డాక్టరు చదువుతున్న మీరా.. అతి సున్నితంగా, స్నిగ్ధ మనోహరంగా వుంటుంది. ఆమె మాత్రమే కాదు ఆమె వ్యక్తిత్వం కూడా అటువంటిదే. ఒక గంభీరమైన అనంతంగా కనిపించే నీటి ఎడారి సాగరం. 'ఎందుకు సముద్రం పట్ల మానవునికి ఇంత ఆకర్షణ?' అనేక పర్యాయాలు అదే చోట సముద్రపు కెరటం నల్ల సీసపు రాతికి తగిలి వ్రక్కలు కాగా, చల్లని శిఖరం రెక్కలు విప్పి స్పృశించే చోట కూర్చుని ఈ ప్రశ్నకు సమాధానం వెదికేది. అంతర్లోకంలో లక్ష రహస్యాల్ని దాచుకుని మసిలిపోతున్న ఆ సముద్రం - ఉపరితలం లోపల ఏముందో తెలియని పెద్ద గిఫ్ట్ బాక్స్‌లాగా అవ్యక్త కుతూహలాన్ని కలిగించడం వల్లనేమో.. అంచులు కనిపించని విస్తృతీ, ఆలోచనకందని లోతులూ..

అవే లక్షణాలున్న అతను సాగర్... మితభాషి అనగలదో లేదో కానీ, అమితభాషి అని మాత్రం అనలేదు. అతని భాషణం మౌలికమైన ఆలోచనల్ని స్ఫురింపజేసి నిశ్శబ్ధంలాగా వుంటుంది. మౌనంగా వున్నప్పుడూ అంతే ఏదో విప్పి చెబుతూ బోధిస్తున్నట్లు అనిపిస్తుంది.

"మనిషి వ్యక్తిత్వం అని మనం చెప్పుకునేది మనకు కలిగిన భావాలతో మనం గీసుకున్న రేఖా చిత్రం మాత్రమే." అలా మాట్లాడే సాగర్ ప్రతిమాటలతో నిశ్శబ్దాన్ని కొలిచి గుట్టలు పోస్తుండేవాడు, ఇద్దరి మధ్యనా సంభాషణల వంతెనను పొడుగ్గా నిర్మించి తనొక చివర వుంచి, అతనొక చివరకు వెళ్ళిపోతూ వుండేవాడు.

ఆమె వుండే గదికి ఎదురింట్లో వుండే సాగర్, కోరమాండల్ తీరంలో అతనితో సన్నిహిత పరిచయం, కొన్ని సాయంత్రాలు వెన్నెల రాత్రుల్లోకి, కొన్ని సాయంత్రాలు చీకటి రాత్రుల్లోకి కరుగుతూ, గడ్డకడుతూ వుంటే, చీకటితో ట్యూబ్‌లైట్ల వెలుగులు చిక్కబడ్డాయో, ఆ ట్యూబ్‌లైట్ల వెలుగులతో చీకటి చిక్కబడ్డదో ఎలా చెప్పాలో ఊహిస్తూ, మౌనంగా అతని పక్కన నడిచేది మీరా.

ఈ అద్భుత స్నేహాకర్షణ మధ్య మునిగి తేలుతున్న మీరాకి మిగతా ప్రపంచం అంతా చాలా నిస్సారంగా కనిపిస్తుంది. ఆమె స్నేహితురాలు రేణుక జీవితం, మామూలు రీతిలో జరిగే విలువలు వేరైన ఇద్దరు వివాహం పేరున కలిసి బ్రతకడం "దుస్సమన్వయం" అనిపిస్తుంది.

సాగర్‌ను చూసిన వాళ్ళు విద్యార్ధి అనుకోరు. కలాకారుడు, సాహితీ పరుడు, తాత్వికుడు అనిపిస్తాడు. "చాలా తెలివిగా కనిపించే నువ్వు కొన్ని విషయాల్లో నిజంగానే అమాయకురాలివే" అంటుంది ప్రాణ స్నేహితురాలు మాధురి. లౌక్య విషయాల్లో నిజంగానే అమాయకురాలు మీరా. అందుకే, ఫారిన్ రిటర్న్డ్ అయిన మామయ్య కొడుకు డాక్టర్ బాబు ఆర్ధికంగా వసతి వున్నవాడు, వరసైన వాడు ఆమెను మానసికంగా కదిలించలేదు.

"ఈ దేశం ఎప్పుడు మారుతుందంటావ్? స్వాతంత్ర్యం వచ్చి ముప్ఫయి ఏళ్ళు అయింది. దేశంలో జనాభా పెరిగింది వైజ్ఞానిక దృక్పథం ఏమైనా పెరిగిందా? నీరద్ చౌదరినీ నయీపాల్‌ని విమర్శించే సమాజంలో మేధావిక, వైజ్ఞానిక పురోగతి కలుగుతుందంటే నమ్మకం కలగడంలేదు. రోగాలన్నీ, జాతర్లలో, తిరునాళ్ళలో, తీర్థయాత్రలతో నయం కావాల్సిందే ఆస్పత్రులూ, ఆపరేషన్ థియేటర్లు పశువుల కొట్టాలులా వుంటాయి. ప్రజలను నడిపే వాళ్ళు సగటు మేధావులు కూడా కారు...

భూమిని చంకన పెట్టుకుపోయిన రాక్షసుణ్ణి చంపడానికి విష్ణువు జంతువు కావలసి వచ్చిందా?! ఇలా వాదించే ఆ సంపన్నుడు, విజ్ఞాని అనిపించుకునే డాక్టర్‌బాబు పురి వేసుకున్నట్లు ఆయన భావాలను ఆయనే బంతి కట్టుకుంటున్నటున్నట్లనిపిస్తుంది మీరాకి... "చంద్రగ్రహానికి ప్రయాణం చేసే వ్యోమగాములు అంతరిక్షంలో క్రిస్మస్ ప్రార్ధనలు చేసుకోవడంలో అంతర్యం ఏమిటంటారు? విశ్వాసం వేరు. విజ్ఞానం వేరు.." అనే చిన్నన్నయ్య, డాక్టర్ బాబు సంభాషణలగోల అంతా నిస్సారమైన వ్యాసంగం అనిపిస్తుంది మీరాకు.

ఆమెకు కావాల్సింది ఇంటలెక్చువల్ కంపెనీ మాత్రమే అయితే డాక్టర్ బాబు ఆమెను కదిలించగలిగే వాడేమో... కానీ ఇక్కడే మీరా మనకు స్పష్టంగా దర్శనమిస్తుంది.

సాగర్‌నూ డాక్టర్ బాబూను పోలిక చేసి చూస్తుంది. సాగర్ ఒక చక్కని కథ కావ్యమైతే డాక్టర్ బాబు బాయిడ్ పేథాలజీలాంటివాడు సాగర్ సాగర మధ్యంలో అందమైన లాండ్ స్కేప్‌లతో నిండిన ద్వీపం కాగా, డాక్టరు బాబు అయస్కాంత పర్వతం: డాక్టరు బాబుతో తన జీవితాన్ని ముడివేసుకోగలదా తను?! జీవితం అప్పుడు ఒక డాక్యుమెంటరీలా సాగుతుంది...పల్లవిలోకి రాకుండా సాగర్‌తో స్నేహం ఆలాపనంగా మాత్రం వుండిపోవలసినదేనా?!

ఈ ఆలోచనా సరళితో మీరా ఏమిటో మనకు చెప్తారు రచయిత. వారి భావుకత, రసజ్ఞత ప్రతి అక్షరంలోనూ వ్యక్తమవుతుంది. ఈనాటి ఎన్ని వివాహాలు "దుస్సమన్వయం"తో నలిగి, మీరా వూహించిన డాక్యుమెంటరీ బ్రతుకులుగా మారుతున్నాయా అనిపిస్తుంది మనకు.

సాంఘిక సమానత్వం పేరిట ఎంత స్వేచ్ఛ వచ్చినా, జీవిత కేంద్రం పురుషుడు అనే భావాల్ని స్త్రీ ఎప్పటికి లౌకిక వ్యవహార రీతిలో వ్యక్తీకరించలేదేమో.... తుమ్మెదలే పుష్పాలను వెతుక్కుంటూ వెళ్తాయి. ఎక్కడా పూలు తుమ్మెదల్ని వెతుక్కుంటూ ఎగిరిపోవు. నేల పిపాసతో బీటలు వారితే వచ్చి మేఘం వర్షించాల్సిందే నేల ఎదురు వెళ్ళదు. అందుకే, సాగర్‌కు తనకూ వున్న ఈ అభిరుచుల సమాగమనంలో తన వేగము ఆత్రమూ ఎక్కువగా వున్నట్లు అనిపించి కొన్నాళ్ళు అతని సాన్నిధ్యంలోకి రాకుండా అజ్ఞాతవాసం చేస్తుంది మీరా. కానీ మనసు, కళ్ళు అతని సాన్నిధ్యాన్ని వాంఛిస్తూనే వుంటాయి.

ఈ కొట్టు మిట్టాట లో మాధురి భీమ్లీ పిక్నిక్ ప్రోగ్రాం వేస్తుంది. అక్కడ రాజేశ్వరరావు అనే మెడికోను గమనిస్తుంది. నల్ల కళ్ళద్దాలలోంచి అతను తనను చూపులతోనే స్పృశిస్తున్నాడని తెలిసి గుండె ఝల్లుమంటుంది.

చిన్నదే అయినా సుదీర్ఘంగా కనిపించే ఈ జీవిత ప్రయాణంలో ఎందరెందరో, ఎలాంటి వ్యక్తులో తారసపడతారు. డబ్బు ఖర్చు పెట్టడానికే వుందన్నట్లు, జీవితం అనుభవించడానికే వుందనేవారు కొందరు, ప్రతిదాన్నీ తాపీగానో ఉదాసీనంగానో, నిర్వికారంగానో స్వీకరిస్తూ ఈ జీవితమే మరొక బృహత్తర గమ్యానికి చేరే మార్గమన్నట్లు ఉద్రేకాలకూ, ఆవేశాలకూ అతీతంగా ప్రవర్తించే కొందరు... రాజేశ్వరరావు మొదటి తెగ వ్యక్తి, బౌద్ధ రిప్లే చర్చిలో గాజు పలకల మీద గీసిన బొమ్మలూ, విశాలమూ, ఎత్తు అయిన ఆ కాంగ్రిగేషన్ హాలులో ఏదో అదృశ్య మూర్తులు తమ ముందే కన్పించకుండా తిరుగాడుతున్నట్లు వున్న పరిసరాలలో అతని చూపు ఆమెకు వింత భయాన్ని జంకునూ కలిగించేది అతను మాధురితో కలిసి మర్నాడు ఇంటికి వచ్చి తన తల్లి రమ్మన్నదని ఆహ్వానిస్తే, ఆశ్చర్యపోతుంది. అతనికి తన వ్యతిరేకతను రకరకాలుగా చెప్పాలని ప్రయత్నిస్తుంది.

"నీతో మాట్లాడిన ప్రతి యువకుడూ నువ్వంటే పడిచస్తాడని ఎప్పుడూ అనుకోకు యువతీ..." అని వెక్కిరిస్తుంది మాధురి. మర్యాదకి డాక్టర్ పద్మావతిని చూడటానికి వెళ్ళి వాళ్ళ అమ్మాయి భాగేశ్వరితో హృదయపూర్వకమైన స్నేహం చేయగలుగుతుంది మీరా. ఎప్పుడూ స్వప్న దర్శనం చేస్తున్నదానిలా కనిపించే కళ్ళతో అవతలి వ్యక్తుల మాటలు వింటూ ముఖంలోకి చూస్తూనే తన ప్రపంచంలోనే విహరించే ఇరవై సంవత్సరాల 'బాలిక' భాగేశ్వరి. కానీ రాజేశ్వరరావును మాత్రం భరించలేకపోతుంది మీరా. అతను తనతో ఏ విషయం సంభాషించినా అది అతను మాట్లాడటానికి తటపాయిస్తున్న మరో విషయానికి ఉపక్రమణికగానే ధ్వనిస్తుంది. పురుషుడి గొంతులోనూ, కంటిలోనూ వ్యక్తం అయ్యే భాషను సక్రమంగా అర్థం చేసుకునే శక్తి భగవంతుడు ప్రతి స్త్రీకి ఇస్తాడు. సాగర్ అంటే అర్థమైన మీరా రాజేశ్వరరావులోని మొరటుతనం భరించలేకపోతుంది.

సాగర్ ఫ్రెండ్ ఆరోహి, "ప్రేమంటే ఎరగని... వ్యక్తివాడు. మనం రెండు మాటలు అడిగితే సమాధానం రాదు. మూడు మాటలు అడిగాక వచ్చే సమాధానం ఒక చిరునవ్వు. ఇంకా ముందుకు పోతే అప్పుడు ముక్తసరి మాటలు... అయినా నేను వాడిని తీసుకు వస్తాను..." అని మాట ఇస్తాడు.

అందంగా అలకరించుకున్న మీరా శుభాకాంక్షలతో అతని కోసం ఎదురు చూస్తుంది. ఆమెకు ఏమిటి కావాలో ఆమె మనసు చెబుతూనే వుంటుంది. డాక్టర్ బాబు, రాజేశ్వరరావులు తనను కావాలని చెప్పినా, పలకరించినా, తనలో కలగని చలనం, ఉద్వేగం ఇతని విషయంలో ఎందుకు కలుగుతుందో ఆమెకే అర్ధంకాదు.

చిక్కగా పెరిగిన గడ్డంతో, మేఘావృతమైన చంద్రునిలాగా పలచని చిరునవ్వుతో వస్తాడతను.

"పడమటి దేశీయుల వ్యక్తిత్వంలో ఒక గొప్ప లక్షణం వుంటుంది. పరిణత మనస్కుడైన ప్రతి వ్యక్తికీ జీవితంలో ఒక ఆదర్శమూ, జీవితాన్ని గురించిన ఒక దృక్పథమూ ఆ దృక్పథానికి ప్రాతిపదిక అయిన ఒక తత్వమూ ఉంటాయి. ఆ ధోరణి మన దేశంలో లోపించింది" అన్న అతని మాటలకు, "మీకు అలాంటివి ఉన్నాయా?" అని అడుగుతుంది మీరా...

"ఒక వ్యక్తికి జీవితం పట్ల వున్న దృక్పథం, తత్వం చేష్టలలో తెలియాలి గాని, మాటల్లోకాదు" అంటాడు సాగర్. అతనితో మాట్లాడి, తన మనస్సు విప్పి చెప్పాలనుకునేటప్పటికీ, చిన్నన్నయ్య వచ్చి, తల్లికి జబ్బుగా ఉందని మీరాని తీసుకు వెళతాడు. తల్లి బాధను చూసి బేల అయిపోతుంది మీరా.

ఎవరి కన్నీళ్ళూ నివారించలేని దిశగా గాలిపటం, మీదుగా నడుస్తూ వెళ్ళిపోతుందా అమ్మ?! అని భయపడుతుంది. తల్లి జీవితంలో నిగూఢమైన ఒక దుఃఖం లాంటి నిజం అర్ధమౌతుంది మీరాకి. డాక్టర్ రాజేశ్వరి తన తండ్రి ప్రియురాలు.. నిరంతరం మరొక మనిషి ధ్యానంలో వుండే భర్తతో కాపురం చేసింది అమ్మ.

వ్యక్తులంతా ఏకాకులే. ఈ ప్రపంచంలో రక్తసంబంధమని, బంధుత్వమనీ, దాంపత్యమనీ, స్నేహమని ఎన్ని పేర్లు పెట్టుకున్నా, అనుబంధాలుగా, ప్రతి వ్యక్తికీ తను ఏకాకి అన్న విషయం ఎప్పుడో, ఒకప్పుడు తెలిసిరాకపోదు. ఆ ఏకాంతంలోని అనుభూతులూ, ఊహాలోకాలూ, ఆవేశాలూ ఇవే వ్యక్తుల నిజరూప ప్రపంచాలు.

కానీ తామరాకుమీద నీటి బొట్టులాంటి సాగర్‌లో ఆత్మీయత నిద్రలేపి అతని ఏకాకిత్వం ద్వీప తత్వం పోగొట్టాలని మీరా చిలిపి ఆశ. భగవంతుడు స్త్రీకి వేసే పెద్ద శిక్ష - ముందుగా చేయి చాచి పిలువని ప్రియుణ్ణి ప్రసాదించడం - అతనితో సింహాచలంలో గడపిన ఆ సన్నిహిత ఘడియలోని అణుచుకున్న శృంగారం, అతను చూపులతో తెలియపరిచే రసజ్ఞత, కోరిక బయటబడని ఆత్మీయత - ఇవన్నీ అతను వేరే జాతికి చెందినవాడని తెలియగానే మళ్ళీ తికమక పడుతుంది మీరా. అంత గొప్ప ఫిలాసఫర్, థింకర్, రిసర్చ్ స్కాలర్‌ను కేవలం ఈ కారణం వల్ల దూరం చేసుకోగలదా?! మరి కుటుంబం? లోకం?! సందిగ్ధంలో తల్లి దగ్గరకు వెళ్ళిపోతుంది మీరా. తల్లి భూషణం మామయ్య కొడుకు డాక్టర్ బాబును ఆమెకు వరునిగా ఎన్నిక చేయాలని ఉన్నదని సూచిస్తుంది. మీరా తల్లితో తన కోరిక అరమరిక లేకుండా చెబుతుంది.

"మనోవికాసానికి ప్రాధాన్యం ఇవ్వని వారెవరమ్మా?! జీవితంలో తమ ఆశయాలకు, ఆశలకు భంగం కలిగినప్పుడు అది ఆ వ్యక్తి జీవితంపై ఎంత ఘోరమైన ప్రభావాన్ని చూపుతుందో నాకు అనుభవ పూర్వకంగా తెలుసు" అనే తల్లి మాటలకు ఉలిక్కిపడుతుంది మీరా.

మహా సందిగ్ధ పరిస్థితుల్లో తల్లితో కలిసి తీర్ధయాత్రలు చేయిస్తారు రచయిత. ఇంత ప్రయాణంలోనూ సాగర్‌ను ఒక్క గంటకూడా మరువలేకపోతుంది మీరా. భౌతిక వాసనా శరీరాన్ని నిరసిస్తూ భైరవ మూర్తిగారి ఉపన్యాసాలు, తీర్ధస్నానాలు, విరక్తి మార్గాలు వీటి ఫలితంగా మహాపంథీ శిఖరం పక్కన లోయలో ఆత్మాహుతి చేసుకున్నది మీరా తల్లి.

మహా దుఃఖంతో తిరిగి వైజాగ్ వచ్చింది మీరా... ప్రతి క్షణం సాగర్ సాన్నిహిత్యాన్ని కోరుకుంటూ, మరుక్షణం అతను తనకు దూరమైపోతాడేమోనని భయపడుతూ నిరంతర సంఘర్షణ ఆమెలో, తిరిగి అతని సాన్నిహిత్యంలోని మధురిమ ఆమెకు కలలు నేర్పించాయి.

"అమెరికా అట్లాంటిక్ సముద్రం - ఓడ కళాసీలు, ఫసిఫిక్ హైతీ దీవులు, హవాయ్ - ఇది నీ స్వప్న ప్రపంచం కదా ఎక్స్చేంజ్ ప్రోగ్రాం క్రింద ఎందుకు అమెరికా వెళ్ళవు?!" అని అడుగుతుంది మీరా.

"కానీ సింహాచలంలో నీతో సన్నిహితమైన రోజున కొత్త ప్రపంచాన్ని జయించాను. వాస్తవ ప్రపంచాన్ని వదులుకుని, స్వప్న ప్రపంచానికి వెళ్ళలేకపోయాను." అనే రాజేశ్వరరావు, పద్మావతి, మాధురి, భాగేశ్వరి, కులం, మతం, వ్యవస్థ - ఇవన్నీ అర్థం లేనివీ అఖ్ఖర్లేనివి అనిపిస్తాయి.

కానీ, మీరా జీవన "యాత్ర" అంత సజావుగా సాగదు. ఆమె అనుభవాల పరంపర, తీరని దుఃఖాలు అంతటితో ఆగవు. సాగర్‌కు కేన్సర్ అన్న అనుమానం వ్యక్తం చేస్తారు బయాప్సిలో. ఆత్మీయులనుకునే అందరూ ఆమెను ఆలోచించుకోమంటారు. అటువరసైన డాక్టరు బాబు, ఇటు నిరంతర తన సాన్నిధ్యానికి అలమటించే రాజేశ్వరరావు, ఆప్యాయత నిండిన అతని తల్లి పద్మావతి, ఇటు సాగర్... ఇక్కడే రచయిత, మనో ప్రపంచ వాసిని అయిన స్త్రీ ఎందుకు ప్రాపంచ లాభాలకు తనను తాను తాకట్టు పెట్టుకోలేదో చాలా అర్థవంతంగా చెప్తారు.

సాగర్‌కు తెలియకుండా వుండాలని ఎంతో ప్రయత్నిస్తుంది మీరా. కానీ, అసూయకు మారు రూపమైన రాజేశ్వరరావు వల్ల అతనికి తెలుస్తుంది.

"నువ్వు డాక్టరువు. నిజమే... సావిత్రివి కావుగా.. నువ్వన్నట్లుగా మనం వివాహం చేసుకున్నామే అనుకో ఒకటి, రెండు సంవత్సరాలలో నువ్వు ఆశించని పరిణామం సంభవిస్తే ఏం చేస్తావు?!" అడుగుతాడు సాగర్.

"కానీ, నువ్వు నన్ను అపార్థం చేసుకున్నట్లు నటించి దూరంగా ఉంచాలనుకుంటున్నావు. నేను అర్థం చేసుకుని కలిసి ఉందామనుకుంటున్నాను. నేను సావిత్రిని కాను. నిజమే.. నువ్వు సత్యవంతుడువని ఎందుకు అనుకుంటావు? జీవితంలో మనం ఆశించిన ఫలితాలు ఆశించినట్లు రావు. ఆశించని ఫలితాలు ఆశించినంత మాత్రాన రాకుండా ఉండవు కూడా"... అంటుంది మీరా.

ఆ ప్రేమమయి మాటలకు చూపులలోనే ప్రేమా, ఆరాధనా, జాలీ నిస్సహాయతా అన్నీ కనబరుస్తాడు సాగర్.

ఈ స్థితిలో కూడా అతణ్ణి వివాహం చేసుకోవాలంటున్న మీరాతో.

"అతను ఇన్సూర్ చేసైనా ఉండాలి. తప్పుకోలేని పరిస్థితిలో మీరు చిక్కైనా ఉండాలి" అని అతి నీచంగా తన అభిప్రాయం చెప్తాడు రాజేశ్వరరావు. ఇటువంటి స్వాభావిక నీచుడితో ఇహలోకపు అవసరాల కోసం కలసి బ్రతకడం కన్న సాగర్ సాన్నిధ్యంలో కొద్ది రోజులు గడపడంలో పరిపూర్ణత ఉన్నదనిపిస్తుంది మీరాకి.

ఆ లోపల జరగకూడనిది జరుగుతుంది.

సాగర్ లేని దుఃఖసాగరంలో మునిగిపోయింది మీరా. ఆమెను ఓదార్చడానికి భాగేశ్వరి విశాఖలో గడిపే ఆఖరిరోజు తన దగ్గర ఉండమంటుంది. ఆరోగ్యం దెబ్బ తిన్న మీరాకు ఇంజక్షన్ ఇచ్చి, ఆ మత్తులో వున్న ఆమెను అనుభవించబోతాడు రాజేశ్వరరావు. తప్పించుకుని పారిపోతుంది మీరా.

ఆమె జీవితంలో రొటీన్.. రాజేశ్వరరావు మళ్ళీ కనబడి క్షమార్పణ చెప్పినా ఆమెలో నిర్లిప్తత, ఏదో నిశ్శబ్దం... ఆ తలుపు ఎవరూ తీయలేరు.

అప్పుడు పరిచయమౌతాడు ప్రభు స్టూడెంటుగా, అతని ఆరాధనా, స్వార్థపూరితమైన అభిమానం... ఆమెలో పెద్దరికాన్ని దాచిపెట్టి. స్త్రీని నిద్రలేపుతుంది. తన పుట్టినరోజుని గుర్తుంచుకుని అతను పంపిన రాజమాల.

ఒక వ్యక్తి మనసు తెలుసుకోవడానికి అతని చర్యలు సూచకాలు అయినప్పటికీ ఒకొక్కసారి అవి తప్పు దారి పట్టిస్తాయి. కొన్ని కొన్ని సార్లు అంతరంగంలోని భావాలు, జాగ్రదావస్థలో తలపులు తెరచుకుని బయటికి రాలేనివి నిద్రలో స్వప్నం అనే రంగస్థలం మీద వెర్రి స్వేచ్ఛతో నాట్యమాడతాయి. మెలుకువ రాగానే మళ్ళీ అభేధ్యమైన తమ స్థావరాలకు వెళ్ళిపోతాయి.

డాక్టర్ బాబు లవ్ ఎఫైర్, అతని కొడుకు, అతనికి ఇల్లు వెతికి పెట్టడం వీటన్నింటికీ సాయపడతాడు ప్రభు. ఆమెపై అతని ఆరాధన హద్దులు మీరుతుంది కానీ, వ్యక్తీకరించలేడతను.

మీరాను కలవరపెట్టే విషయం అతనిలో సాగర్ ఛాయలు. తన కన్న చిన్నవాడైన ఈ భావకుడు, ఆరాధకుడు తన జీవితాన్ని కల్లోలపరచడం - కానీ, అతని ప్రేమలో ఎంత తీవ్రత?! ఎంత ఉద్వేగం అతని కాంక్షలో. ఎంత భయం అతని మొదటి ప్రేమానుభవంలో?!

"నేను మీతో జీవన సాహచర్యం ఆశిస్తున్నాను. అర్థిస్తున్నాను. మీరు లేని జీవితం నేను ఊహించలేను." మీ ప్రభు - అని రాస్తాడు అతను. అతని ఆరాధనా విపంచికను అతి సున్నితమైన వేళ్ళతో మీటి అంగీకరిస్తుంది మీరా.

సుదీర్ఘమైన ఆమె మానసిక యాత్ర ఈ అందమైన మాధుర్య శృంగార భావనా బృందావనంలో నెమళ్ళూ, కస్తూరి చందనాగరు పరిమళమూ - వీటి కలయికలో లయించి, నిట్టూరుస్తుంది.

భావనా ప్రపంచాన్ని గౌరవించగలిగిన ప్రతి ఒక్కరూ చదవవలసిన నవల 'యాత్ర'. చదివిన తరువాత భావకులైన పాఠకులు తమలో 'మీరా'ను అన్వేషించుకుంటారు.

**అటువంటి సజీవ స్త్రీమూర్తి ఆమె.**

***

## శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారి
## సెక్రటరీలో జయంతి




"**నవల ఒక్కటే పాఠకుని** మనసులో ఉన్న ఊహకు రెక్కలు ఇచ్చి, తన వెంట తీసుకువెళ్ళగలదు. నవల రాత్రివేళ నిద్రరానప్పుడు, బస్‌స్టాప్‌లో వెయిట్ చేసినప్పుడు, ఏకాంతం మిగిలినప్పుడు, నిశ్శబ్దంగా అతని అంతర్యంలో ఒక ప్రత్యేక ప్రపంచం అతను కోరుకున్న క్షణాన, సృష్టించడానికి సిద్ధంగా ఉంటుంది. నవల పాఠకునికి కనిపించని తోడు.

రచయితకు, సంపాదకుడికి, పాఠకునికి మధ్య సంబంధం ఒక పూల చెట్టుకు, క్షేత్రానికి, భగవంతుడికి మధ్య ఉండే అపురూపమైన సంబంధం -"

పై మాటలు చెప్పగలిగిన వ్యక్తి ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి.

సులోచనారాణిగారు చాలా మంచి స్త్రీ పాత్రలను సృష్టించారు. కానీ, "సెక్రటరీ" నవలలో "జయంతి" ఒక ట్రెండ్ సెట్టరు, తిడుతూ, దీవిస్తూ, ఆలోచిస్తూ, వద్దనుకుంటూ, ఇందులో ఏముంది? అన్న ఇంటలెక్చువల్ పెసిమిజమ్‌తో ప్రశ్నిస్తూ - ఏ విధంగానైనా కానీ అఖిలాంధ్రలోక పాఠకులు సెక్రటరీ చదివారు - రచయిత్రి చదివింపచేశారు. ఈ పాఠక హృదయాలను ముట్టడి చేసి, దాసోహం చేసుకోగలిగిన సౌందర్యాక్షర నిశ్శబ్ద విప్లవం పేరు సులోచనారాణి.

రచయితకు, తను రాసే రచనల పట్ల అపారమైన నమ్మకం వుండాలనీ, పాఠకులు నవలలో తమ జీవితపు సమస్యలకు పరిష్కారం వెతుక్కునేటప్పుడు, అది వారి పట్ల శాపంగా మారకూడదని భావించే ఈ రచయిత్రి సెక్రటరీలో జయంతిని ఒక అక్షర చిత్రంగా మలిచారు.

జయంతి సజీవ స్త్రీ మూర్తా? అని ప్రశ్నిస్తే నిస్సందేహంగా 'అవును' అని సమాధానం చెప్పొచ్చు. కారణం, చాలా విచిత్రంగా, జయంతి పాత్రను చదివి ఆంధ్రదేశంలో కోకొల్లలు మంది టీనేజ్ ఆడపిల్లలు జయంతిలా మారాలనీ, ప్రవర్తించాలనీ ప్రయత్నించి జయంతిని సజీవురాలిని చేశారు. ఈ అస్పష్ట సృష్టి రహస్యం సులోచనారాణిగారికే తెలుసు.

'సెక్రటరీ'లో జయంతి ఒక ముసలి బామ్మగారి సంరక్షణ తప్ప మరే ఆధారమూ లేని అమాయకురాలు. ఆంధ్ర దేశపు సగటు అమ్మాయి. గొప్ప అందము, తెలియని సౌకుమార్యము, ముగ్ధత్వము, కొంత జయంతి, తన జీవితంలో గొప్ప మార్పు తేనున్న 'ఆంధ్ర వనితా విహార్'లో సెక్రటరీ ఉద్యోగం రావడంతో ఈ నవల ప్రారంభమౌతుంది. జీవితానికి మరొకవైపు ఉంటుందని తెలియని ఆ ముగ్ధ, ప్రతి వస్తువు సజీవ శక్తితో, నూత్నానందంతో వెలిగిపోతున్నట్లు ఆఖరికి మంచం ప్రక్కన కిటికీలో నుంచి లోపలికి వస్తున్న వెన్నెల కూడా అర్థంకాని భాషలో పలుకరించాలని ప్రయత్నిస్తున్నట్లు భావించే భావుకురాలు.

స్వంత బామ్మ తప్ప మరొక వ్యక్తిని దగ్గరగా ఎరగని జయంతి, పుస్తకాలలో కనిపించే ప్రపంచమే ఈ ప్రపంచం కూడా అనుకునే జయంతి, అందరూ తనలాంటి వాళ్ళేనని భావిచే జయంతి - అసూయాగ్రస్తులైన ఆడవాళ్ళు, చదువున్నా, సంస్కారం లేని మెంబర్లతో నిండిన వనితా విహార్ సభ్యుల సంకుచిత్వం అర్థం చేసుకోలేకపోతుంది.

కానీ, జయంతి పని విషయంలో పాజిటివ్ థింకర్, వారి ప్రవర్తనతో నిరాశ చెందకుండా, వీళ్ళను శ్రద్ధాశక్తులతో తనవైపు చూసేలా చేసుకోవాలని మనసులో శపథం చేసుకుంటుంది. నిశ్శబ్దంగా ఆమె చేసుకునే నిర్ణయాల వెనకాల మొండి పట్టుదల, పరిస్థితులను గుర్తించని అమాయకత్వంతో కూడిన మూర్ఖత్వం ఉంటాయి.

ఈ సన్నజాజి పూవులాంటి పిల్ల చుట్టూ ఇటువంటి పట్టుదల ఆత్మాభిమానం వున్నాయని గుర్తించిన మొదటి వ్యక్తి రాజశేఖరం. అతని అద్భుతమైన వ్యక్తిత్వపు ఎదుగుదల వెనకాల మానని గాయాలు అవమర్యాదలు, స్త్రీత్వపు హిపోక్రసీలు చేసిన మోసాలు ఎన్నో?! అతని జీవితంలో ఎదురుబడిన స్త్రీలలో ఉన్నతులు, ప్రేమాస్పదులు, మాతృసమానులు తక్కువమంది. సంఘం తయారు చేసిన ప్లాస్టిక్ సీతాకోకచిలుకలు ఎక్కువ మంది వున్నారు. అతను "ప్రేమించాను" అనుకున్న రేఖ వచ్చి ఆడతనాన్ని అవకాశవాదానికి ఉపయోగించుకోవడం, గౌరవించి పెళ్ళి చేసుకుందామనుకున్న గీత అకస్మాత్తుగా మృత్యు ముఖంలోకి జారిపోవడం, లక్ష్మి, కామేశ్వరమ్మగారిలాంటి వారు తల్లి, చెల్లెలు స్థానాల్లో ఉండటంతో అతని జీవితంలో ఒక భాగం శూన్యమైపోయింది. ఆ శూన్య ఉపరితలాన్ని సృజించి, ప్రాణవాయువులతో కాంతి దీపారాధన చెయ్యగల వ్యక్తి అతనికి కనబడదన్న నిరాశతో వుంటాడు. ఆ స్థితిలోనే తొణకని స్వప్నంలాంటి జయంతిని చూస్తాడు. గొప్ప మనిషి, హృదయ స్పందన వున్న వ్యక్తిగా ఆ పిల్లను ఆరాధిస్తాడు., కానీ తెలివిగల వ్యక్తిగా, జీవితం చదివిన అనుభవశాలిగా ఆమెలోని అమాయకత్వం, మూర్ఖత్వం గ్రహిస్తాడు. అటువంటి జయంతిలో నైసర్గికమైన ప్రేమ ఉదయించి, ఆమె మీద ఆమెకు నమ్మకం కలిగించి, నేను కూడా ప్రేమకు అర్హురాలినే అన్న భావం కలిగించడానికి చాలా ఓపికతో ఎదురు చూసి మార్పు కుంటాడు రాజశేఖరం. ఈ సైకో ఎనాలిసిస్, తెచ్చే విపరీతమైన మార్పుకు అద్యంతాల మధ్య కథే 'సెక్రటరీ...'

వనితా విహార్‌లోని ఆడవారి భర్తల - ప్రవర్తన, తమ్ముల నీచత్వం, అసూయాగ్రస్తులైన మెంబర్లు చేసే అవమర్యాదలు తట్టుకోలేక రిజైన్ చేస్తుంది జయంతి. ఆమెకు తన దగ్గర టెంపరరీగా సెక్రటరీ ఉద్యోగం ఇస్తాడు రాజశేఖరం. 'భయపడుతూనే అవసరానికి ఉద్యోగంలో చేరుతుంది జయంతి. ఆమెలో ద్వంద్వ ప్రకృతులుంటాయి.. "ఇక్కడ ఉద్యోగంలో చేరానని తెలిస్తే చంపెయ్యరూ ఆ

ఆడవాళ్ళంతా? రాజశేఖరం వాళ్ళ కలల రాకుమారుడాయె.." అనుకుంటుంది. కానీ వెంటనే "నేనేం తప్పు చేస్తున్నానని?" అని మొండికెత్తుతుంది. జీవితమంతా చేదు అనుభవాల మధ్య కొట్టుమిట్టాడుతున్న జయంతి ఒక పట్టాన రాజశేఖరాన్ని నమ్మలేకపోతుంది. అతని మర్యాద నటన అనీ, అతని మంచితనం హిపోక్రసీ అని, డబ్బున్న జబ్బు అతనికీ ఉందని తొందరపాటు నిర్ణయాలకు వచ్చే ఆమెకు రాజశేఖరం అనే వ్యక్తి వ్యక్తిత్వం అర్థమవ్వడానికి చాలా రోజులు పడుతుంది.

"అతని పేరు చెప్పినప్పుడల్లా, నీ మొహం అదో మాదిరిగా అయిపోతోందిలే..." అని స్నేహితురాలు సునంద అన్నప్పుడు ఉలిక్కిపడుతుంది.

ఆమె పుట్టినరోజు గుర్తుపెట్టుకుని చాలా అందమైన, నాజూకుగా ఉండే చీర పంపించిన అతనిని తలుచుకుంటే ఆమె హృదయం ఉప్పొంగిపోతుంది. కానీ అతనికి తను తగనన్న ఇన్ఫీరియారిటీతో లేనిపోని రోషం నటిస్తుంది జయంతి. తనకు దొరికినంతలో, అవకాశం ఉన్నంతలో తనకు లభించిన సంతోషంలో సాధ్యమైనంత వరకు సునందకు పంచడానికి ప్రయత్నించే స్నేహశీలి జయంతి. కానీ తనకు అటువంటి అందమైన స్నేహాన్ని ఆనందాన్ని ఎవరైనా ఇవ్వగలరంటే నమ్మలేదు ఆమె.

సినిమాలో ఒంటరిగా అతడిని ఉన్నట్లుండి కలుసుకున్న జయంతి,

"జయంతీ! ఈ చీరలో ఎంతబావున్నావు నిజంగా"- అంటున్న అతన్ని చూసి అభిమాన పడిపోతుంది. అతని కంఠంలో దేనికోసమో వెతికి దొరకలేదని నిరాశపడి అలసిపోయినప్పుడు చివరకు హఠాత్తుగా దొరికితే ఎలాంటి అనుభూతి వుంటుందో ఆ ధ్వని ఆమెను స్పందింప చేస్తుంది. "క్లబ్‌కు వెళ్ళి, ఓ మూల కూర్చుని పేపరో, పుస్తకమో చదువుతున్నట్లు నటిస్తూ నిన్ను గురించి ఆలోచిస్తాను.." కళ్ళల్లో నవ్వు తళుక్కుమంటూ మాట్లాడుతున్న ఆ స్ఫురద్రూపి జయంతిని వులిక్కిపడేట్లు చేస్తాడు.

కానీ, పాపం జయంతి తన అదృష్టం మీద నమ్మకం లేని, ఇన్ఫీరియారిటీతో బాధపడే ఆడపిల్ల. అతని మాటల్లో, చేతల్లో ధ్వని ఆమెకి అర్థమైనా, ఒప్పుకునే పాటి ధైర్యం లేక, అతని గురించి వీలైనంత చెడ్డతనం వూహించుకుంటూ, తన వానిటీని నెగటివ్‌గా తృప్తి పరచుకుంటుంది జయంతి.

జయంతిలో నిరంతరం ఏదో మార్పు, కొత్తదనం కోరుకునే స్వభావం వున్నది. కానీ మొనాటనీని, బండబారిపోయే స్థిరత్వాన్ని ఆమె భరించలేదు కానీ, కట్టుబాట్లను, అలవాట్లను, తన కాంప్లెక్సును దాటి ఛేదించి తనకు కావలసిన వాటిని పొందే ధైర్యం లేదు. ఆస్కార్ వైల్డ్ అన్నట్లు ప్రపంచంలో రెండే రెండు గొప్ప విషాదాలు - 'వొకటి అనుకున్నది' కాకపోవటం, రెండోది అనుకున్నది అయిపోవడం' - ఎంత నిజం ఆ మాటలు?" అనుకుంటుంది జయింతి.

తనని ఆరాధించి, ప్రేమిస్తున్నాడేమో అని భయపడుతున్న రాజశేఖరం దగ్గరకన్నా, శివరాం, ప్రకాశం లాంటి వారి దగ్గర చాలా రిలాక్స్‌గా హాయిగా ఉంటున్నాననుకుంటుంది జయంతి. కారణం, రాజశేఖరంలో గౌరవించి అభిమానించే గుణాలు ఎక్కువగా ఉండి ఆమెను భయపెడతాయి.

"మనుషులకు ఆధారముంటే పైకి రాగలరు. కానీ ఆధారం లేని నాబోటి వాళ్ళు నేలరాలిన రాధామాధవం తీగలాంటివారు" అనుకుని తనకు రాజశేఖరం ఏమీకాడని తృప్తి పడుతుంది.

జయంతికి విపరీతమైన "డిప్రెషన్" ఎక్కువ. ఉన్నట్లుండి, 'ఏమిటీ జీవితం? వయసు మళ్ళే లోపల ఎవరో ఒకరు పెళ్ళి చేసుకుంటారు. పిల్లలు పుడతారు. తరువాత ఈ ఆలోచనలకు కూడా అవకాశం ఉండదేమో. ముసలమ్మగా మారిపోయి, నెరిసిపోయిన జుట్టుతో లావుగా మారిన శరీరంతో, సంతానం గురించి పనుల గురించి కబుర్లు చెప్పుకోవాలి... అంతేనా?' అనిపిస్తుంది. ఈ నిరాశావాదం నుంచీ, అనుభూతి రాహిత్యం గురించిన ఆలోచన నుంచీ చాలా సాదాసీదాగా బ్రతికేయాల్సి వస్తుందేమోనన్న భయం నుంచి ప్రతి క్షణం పారిపోవాలని ప్రయత్నిస్తూ ఉంటుంది జయంతి.

ఆమెకు కావలసిన జీవితం గురించి చాలా అస్పష్టమైన ఊహా చిత్రం ఉంది ఆమెకు. కానీ, తనకు ఏది వద్దో, తను ఏది భరించలేదో మాత్రం ఆమెకు బాగా తెలుసు. కావలసినది చేతికి అందేటప్పుడు ఇన్ఫీరియారిటీతో, తనమీద తనకు నమ్మకం లేక జీవితాన్ని పోగొట్టుకోడానికి సిద్దపడి, పారిపోవడానికి ప్రయత్నిస్తుంది. సైకాలజీలో ఇది "ప్యూజ్ స్టేజ్"కి గుర్తు.

మరి జయంతి దృష్టిలో జీవితం అంటే ఏమిటి? "బాల్యం ఎలా గడిచినా, యవ్వనంలో కొన్ని అనుభూతులు చిరస్మరణీయంగా మనసులో ముద్ర వేసుకునేంతటి బలమైన సంఘటనలు లభించాలి. అవి గుర్తుకువస్తే, వెన్నెల్లో కూర్చున్నట్లు, సెలయేరు సంగీతం వింటున్నట్లు, వయస్సు మర్చిపోయి, మళ్ళీ ఆ క్షణాల్లో జీవిస్తున్నట్లు అనిపించేలా ఉండాలి కానీ గుర్తుకు వస్తే జలదరించేటట్లు మనసు ఏవగింపుతో ముడుచుకుపోయేటట్లు వుండకూడదు. వృద్ధాప్యంలో, ఈ జీవితం అయిపోయినా పరవాలేదు. ఈ జన్మకు ఈ అనుభూతులు చాలు. ఈ తృప్తిచాలు నాకు అనుకునేట్లు ఉండాలి." ఇంత అద్భుతంగా, సున్నితంగా ఆలోచిస్తుంది కాబట్టే జయంతి ఎప్పటికప్పుడు అనుభూతి రాహిత్యం నుంచీ "పలాయనం" మార్పుగా ఎన్నుకుంటుంది. అందుకే, బైటకు మూర్ఖంగా, అమాయకంగా కనబడే జయంతిలో అంతర్గతమైన జీవనవాంఛ, సౌకుమార్యం, ఆమె జీవితంలో అన్ని మలుపులకు, మార్పులకు, కారణమౌతాయి.

అనుభూతుల జిలుగు వెలుగులు తప్ప భరించలేని ఆ సుకుమారి లౌక్య ప్రపంచం దృష్ట్యా చాలా తెలివి తక్కువ నిర్ణయాలు అమాయకత్వం తెచ్చి పెట్టే ప్రమాదకరమైన అనుభవాలు పొదుతుంది. అంతర్గతమైన ఈ వాంఛ ఆమెకు తెలియకుండా దాదాపు రెండు సంవత్సరాల లోపల ప్రేమించిన రాజశేఖరం నుంచీ దూరంగా పారిపోతూ, అతనికి మేలు చేశాననుకుంటూ, ఏదో ఒక ఆలంబనం కోసం శివరాంను పెళ్ళిచేసుకోమని అడుగుతుంది. ప్రకాశంతో వూరు విడిచి వెళ్ళిపోతుంది. ప్రసాద్‌తో పెళ్ళినిశ్చయంలో ఇరుక్కుంటుంది. ఈ భయంకరమైన థ్రిల్స్, అనుభవాలు ఈ అమ్మాయిలో చాలా మెటామార్ఫాసిస్‌కు గురి చేస్తాయి.

శివరాంతో పిక్నిక్‌కు వెళ్ళి, ప్రకాశంతో కారు యాక్సిడెంటులో ఇరుక్కోవటం, పోలీస్ స్టేషన్‌లో పట్టుబడటం, రాజశేఖరం సాయంతో బయటపడాల్సిరావడం - ఇతనెవరు? నా గురించి శ్రద్ధ తీసుకోవడానికి అని కాంప్లెక్సు - పెద్ద పెద్ద జీవితపు కెరటాల్ని తట్టుకోలేని పసిపిల్ల చాతకాని ఈతతో అణుక్షణం దొరికిపోతూ వుంటుంది రాజశేఖరానికి.

కానీ అతని హృదయంలో ప్రేమ, జీవితానుభవం ఆమె పట్ల అతణ్ణి గార్డియన్‌గా చేస్తాయి. జయంతి అతనికి తెలుస్తూనే వుంటుంది. కానీ కారణం ఎవరైనా చెపితే, నిర్ణయాలు తీసుకోవడానికి ఒప్పుకోదు జయంతి. అందుకని, ఆమె అనుభవాలకు అడ్డు రాకుండా, పై పెట్టున వెయ్యి కళ్ళతో కాపాడుతూ ఆమెను ఆరాధిస్తూనే, శాశిస్తూ, ప్రేమిస్తూనే ఆ అనుభూతిని దాచుకుంటూ, ఆరాధిస్తూనే అవతలివ్యక్తికి అడ్డురాకుండా కాపాడుకుంటూ వుంటాడు రాజశేఖరం.

అతని జలసీ చాలా అందంగా, పొసెసివ్‌గా వుంటుంది. శివరాం కంపెనీ కోరుకున్నప్పుడు, ఆమె అతడిచ్చిన బొకే గుండెలకు హత్తుకున్నప్పుడు చాలా సున్నితంగా విసుక్కుంటాడు రాజశేఖరం. ఆమె కోరుకుంటే వూర్లో దొరికే పూవులన్నీ తెచ్చిపెడతానని చెపుతాడు. చిలిపిగా అతన్ని కవ్విస్తుంది కానీ అతడి భావన వెనకాల లోతును గ్రహించుకుని తట్టుకోలేదు. కారణం తను అంత ప్రేమకు అనర్హురాలనన్న భయం. అందుకే ఆమె మూర్ఖత్వానికి అతడు మందలించినప్పుడల్లా అతనిలో డబ్బున్న వాడి అహంకారం, తను ఏం చేసినా చెల్లుబడి అవుతుందనుకునే మొగవాడి దౌష్ట్యం వెతకడానికి వెయ్యి కళ్ళతో ప్రయత్నిస్తూ వుంటుంది.

రాజశేఖరంతో చనువుగా ప్రవర్తిస్తున్న రేఖారాణీని చూసి, అసహ్యించుకుని చేదు పదార్థం తిన్న దానిలా అయిపోతుంది. కచ్చతో అతడిచ్చిన చీర వెనక్కు ఇచ్చి రిజైన్ చేస్తానంటుంది.

రాజశేఖరం ఆమె చెయ్యి పట్టుకుని "ఎంత ధైర్యం నీకు నా దగ్గరనుంచీ వెళ్ళిపోవడం అంత సులభమనా నీ ఉద్దేశ్యం!!" అంటాడు. అతడి గొంతులో అభిమానం, హక్కు, జరిగిన సంఘటనను వివరించి చెప్పాలన్న భావన అర్థచేసుకోనట్లే నటిస్తుంది జయంతి. మంచి పిల్ల జయంతి ఎప్పటికప్పుడు ఎందుకు సమస్యలలో చిక్కుకుంటుంది. "యద్భావం తద్భవతి" - అన్నట్లు, చాలా షార్పుగా, సెన్సిటివ్‌గా

ఆలోచించే జయంతి ఆలోచనలు చాలా తనను మోసం చెయ్యడాన్ని వూహించుకునే జయంతి "థాట్ వైబ్రేషన్స్" చాలా బలవత్తరమైనవి అవడంవల్ల ఆ ఆలోచనలు అనుభవాలుగా మారతాయి.

ఇన్ఫీరియారిటీ నుంచి తప్పించుకోలేక ప్రతి క్షణం తననించీ పారిపోయే జయంతికి అందుకే తన బాహుబంధాలతో ఆమె హృదయానికి వేసే పూలకంచెను చాలా విస్తృతం చేసి జీవితం నేర్చుకునే అవకాశం కల్పిస్తాడు రాజశేఖరం. అతనికి తెలుసు, ఆమె తన భయాలతో, అనుమానాలతో ఏ అందమైన అనుభవాన్ని నమ్మలేదని, ప్రేమ, గౌరవం తన కోసం ఎదటి మనిషి బ్రతుకుతాడన్న నమ్మకం ఆమెకు వచ్చేదాకా, అతడు నిరీక్షించడానికే నిర్ణయించుకుంటాడు.

అపెండిసైటిస్ ఆపరేషన్ అయిన రోజు ఆమె రాజశేఖరం ఆప్యాయతలో బలవంతంగానే సేద తీర్చుకుంటుంది. ఆమె ఎంత ప్రయత్నం చేసి నటించినా, సబ్కాన్షియస్ స్థితిలో పట్టుపడిపోక తప్పదు. మత్తులో అతని స్పర్శకోసం, అతని కోసం దిగాలుపడి పలవరిస్తుంది జయంతి. ఆమెకు తను ఎంత కావాలో తెలిసినా, కాన్షియస్ స్టేజ్లో వొప్పుకోలేని ఆమెను చూసి నిట్టూర్పు విడవటం తప్ప ఏం చెయ్యగలడా ప్రేమికుడు?! నిరీక్షిస్తాడు!

జయంతి భయపడినట్లుగానే బోలెడన్ని చేదు అనుభవాలు ఆమెకు. బామ్మ చనిపోవడం, అతని ఇంట్లో వంటరిగా వుండటం మర్యాద కాదు అనుకుంటూ వుండగానే రేఖారాణి వచ్చి ప్రమీలతో రాజశేఖరం పెళ్ళి వొప్పందం గురించి చెప్పడం, అది తట్టుకోలేక ఎలాగైనా అతడి నుంచీ దూరంగా పారిపోవాలని ముఖపరిచయం వున్న ప్రకాశంతో రైలు ఎక్కడం, అతడు చచ్చిపోవడం, అతడి స్నేహితుడు డాక్టరు ప్రసాద్ రక్షించి అతని అక్క లక్ష్మి దగ్గరకు పంపడం - ఇలా భయంకరమైన డ్రామాకు గురి అవుతుంది జయంతి. తన జీవితం, నిర్ణయాలు తనకు తెలియకుండానే ఎదుటివారి చేతుల్లోకి వెళ్ళిపోవడం, ఆ రక్షణ హస్తాలు రాజశేఖరానివి కాకపోవడం ఆమెకు విపరీతమైన దుఃఖాన్నీ, భయాన్నీ కలిగిస్తాయి.

ప్రతిక్షణం మనసు రాజశేఖరం గురించి ఎదురు చూడటం, తీరా అతడు లక్ష్మి ఇంటిలో ఎదురైతే పారిపోవడం, ప్రసాద్తో పెళ్ళి అని నిర్ణయించగానే, భరించలేక బయటపడిపోవటం - ఇలా ఆమె ఆలోచనలే ఆమె జీవితంలో అనేక మలుపులకు కారణమౌతాయి.

ఆమె దుఃఖం, భయం, బాధ ఎవరో తనను శాపగ్రస్తురాలని తీర్పు రాశారన్న భావంతో అనుభవిస్తుంది. ఉద్యోగం పట్ల, మెప్పుదల పట్ల చాలా పాజిటివ్గా వుండే జయంతి, అనుభూతుల వల్ల, తన జీవితం అందించే అదృష్టాల పట్ల చాలా నెగిటివ్ అభిప్రాయం కలిగి వుంటుంది. తనకు కావలసినదేదో అస్పష్టంగా తెలియడం, తన అదృష్టం పట్ల నమ్మకం లేకపోవడం ఈ రెండు పదునైన భావాల మధ్య చిక్కుకుపోతుంది జయంతి. ఆమె మనో విశ్లేషణ తెలిసీ, అర్థం చేసుకుని కూడా ఏమీ చెయ్యలేని పరిస్థితి రాజశేఖరానిది.

"మనిద్దరిలో నీ పొరపాటు, నా పొరపాటు ఒక అగాధం సృష్టించిందన్న బాధ నాకు లేదు. నేను ఈచివరి నుంచే చెయ్యిచాచి నిన్ను అందుకోగలను. కానీ, నువ్వు నేను అందుకోవడానికి ఇష్టపడవు. ఆ సంగతి నాకు తెలుసు -" ఇంతకన్నా ఎలా చెప్పగలడు రాజశేఖరం.

తన ప్రేమను ఆమె కోరుకుంటూ, గుర్తించికూడా వొప్పుకోనట్లు నటిస్తోంది... ఎలా చెప్పాలి ఆమెకు?!

"జయంతీ! నేనెప్పటికీ నీవాడినే.. నీఇష్టం... నన్ను నీస్నేహితుడుగా తీసుకో, తండ్రిగా చూసుకో, సోదరుడిగా భావించుకో నీకు నచ్చిన విధంగా నీ ఆప్తుడిగా మాత్రం జీవితాంతం మిగిలిపోతాను. నీ పిల్లలు నాకు వారసులు. వాళ్ళ ప్రేమలోనిన్ను పొందడానికి ప్రయత్నిస్తాను. నాకు నీతో రాజీ పడటంకన్నా దారిలేదు. కారణం నా మనసులో నువ్వు ఏర్పరచిపోయిన ఈ శూన్యాన్ని పూడ్చుకోవాలంటే నా జీవితం చాలదు. నాకు అంత శక్తిలేదు కానీ నువ్వు నాకు కావాలి... దాని వల్ల నీకేం నష్టం కలగనీయకుండా నాజీవితాన్ని సరిదిద్దుకుంటాను." - ప్రసాదుతో ఆమెకు వివాహం అని తెలిసి జయంతికి ఇలా ఉత్తరం రాస్తాడు రాజశేఖరం. అతని వ్యక్తిత్వం ముందు ఒక్కసారి తలవంచి చెమ్మగిల్లిన కళ్ళతో నమస్కరించేట్లు చేస్తారు రచయిత్రి.

అతను అహానికి దూరమై, సరెండరు అయిననాటినుంచీ అతనికి ఆమె అనుభూతి పరంగా దగ్గరౌతుంది. ఆ భావన బలవత్తరమై ఆమె బలవంతంగానే కోటి స్వప్నాలతో, పశ్చాత్తాపంతో అతను ఎదురు చూస్తూ చాచిన బాహువుల్లోకి వచ్చి అలిసిపోయి దాక్కుంటుంది జయంతి.

చాలా సాదాసీదాగా బ్రతికెయ్యకూడదనుకున్న బలవత్తరమైన ఆలోచనలతో, జీవితాన్నే ఒక గొప్ప ఆల్బంగా మార్చుకుంటుంది జయంతి. కానీ ఈ అనుభవాల ముత్యాల సరంలో సూత్రధారీ, పాత్రధారీ కూడా రాజశేఖరమే. అతను వొకప్పుడు స్పష్టంగా, మరొకప్పుడు అస్పష్టంగా ఆ ముత్యాల సరాల మధ్య సూత్రమై మనకు దర్శనమిస్తూ వుంటాడు.

"మనకు భగవంతుడు ఇచ్చిన ప్రసాదం జీవితం. యోగనిద్రలో క్షణంలో వెయ్యోవంతు కళ్ళు తెరిచి ఈ అద్భుతమైన సృష్టిని, ఈ అపురూపమైన అవకాశాన్నీ, ఈ అసూయలతో వ్యర్థ పంతాలతో, చెయ్యిజార్చుకోవద్దు. మనం మళ్ళీ పొందలేము ఈ జీవితాన్ని. మనం జీవిస్తున్నాం అనే స్పృహతో, ఆనందంతో బ్రతుకుదాం....

మనం అంతా రైల్వేస్టేషన్ వెయిటింగ్ రూములో కూర్చున్న ప్రయాణీకులం.. ఎవరి రైలు వస్తే వాళ్ళు వెళ్ళి పోతాం.."

పుస్తకం మూసి, ఊహా ప్రపంచం అంచులకు వెళ్ళిపోయి, జీవితానుభవాల పేటికలో ఇటువంటి రాగరంజితమైన సున్నితమైన రోజారేకుల్లాంటి అనుభూతులను ఎన్నడైనా పొందగలమా? అని ఆలోచింపచేస్తారు రచయిత్రి.

చక్కటి మలుపులతో, సౌందర్యం పోని వాడుక భాషలో, హృదయానికి హత్తుకునే సంఘటనలతో లాజిక్ డ్రామా రెండూ మేళవించి తయారు చేసిన అద్భుతమైన స్క్రీన్‌ప్లే "సెక్రటరీ"

లైబ్రరీలో ఎప్పుడూ దొరకకుండా నిరంతరం సర్క్యులేషన్‌లో వుండే తెలుగు నవల సెక్రటరీ - ప్రతి గుండెలోనూ మరుపురాని మధుర స్మృతి "**జయంతి**"

***

## రంగనాయకమ్మ గారి బలిపీఠం నవలలో 'అరుణ'

**"A writer must distinguish between what an author in fact says and what he thinks he is saying. That is true even of philosophical systems":**
**-Marx:**




**నేను సామాజిక స్పృహతో రాస్తున్నాను** అన్న ఆలోచనతో ప్రారంభించే నవలల రంగు రుచి వాసనా వేరు.... అక్షర రమ్యతతో, వ్యక్తిత్వపు మలుపులలో, సంఘటనల ఒడుదుడుకులతో, మనిషిలోని మార్పు పరిధి విస్తరణ, సంకోచము ఒకటని ఏమిటి?! ఇవన్నీ క్రోడీకరిస్తూ చెప్పగలగడంలో తగుపాళ్ళ నిజాయితీ, తను చెపుతున్న విషయం మీద గౌరవం ఉండటం రచయితకు చాలా వరకు ముఖ్యం.

"రంగనాయకమ్మ గారి నవల 'బలిపీఠం' చదవగానే వీరేశలింగం పంతులుగారి "రాజశేఖర చరిత్ర", ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులుగారి "మాలపల్లి" గుర్తుకు వచ్చాయి. 'బలిపీఠం' కూడా సాహిత్యంలో అలాంటి మైలు రాయేనన్న నమ్మకం నాకు కుదిరింది.... 'బలిపీఠం'లోని పాత్రలు
సమస్యలకు సమాజం యొక్క వర్తమానంతోనూ, భవిష్యత్తుతోనూ అతి సన్నిహితమైన సంబంధం ఉన్నది... ఈ నవల అరుణా భాస్కర్‌ల మధ్య జరిగే సంఘర్షణ..." అంటారు ఈ పుస్తకపు ముందు మాటలో కొడవటిగంటివారు.

అప్పటి నవలా సాహిత్యంలో రంగనాయకమ్మగారు తెచ్చిన కుదుపు సామాన్యమైనది కాదు... ఈవిడ రచనా వ్యాసంగాన్ని
సమీక్ష చేస్తే, ఎదుగుదల, ఈవిడ అక్షరాల్లో చాలా నిజాయితీగా కనబడుతుంది. భావదాస్యం, బానిస విప్లవం ఈవిడలో లేదు. ఒకసారి విప్లవం ప్రారంభమయ్యాక, తల ఎత్తి తనకు ఏది కావాలో తెలుసుకుని సాధించే విధానం అర్థం అయ్యాక, దానికి ఇక బానిసత్వం అన్న పేరు లేదు. రాదు. సాధారణంగా "ఇజాలు" మాట్లాడే వాళ్ళలో ఒక బలహీనత ప్రోది చేసుకుంటుంది. వాళ్ళు నమ్ముకున్న సిద్ధాంతం పట్ల విపరీతమైన నమ్మకం ఎక్కువై, మూర్ఖత్వంగా మారి ఇక మరి మంచి అన్నదాన్ని దేన్నీ గౌరవించని స్థితికి వెళ్ళి పోతారు. దీనివల్ల వ్యక్తి పూజలు ఎక్కువై సిద్ధాంత పరమైన భావ విస్తరణ పరిధులు వేసుకుని ఆగి పోతుంది. ఎవరికి తెలిసింది వారు వెళ్ళగక్కుతూ నేర్చుకోవలసిన దానికన్నా చెప్పడం ఎక్కువై బాధపడి, మఖలో పుట్టి పుబ్బలో మాడే వైజ్ఞానిక ఇజాల సదస్సులు చాలా జరుగుతూ ఉంటాయి. వీరందరిలో నిజంగా నేర్చుకునే తపన ఉండే జనం తక్కువ. ఆ కొద్దిశాతానికి కూడా ఏది నేర్చుకోవాలో చెప్పే జనం అంతకన్న తక్కువ. ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటి కప్పుడు సమీక్షించుకుంటూ, కాల ప్రవాహంలో దారి కనపడని అడుగుల జాడలను కొలుచుకుంటూ, మారుతున్న కాల స్థితికి తగ్గట్టు భావ విప్లవం ఎలా రావాలో ఒక ప్రణాళిక ఏర్పరచుకుంటూ, మళ్ళీ దానిని మామూలు జనానికి ఎలా అందజెయ్యాలో, మేధావి వర్గాన్ని ఏ పద్ధతిలో కదల్చాలో, పలాయన వాదుల్ని ఏ రకంగా నిద్ర లేపి జాగృతం చెయ్యాలో ఈ విషయాలన్నీ తెలుసుకుని రాజకీయ; ఆర్థిక, సాంఘిక చైతన్యాలను గుచ్చెత్తి చెప్పాలన్న ప్రయత్నం, ఆదర్శం ఉండటం చాలా కష్టం... రంగనాయకమ్మగారిలో ఇది కొంతలో కొంత సాధించిన తృప్తి ఉన్నది. ఆమె వలన ప్రభావితమైన వారిలో నేర్చుకోవలసినది ఏమిటో తెలుసుకున్నామన్న తృప్తి ఉన్నది.

రంగనాయకమ్మగారు సృష్టించిన మరెన్నో గొప్ప స్త్రీ పాత్రలు లేకపోలేదు. కానీ, రచయిత్రిగా ఈమె తొలి నవలలోనే పాత్ర చిత్రీకరణలో ఎంత గొప్ప ఎత్తుకు ఎదిగి పోయారో చెప్పడానికే "అరుణ"ను ఎన్నుకోవడం జరిగింది.

అరుణ సజీవ మూర్తి. ఈనాటికీ, ఏనాటికీ కూడా సాంఘిక జీవితపు మలుపుల వద్ద అరుణలు నిలబడి జీవితాన్ని మరొక వైపు నుంచి వ్యాఖ్యానిస్తూ, ఆదర్శాల చిలక పలుకులను విమర్శిస్తూ, దెబ్బ తీస్తూ ప్రశ్నిస్తూ దర్శనమిస్తారు. అరుణ చెడ్డ మనిషి కాదు. కానీ ఆమెలోని వ్యక్తి గతకాలపు అపోహల నుంచి బయట పడలేకపోతుంది. ఈ ఒక్క కారణంతో ఆమె మనస్తత్వమూ, ప్రవర్తనా చాలా దిగజారి పోయాయి.

రచయిత్రికి గల రచనా దక్షతకు కొ.కు గారి భావనలో అరుణ పాత్ర నిర్వహణ కన్న మంచి నిదర్శనం అవసరం లేదనిపిస్తోంది. ఎన్నో కష్టాలు అవమర్యాదలు పడిన సహన శీలిగా, బుద్ధిమంతురాలిగా, మంచి గృహిణిగా, ఇల్లూ వాకిలీ, కలిమి, శాంతి ఉండే ఇల్లాలుగా కనిపించే స్త్రీ మూర్తి ఒక ఒత్తిడికి, తాకిడికి, ఇన్ఫీరియారిటీకి బలైపోయినప్పుడు దెబ్బతిన్న సివంగిలా ఎలా భయంకరతను ప్రదర్శించగలదో, పంతానికీ పట్టింపుకూ పోయి ఎలా జీవితాన్ని సర్వనాశనం చేసుకోగలదో గొప్పగా చెపుతారు రచయిత్రి. ఇది నవల కాబట్టి చివరికి అరుణలో కొంత పశ్చాత్తాపం వస్తుంది. కానీ, నిజ జీవితంలో ఆ మెటామార్ఫాసిస్ రాకుండానే బలిపీఠం ఎక్కే పశుత్వపు స్త్రీత్వాలు ఎన్నో?!

ఈ నవలలో నాయక పాత్ర పేరు భాస్కర్... కరుణ దయ, ప్రేమ గల సాంఘిక సేవా తత్పరుడు. అతడు కరుణ సమాజపు ఛాయల్లో పెరుగుతాడు. అతడి వాతావరణం అతన్ని గొప్ప వ్యక్తిగా, ఆదర్శ పురుషుడిగా, ఇంద్రియాలను జయించ గలిగిన వాడిగా, త్యాగశీలిగా ఉండే అవకాశం ఇస్తుంది.

ఇంక అరుణ - ఆచారాలు పటిష్టంగా అమలులో ఉండే ఆంధ్రదేశపు మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన బాల వితంతువు. తల్లీ తండ్రీ లేని అనాధ,. మేనమామ, మేనత్తల స్వార్థపూరితమైన ప్రేమ మీద ఆధారపడ్డ దురదృష్టవంతురాలు. ఆమె జీవితంలో ఎఱ్ఱబొట్టుకానీ, రంగుల గాజులు కానీ, అందమైన చీరలు కానీ ఎరగని అభాగ్యురాలు. వీటికి తోడు గుండె జబ్బు మనిషి జీవన మార్గంలో శిశిరం తప్ప ఆమె జీవితం మరి దేన్నీ రుచి చూడలేదు. అటువంటి దీనురాలు, తన జీవితం మృత్యు దీవెనల నీడలోకి జారిపోయిందని తెలిసీ, ఒక చిన్న కోరిక గుండెల్లో పెంచుకుంటుంది. అది నిజమవ్వకూడదా? అన్న ఆశ తోడుగా బ్రతుకుతుంది.

"మా అత్తయ్య రంగు రంగు చీరలు కట్టుకుని చక్కగా పువ్వులు పెట్టుకుని నాకు మాత్రం తెల్ల పరికిణీ కట్టి నున్నగా తల దువ్వి ఊరుకునేది. వెధవ ముండకు షోకులెందుకే అనేది.... నాకు ఒక్క రోజైనా సౌభాగ్యవతిగా తిరగాలనీ, నా మృత కళేబరంపై నా భర్త విడిచే రెండు కన్నీటి బొట్లు రాలిపడాలని..." ఇది ఆమె కోరిక. ఆమె కోరిక నెరవేరే పరిస్థితి, అవకాశం సంఘం ఇవ్వదు. కానీ భాస్కర్ లాంటి ఉన్నతులు ఒకొక్కసారి అరుణ లాంటి వారి ప్రార్థనలకు జవాబుగా దర్శనమిస్తారు. ఆమె స్థితికి జాలిపడి వివాహం చేసుకుంటానని అంటాడతను. కానీ ఆమె బ్రాహ్మణ వితంతువు; "నేను హరిజనుణ్ణి" అని చెపుతాడు. అరుణ ఉలిక్కి పడుతుంది. కానీ కట్టు బొట్లతో, వర్ణాచారాలు ప్రతిక్షణం జ్ఞాపకం చేసే సాంఘిక పద్ధతి జీవన విధానంగా ఉన్న ఆ ఆశోపహతురాలు కేవలం 'సుమంగళి'గా చచ్చి పోదామన్న కోరికతో మాత్రమే ఈ పెళ్ళికి ఒప్పుకుంటుంది. అతని మాటలు, జీవితంలో 'నాది' అన్నది కావాలన్న ఒక భావన - ఇవి మాత్రమే ఆమె కాళ్ళకు పారాణి పెట్టిస్తాయి. ఏనాడూ ఎదిరించి మాట్లాడని ఆమె అత్తయ్యను, మామయ్యను ఈ పెళ్ళికి ఒప్పించడానికి విపరీతంగా ప్రయత్నిస్తుంది.

అతని అనాధసేవ పట్ల ఆసక్తికి ఆశ్చర్యపోతుంది అరుణ. కానీ, అల్లాంటి వాటి పట్ల ఆమెకేం ప్రత్యేక గౌరవాలు లేవు. అదే తమాషా... సంఘంలో ఈ నాడు పరిణితి తక్కువ అవడానికి కారణం బహుశ సేవా తత్పరత లోపించడం కాదేమో... సేవను దాన్ని ఫలాన్ని పొందిన వ్యక్తి వాటివల్ల ఆర్థికంగా, సాంఘికంగా నిలదొక్కుకున్నా ప్రభావితుడు కాలేక పోవడం చాలా వరకు కారణం కావచ్చును. తన పరిస్థితి బలీయమైనప్పుడు రెండు చేతులు చాచి పొందిన సేవాభిక్షను, దాన్ని ప్రసాదించిన వ్యక్తి ఔన్నత్యాన్ని తరువాత, జీవితంలో నటించే కాంప్లెక్స్ చాలా మందిలో స్థిరమైపోవడమే ఈ విష పరిణామానికి కారణం.... వారికి సేవ, ధర్మం పొందే స్థితిలో ఉండవలసి వచ్చిందేనన్న దుఃఖం, భయం. అందుకే ఎవరి కరుణతో తాము ఈ స్థితికి వచ్చారో వారిని తప్పించుకు తిరగడానికి ప్రయత్నిస్తారు. కరుణ లాంటి వారు హింసించి, ఈ మానసిక సంక్షోభం నుంచి బయటపడాలని ప్రయత్నిస్తారు. ఇది ఆశ్చర్యంగా కనిపించినా, దాని వెనకాల వారి బానిసత్వపు భావనే కారణం. అందుకే సంఘ ద్రోహం, సాధారణంగా సాంఘిక దురాచారానికి గురైై సహాయం పొందిన వ్యక్తులు చెయ్యగలగడం మనకు ఆశ్చర్యమనిపించినా పచ్చి నిజం. ఇందులో భాస్కర్ సేవ చేసే వ్యక్తుల పట్ల అరుణకు నిరసన, చీదర భావం అందుకే వ్యక్తమౌతుంది.

అరుణ, భాస్కర్ ప్రోత్సాహంతో చదువు పూర్తి చేస్తుంది. ఉద్యోగం సంపాదించగలుగుతుంది. అతడు పోరితే నాటకంలో వేషం వేస్తుంది. కానీ, ఆమెలో చాలా బలహీనతలున్నాయి. తన పంతం, పట్టుదల ఎవరైనా అనే మాటలకు బలి పెడుతుంది. కానీ, ఆ అనే వారు ఆమెకు నచ్చిన ఆప్తులై ఉండాలి. మేనమామ నాటకాల వేషాల గురించి వ్యాఖ్యానించగానే "ఛీ! మనుష్యులంతా మారాలి కానీ, తగుదునమ్మా అని ఒక్కరు ముందు కొస్తే ఏం ప్రయోజనం?!" అని భాస్కర్ సదుద్దేశ్యాన్ని చిన్న బుచ్చుతుంది.

వీరికి ఒక చిన్నారి పాప పుడుతుంది. "నిజం చెప్పద్దూ! పాప మీలా నల్లగా ఉంటుందేమోనని భయపడ్డాను...." అనే అరుణ మాటలకు ఉలిక్కి పడలేదు భాస్కర్. పాప బారసాల ఘనంగా జరపాలని, తనొక విధవగా, అనారోగ్యవంతురాలిగా, దురదృష్టవంతురాలిగా పరిగణించిన సంఘం ముందు మిధ్యా గౌరవంతో పట్టుచీరతో ఆడంబరంగా తిరగాలని కోరుకుంటుంది. ఆమె సుఖమైన జీవితాన్ని పొందగానే, నాగుపాముల్లా ఆమెలో ఆదమరచి నిద్రిస్తున్న ఆలోచనలు పడగ విప్పుతాయి. విచక్షణా జ్ఞానం లేనిదానిలా ప్రవర్తిస్తుంది.

ఆమె తన వయస్సు వారితో కలవలేకపోతుంది. ఎవరి పొడా గిట్టక పోవడం ఎక్కువైపోతుంది. భాస్కర్ స్నేహితులను గౌరవించలేక పోతుంది. లేని పెద్దరికం తెచ్చి పెట్టుకొంటుంది. తన కన్న పెద్దవారితో ఏకీభవించడానికి ఒప్పుకుంటుంది కానీ, మామూలు వ్యక్తులూ, భాస్కర్‌కు దగ్గరైన వారైతే ఆమె మరింత దూరంగా ఉంటుంది. ఇవన్నీ మనస్తత్వశాస్త్రంలో ఒంటరిగా పెరిగిన బిడ్డ లక్షణాలు.... అందుకే తన మేలు ఏనాడూ కోరని మామయ్య, అత్తయ్యలకు దగ్గరవడం ప్రారంభిస్తుంది.

"ఈ కుల భావం తర తరాలుగా వస్తోంది అరుణా.. మనలో ఈ ఎక్కువ తక్కువలు అలవాటై పోయినాయి. పెద్ద కులం వారితో మనకు సంబంధం వద్దనీ, అది మంచిది కాదనీ మా అక్కయ్య వ్రాసింది... ఈ కులతత్వాలు ఒక్కసారి మాసిపోవు కదా..." అని భాస్కర్ అంటే,

"అవి మాసిపోయినా మాసిపోక పోయినా మీ అక్కయ్యగారికి మాత్రం నా విషయంలో అటువంటి భయమేమీ అవసరం లేదు..." అని కాబోయే ఆడబడుచుకు ఒక ఉత్తరం, భాస్కర్ పెరిగిన కరుణాశ్రమం మహర్షికి ఒక ఉత్తరం తన చేతులతో స్వయంగా రాస్తుంది. కాని ఇదంతా ఆలోచన, విచక్షణలతో చేసిన పనులు కావు. భాస్కర్ తనను స్వీకరించడానికి సిద్ధపడ్డాడన్న గౌరవానికి తోడూ అతడి సత్ప్రవర్తన, ఆప్యాయత, తనను ప్రకృతి ఆశ్రమంలో ఉంచి ఆరోగ్య చికిత్స చేయించడం - ఇవన్నీ అతణ్ణి ఆమె దృష్టిలో దేముడిని చేస్తాయి. ఆ బొమ్మ కూడా ఆమె సృష్టించుకున్న ఊహే. అసలు అరుణ తత్వంలోనే ఒక లక్షణం ఉన్నది. ఆమె తను నమ్మిన ఏ విషయాన్నీ మరెవరు కాదన్నా ఊరుకోలేదు. అది తనలో నిద్రించే అంతరాత్మ అయినా సరే కానీ, క్షణికమైన ఇంపల్స్ మీద ఆధారపడి, బలహీనమై పోవడంతో ఆలోచన, కార్యాచరణ, మాట నానారకాల బీభత్స రూపం పొందుతాయి. ఈ లక్షణాలు నవలలో మనకు అనేక చోట్ల దర్శన మిస్తాయి.

భాస్కర్‌తో వివాహం నిర్ణయమైన మరునిమిషం నుంచే ఆవేదన తగ్గి, ప్రకృతి వైద్య సహాయంతో శరీరం నవనవలాడుతూ, పాలిపోయిన చెక్కిళ్ళు, పీక్కు పోయిన కళ్ళు మార్పు చెంది ఎంత అందమైంది అరుణ?! అని భాస్కర్ అనుకునేటంత మార్పు వస్తుంది ఆమెలో. అరుణ మీద జాలితో ఆమె చివరి కోర్కెతీర్చాలన్న ఉద్దేశ్యంతో వివాహానికి ఒప్పుకుంటాడే కానీ, తారను హృదయపూర్వకంగా ప్రేమించి, ఆదర్శాలను, నడవడిని ఆరాధించిన భాస్కర్‌ను తనవాడిని చేసుకోవడం ఎంత కష్టమో తెలియదు అరుణకు.

తీరా ఆరోగ్యం బాగు పడగానే, "అతడు ఖర్చు పెట్టింది అతడి మొగాన కొట్టి మన వర్ణం వాడిని ఎవరినైనా చేసుకో" అని మేనమామ సలహా ఇస్తే, మనస్ఫూర్తిగానే ఎదురు తిరుగుతుంది అరుణ. ఏనాడూ ఎరగని ప్రేమను, దయను ఆప్యాయతను అతడి నుంచి పొందుతున్న అరుణ అవి ఆనాడు పోగొట్టుకోదలచలేదు. కానీ ఆమె కృతఘ్నురాలు కాదు. లౌక్యులు, కుచ్చితులు అయిన మేనమామ మేనత్తలను తనను ఆశీర్వదించమనే అడుగుతుంది.

"నీకు పంతం, పట్టుదల బాగా ఎక్కువ. నీతో కాపురం ఎలాగో?!" అని భాస్కర్ సరసమాడితే,

"మీరు ఎంత అమాయకులు కాకపోతే నా వంటి దాన్ని అంగీకరిస్తారా! మీ అమాయకత్వాన్ని నేను అడ్డు పెట్టుకోనులెండి..." అని మధురంగా అంటుంది. ఆమెలోని దురభిమానం ఎదుటి మనిషి తనకు లొంగి ఉన్నాడన్నంత కాలం గౌరవంగా, ప్రేమగా రూపొందుతుంది. కానీ అదే మనిషి తన విధానాన్ని తన పద్ధతిని ప్రశ్నిస్తున్నాడనగానే మిన్నాగులా మారి బుస కొడుతుంది. ఆమె మంచితనం మొగ్గ తొడిగే ముందే, పంతం, కోపం దానిని చిగురులోనే తుంచేస్తాయి.

సుమధురంగా సాగుతుంది ఆమె సంసార జీవితం కొన్నాళ్ళు.

"నీకు తొందరపాటు, కించిత్తు దురభిమానంలే లేకపోతే ఇంకా బాగుండును..." అంటాడు భాస్కర్. అనాధ, దుఃఖితురాలు, తన దయాధర్మాల మీద ఆధార పడ్డ ఈ రోగిష్టి యువతి, ఆమె కన్నీరు ఎరిగిన భాస్కర్‌కు, హక్కులు ఏర్పడగానే ఆమెలోని రణ చండికను చూసి ఆశ్చర్యపోతాడు.

విచక్షణా జ్ఞానం లేకుండా ముందు తొందర పడ్డట్టుగా ప్రవర్తించి, తరువాత క్షమార్పణ అంటుంది... తనకు కోపం వస్తే భాస్కర్ బ్రతిమిలాడాలని, తప్పు చేస్తే ఎత్తి చూపకూడదని, ఏది కోరినా అంగీకరించాలనీ - ఇల్లాంటి కోరికలు ఎక్కువ అవుతాయి.

భాస్కర్ బొంబాయికి ట్రైనింగ్‌కు వెళ్ళగానే, మామయ్య, అత్తయ్యల తోడుతో, అరుణలో మళ్ళీ నిద్రాణమైన అవలక్షణాలన్నీ వాళ్ళ ఆలంబనతో నిద్రలేస్తాయి. ఆడంబరమైన ఖర్చు అలవాటౌతుంది. భాస్కర్ పొదుపు కోసం శ్రమించడం ఆమెకు కాపీనంలా కనబడుతుంది. ఆడబడుచు కొడుకు గోపీ చదువు కోసం తన ఇంటికి రాగానే, ఆమెలో కులతత్వం మెల్లిగా మారాకు తొడుగుతుంది. భాస్కర్ అరుణల మధ్య విభేదాల నిప్పురవ్వలు రాచుకోవడం ప్రారంభమౌతాయి. భాస్కర్ వచ్చినప్పుడు మాత్రం, అతని సాంగత్య ప్రభావం వల్ల "మీరు అన్నారని నేను బాధపడటం లేదు కానీ, నాలో ఏదో అర్థం లేని బలహీనత ఉందనిపిస్తోంది." అని ఒప్పుకుంటుంది. కానీ అది క్షణికమే. ఆడబడుచు సీతమ్మ తన ఇంటి పంచకు చేరగానే విజృంభిస్తుంది అరుణ. ఆవిడ అనాగరికత, మాట యాస ఏవీ భరించలేకపోతున్నానని ముఖాన చెపుతుంది. తనలో ఇంత కాఠిన్యం, తోటి మనుష్యుల పట్ల ఏహ్యాభావం ఉన్నాయా? అనుకుంటూనే తప్పు తోవన పడుతుంది. సంపాదన పరురాలినన్న అహం భాస్కర్ ముందే చూపెడుతుంది. ఇల్లు నరకం చేసుకుంటుంది. భాస్కర్‌ను హింస పెట్టి సంతోషిస్తుంది. వీటన్నింటికీ కారణమైన ఇన్ఫీరియారిటీ రూపం మార్చి ఆధిక్యతగా చూపించి ఎదురు దెబ్బలు తింటుంది.

భాస్కర్‌ను అవమానించి, అనుమానించి వావి వరసలు చూడకుండా సంబధాలు కట్టి, దుఃఖపెట్టి, సంసారం రట్టు చేసుకుని, పూజలు, వ్రతాలు, మడులు, ఆచారాలు అని ఎప్పుడూ లేనివన్నీ తెచ్చి పెట్టుకుని అతణ్ణి హింసించి, బిడ్డలకు దూరం చేసి కోర్టు కెక్కుతుంది. భాస్కర్ నిస్సహాయుడైపోతాడు. ఆమె తను ఇచ్చిన ప్రేమను, గౌరవాన్ని సాంఘిక మర్యాదని కాలరాయడం చూసి గిల గిలలాడిపోతాడు. అతడు బిడ్డలకోసం తలవంచిన కొద్దీ ఆమె పేట్రేగిపోతుంది. కోర్టులో ఆమె చెప్పిన అబద్ధాలు, తనపై మోపిన నిందలు అతడికి విసుగు కలిగిస్తాయి. తను చెక్కిన ఈ శిల్పం ఇలా విషజ్వాలలు కక్కుతూంటే అర్థం కాక ఆశ్చర్య పోతాడు భాస్కర్. భర్తకు, శాంతి సుఖాలకు దూరమై, తనలో అసూయ, అహంకారం ప్రజ్వరిల్ల చేసిన మామయ్య, అత్తయ్య తనకు, తన బిడ్డలకూ ఏ అండదండా కారనీ, కేవలం తన సంపాదనే వారికి ఆలంబనం అనీ అర్థం చేసుకొని మళ్ళీ చీకాకుల చీకట్లలో ఒంటరి తనపు అగాధాల్లో, ఒడిదుడుకుల సుడిగుండాలలోకి ఎగుర వెయ్యబడుతుంది ఆ అభాగ్యురాలు. అనారోగ్యంతో, ఉద్యోగం చేస్తేకానీ గడవని పరిస్థితిలో ఉంటుంది అరుణ. కానీ 'అమల' తన కన్న చిన్న పిల్ల అయిన తన బంధువు, కులాంతర వివాహం చేసుకుని ఆదర్శవంతంగా జీవితం గడపడం చూసిన దగ్గరనుంచీ ఆమెలో తిరిగి మరొక 'మెటామార్ఫాసిస్' ప్రారంభమౌతుంది: ఇక్కడ రచయిత్రి ఒక విషయం స్పష్టం చేస్తారు. "వర్ణాంతర వివాహాలు జరుగుతున్నాయి. ఇంకా జరుగుతాయి కానీ, అలాటి వివాహం చేసుకున్న మనిషి అమల లాంటిదైతే రాణిస్తుంది. అరుణ లాంటిదైతే అపహాస్యం పాలౌతుంది ఇది ముమ్మాటికి నిజం. అహార వ్యవహారాల విషయంలో, దేముళ్ళు నమ్మకాల విషయంలో, పూజలు, వ్రతాల విషయంలో అమల, ఆమె భర్త క్రిస్టియన్ కుటుంబం కలిసి పోవడం ఎంత భయంకర సమస్యా రూపం ఇచ్చుకుని దడుచుకుందో అర్థం చేసుకుంటుంది అరుణ.

కాని 'నియతి' ఒక్కసారే మనిషికి అవకాశం ఇస్తుందేమో... మళ్ళీ ప్రకృతి ఆశ్రమంలో చేర్చబడ్డ అరుణ తను తూలనాడి దూరం చేసుకున్న తన భర్త భాస్కర్ తన మీద జాలితో సాంగత్యం వలన ఏర్పడిన ఆప్యాయతతో తనను కాపాడి వైద్యం చేయిస్తున్నాడని తెలిసి ఆ శ్చర్యపోయి, పశ్చాత్తాపంతో, దుఃఖంతో కుమిలి పోతుంది.

అతని ఒడిలో పడుకుని, "ఈ ఘడియ కోసమే మొట్టమొదట మీతో బంధం ఏర్పరచుకున్నాను. ఈ ఆఖరి నిమిషాలలో అబద్దం ఆడను. నాకు తృప్తిగా ఉన్నది" - అని ఒప్పుకుని కనులు మూస్తుంది.

అరుణ పాత్ర ప్రారంభం నుంచి, ముగింపు దాకా ఎంతో జాగ్రత్తగా తెల్చినట్లుగా కనబడే ఊహాచిత్రం.

ఒకమంచి రచయిత్రి, ఆలోచిస్తూ, ఆలోచింప చేయాలన్న తపన ఉన్న మేధావి వర్గానికి చెందిన రచయిత్రి. సూటిగా రాయగలిగిన నేర్పు, తను చెప్పదల్చుకున్నది, వాడిగల విప్లవజ్ఞానమైనా, ఓర్పుగా అక్షరాల్లో ఇమిడ్చి చెప్పగల పద్ధతి, గుండెలు కదిలించే ఆర్ద్రత, అన్యాయాన్ని చిత్రీకరిస్తూ 'ఈ జరుగుతున్న చరిత్రకు నువ్వు మాత్రం ప్రేక్షకురాలివి కావా?' అని ప్రతి వ్యక్తిని సూటిగా ప్రశ్నించగలిగిన అక్షరాలవడి, వాడి ఇవన్నీ ఈ రచయిత్రి ప్రత్యేకతలు, మధ్య తరగతి స్త్రీ గుండెల్లో మండి, లావాలా ప్రవహించి, కొన్ని పరిస్థితుల్లో గడ్డకట్టుకుపోయి దుఃఖపు పొరల మధ్య కరుణ పరిణామానికి ప్రశ్నగా నిలబడ్డ ఆ అనుభూతి చారలని విశ్లేషించగలిగిన శాస్త్రజ్ఞురాలు ఈ రచయిత్రి, ఇదంతా ఇప్పటి గత చరిత్ర, 'బలిపీఠం' తరువాతి చరిత్ర.

కానీ తను నమ్ముకున్న సిద్ధాంతాల కోసం, తను చెప్పదలుచుకున్న విషయాలు చెప్పడం కోసం ఈమె ఒక అద్భుతమైన త్యాగం చేశారు.

ఈనాడు వ్యాపార ప్రపంచంలో రంగనాయకమ్మ పేరు చెపితే కాసుల వర్షం కురిసే ఒక స్థితికి వెళ్ళి అక్కడ ఆగి, వెనుకకు తిరిగి సమీక్షించి, నెట్టుకు వస్తున్న అర్థంలేని సాహిత్య వెల్లువలకు చెయ్యి అడ్డం పెట్టి, 'దాని వాడి, వేడి ఎంత? భవిష్యత్తుకు తను నేర్పదలుచుకున్న దానికి 'నవల' లిమిటేషన్ ఏర్పరుస్తుందని భావించి తను నమ్మిన మార్క్సిజం కోసం శాస్త్ర గ్రంథాల పరిశోధన, అనువాదం వీటి కోసం తన పంథాను జీవిత క్రమాన్ని మార్చుకున్న ఏకైక రచయిత్రి ఈమె.

కానీ, రంగనాయకమ్మగారు ఏది చెప్పగలిగినా గొప్పగా చెప్పగలరని ఆమె సృష్టించిన సాహిత్యం మనకు ఋజువుగా నిలబడి ఉంటుంది... 'బలిపీఠం'తో ప్రారంభమైన ఈ జాగృతి, స్త్రీలో ఆలోచన, జ్ఞానతృష్ణ, విచక్షణ ఉన్నంత కాలం రంగనాయకమ్మ గారిని మర్చిపోనివ్వదు.

***